
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 11-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 25 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





తాగండి.. ఊగండి!

సర్కారుకు సొమ్ములు కావాలి

మద్యంపై నియంత్రణ లేదు.. నిషేధమూ రాదు

మీ భూమి మీది కాదు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముసుగులో స్వాహాలను దోచుకునే కుట్ర

చిన్న సన్నకారు రైతులు, నిరక్షరాస్యులు.. భూమిని దూరంగా ఉండేవారే తొలి బాధితులు!

ఇది జగన్ మార్కు దోపిడీ చట్టం

అప్పుల్లో నంబర్ 1

నిరుద్యోగంలో నంబర్ 1

పట్టభద్రుల నిరుద్యోగంలో బిహార్‌ను మించిపోయిన ఏపీ

అత్యధికంగా రాష్ట్రంలో 24 శాతం నిరుద్యోగిత

కేంద్ర ప్రభుత్వ వార్షిక నివేదికలో బహిర్గతం

ఎన్నికల వేళా షాకులే!

జనంపై 1148.72 కోట్ల ట్రూఅప్ భారం

కొనలేం.. తినలేం!

చుక్కల్లో నిత్యావసరాల ధరలు

తాకట్టులో సచివాలయం!

జగన్ సర్కారు మరో దా'రుణం'

370 కోట్ల కోసం హెచ్‌డీఎఫ్‌సీకి రాసిచ్చేశారు

కథ..మొదటికే!

ఆర్టీసీ ఛార్జీల మోత

మావల్ల కాదు మహాప్రభో!

మాచర్ల మార్పు కోరుకుంటోంది!

కాటేస్తున్న మద్యం

జెన్కో అమ్మకం దిశగా తొలి అడుగు

కృష్ణపట్నం థర్మల్ విద్యుత్కేంద్రం ప్రైవేటుపరం

టెన్త్ కుర్రాణ్ణి తగలబెట్టేశారు

రోజుకు 9 మంది బాలికలు... 24 మంది మహిళలు అదృశ్యం

గంజాయి, డ్రగ్స్‌లో ఏపీ టాప్

నర్సీపట్నం డాక్టర్ సుధాకర్ గుండెపోటుతో మృతి

కరోనా సమయంలో వైద్యులకు ఎన్ 95 మాస్కులు ఇవ్వలేదని ఆరోపణ

సస్పెండ్ చేసిన ప్రభుత్వం

గలాటా చేస్తున్నారంటూ నడిరోడ్డుపై హింసించిన పోలీసులు

ఇది.. ప్రభుత్వ హత్యే: టీడీపీ

బాబోయ్ బాదుడు!

పెట్రో పన్నుల భారంలో రాష్ట్రం టాప్

దారికాచి కొట్టి.. కాళ్లు కట్టేసి..

పెట్రోల్ పోసి ఆహుతి

బాపట్ల జిల్లా రాజోలులో కిరాతకం

గ్రామంలో వైసీపీ కార్యకర్త వెంకటేశ్వరరెడ్డి దుశ్చర్య

అక్కను వేధిస్తుంటే అడ్డుకున్నాడని తమ్ముడిపై కక్ష

క్యాలెండర్ రాదు.. భర్తీ లేదు!

నిరుద్యోగుల ఆశలపై జగన్ సర్కారు నీళ్లు

అమరావతి అంతమే ఎజెండా

దుర్గమ్మా... చూడమ్మా!

వెండి ఉత్సవ రథం సింహాలు మాయం

కొల్లగొట్టారు.. కొంప ముంచారు!

యువతిపై సామూహిక అత్యాచారం

పోలీసు స్టేషన్‌లో శిరోముండనం

దళితుడిపై పోలీసుల అమానుషం

అధికార నేత కన్నెర్రకు ఖాకీ సాయం

సీతానగరం పోలీసుస్టేషన్‌లో ఘటన

ఎస్సై అరెస్టు.. ఇద్దరు పోలీసులు సస్పెండ్

ఆ ముగ్గురిపై అట్రాసిటీ చట్టం కింద కేసు

బాధితుడు ఇండుగుమిల్లి ప్రసాద్

బీసీలకు రుణాలెక్కడ?

రాయితీ రుణాల నిలిపివేత • పెండింగ్‌లోనే 6.33 లక్షల దరఖాస్తులు

అంతకుముందు ఐదేళ్లలో బీసీ కార్పొరేషన్ ద్వారా రూ. 1626 కోట్ల సాయం

పోలీసుల ఒత్తిడితో కుటుంబం ఆత్మహత్య!

- నగదు పోయిన ఘటనపై ఆటో డ్రైవర్‌ను విచారించిన పోలీసులు
- నేరం ఒప్పుకోమని బెదిరించారని బంధువుల ఆరోపణ



రణస్థలి

కదం తొక్కిన మహిళా శక్తి

పట్టిసీమ నాపై పగబట్టిందే..!

పట్టపగలు.. నడిరోడ్డుపై..

దళిత విద్యార్థిని దారుణ హత్య

అవినాశ్ 'కాల్'తో కదిలిన తీగ!

'ఆరోగ్యశ్రీ'కి తూట్లు!

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు దూరం

రేపల్లె రైల్వేస్టేషన్‌లో గర్భిణిపై గ్యాంగ్ రేప్

చెలరేగిపోతున్న ఇసుక మాఫియా

మార్కెట్ మళ్లీ లాభాల బాట

ముంబై: స్టాక్‌మార్కెట్ ఐదు రోజుల తర్వాత శుక్రవారం మళ్లీ లాభాల బాట పట్టింది. సెన్సెక్స్ 260.30 పాయింట్ల లాభంతో 72,664.47 వద్ద, నిఫ్టీ 97.70 పాయింట్ల లాభంతో 22,055.20 వద్ద ముగిశాయి. ఇంట్రా డేలో సెన్సెక్స్ 542.37 పాయింట్ల లాభంతో 72,946.54 గరిష్ఠ స్థాయిని తాకింది. సెన్సెక్స్ హెవీ వెయిట్స్ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, ఎయిర్‌టెల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవడం శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్‌కు కలిసొచ్చింది.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ అదుర్స్: శుక్రవారం ముగిసిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐపీఓకు మదుపరుల నుంచి మంచి ఆదరణ లభించింది. బిడ్డింగ్ ప్రాసెస్ ముగిసే సరికి ఇష్యూ 25.49 రెట్లు సబ్‌స్ర్కైబ్ అయింది.

- ఈ నెల 15న ఐపీఓకి వస్తున్న గో డిజిట్ ఇన్సూరెన్స్ కంపెనీ షేరు ధర శ్రేణిని రూ.258-272గా ప్రకటించింది.

నగల దుకాణాలకు అక్షయ తృతీయ కళ



జనంతో కిటకిట

ముంబై: పసిడి ధర కొండెక్కినా అక్షయ తృతీయ రోజు బంగారు నగల అమ్మకాలు ఏ మాత్రం తగ్గలేదు. శుక్రవారం ఉదయం నుంచి నగల దుకాణాలకు జనం పోటెత్తారు. గత ఏడాది అక్షయ తృతీయ రోజు 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం రూ.60,000గా ఉంది. ఈ అక్షయ తృతీయకు అది 15 నుంచి 17 శాతం పెరిగి రూ.71,000కు చేరింది. ఈ ప్రభావం ఈ ఏడాది అక్షయ తృతీయ నగల అమ్మకాలపై ఉంటుందని మార్కెట్ వర్గాలు భయపడ్డాయి. అయితే ఆ భయాలను పటాపంచలు చేస్తూ కొనుగోలుదారులు శుక్రవారం ఉదయం నుంచే నగల దుకాణాల ముందు క్యూ కట్టారు.

'దేశవ్యాప్తంగా నగల దుకాణాలు అక్షయ తృతీయ రోజు కిటకిట లాడాయి. దక్షిణ భారత దేశంలో ఇది మరింత స్పష్టంగా కనిపించింది' అని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (ఏఐజేజేడీసీ) చైర్మన్ సయాం మెహ్రా చెప్పారు.

తగ్గే అవకాశం

గత ఏడాతో పోలిస్తే ఈ సంవత్సరం అక్షయ తృతీయ రోజు కొనుగోలుదారులు ఆచితూచి ఖర్చు చేశారు. మరీ అవసరమైతే తప్ప పెద్ద పెద్ద ఆభరణాల జోలికి పోలేదు. ఎక్కువ మంది చిన్న చిన్న ఆభరణాలతోనే సరిపెట్టుకున్నారు. అధిక ధరలు ఇందుకు ప్రధాన కారణంగా కనిపించింది. దీంతో గత ఏడాదితో పోలిస్తే విలువపరంగా అమ్మకాలు పెరిగినా, పరిమాణ పరంగా ఐదు నుంచి ఏడు శాతం తగ్గాయని మార్కెట్ వర్గాలు చెప్పాయి. దక్షిణ భారత్‌లో పెళ్లిళ్లకు అవసరమయ్యే పెద్ద పెద్ద ఆభరణాలు ఎక్కువగా అమ్ముడైతే, మిగతా ప్రాంతాల్లోని కొనుగోలుదారులు ఎక్కువగా చిన్న చిన్న ఆభరణాలతోనే సరిపెట్టుకున్నారు. పసిడి ధర మరింత పెరుగుతుందనే భయంతో కొంత మంది, అక్షయ తృతీయ రోజు పెద్ద పెద్ద ఆభరణాలు కొనుగోలు చేశారు. అక్షయ తృతీయ శనివారం మధ్యాహ్నం వరకు ఉన్నందున అమ్మకాలు శనివారం వరకు కొనసాగుతాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

రూ.3.80 లక్షల కోట్ల పసిడి దిగుమతులు

మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మన దేశం 4,554 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.80 లక్షల కోట్లు) విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దిగుమతి అయిన 3,500 కోట్ల డాలర్ల విలువైన బంగారంతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువ. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఇందుకు సంబంధించిన వివరాలు విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరం మన దేశం దిగుమతి చేసుకున్న బంగారంలో స్విట్జర్లాండ్ నుంచి 40 శాతం, యూఏఈ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి పది శాతం దిగుమతి అయింది.

టాటా మోటార్స్ లాభం మూడింతలు



- క్యూ4లో రూ.17,528 కోట్లు
- ఒక్కో షేరుకు మొత్తం డివిడెండ్ రూ.6

న్యూఢిల్లీ: మార్చి 31తో ముగిసిన 2024 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి టాటా మోటార్స్ ఏకీకృత నికర లాభం మూడింతలకు పైగా వృద్ధితో రూ.17,528.59 కోట్లకు చేరుకుంది. జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్ఆర్) సహా కంపెనీకి చెందిన మూడు వాహన విభాగాలు బలమైన పనితీరును కనబరచడం ఇందుకు దోహదపడింది. 2022-23లో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.5,496.04 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ4లో టాటా మోటార్స్ ఏకీకృత నిర్వహణ ఆదాయం రూ.1,19,986.31 కోట్లకు పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలానికి దాదాపు రూ.1.06 లక్షల కోట్ల రాబడి నమోదైంది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.4,37,927.77 కోట్ల ఆదాయంపై రూ.31,806.75 కోట్ల నికర లాభాన్ని గడించింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో సాధారణ షేరుకు రూ.3 తుది డివిడెండ్‌తో పాటు రూ.3 ప్రత్యేక డివిడెండ్ కలిపి మొత్తం రూ.6 డివిడెండ్ చెల్లించాలని టాటా మోటార్స్ బోర్డు సిఫారసు చేసింది. కాగా, ఒక్కో ఏ క్లాస్ ఆర్డినరీ షేరుకు కంపెనీ రూ.3.10 తుది డివిడెండ్, రూ.3.10 ప్రత్యేక డివిడెండ్ కలిపి మొత్తం రూ.6.20 చెల్లించనుంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- జనవరి-మార్చి కాలానికి జేఎల్ఆర్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధితో 790 కోట్ల పౌండ్లకు చేరుకోగా.. నికర లాభం 140 కోట్ల పౌండ్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఈ విభాగం ఆదాయం 27 శాతం వృద్ధితో 2900 కోట్ల పౌండ్లకు, లాభం 260 కోట్ల పౌండ్లకు పెరిగింది. ఈ విభాగానికిదే అత్యధిక వార్షికాదాయం. ల్యాండ్‌రోవర్, డిఫెండర్ మోడళ్లకు బలమైన డిమాండ్ ఇందుకు దోహదపడింది.
- టాటా వాణిజ్య వాహనాల విభాగం ఆదాయం క్యూ4లో రూ.21,600 కోట్లకు చేరుకోగా.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.78,800 కోట్లుగా నమోదైంది. జనవరి-మార్చి కాలానికి దేశీయంగా 1,04,600 యూనిట్ల వాణిజ్య వాహన విక్రయాలను విక్రయించినట్లు సంస్థ తెలిపింది.
- టాటా ప్రయాణికుల కార్ల విభాగం ఆదాయం క్యూ4లో రూ.14,400 కోట్లు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.52,400 కోట్లుగా నమోదైంది. మార్చి త్రైమాసికంలో వాహన విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 14.8 శాతం పెరిగి 1,55,600 యూనిట్లుగా నమోదయ్యాయి.

> గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆల్‌టైం రికార్డు ఆదాయం, లాభాలను నమోదు చేసింది. కంపెనీ దేశీయ వ్యాపారం ఇప్పుడు రుణరహితంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాలూ రుణరహితంగా మారనున్నాయి. భిన్న వ్యూహాలతో కంపెనీ వ్యాపారాలు బలమైన పనితీరును కనబరుస్తున్నాయి. ముమ్ముందు సంవత్సరాల్లోనూ ఈ జోరు కొనసాగుతుందని ధీమాగా ఉన్నాం.
> – పీబీ బాలాజీ, టాటా మోటార్స్ సీఎఫ్ఓ

బీఓబీ లాభం రూ.4,886 కోట్లు

ఒక్కో షేరుకు రూ.7.60 డివిడెండ్

న్యూఢిల్లీ: నాలుగో త్రైమాసికంలో బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) స్టాండ్ అలోన్ లాభం 2.3 శాతం పెరిగి రూ.4,886 కోట్లకు చేరుకుంది. కాగా, మొత్తం ఆదాయం రూ.33,775 కోట్లకు ఎగబాకింది. సమీక్షా కాలానికి బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.29,583 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ మార్జిన్ 3.18 శాతంగా నమోదైంది. మార్చి చివరి నాటికి బ్యాంక్ మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.92 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పీఏలు 0.68 శాతానికి దిగివచ్చాయి. దాంతో, మార్చి త్రైమాసికంలో మొండిబాకీలు, తక్షణావసరాల కోసం కేటాయింపులు రూ.1,302 కోట్లకు తగ్గాయి. కాగా ప్రొవిజన్ కవరేజీ రేషియో 93.30 శాతానికి పుంజుకోగా.. మూలధన సమర్థత నిష్పత్తి 16.31 శాతానికి మెరుగుపడింది. వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.7.60 డివిడెండ్ చెల్లించాలని బీఓబీ బోర్డు సిఫారసు చేసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2023-24) బీఓబీ రూ.1,27,101 కోట్ల ఆదాయంపై రూ.17,789 కోట్ల లాభం గడించింది.

బీఓఐ లాభంలో 7% వృద్ధి

ఒక్కో షేరుకు రూ.2.80 డివిడెండ్

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) మార్చి త్రైమాసిక లాభం 7 శాతం పెరిగి రూ.1,439 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.17,913 కోట్లకు పుంజుకుంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.5,937 కోట్లుగా, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.30 శాతంగా నమోదైంది. మార్చి 31 నాటికి బీఓఐ మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 4.98 శాతానికి దిగిరాగా.. నికర ఎన్‌పీఏలు 1.22 శాతానికి తగ్గాయి. కానీ, మార్చి త్రైమాసికంలో మొండిబాకీల కోసం కేటాయింపులు మాత్రం రూ.2,043 కోట్లకు పెరిగాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం 57 శాతం వృద్ధితో రూ.6,318 కోట్లకు పెరగగా.. మొత్తం ఆదాయం రూ.66,804 కోట్లకు ఎగబాకింది. 2023-24కు గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.2.80 డివిడెండ్ చెల్లించాలని బ్యాంక్ బోర్డు సిఫారసు చేసింది.



వందేళ్ల లిమిటెడ్ ఎడిషన్ ఎంజీ కార్లు

బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ మోరిస్ గ్యారెజెస్ (ఎంజీ).. ఐకానిక్ ఎవర్‌గ్రీన్ రంగులో 100 ఏళ్ల లిమిటెడ్ ఎడిషన్లను భారత మార్కెట్లోకి శుక్రవారం ప్రవేశపెట్టింది. కోమెట్ ఈవీ, ఆస్టర్, హెక్టర్, జెడ్ఎస్ ఈవీ మోడళ్లలో ఈ ఎడిషన్ కార్లను అందుబాటులోకి తెచ్చింది. కారును బట్టి వీటి ధరల శ్రేణి రూ.9.48 లక్షల నుంచి రూ.24.18 లక్షల స్థాయిలో ఉంది.

రిజర్వ్ బ్యాంక్ ఈడీగా లక్ష్మీకాంతరావు

ముంబై: ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆర్.లక్ష్మీకాంత రావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నియంత్రణల విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆర్‌బీఐలో ఆయనకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది.

మిర్యాలగూడలో మలబార్ షోరూం

హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల రిటైల్ విక్రయ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన సరికొత్త షోరూమ్‌ను తెలంగాణలోని మిర్యాలగూడలో ఏర్పాటు చేసింది. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం ఈ షోరూంను ప్రారంభించారు. నగరానికి చెందిన ప్రముఖులు, వినియోగదారులు, మలబార్ యాజమాన్య బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిర్యాలగూడ ప్రజలకు మా అత్యద్భుతమైన ఆభరణాల సేకరణలు, ప్రపంచస్థాయి షాపింగ్ అనుభూతిని అందించడానికి మేమెంతో సంతోషిస్తున్నామని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మిర్యాలగూడ షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కంపెనీ కస్టమర్లకు ప్రత్యేక ప్రారంభ ఆఫర్లను ప్రకటించింది. బంగారు ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు, స్టడెడ్ ఆభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 25 శాతం తగ్గింపు, వజ్రాభరణాల్లోని వజ్రాల విలువపై 25 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తెలిపింది. ఈనెల 12 వరకే ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,090 ▲	67,000 ▲	90,000 ▲
ముంబై	73,010 ▲	66,880 ▲	84,215 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	540
చిత్తూరు	598	విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140	గోదావరి	150
వరంగల్	140	విజయవాడ	150
కరీంనగర్	140	గుంటూరు	150
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	150
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	142		

టైటాన్స్ రేసులోనే

స్పోర్ట్స్

- చెన్నైపై ఘనవిజయం
- గిల్, సుదర్శన్ సెంచరీలు
- పోరాడిన మిచెల్, అలీ
- మోహిత్‌కు 3 వికెట్లు



శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 104)

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: కోల్‌కతా

కోల్‌కతా X ముంబై

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) దూబె (బి) దేశ్‌పాండే 103, గిల్ (సి) జడేజా (బి) దేశ్‌పాండే 104, మిల్లర్ (నాటౌట్) 16, షారుక్ (రనౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 6; **మొత్తం: 20 ఓవర్లలో 231/3; వికెట్ల పతనం:** 1-210, 2-213, 3-231; **బౌలింగ్:** శాంట్నర్ 2-0-31-0, తుషార్ దేశ్‌పాండే 4-0-33-2, శార్దూల్ 4-0-25-0, సిమర్‌జీత్ 4-0-60-0, జడేజా 2-0-29-0, మిచెల్ 4-0-52-0.

చెన్నై: రహానె (సి) తెవాటియా (బి) సందీప్ 1, రచిన్ (రనౌట్) 1, రుతురాజ్ (సి) రషీద్ (బి) ఉమేశ్ 0, మిచెల్ (సి) షారుక్ (బి) మోహిత్ 63, మొయిన్ అలీ (సి) నూర్ (బి) మోహిత్ 56, దూబె (సి) నూర్ (బి) మోహిత్ 21, జడేజా (సి) మిల్లర్ (బి) రషీద్ 18, ధోనీ (నాటౌట్) 26, శాంట్నర్ (బి) రషీద్ 0, శార్దూల్ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు: 7; **మొత్తం: 20 ఓవర్లలో 196/8; వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-10, 4-119, 5-135, 6-165, 7-169, 8-169; **బౌలింగ్:** ఉమేశ్ 3-0-20-1, సందీప్ 3-0-28-1, త్యాగి 4-0-51-0, నూర్ అహ్మద్ 2-0-25-0, రషీద్ 4-0-38-2, మోహిత్ 4-0-31-3.

1 ఐపీఎల్‌లో ఎక్కువ శతకాలు (13) నమోదవడం ఇదే తొలిసారి.

3 ఒకే ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఇది మూడో సారి. గతంలో బెంగళూరు, సన్‌రైజర్స్ జట్ల నుంచి నమోదయ్యాయి.

1 గుజరాత్ తరఫున ఏ వికెట్‌కైనా అత్యధిక పరుగుల (209) భాగస్వామ్యం నమోదు చేసిన సాయి సుదర్శన్-గిల్.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
హైదరాబాద్	12	7	5	0	14	0.406
చెన్నై	12	6	6	0	12	0.491
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
బెంగళూరు	12	5	7	0	10	0.217
గుజరాత్	12	5	7	0	10	-1.063
ముంబై	12	4	8	0	8	-0.212
పంజాబ్	12	4	8	0	8	-0.423

అహ్మదాబాద్: ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టిన గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగానే నిలుపుకొంది. అలాగే ఇతర జట్లకు కూడా తమ విజయంతో ఊపిరిలూదింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సలతో 104), సాయి సుదర్శన్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సలతో 103) శతకాల మోతెక్కించడంతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 35 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే 10 పాయింట్లతో ఆఖరి నుంచి ఎనిమిదో స్థానానికి చేరింది. ఇక చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి, ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అటు డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ మాత్రం చెత్త ఆటతో చిత్తయ్యింది. ఆరు విజయాలు, ఆరు ఓటములతో సీఎస్‌కే 12 పాయింట్లతోనే ఉంది. ఈ జట్టు కూడా మిగిలిన రెండు మ్యాచ్‌లను కచ్చితంగా నెగ్గాల్సిందే. ముందుగా గుజరాత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 231 పరుగులు చేసింది. తుషార్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసి ఓడింది. మిచెల్ (34 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సలతో 63), మొయిన్ అలీ (36 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 56) అర్ధసెంచరీలు సాధించారు. మోహిత్‌కు మూడు, రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.



సాయి సుదర్శన్ (51 బంతుల్లో 103)

మిచెల్, అలీ పోరాడినా..: భారీ ఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ దారుణంగా ఆరంభమైంది. తొలి మూడు ఓవర్లలోనే టాపార్డర్ బ్యాటర్లు రచిన్ (1), రహానె (1), రుతురాజ్ (0) పెవిలియన్‌కు చేరారు. ఈ స్థితిలో డారిల్ మిచెల్, మొయిన్ అలీ నాలుగో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ వీరి నిష్క్రమణతో జట్టు కూడా తడబడింది. ఇద్దరి బౌండరీల ధాటికి పవర్‌ప్లేలో జట్టు 43/3తో కోలుకుంది. ఆ తర్వాత మిచెల్ మరింత వేగం చూపుతూ ఎనిమిదో ఓవర్‌లో మూడు ఫోర్లు బాదాడు. 27 బంతుల్లోనే తను ఫిఫ్టీ సాధించగా.. అలీ కూడా 11వ ఓవర్‌లో 6,6,6తో స్కోరును వంద దాటించాడు. స్పిన్నర్ రషీద్ ఓవర్‌లోనూ మిచెల్ 4,6తో జోరు చూపాడు. ఈ జోడీ క్రీజులో ఉన్నంత సేపు చెన్నై సరైన దారిలోనే వెళ్లింది. కానీ కెప్టెన్ గిల్ పేసర్ మోహిత్‌కు బంతినివ్వడంతో పరిస్థితి తారుమారైంది. అతడు తన వరుస ఓవర్లలో మిచెల్, అలీ, దూబే (21) వికెట్లు తీయడంతో చెన్నై ఇక కోలుకోలేకపోయింది. 18వ ఓవర్‌లో జడేజా (18), శాంట్నర్ (0)లను స్పిన్నర్ రషీద్ దెబ్బతీశాడు. చివరి ఓవర్‌లో ధోనీ (26 నాటౌట్) 6,6,4తో మురిపించినా.. ఫలితం లేకపోయింది.

ఓపెనర్ల సెంచరీలు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సాయి సుదర్శన్, గిల్ సెంచరీలతో కదం తొక్కారు. పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో చెన్నై బౌలర్లు బంతులు వేయడం తప్ప చేసేదేమీ లేకపోయింది. దీంతో 17 ఓవర్లపాటు ఇద్దరు బ్యాటర్లదే ఆధిపత్యం సాగింది. ఆరంభం నుంచే బాల్ చక్కగా బ్యాట్ మీదికి రావడంతో సాయి, గిల్ పోటాపోటీగా ఆడేస్తూ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లారు. దీంతో 250 స్కోరు పక్కా అనిపించినా ఆఖర్లో బౌలర్లు కాస్త కట్టడి చేశారు. పవర్‌ప్లేలో జట్టు 58 పరుగులు చేశాక సుదర్శన్ మరింత జోరు చూపాడు. తొమ్మిదో ఓవర్‌లో అతడు 4,6తో 32 బంతుల్లో ఫిఫ్టీ చేరుకున్నాడు. ఇక 11వ ఓవర్‌లో గిల్ 6,4తో 25 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించగా.. అటు సాయి మరో రెండు సిక్సర్లతో 23 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత కూడా 13వ ఓవర్‌లో సాయి 4,6 బాదగా.. మిచెల్ ఓవర్‌లో గిల్ మూడు సిక్సర్లతో 19 రన్స్ అందించాడు. ఇదే ఓవర్‌లో అతనిచ్చిన క్యాచ్‌ను తుషార్ వదిలేశాడు. దీన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్న గిల్ ఓ ఫోర్‌తో.. ఆ వెంటనే సుదర్శన్ 6తో 17వ ఓవర్‌లో 50 బంతుల్లోనే తమ శతకాలను పూర్తి చేసుకున్నారు. అయితే 16వ ఓవర్‌లో ఆరు పరుగులే ఇచ్చిన తుషార్.. 18వ ఓవర్‌లో నాలుగు రన్స్ ఇచ్చి సుదర్శన్, గిల్ వికెట్లతో చెన్నైకి రిలీఫ్‌నిచ్చాడు. ఆ తర్వాత స్కోరులో వేగం తగ్గింది. ఓవరాల్‌గా గుజరాత్ చివరి మూడు ఓవర్లలో 22 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి.. కేవలం ఒక్క ఫోర్ మాత్రమే సాధించింది.

నీరజ్.. స్వర్ణం మిస్



దోహా డైమండ్ లీగ్‌లో రెండో స్థానం

దోహా: ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా దోహా డైమండ్ లీగ్‌లో త్రుటిలో స్వర్ణ పతకాన్ని మిస్సయ్యాడు. శుక్రవారం రాత్రి జరిగిన జావెలిన్ త్రో ఈవెంట్ చివరి ప్రయత్నంలో నీరజ్ 88.36 మీ. దూరం ఈటెను విసిరి రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాకబ్ వాడ్లేచ్ 88.38 మీ. దూరం విసిరి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. కేవలం రెండు సెంటీమీటర్ల దూరంతో నీరజ్ టైటిల్ కోల్పోయాడు. గత ఏడాది ఇక్కడ నీరజ్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) 86.62 మీ. దూరంతో మూడో స్థానం సాధించాడు. ఇక తొలిసారి డైమండ్ లీగ్ బరిలో దిగిన భారత మరో జావెలిన్ త్రోయర్ శ్రీకాంత్ జెనా (76.31 మీ.) పదిమందిలో తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాల నమోదుకు కోర్టు ఆదేశం

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు సాక్ష్యాలున్నాయని వెల్లడి



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో అతడిపై నేరాభియోగాలు నమోదు చేయాలని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు పోలీసులను శుక్రవారం ఆదేశించింది. అందుకు తగినన్ని సాక్ష్యాలున్నాయని స్పష్టంజేసింది. సెక్షన్ 354 (మహిళల నిరాడంబరతకు భంగం కలిగించడం), 354 ఎ (లైంగిక వేధింపులు), 506 (నేరపూరిత బెదిరింపు) కింద అభియోగాలను నమోదు చేయాలని కోర్టు సూచించింది. అలాగే డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో బీజేపీ మాజీ ఎంపీ అయిన బ్రిజ్‌భూషణ్‌పై త్వరలో విచారణ ప్రారంభం కానుంది. బ్రిజ్‌భూషణ్ వేధింపులకు వ్యతిరేకంగా స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేశ్ ఫొగట్, బజ్‌రంగ్ పూనియా సహా పలువురు ఏడాదిపాటు ఢిల్లీలో ఆందోళనలు నిర్వహించిన సంగతి తెలిసిందే. కాగా, విచారణను ఎదుర్కొంటానని బ్రిజ్‌భూషణ్ చెప్పాడు.

ఏసీఏలో రూ. 200 కోట్ల అవినీతి

- శరత్‌చంద్రా రెడ్డి బృందంపై విచారణ జరిపించాలి
- చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ చీఫ్ విజయ్

తిరుపతి (క్రీడలు): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)లో దాదాపు 200కోట్లు అవినీతి జరిగిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. విజయ్‌కుమార్ (క్రికెట్ విజయ్) ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2019 నుంచి 2023 వరకు కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. క్రీడాకారులకు చేరాల్సిన బీసీసీఐ నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న విజయ్.. ఈ విషయం క్రికెటర్లకు, వారి తల్లిదండ్రులకు తెలియాలనే మీడియా ముందుకు వచ్చామని స్పష్టం చేశారు. లేని ఉద్యోగులను చూపించి నిధులు దోచేశారని మండిపడ్డారు. లిక్కర్ స్కాంలో నిందితులు, క్రికెట్ అంటే అవగాహన లేని వారు అసోసియేషన్ సభ్యత్వానికి అనర్హులన్నారు. 2019లో ఏసీఏలోకి అడుగుపెట్టిన శరత్‌చంద్రారెడ్డి బృందం అర్హత లేకపోయినా డబ్బు, అధికార బలంతో ఎన్నికలకు తావు లేకుండా ఏకగ్రీవ నియామకమైనట్లు ప్రకటించుకుందన్నారు. సీఎం జగన్ మెప్పు పొందడానికి పులివెందులలో, విజయసాయిరెడ్డికి భూములున్న భోగాపురంలో మైదానాల నిర్మాణం పేరుతో వేల కోట్ల ఖర్చుపెట్టారని విమర్శించారు. వీరి రాకతో ఏసీఏలో ఉద్యోగులంతా బయటకు వెళ్లిపోయారని, అయినా వారికి జీతాలు ఇస్తున్నట్లు అకౌంట్స్‌లో చూపిస్తున్నారన్నారు. సమావేశంలో శ్రీనివాసమూర్తి, గిరి ప్రకాష్, సతీష్ యాదవ్ పాల్గొన్నారు.

అగార్కర్ వద్దంటేనే..

శ్రేయాస్, ఇషాన్‌కు కాంట్రాక్టు నిరాకరణపై జై షా

ముంబై: చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నిర్ణయం మేరకే శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌ను సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితానుంచి తొలగించామని బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించాడు. బీసీసీఐ సూచించినా..దేశవాళీ పోటీల్లో ఆడేందుకు నిరాకరించడంతో కాంట్రాక్టు జాబితా నుంచి శ్రేయాస్, ఇషాన్‌లను పక్కనబెట్టిన సంగతి తెలిసిందే. గత ఏడాది వన్డే వరల్డ్ కప్ తర్వాత సుదీర్ఘ విరామం తీసుకున్న కిషన్..ఐపీఎల్ వరకూ ఆటకు అందుబాటులో లేని విషయం విదితమే. మరోవైపు గాయం నుంచి కోలుకున్న అయ్యర్ ముంబై తరఫున కొన్ని రంజీ మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. 'శ్రేయాస్, ఇషాన్ దేశవాళీ పోటీల్లో ఆడలేదు. దాంతో వారిని సెంట్రల్ కాంట్రాక్టు జాబితా నుంచి తొలగించాలని అగార్కర్ నిర్ణయించాడు. నా పాత్ర సెలెక్షన్ కమిటీ నిర్ణయాలను అమలు పరచడమే' అని జైషా పేర్కొన్నాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

వార్సా (పోలెండ్): సూపర్ బెట్ టోర్నీ ర్యాపిడ్ రౌండ్ ముగిసే సరికి ప్రజ్ఞానంద (10) మూడో స్థానంలో నిలిచాడు. చైనాకు చెందిన వీ ఈ (13) అగ్ర స్థానంలో నిలవగా, కార్ల్‌సన్ (12) రెండో స్థానం సాధించాడు. గుకేష్ (7) తొమ్మిదో స్థానంలో నిలిచాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (8) ఆరో స్థానం సాధించాడు. ఆఖరిదైన 9వ రౌండ్‌లో వీ యీతో ప్రజ్ఞానంద, అనీష్ గిరితో కార్ల్‌సన్ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. విన్సెంట్ చేతిలో అర్జున్, దుడా చేతిలో గుకేష్ ఓడారు.

వహ్వా.. నిషా

భారత్‌కు ఐదో ఒలింపిక్ బెర్త్ అందించిన రెజ్లర్



ఇస్తాంబుల్: వరల్డ్, ఒలింపిక్ గేమ్స్ క్వాలిఫయర్స్ టోర్నమెంట్‌లో భారత యువ రెజ్లర్ నిషా దహియా (68 కిలోలు) సత్తా చాటింది. తన విభాగంలో ఫైనల్స్‌కు దూసుకెళ్లి భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ అందించింది. మహిళల రెజ్లింగ్‌లో భారత్‌కు ఇది ఐదో ఒలింపిక్ కోటా కావడం విశేషం. ఇప్పటికే వినేశ్ ఫొగట్ (50 కి), అంతిమ్ పంగల్ (53 కి), అన్షు మాలిక్ (57 కి), రితికా హుడా (76 కి) పారిస్ విశ్వ క్రీడలకు బెర్త్ సాధించిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో నిషా 8-4తో అలెగ్జాండ్రా ఏంజెల్ (రొమేనియా)ను చిత్తుచేసింది. అంతకుముందు క్వార్టర్స్‌లో నిషా 7-4తో అడెలా హన్‌జికోవా (చెక్)పై గెలిచింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 11-5-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

మోదీ అబద్ధాలకోరు

ఇద్దరు వ్యక్తుల చేతుల్లోనే దేశ సంపద: ఖర్గే

మోదీవి దుశ్శాసన రాజకీయాలు: ఏచూరి

మోదీ మాటలకు చేతలకు సంబంధం లేదు: డి.రాజా

బెజవాడ, గుంటూరులో ఇండియా కూటమి బహిరంగ సభలు 8

కేజ్రీకి బెయిల్

సీఎంవో, సెక్రటేరియట్‌కు వెళ్లొద్దని, 2న లొంగిపోవాలని సుప్రీం షరతు

కేజ్రీపై నేరం ఇంకా రుజువు కాలేదని, నేర నేపథ్యం లేదని వ్యాఖ్య 8

సామాన్యుడికీ సీఎంకూ ఒకే న్యాయం వర్తింపజేయాలన్న ఈడీ

ఏకీభవించని సుప్రీం.. చంద్రబాబుకూ సభల్లో పాల్గొనే చాన్స్ ఇచ్చినట్టు వెల్లడి

ఇదీ జరిగింది..

4 నెలల కిందట నొక్కిన బటన్‌లకు ఎన్నికల ముందు డబ్బులేసి లబ్ధి పొందాలన్నది జగన్ వ్యూహం! గురువారం ఉదయం నుంచి శుక్రవారం రాత్రి దాకా ఈ హైడ్రామా సాగిందిలా...

గురువారం: ఎప్పుడో నొక్కిన బటన్‌లకు ఇప్పుడు, పోలింగ్ ముందు డబ్బులు ఇవ్వడం ప్రజాప్రాతినిధ్య చట్టం, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని ఈసీ స్పష్టం చేసింది.

రాత్రి 10 గంటలు: ఈసీ ఆదేశాలను శుక్రవారం వరకు నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. 11, 12, 13 తేదీల్లో మాత్రం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయొద్దని ఆదేశించింది.

అర్ధరాత్రి 1 గంట: హైకోర్టు ఉత్తర్వులతో వచ్చిన వెసులుబాటు నేపథ్యంలో... బటన్ నొక్కుడు డబ్బులు వేసేందుకు అనుమతించాలని ఈసీకి సీఎస్ జవహర్ రెడ్డి లేఖ.

శుక్రవారం ఉదయం: ఇప్పుడే డబ్బులు ఎందుకు వేయాలనుకుంటున్నారు, జనవరి నుంచి మార్చి మధ్య మీ ఆర్థిక పరిస్థితి సహకరించలేదా... వివరాలు చెప్పాలని ఈసీ ఆదేశం.

మధ్యాహ్నం 2 గంటలు: ఆర్థిక పరిస్థితి వివరిస్తూ ఈసీకి జవహర్ రెడ్డి జవాబు.

సాయంత్రం 4 గంటలు: హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుపై అప్పీలును విచారించిన ధర్మాసనం... ఈ సమయంలో ఉత్తర్వులు ఇచ్చినా ప్రయోజనం ఉండదనే అభిప్రాయంతో విచారణ వాయిదా!

సాయంత్రం 7 గంటలు: సీఎస్ లేఖలో పొందుపరిచిన వివరాలను పరిశీలించిన ఈసీ. నిధుల విడుదలలో జగన్ సర్కారు కావాలనే జాప్యం చేసినట్లు నిర్ధారణ. "జనవరి నుంచి మార్చి వరకు బాగున్నా... అప్పుడు ఎందుకు ఇవ్వలేదు? గతంలో ఎప్పుడూ మే నెలలో డీబీటీ నిధులు ఇచ్చిన దాఖలాలు లేవు కదా! ఇప్పుడు మాత్రం అత్యవసరం ఏముంది? పోలింగ్ ముగిశాకే డబ్బులు వేసుకోవచ్చు" అని ఈసీ స్పష్టీకరణ.

'బటన్' కుట్రలు బద్దలు!



జగన్నాటకం బయటపెట్టిన ఎన్నికల కమిషన్

- జనవరి-మార్చి మధ్య 6 పథకాలకు బటన్ నొక్కుడు
- నెలలు దాటినా ఖాతాల్లో జమ చేయకుండా జాప్యం
- పోలింగ్‌కు ముందు ఖాతాల్లో వేసి లబ్ధిపొందే కుట్ర
- హైకోర్టు ఇచ్చిన వెసులుబాటుతో అర్ధరాత్రి హంగామా
- అనుమతి కోసం ఈసీకి సీఎస్ జవహర్ రెడ్డి లేఖ
- వరుస ప్రశ్నలు సంధించిన ఎన్నికల కమిషన్
- జనవరి-మార్చి మధ్య మీ ఆర్థిక పరిస్థితి ఏమిటి?
- ఆరు పథకాలకు ఇప్పుడే నిధులు ఎలా వచ్చాయి?
- ఇవే పథకాలకు గతంలో ఎప్పుడు జమ చేశారు?
- ఇన్ని నెలలు ఇవ్వకుండా.. ఇప్పుడు అర్జంట్ ఏమిటి?
- బదులివ్వాలని సీఎస్‌కు ఈసీ ఆదేశాలు
- సీఎస్ సమాధానంతో కుట్రపై మరింత స్పష్టత
- కావాలనే నిధులు విడుదల చేయలేదని నిర్ధారణ
- పోలింగ్ తర్వాతే జమ చేయాలని సీఎస్‌కు ఆదేశం

అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): నే........రుగా పడాల్సిన డబ్బులు ఎక్కడాగిపోయాయి? బటన్ నొక్కిన నాలుగు నెలలకు కూడా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఎందుకు జమ కాలేదు? కావాల్సిన కాంట్రాక్టర్లకు వేలకోట్లు చెల్లించేసి... పేదలు, బడుగు, బలహీన వర్గాలకే 'ఈ బిడ్డ' ఎందుకు డబ్బులు ఆపేశారు? అప్పుడెప్పుడో బటన్ నొక్కి, తన సొంత, రోత పత్రికకు అప్పుడే కోట్ల విలువైన ప్రకటనలు ఇచ్చుకుని... అసలు లబ్ధిదారులకు మాత్రం ఇప్పుడు డబ్బులు వేస్తామనడమేమిటి? ఇదంతా... జగన్నాటకం! పోలింగ్‌కు ఒకటి, రెండు రోజుల ముందు ఖాతాల్లో డబ్బులు జమచేసి, జనం సొమ్ముతోనే జనం ఓట్లను కొనుగోలు చేయాలన్న వ్యూహం! ఈ జగన్నాటకాన్ని ఎన్నికల సంఘమే బయటపెట్టింది. ఎప్పుడో జనవరిలో నొక్కిన బటన్ సొమ్ములు ఇప్పుడు జమచేసి ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న

మిగతా 8వ పేజీలో...

అక్రమాలు చేయలేం!

తేల్చిచెప్పిన అధికారులు

మరో రూ.4,000 కోట్ల అప్పు

నిధుల పంపిణీకి ఈసీ ఎన్‌వోసీ ఇవ్వలేదు



11 నుంచి 13 వరకు సొమ్ము జమ చేయవద్దని సింగిల్ జడ్జి ఉత్తర్వులున్నాయి

అప్పీళ్లపై విచారణ జరిపి ఏం ప్రయోజనం?: హైకోర్టు

సెలవుల తర్వాతే విచారణ 8

నేటి సాయంత్రంతో ప్రచారం

సమాప్తం

సాయంత్రం 6 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ అమల్లోకి 12

ఆ సమయంలో లౌడ్ స్పీకర్లు, బహిరంగ సభలపై నిషేధం



వెంకన్ననూ వాడుకున్నాడు

స్వప్రయోజనాల కోసం తిరుమలనూ వాడటమే!

దేవుడికి రక్షణేదీ!

ఆలయాలపై వైసీపీ పడగ



10 11

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

నీ కోసం త్యాగం చేశానని బైబిల్‌పై

ప్రమాణం చేస్తా

నేను డబ్బు, పోస్టు అడిగానని ప్రమాణం చేయగలరా?

జగన్‌కు షర్మిల సవాల్

- నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది ఎవరు?
- పాదయాత్ర సమయంలో పార్టీ అంతా నా చుట్టూనే
- రాజకీయ కాంక్ష ఉంటే వైసీపీని హైజాక్ చేయలేనా?
- అవినాశ్‌రెడ్డి చెప్పిన మాటలకు కన్విన్స్ అవడానికి నువ్వెవరు?
- నువ్వేమైనా రాజ్యాంగమా?
- జగన్‌కు సూటి ప్రశ్నలు



భావోద్వేగానికి గురై కన్నీరు పెడుతున్న షర్మిల

మీ రాజకీయాల కోసం నన్ను నెపోటిజం అంటారా?

నాపై తప్పుడు ప్రచారం చేయించినందుకు జగన్ చరిత్రలో నిలిచిపోతారు

పెయిడ్ ఆర్టిస్టులకు కుక్క బిస్కెట్లు వేసి మరీ నాపై నిందలు వేశారు

మీడియా సమావేశంలో భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టిన షర్మిల 9

షర్మిల దూకుడు!

కడపలో శరవేగంగా మారుతున్న రాజకీయం

వైసీపీతో ఢీ అంటే ఢీ

- వివేకా హత్య కేసులో అన్న, తమ్ముడితో చెడుగుడు
- సొంత జిల్లా బిడ్డగా జనంలో క్రేజ్.. విస్తృత ప్రచారం
- చిన్నాన్న వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని ధ్వజం
- జిల్లా అభివృద్ధిని దెబ్బతీశారని ఆగ్రహం
- చాపకింద నీరులా సునీత ప్రచారం.. సౌభాగ్యమ్మ కూడా
- జగన్ శిబిరం ఉక్కిరిబిక్కిరి.. అయోమయంలో అవినాశ్
- దీంతో జిల్లాపై జగన్ ప్రత్యేక ఫోకస్.. 4 చోట్ల సభలు

9



వాతావరణం అనుకూలించలేదు. హెలికాప్టర్ ఎగరలేదు! వస్తానన్న నాయకుడు రాలేకపోయారు. అయినా సరే... అభిమాన జన సందోహం కట్టుకదల్లేదు! ఆయన మాట కోసం ఎదురు చూశారు! ఇది... పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన ఘటన! శుక్రవారం సాయంత్రం మాచర్ల సభలో చంద్రబాబు పాల్గొనాల్సి ఉంది. 60వేల మందికిపైగా జనం గుమికూడారు. కానీ... వర్షం కారణంగా వాతావరణం అనుకూలించక పోవడంతో చంద్రబాబు హెలికాప్టర్‌లో అక్కడికి రాలేకపోయారు. అయినా సరే... పెద్దసంఖ్యలో జనం అక్కడి నుంచి కట్టుకదలకుండా నిలిచారు. దీంతో... ఒంగోలులో ఉన్న చంద్రబాబు అక్కడి నుంచే టీడీపీ ఎంపీ అభ్యర్థి కృష్ణ దేవరాయలు మొబైల్ ఫోన్‌కు వీడియో కాల్ చేసి లైవ్ ద్వారా మాచర్ల సభను ఉద్దేశించి ప్రసంగించారు.



పిఠాపురంలో నిర్వహించిన రోడ్ షోలో పవన్

జగన్‌కు ఓటేస్తే ఉరితాడే!

మీ బిడ్డనంటూ మీ భూమి కొట్టేస్తాడు: చంద్రబాబు

- ఆయన మళ్లీ వస్తే.. మీ ఆస్తి మీది కాదు!.. భూరికార్డులు ప్రైవేటు ఏజెంటు వద్ద పెడతారట
- టైటిలింగ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌ను ఆయనే నామినేట్ చేస్తాడట.. కోర్టుకు వెళ్లకూడదట..!
- జగన్ ప్రైవేటుగా పెట్టుకున్న వ్యక్తికి ప్రజల ఆస్తులపై పెత్తనమేంటి?
- మన భూమి మన బిడ్డలకు దక్కాలంటే ఈ దొంగ బిడ్డను ఇంటికి తరలించాలి
- నేటి సాయంత్రం 4 గంటలకు ఆ చట్టం ప్రతులను చించి చెత్తబుట్టలో పారేయండి
- నా రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ రద్దుపైనే.. రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలు ఇస్తా

ప్రజాసంక్షేమం కోసం పనిచేసే బాధ్యత నాది, పవన్‌ది: బాబు

మచిలీపట్నం/గన్నవరం/భీమవరం/మాచర్ల/ఒంగోలు, మే 10 (ఆంధ్రజ్యోతి): మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే మీ భూమి మీది కాదని టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజలను హెచ్చరించారు. జగన్‌కు ఇంకోసారి ఓటేస్తే ఉరి తాడేనన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా

మిగతా 12వ పేజీలో...

ఆస్తుల రక్షణ కోసం కూటమికే ఓటేయండి

- లేదంటే జగన్ వచ్చి ప్రజల ఆస్తులు అమ్మేస్తాడు
- వైసీపీ నేతలకు తెలుగుజాతి తలవంచదు..
- వారిని మట్టిలో పాతేస్తాం 12
- ఎన్నికలకు ముందే జగన్ భయపడుతున్నాడు
- ఏపీ దిశ, దశ మార్చే ఎన్నికలు పిఠాపురం నుంచే
- పిఠాపురం సభలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- రోడ్ షోకు దారిపొడవునా ప్రజల బ్రహ్మరథం

భారతి నన్ను నరికేస్తారో షర్మిలను నరికేస్తారో?



- మాకు ప్రాణహాని ఉంది.. అన్నిటికీ తెగించి పోరాడుతున్నాం
- నా పిల్లలకు వీలునామా రాసి వచ్చా 9
- సింగిల్ ప్లేయర్‌గా ఉండాలనే వివేకా హత్య
- జగన్‌ను ఎదిరించగల సత్తా ఉందనే భయం
- వివేకా కుమార్తె సునీత సంచలన వ్యాఖ్యలు

చంద్రబాబు.. ప్రజల్లో దేవుడిని చూస్తారు

- నిజం గెలవాలి యాత్ర అరుదైన ఘట్టం
- బాబు అరెస్టుతో చాలా బాధపడ్డాను 7
- 204 మంది కార్యకర్తలు చనిపోయారు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ధ్వంసమైంది
- మహిళలను దూషించే హక్కు ఎవరిచ్చారు?
- కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి మేలు
- బాబుకు కుప్పంలో లక్ష మెజారిటీ ఖాయం



'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో నారా భువనేశ్వరి



ఒంగోలులో ఓ దుకాణం నుంచి బియ్యం బస్తాలు తీసుకెళ్తున్న జనం 8

రూ.10కే రెండు క్వార్టర్లు, 50కే బస్తా బియ్యం

- హవాలా తరహాలో నోటుపై సీరియల్ కోడ్
- రాష్ట్రంలో ప్రలోభాల పర్వానికి లేచిన తెర
- ఒంగోలులో 2 రైస్ షాప్‌ల సీజ్, రిలీజ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కేజ్రీవాల్‌కు ఊరట!

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మద్యం కేసులో మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఎన్నికల ప్రచారానికి వీలుకల్పించాలన్నది పరమోద్దేశం కనుక, సార్వత్రిక ఎన్నికల తుదిదశ జూన్ 1న ఇలా ముగియగానే, మర్నాడే తిరిగి తిహాడ్ జైల్లోకి వచ్చేయాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. మధ్యంతర బెయిల్ దక్కిన ఈ 21రోజుల్లో పార్టీ అధినేతగా ఆయన విస్తృతంగా ప్రచారం చేసుకోవచ్చును కానీ, సీఎంగా విధులు నిర్వర్తించకూడదని ఆదేశం. సీఎంవోకూ, సెక్రటేరియట్‌కూ వెళ్ళవద్దనీ, ఫైళ్ళమీద సంతకాలు చేయకూడదనీ, ఈ కేసు గురించి వ్యాఖ్యానించడం, సాక్షులను కలుసుకోవడం ఇత్యాదివి ససేమిరా కుదరవంటూ కోర్టు ఈ బెయిల్ ఇచ్చింది. ఆయన తరపు న్యాయవాది కోరినట్టుగా జూన్ 5వరకూ బెయిల్ దక్కివుంటే మిగతావారితో కలిసి ఎన్నికల ఫలితాలను వీక్షించడమూ, మర్నాడు సంబరాలో సమీక్షలో చేసుకోవడమూ సాధ్యపడేది. ప్రచారాన్ని ముగించి తిరిగి జైలుకు మళ్ళిపోవడమే ఇప్పుడు ఆయన చేయగలిగినపని. ఇప్పటికే మూడుదశల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో, కనీసం మిగిలినదానిమీద తన ప్రభావాన్ని చూపేందుకు ఆయనకు ఈ బెయిల్ ఉపకరిస్తుంది.

ఒక సిట్టింగ్ ముఖ్యమంత్రి జైలుకెళ్ళడం దేశచరిత్రలో ఇదే తొలిసారి. సామాన్యుడికైనా, సీఎంకైనా న్యాయం ఏకరీతిన వర్తించాలన్న వాదనతో, రైతుతో, వ్యాపారితో ముఖ్యమంత్రిని సమం చేస్తూ బెయిల్‌ను అడ్డుకోవడానికి సొలిసిటర్ జనరల్ విశేషమైన ప్రయత్నమే చేశారు. సరిగ్గా పంటకోతకు వచ్చే సమయంలోనే రైతును అరెస్టు చేస్తే, అది కుట్రపూరితంగా జరిగిందని అనిపిస్తే రైతుకూడా బెయిల్‌కు అర్హుడేనని ఆయనకు తెలియనిదేమీ కాదు. ఈ వాదనలనూ, పోలికలనూ తిరస్కరిస్తూ ఒక ముఖ్యమంత్రిగా, జాతీయపార్టీ అధినేతగా ఐదేళ్ళకోమారు వచ్చే ఎన్నికల్లో ప్రచారం చేసుకోవడానికి కేజ్రీవాల్‌కు గల హక్కును సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఏడాదిన్నరనుంచి ఈ కేసులో దర్యాప్తు చేస్తున్నారు, కానీ మార్చిలో ఆయనను అరెస్టుచేశారు, ఇప్పుడు ఈ 21రోజులూ ఆయన బెయిల్‌మీద వెళ్ళినంతమాత్రాన నష్టమేమీ లేదు అన్న వ్యాఖ్యల్లో కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంమీద అవగాహన ఉన్నట్టుగా కనిపిస్తున్నది. ఎన్నికల ప్రచారం కోసం ఇచ్చే తాత్కాలిక బెయిల్ కనుక న్యాయస్థానం దీనికి అభ్యంతరపెట్టదని కేంద్ర పాలకులు కూడా భావించి ఉండవచ్చు. మే3వ తేదీన న్యాయస్థానం నుంచి బెయిల్ విషయంలో సానుకూలమైన వ్యాఖ్యలు రావడంతో, మే 7వతేదీ విచారణ సందర్భంలోనే ఆయనకు బెయిల్ ఖాయమని అంతా అనుకున్నారు. కానీ, సోమవారం హఠాత్తుగా అరవింద్ కేజ్రీవాల్ మీద మరో అభియోగాన్ని విచారించడానికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించారు. శిక్ష అనుభవిస్తున్న ఒక సిక్కుమిలిటెంట్‌ను వదిలిపెట్టడానికి హవాలామార్గంలో ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు నిధులు తీసుకున్నాడన్నది ఈ కొత్త వ్యవహారంలో ఆరోపణ. మరుసటిరోజు సుప్రీంకోర్టు విచారణను ప్రభావితం చేసి, బెయిల్ రాకుండా అడ్డుపడటానికే ఎల్‌జీ ఈ అకృత్యానికి ఒడిగట్టారని ఆప్ విరుచుకుపడింది. బెయిల్ విషయంలో ఎంతో సానుకూలత చూపిన సుప్రీంకోర్టు మర్నాడు ఆ ఊసెత్తకపోవడం, విచారణ వాయిదావేయడంతో ఎవరికి తోచిన వ్యాఖ్యలు వారు చేశారు.

ఇప్పుడు, చక్కని మాటలతో తన నిర్ణయాన్ని విశ్లేషిస్తూ, కేసు లోతుల్లోకీ, దాని మంచిచెడ్డల్లోకీ పోకుండా ఒక రాజకీయపార్టీ అధినేతగా కేజ్రీవాల్‌కు ఎన్నికల ప్రచారంలో పాల్గొనే హక్కును కోర్టు గుర్తించింది, అవకాశం ఇచ్చింది. మామిడిపళ్ళు తిని శరీరంలో చక్కెరశాతాన్ని పెంచుకొని మెడికల్ బెయిల్ పొందడానికి కేజ్రీవాల్ చూస్తున్నారన్నట్టు వంటి వాదనలను కూడా గతంలో మనం విన్నాం. సరిగ్గా యాభైరోజుల తరువాత ఆయన తాత్కాలికంగానైనా కీలకమైన సమయంలో బయటకు రావడం పార్టీకి కచ్చితంగా సమధికోత్సాహాన్ని ఇస్తుంది. నిర్బంధంతో ఇప్పటికే కొంతమేరకు నష్టం జరిగినప్పటికీ, మిగిలిన ఈ సమయంలో మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను ఆయన విస్తృతంగా చుట్టేయబోతున్నారట. ఢిల్లీలో ఆయనతోపాటు భార్య కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతూండటం భవిష్యత్ సంసిద్ధత కావచ్చు. ఇండియా కూటమిలోని పక్షాలన్నీ కోర్టు నిర్ణయాన్ని స్వాగతించాయి, కేజ్రీవాల్ రాకతో తమ పోరాటం మరింత బలోపేతం అవుతుందని ప్రకటించాయి. తన పార్టీ పాలనలో ఉన్న పంజాబ్‌లో పోలింగ్ ముగిసినరోజునే కేజ్రీవాల్ తిరిగి తిహాడ్ జైలుకు తరలిపోవాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటికే ప్రజల్లో ఉన్న సానుభూతిని ఓట్లుగా మార్చుకోవడానికి ఆయన రాక ఉపకరిస్తుందని ఆప్ విశ్వాసం.

గిరిజనుల అస్తిత్వాన్ని దెబ్బతీసిన పాలన!

జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో గిరిజనుల అస్తిత్వాన్నే దెబ్బకొట్టారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడి వారి హక్కులను కాలరాశారు. షెడ్యూల్డ్ తెగల అటవీ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘించి, వారి సహజవనరులు భూమి, గాలి, నీరు, భాష, సంస్కృతి, సంప్రదాయాలపై ముప్పేట దాడి చేశారు. రాజ్యాంగబద్ధంగా గిరిజనుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్లు, ప్లాన్లు, సబ్‌ప్లాన్లను నిర్వీర్యం చేశారు. విద్య, ఉద్యోగ అవకాశాలు, హక్కులు ప్రతీ దశలోను ఉల్లంఘించారు.

వైసీపీ ప్రభుత్వం ఫారెస్ట్ కన్జర్వేటివ్ యాక్ట్–1980, అటవీ చట్టం–1882, భారతీయ అడవుల చట్టం–1927, ఏపీ ఫారెస్ట్ యాక్ట్–1967, నాన్ కంప్లియన్స్ ఆఫ్ ఫారెస్ట్ కన్జర్వేషన్ రూల్స్–2003లను పట్టించుకోలేదు. విశాఖపట్నంలోని బమిడికలొద్ది ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గనుల్లో ల్యాటరైట్‌ను అక్రమంగా తవ్వేసి, వేలాది చెట్లను కొట్టేశారు. దీంతో ఆదివాసీలకు అటవీ ఉత్పత్తులు దూరమయ్యాయి. 250 కుటుంబాలున్న గ్రామానికి 30 అడుగుల వెడల్పుతో అటవీశాఖ అనుమతులు లేకుండానే భారీ రోడ్డు నిర్మించి, ఇష్టానుసారం మైనింగ్ చేసి పర్యావరణానికి తీవ్ర హాని చేశారు. అక్రమ మైనింగ్ కారణంగా వన్యప్రాణులు ఉనికి కోల్పోయాయి. పంటలపై తీవ్ర ప్రభావం పడింది. జగన్‌రెడ్డి చర్యలతో ఏజెన్సీ ప్రాంతాల్లో భూగర్భజలాలు సైతం కలుషితమయ్యాయి. మైనింగ్ మాఫియా లారీల చక్రాల కిందపడి సార్లంక అటవీ ప్రాంతంలో వందలాది మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి. గిరిజనుల ఆకాంక్షలకు అనుగుణంగా విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను తెలుగుదేశం ప్రభుత్వం నిలిపివేస్తే.. జగన్‌రెడ్డి ల్యాటరైట్ పేరుతో రూ.15వేల కోట్ల విలువైన బాక్సైట్ గనులను తన బినామీలకు కట్టబెట్టారు. ఈ మైనింగ్ మాఫియా ఆగడాలు ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితం కాలేదు. తెల్లపోనంకి చెట్లపై ఆధారపడి కొండపల్లి బొమ్మలు తయారుచేస్తూ వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. అక్రమ మైనింగ్ కారణంగా 100 ఎకరాలలో విస్తరించి ఉన్న తెల్లపోనంకి చెట్లు కనుమరుగయ్యాయి. మడ అడవులను నరికివేశారు. వీటిని నరకడం అంటే తినే కంచంలో మట్టిపోసుకోవడమే.



గిరిజన హక్కులను, రిజర్వేషన్లను కాపాడటంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జీఓ నెం.3ను సుప్రీంకోర్టు కొట్టివేసినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. గిరిజన బిడ్డలు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నా వాళ్ల గోడు జగన్‌కి పట్టలేదు. జీఓకి అనుకూలంగా కనీసం అసెంబ్లీలో తీర్మానమైనా చేయలేదు. గిరిజన రిజర్వేషన్లు, షెడ్యూల్డ్ ఏరియా చట్టాలు, హక్కులపై జగన్ ప్రభుత్వం మౌనం వహించడంతో రిజర్వేషన్ విధానంపై ఆయనకి కనీస నిబద్ధతలేదని అర్థమైంది. చంద్రబాబు కాపులకు కల్పించిన 5 శాతం రిజర్వేషన్‌ను జగన్ రద్దు చేసి వారికి తీరని అన్యాయం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో గత ప్రభుత్వాలు అమలు చేసిన 34 శాతం రిజర్వేషన్‌ను 24 శాతానికి కుదించారు. బీసీలకు రావాల్సిన 16,800 పదవులు పోగొట్టారు.

చంద్రబాబు నాయుడు 2014 నుంచి 2015 వరకు 97,491 మంది గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందించారు. జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం హైడ్రో పంప్డ్ పవర్ ప్రాజెక్టుల పేరుతో గిరిజనుల భూములను బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టింది. భూములను నాన్ ట్రైబల్ యాక్టివిటీకి బదిలీ చేయాల్సి వచ్చినప్పుడు 'పెసా' చట్టం నియమనిబంధనలు పాటించాలి. కాని ఇవేవీ పాటించకుండా ఏజెన్సీ ప్రాంతాల్లో దాదాపు 3 లక్షల ఎకరాలు బడా కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేశారు.

జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రూ.5 వేల కోట్లు ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రక్కదారి పట్టించారు. నామినేటెడ్ పనులు, పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన జగన్‌రెడ్డి ఐదేళ్లలో గిరిజనులకు ఒక్క నామినేటెడ్ పదవి ఇవ్వలేదు. ఐదేళ్లలో 16 గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేశారు. గిరిజన విద్యార్థులకు విదేశీ చదువెందుకని అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకాన్ని రద్దు చేశారు. గిరిజన యువతకు ఉన్నత ఉద్యోగాలకు శిక్షణ ఇచ్చే ఎన్టీఆర్ విద్యోన్నతి పథకాన్ని రద్దు చేశారు. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ నుంచి ఒక్క గిరిజన విద్యార్థికి కూడా శిక్షణ, ఉద్యోగం కల్పించలేదు. గిరిజన యువతులకు అందించే పెళ్లి కానుకను రూ.లక్షకు పెంచుతున్నట్లు ప్రకటించి... ఐదేళ్లలో ఒక్కరికీ ఇవ్వలేదు. 60 శాతం కేంద్రం నిధులతో నడిచే ట్రైకార్‌ను నిర్వీర్యం చేశారు. ఒక్క గిరిజన యువకుడికీ రుణాలు మంజూరు చేయలేదు. స్వయం ఉపాధిని దెబ్బతీశారు. గిరిజనుల జీవితాలకు భరోసానిచ్చే చట్టాలు, నిబంధనలు, ప్లాన్లు, సబ్‌ప్లాన్లు, కమిషన్లను ఉద్దేశపూర్వకంగా అణగదొక్కిన ఘటనలే మన కళ్లముందు కదలాడుతున్నాయి. గిరిజనుల సహజవనరులు, భూమి, అడవి, నీరు, గాలి, వన్యప్రాణులు, భాష, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలంటే జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అధికార పీఠం నుంచి దించాల్సిందే.

○ డా. కొండ్రెడ్డి నరహరి వరప్రసాద్
ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు

ఆగమవ్వకు! ఆలోచించు!!

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ అభివృద్ధి చెందడానికి హైదరాబాద్ మహానగరమే కారణం. ఆ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయగలుగుతున్నారంటే అందుకు హైదరాబాద్ నుంచి వచ్చే ఆదాయమే ప్రధాన కారణం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా కనీసం రాజధాని కూడా లేని పరిస్థితి ఉందంటే అందుకు జగన్మోహన్ రెడ్డే ముఖ్య కారణం. పైసా ఖర్చు లేకుండా రైతులు వేలాది ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారు. అంతటి మహత్తర అవకాశాన్ని కాలదన్ని జగన్ అమరావతిని పాడుబెట్టారు.

పేదలను ముందుపెట్టి రాజకీయాలు చేయడానికి అలవాటు పడిన జగన్‌రెడ్డి ఆచరణలో చేస్తున్నది ఏమిటి? సంక్షేమ పథకాల పేరిట ఈ ఐదేళ్లలో ఒక్కో కుటుంబానికి లక్షన్నర రూపాయలు పంచిపెట్టి ఉంటారు. అందుకోసం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారు. ఈ పథకాలకు ప్రచారం పేరిట తన సొంత మీడియా సంస్థలకు ఈ ఐదేళ్లలో దాదాపు రూ. 1000 కోట్లు కట్టబెట్టారు. సకల పన్నులు, చార్జీలు పెంచి, రూ.10 తమ చేతిలో పెట్టి రూ.100 గుంజుకొంటున్నారని ప్రజలు తెలుసుకోవాలి.

ఒక చేత్తో సంక్షేమ పథకాలను ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం మద్యం విక్రయాల ద్వారా మరో చేత్తో తిరిగి వసూలు చేస్తున్నది. రాష్ట్రానికి వస్తున్న మొత్తం ఆదాయం సుమారు రూ.74వేల కోట్లు కాగా, అందులో మద్యం విక్రయాల ద్వారా రూ.25 వేల కోట్లు. రాష్ట్ర అప్పులు రూ.13 లక్షల కోట్లకు పైగా చేశారు. ప్రతి మనిషి తలపై రూ.2 లక్షల పైగా అప్పులు తెచ్చారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. అక్షరాస్యతలో ఏపీ 30వ స్థానంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌రెడ్డి ముఠా అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూములు, ఖనిజ సంపద స్వాహా చేస్తున్నది.

ప్రతిపక్షాలపై, మీడియాపై, ప్రజలపై అక్రమకేసులు పెట్టారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి కూడా తాను మాత్రమే జనోద్ధారకుడినని ప్రచారం చేసుకొంటూ ప్రజల కళ్లుగప్పి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న జగన్‌రెడ్డి పట్ల ఆంధ్రులు అప్రమత్తంగా ఉండాలి.

– నీరుకొండ ప్రసాద్

కాపీ పేస్ట్ పథకాలు, అందులోనూ మోసాలు!

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పదవీకాలం మరికొద్ది రోజుల్లో ముగుస్తుంది. అభివృద్ధీ సంక్షేమాలకు సంబంధించి ఈ ఐదేళ్లలో కనీసం ఒక్కటంటే ఒక్క కొత్త పథకాన్ని కూడా ప్రవేశపెట్టకుండా నిష్క్రమిస్తున్న ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడు. ఈ నిష్క్రియాపరత్వానికి కారణాలు వెతికితే– పేదల సంక్షేమం, ప్రజల అభివృద్ధికి సంబంధించి నూతనంగా ఆలోచించలేని అసమర్థతే కనిపిస్తుంది.



గత ఐదేళ్లుగా పేదల సంక్షేమమంటే కేవలం తాను ప్రవేశపెట్టిన నవరత్నాలే అన్నట్లుగా జగన్‌రెడ్డి మాట్లాడారు. నకిలీ రత్నాలుగా మారిన ఈ నవరత్నాల్లో ఒక్కటి కూడా కొత్తగా ఆలోచించి ప్రవేశపెట్టిన పథకంలేదు. ఇవన్నీ గతం నుంచి అమలౌతూ వస్తున్న సంక్షేమ పథకాలే. వీటిపట్ల తనకే పేటెంట్ హక్కులు ఉన్నట్లు, వాటిని తానే ప్రవేశపెట్టి అమలు చేసినట్లు జగన్‌రెడ్డి చెప్పుకోవటం అతని మానసిక పరిస్థితికి అద్దం పడుతోంది.

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్‌తో ప్రారంభమై కొనసాగుతూ వస్తున్న పథకం సామాజిక పింఛన్లు. జగన్‌రెడ్డి పేరు చెబితే ఈ పథకం ఎలా గుర్తుకొస్తుంది? ఆయన పేరు చెబితే గుర్తుకొచ్చేదల్లా పలు షరతులతో లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోతలు, అధికారంలోకి వచ్చాక అప్పటిదాక లభిస్తున్న రూ.2 వేల పింఛన్ను రూ.3 వేలకు పెంచుతానని హామీ ఇచ్చి, అది నెరవేర్చటానికి ముఖ్యమంత్రి ఐదేళ్ళ సుదీర్ఘ కాలం తీసుకున్నారు. దీంతోపాటు, ఈ మూడు వేల కంటే ఎక్కువ ఇవ్వలేను, ఒకవేళ అధికారంలోకి వస్తే నామమాత్రంగా రూ.250 పెంచుతాను, అదికూడ నాలుగేళ్ల తరువాత 2028లో అని పేదల పట్ల తన మోసపు వైఖరిని తన మేనిఫెస్టోలో స్వయంగా వెల్లడించుకున్నారు.

> గత ఐదేళ్లుగా పేదల సంక్షేమమంటే కేవలం తాను ప్రవేశపెట్టిన నవరత్నాలే అన్నట్లుగా జగన్‌రెడ్డి మాట్లాడారు. నకిలీ రత్నాలుగా మారిన ఈ నవరత్నాల్లో ఒక్కటి కూడా కొత్తగా ఆలోచించి ప్రవేశపెట్టిన పథకంలేదు. ఇవన్నీ గతం నుంచి అమలౌతూ వస్తున్న సంక్షేమ పథకాలే. వీటిపట్ల తనకే పేటెంట్ హక్కులు ఉన్నట్లు, వాటిని తానే ప్రవేశపెట్టి అమలు చేసినట్లు జగన్‌రెడ్డి చెప్పుకోవటం అతని మానసిక పరిస్థితికి అద్దం పడుతోంది.

గత ప్రభుత్వాలు ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఇచ్చిన స్కాలర్‌షిప్ (ఉపకార వేతనాల) స్థానంలో పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికి సంవత్సరానికి రూ.15 వేలు ఇచ్చే పథకమే అమ్మ ఒడి. దీని అమలులో కూడా మోసమే ఉంది. గత ఎన్నికల ప్రచారంలో సంఖ్యా పరిమితి లేకుండా చదువుకునే పిల్లలందరికి సాయం అందిస్తానన్న జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మాట మార్చి ఒకే విద్యార్థికి ఇచ్చారు. స్కూళ్లు, టాయిలెట్ల నిర్వహణ పేరుతో ప్రతి మహిళకు చెందాల్సిన లబ్ధి నుండి రూ.2,000 కోత విధించారు.

జగన్ రెడ్డి మోసపు పునాదుల మీద అమలులోకి వచ్చిన పథకం చేయూత. ఎన్నికల ప్రచారంలో 18 నుండి 59 సంవత్సరాల వయసున్న ప్రతి మహిళకు నెలవారి పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక యథారీతిన మడమ తిప్పేశారు. వాస్తవంగా ఇది కూడా పెన్షన్ పథకమే. అయితే తన నయవంచనను కప్పిపుచ్చుకోవటానికి పేరు మార్చి చేయూత అన్నారు. నాలుగో విడత నిధులు విడుదల చేయకుండా మహిళలను జగన్‌రెడ్డి తనదైన శైలిలో మరోసారి మోసగించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అర్హురాలైన ప్రతి మహిళకు ఈ ఐదేళ్లలో రూ.1,80,000 చెందవలసి ఉండగా, ముఖ్యమంత్రి సంవత్సరానికి రూ.18,750 చొప్పున మొత్తం నాలుగేళ్లల్లో రూ.75 వేలు మాత్రమే ఇస్తానని చెప్పి ప్రతి మహిళను రూ. 1,05,000 మేరకు మోసం చేశారు.

గత తెలుగుదేశం ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలను రద్దు చేసింది. ఆసరా పేరుతో జగన్‌రెడ్డి దీన్ని కొనసాగించాడు. ఇందులో కొత్తేముంది? సున్నావడ్డీకే రుణ పరిమితిని రూ.10లక్షలకు పెంచుతానన్న ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోలేదు. పైగా రూ.5 లక్షల వరకు ఉన్న సున్నా వడ్డీ రుణ పరిమితిని రూ.3 లక్షలకు కుదించాడు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పేరు చెబితే గుర్తుకొచ్చేది చేయూత/ ఆసరాలో జరిగిన మోసమేకానీ ఈ పథకాలు కాదు.

రాష్ట్రంలో మద్యపానాన్ని మొదటగా నిషేధించింది ఎన్టీఆర్. ఇది ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఆలోచించి ప్రవేశపెట్టిన కొత్త పథకం కాదు. పైగా ఇచ్చిన హామీకి భిన్నంగా తానే పెద్ద మద్యం వ్యాపారిగా మారి తన సొంత గణంతో అక్రమ మద్యం విక్రయానికి తెరతీసి, క్యాష్ పేమెంట్ల ద్వారా లక్ష కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారు ముఖ్యమంత్రి. ఈ పథకం కొత్తది కాదు.. దాని అమలు పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేదు. అంతా మోసమే.

ఇక రైతు భరోసా విషయానికి వస్తే– రైతన్నలకు సాయం అందించడం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డితో ప్రారంభం కాలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.15వేలు ఇచ్చింది. ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.13,500 సాయం అందిస్తామని చెప్పిన జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వం వాటాగా కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ప్రతి రైతుకు ఇస్తున్న రూ. 6,000 సాయాన్ని తానిచ్చినట్లుగా చెప్పుకుంటూ, తానివ్వాల్సింది ఎగ్గొట్టి రైతులను మోసం చేసిన ఘనత జగన్‌రెడ్డిదే. ఈ పథకమూ జగన్ మోసానికి ప్రతీకగానే నిలిచింది.

'విద్యాదీవెన' పేరిట కాలేజీ విద్యార్థుల వార్షిక బోధనా రుసుమును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పథకం కూడా జగన్ ముఖ్యమంత్రి కావటానికి చాలా సంవత్సరాలకు పూర్వమే ప్రారంభమైంది. గత తెలుగుదేశం ప్రభుత్వం మొత్తం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్ అందిస్తే అది జగన్ హయాంలో పది లక్షలకు పడిపోయింది. సంవత్సరానికి రూ.30 వేల నుండి రూ.70 వేల వరకు ప్రతి విద్యార్థికి ఇవ్వాల్సి ఉండగా, వాస్తవంలో విద్యార్థులకు అందింది సగటున రూ.30వేలే.

ఆరోగ్యశ్రీలో జగన్‌రెడ్డి ఘనత ఏమిటి? ఆయన పేరు చెబితే గుర్తొచ్చేది అధ్వాన్నంగా మారిన ఆరోగ్యశ్రీ అమలు, నెట్‌వర్క్ ఆసుపత్రులకు వందలాది కోట్ల రూపాయల బకాయిలు, సరైన వైద్య సేవలు అందక కష్టాలు పడుతున్న సామాన్య ప్రజలు!

జలయజ్ఞం కొత్త పథకమా? సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేస్తామన్న ముఖ్యమంత్రి ఒక్కటీ పూర్తి చేయలేదు. ఇదీ పాత స్కీము, ఇదీ మోసమే!

పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణాన్ని దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసింది ఎన్టీ రామారావు. ఆ తర్వాత ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేశారు. ఇప్పుడేమీ జగన్‌రెడ్డి కొత్తగా కనిపెట్టలేదు. ఇళ్ల స్థలాల సేకరణలో వైసీపీ నేతల భారీ దోపిడికి పాల్పడ్డారు. ప్రభుత్వం నుండి అందిస్తామన్న సాయంపై జగన్‌రెడ్డి మాట తప్పటంతో పేద లబ్ధిదారులు అప్పులపాలయ్యారు. నవరత్నాల్లో ఒకటైన ఈ పథకం కొత్తదేమీ కాదు. మిగతా ఎనిమిది పథకాల్లాగే ఇది కూడ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేతిలో మోసానికి గురైన పాత ముచ్చటే.

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒక కొత్త సంక్షేమ పథకము ప్రవేశపెట్టకుండా పైగా గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రత్యేక ప్రయోజనాల కోసం తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను రద్దు చేసి తాను ఏ మేరకు పేదల వ్యతిరేకో స్పష్టం చేసుకున్నారు.


జగన్‌రెడ్డి తీరుకు భిన్నంగా చంద్రబాబునాయుడు పేరు చెబితే గుర్తుకొచ్చే పథకాల సుదీర్ఘ జాబితా ఉంది. అందులో కొన్ని– అన్న క్యాంటీన్లు; నెలవారీ పింఛన్ రూ.200 నుండి పది రెట్లు పెంచి రూ.2 వేలు అందించటం; యాభై ఏళ్లకే చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులకు సామాజిక పింఛన్లు; ఆదరణ పథకం; మొదటిసారిగా 'బీసీ సబ్ ప్లాన్' ఏర్పాటు; నిరుద్యోగ భృతి; స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 24 శాతం నుంచి 34 శాతానికి పెంపు; డాక్టర్ అంబేద్కర్ విదేశీ విద్య; బెస్ట్ అవెలబుల్ స్కూళ్లు, స్టడీ సర్కిళ్లు; చంద్రన్న బీమా; ప్రజా రాజధాని అమరావతి; పోలవరం, పట్టిసీమ; పెళ్లి కానుకలు; పండుగ కానుకలు; షాదీఖానాల నిర్మాణం–ఖబరస్తాన్ల అభివృద్ధి; ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం; పలు సహాయక చర్యలతో డ్వాక్రా ఉద్యమ వ్యాప్తి; డ్రిప్/ స్ప్రింక్లర్ ఇరిగేషన్లకు భారీ తోడ్పాటు; వ్యవసాయంలో యాంత్రికీకరణకు రైతన్నలకు ట్రాక్టర్లు అందించేందుకు రైతు రథం; నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట; వీధి వీధిన సిమెంటు రోడ్లు – ఎల్‌ఈడీ వెలుగుల బల్బులు వంటి ఎన్నో పథకాలు చంద్రబాబు చెరగని ముద్రలుగా మిగిలిపోతాయి.

■ కింజరాపు అచ్చెన్నాయుడు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు

గాడితప్పిన రాష్ట్రాన్ని గట్టెక్కించాలి!

సంక్షేమం అంటే డబ్బులు పంచడం కాదు, ప్రతి కుటుంబానికి ఆర్థిక వికాసం కల్పించడం. సంక్షేమం, అభివృద్ధి అనేవి వేరు వేరు కాదని, అభివృద్ధి ద్వారానే సంక్షేమం చేయగలమని నమ్మిన నాయకుడు చంద్రబాబు నాయుడు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పురోగతి సాధించిన దేశాల విధానాలనే ఆయన మన రాష్ట్రంలోనూ అనుసరించారు.

అభివృద్ధి అనేది గమ్యం కాదు, ప్రయాణం మాత్రమే. ఒక్క చాన్స్ అంటూ అడిగిన ఆనాటి ప్రతిపక్షనేత జగన్ ఈ ప్రయాణాన్ని వేగంగా ముందుకు తీసుకుని వెళ్తారని ఆంధ్ర ప్రజలు నమ్మారు. అఖండ మెజారిటీతో గెలిపించారు. కానీ గడిచిన ఐదేళ్లలో జరిగింది వేరు. ఉద్యోగాలు, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి లేక ఒక తరం నిర్వీర్యమైపోయింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్ర నుంచి వలసలు తగ్గిపోయి ఇక్కడే విద్య, వైద్యం, ఉద్యోగం ఉంటాయనుకున్న వారి ఆశలు అడియాసలు అయ్యాయి. మళ్లీ కథ మొదటికి వచ్చింది. చదువు కోసం ఉద్యోగం కోసం ఇతర రాష్ట్రాల బాట పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఐటీ, ఇంజనీరింగ్ రంగాల్లో పని చేసేవారు ప్రపంచంలో ఏ మూలకి వెళ్లి అయినా పని చేసుకోగలుగుతారు. కానీ రోజువారీ పని, ఇతర చిన్న ఉద్యోగాలు చేసుకునేవారు స్థానికంగానే పని వెతుక్కుంటారు. అలాంటి వారి ఉపాధి మీద గత ఐదేళ్లలో ఎక్కువ ప్రభావం పడింది. ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయి, కొత్త పరిశ్రమలు రాక చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం మళ్లీ వలసలు వెళ్లడం మొదలుపెట్టారు. ఎక్కడకు వెళ్ళినా మీ రాజధాని ఏదీ అంటే చెప్పలేని పరిస్థితి.



1995 నుంచి 2004 వరకు చంద్రబాబు తీసుకొచ్చిన విద్య, ఉపాధి సంస్కరణలతో అప్పటికి తరతరాలుగా అభివృద్ధి నెరగని బడుగు, మధ్యతరగతి కుటుంబాలు గత 20 ఏళ్లలో వొళ్లు విరుచుకున్నాయి. ఇంజనీరింగ్ అనేది మధ్యతరగతి కుటుంబాలకు కూడా అందుబాటులో లేని సమయంలో ఆ విద్యను దిగువ మధ్యతరగతి కుటుంబాలకు సైతం అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే. ఆ చదువు పూర్తి చేసుకున్న యువత బయటకి వచ్చే లోపే వారికి ఉద్యోగాలు కల్పించే దిశగా ఐటీ కంపెనీలు, పరిశ్రమల స్థాపనకు హైదరాబాద్‌లో కృషి చేసి వారి ఆర్థిక వికాసానికి బాటలు వేశారు. ఆ ఫలితాలు ఇరవై ఏళ్ల తర్వాత ప్రజలకి అందాయి. ఇది కేవలం కొన్ని వర్గాలకో కుటుంబాలకో పరిమితం కాలేదు. ఓ మెట్టు పైకెక్కిన వర్గాల పూర్వపు స్థానంలో అంతకంటే కింద ఉన్న వర్గాలు చేరుకున్నాయి. ఇదో నిరంతర ప్రక్రియ. కానీ ఈ ఆర్థిక ప్రయోజనాల్ని అందిపుచ్చుకునే సమయంలో జరిగిన రాష్ట్ర విభజన మనకి పెద్ద అశనిపాతం. అభివృద్ధి ఫలాలు అన్నదమ్ముల్లో ఒకరికే చెందాయి.

కానీ చంద్రబాబు పరిస్థితులను నిందిస్తూ కూర్చోలేదు. మాది బీద రాష్ట్రం అని దేబిరించలేదు. కిందపడినా మళ్లీ లేవగల శక్తి ఆంధ్రుల సొంతం అని తాను సమాయత్తం అవ్వడంతోపాటు ప్రజల్నీ అందుకు ఉత్సాహపరిచారు. రాజధాని అంటే నాలుగు భవనాలు, ఆరు రోడ్లు కాదు; యావత్ ఆంధ్రకీ అన్నం పెట్టే అమ్మ అవుతుందని అమరావతి కోసం నడుం కట్టారు. అందుకు ప్రజలూ ముందుకు వచ్చారు. పల్లెల్లో వేసిన 25000 కిలోమీటర్ల పైచిలుకు సిమెంటు రోడ్లు దేశంలో మరే రాష్ట్రమూ వేయలేదు. మండల కేంద్రాలకు దూరంగా విసిరేసినట్టుండే చిన్న పల్లెటూర్లకి సైతం రోడ్డు కనెక్టివిటీ ఏర్పడింది. కేవలం హైదరాబాద్‌లోనే పెట్టుబడులు పెట్టే ఎన్నారైలు అందరూ తమ పెట్టుబడుల్ని అమరావతికి, అలాగే తాము జన్మించిన గ్రామాలకి, టూటైర్ పట్టణాలకు మార్చారు. కానీ గడిచిన ఐదేళ్లలో పరిస్థితులు పూర్తిగా తారుమారు అయ్యాయి. చంద్రుడి జాడలు చెరిపివేసే పనిలో నిమగ్నమైన పాలకులు రాష్ట్రాన్ని తిరోగమనమార్గంలో పయనింపచేశారు.

చంద్రబాబు దూరదృష్టితో నిర్మించిన ఒక్క పట్టిసీమ ప్రాజెక్టుతోనే లక్షలాది ఎకరాలు సస్యశ్యామలం అయ్యాయి. వందలకోట్ల రూపాయల పంటలు పండాయి. నెర్రెలిచ్చి నోళ్లు తెరచుకున్న రాయలసీమ భూముల్లోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం వల్లనే పోలవరం కనీసం ఈ స్థాయికి వచ్చింది. ఈ ఐదేళ్లలో ఏ మేరకు పనులు కొనసాగాయో మన కళ్ల ముందే కనిపిస్తోంది. ఆ రోజున పోలవరం కేంద్రానికి వదిలేసి ఉంటే ఈ స్థాయికి కూడా వచ్చేది కాదు. చాలామంది చంద్రబాబు సంక్షేమ పథకాలకి వ్యతిరేకి అని ప్రచారం చేశారు. కాని అందులో ఏ మాత్రం నిజం లేదు అనటానికి వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు, పశు పథకాలు, వ్యవసాయ పథకాలే నిదర్శనం. నేడు కొత్తగా ఇచ్చినట్లు ఈ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది కానీ ఆనాడు రూ.200 నుంచి రూ.1000కి తర్వాత రూ.1000 నుంచి రూ.2000కి పింఛను పెంచిన విషయం మర్చిపోతే ఎలా? ప్రతి ఏడాది ద్రవ్యోల్బణం ఆరు శాతం పెరుగుతుంది. మనకీ జీతాలు, ఆదాయంలో పెరుగుదల ఉన్నట్లే ప్రభుత్వం అందించే పథకాల విలువలో కూడా పెరుగుదల ఉంటుంది. అది ఏ ప్రభుత్వం అయినా పెంచాల్సిందే కానీ ఒక్కసారిగా పదింతలు పెంచిన వారిని విమర్శించి పది శాతం పెంచిన వారిదే సంక్షేమ ప్రభుత్వం అంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఆంధ్రులు విజ్ఞతతో ఆలోచించాల్సిన తరుణమిది. విద్వేష రాజకీయాలకు.. విధ్వంస పాలనకు ఓటేస్తారో ప్రగతి వైపు నడిపించే నాయకుడిని ఎన్నుకుంటారో అన్నదానిపైనే ఆంధ్రప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

• వేమూరి రాజేశ్
(పారిశ్రామికవేత్త, షార్జా)

బీసీలకు అండగా కూటమి ఎజెండా

వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో దగాకు గురైన బీసీ సామాజిక వర్గానికి జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ఇచ్చిన హామీలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. విద్యా, ఉపాధి, కులవృత్తి, రాజకీయ పరంగా అన్ని రంగాల్లో బీసీలకు న్యాయం జరిగేలా జనసేన–టీడీపీ–బీజేపీ కూటమి ప్రత్యేక ఎజెండాతో ముందుకొస్తున్నది. బీసీ సామాజిక వర్గాలకు రాష్ట్రంలో మళ్లీ మంచి రోజులు రావాలంటే జనసేన నినాదమైన 'ప్రతి చేతికి పని' ఆచరణలోకి రావాల్సిన ఆవశ్యకత ఉంది.

సమాజంలో ఏదైన ఒక సామాజిక వర్గం అభివృద్ధి సాధించాలంటే వారికి రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రోత్సహించడం సహజం. అయితే ఏపీలో ఇందుకు భిన్నంగా బీసీలకు ఉన్న రిజర్వేషన్లపై కోత పెట్టింది జగన్ ప్రభుత్వం. 34 శాతం ఉన్న రిజర్వేషన్లలో 10 శాతం కోత పెట్టి 24 శాతానికి తగ్గించడంతో 16 వేల మందికిపైగా బీసీలు స్థానిక పదవులు కోల్పోయారు. బీసీలకు కీలకమైన కులవృత్తులను, చేతివృత్తులను ప్రోత్సహించాల్సింది పోయి ఈ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది.

రాష్ట్రంలోని 153 బీసీ కులాలకు జగన్ 2019 ఎన్నికల్లో ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అరచేతిలో స్వర్గం చూపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం దేవుడెరుగు ఎవరైనా ప్రశ్నిస్తే అన్యాయంగా దౌర్జన్యాలు, పోలీసుల కేసులు రాష్ట్రంలో నిత్యకృత్యాలయ్యాయి. బీసీ కేటగిరీలోని 153 కులాలను గుర్తించి 139 కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పి 56 ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అందులోని పదవులను వైసీపీ వారికే కట్టబెట్టి, అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించలేదు. మరోవైపు సామాన్య బీసీలకు అన్యాయం చేస్తూ బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల జీతభత్యాలకు రూ.50 కోట్లు ఖర్చు చేసి వారి పార్టీ నేతలకు న్యాయం చేసింది.

> బీసీలు సాధికారత సాధించాలంటే వారు ఐకమత్యంగా నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. విజ్ఞులైన బీసీ సామాజిక వర్గం వారు తమ సంక్షేమానికి అండగా నిలబడేదెవరో నిర్ణయించుకోవాలి. పవన్ కల్యాణ్ ఇచ్చిన 'హలో బీసీ... బైబై వైసీపీ' పిలుపునకు అనుగుణంగా రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



శాశ్వత బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పింది ప్రభుత్వం. రూ.18226 కోట్ల బీసీ కార్పొరేషన్ల నిధుల్ని దారి మళ్లించి ఈ సామాజిక వర్గాల అభివృద్ధి నిరోధకులయ్యారు. రూ.75వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 45ఏళ్లు దాటిన మహిళలకు ఏటా రూ.15 వేల కోట్లు చొప్పున అయిదేళ్లలో రూ.75 వేలు ఇస్తామని వాగ్దానం చేసిన జగన్ అధికారం చేపట్టాక లబ్ధిదారుల సంఖ్యను కుదించారు. బీసీ కార్పొరేషన్‌కు చెందిన రూ.200కోట్లు బ్యాంకుల్లో ఉండగా, వాటిని వెనక్కు తీసుకున్న ఘనత ఈ ప్రభుత్వానిది. బీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన ఎంబీసీల కోసం 2016లో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం దానికి 90 శాతం రాయితీ ఇవ్వగా, జగన్ ఈ కార్పొరేషన్‌కు మొండిచేయి చూపారు.

భవన నిర్మాణరంగంలో కీలకమైన వడ్డెర్ల నడ్డి విరిచింది ఈ ప్రభుత్వం. ఇసుక రీచ్‌లు, క్వారీలను ప్రయివేట్ కంపెనీలకు కట్టబెట్టడంతో వడ్డెర్లు కాంట్రాక్టుల కబంధ హస్తాల్లో నలిగిపోయారు. 30 లక్షల మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. నామినేటెడ్, కాంట్రాక్టుల పనుల్లో 50శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి వైసీపీ పార్టీ కార్యకర్తలకే ప్రాధాన్యతిచ్చారు. జనసేనాని పవన్ కల్యాణ్ ప్రజాపోరాటం చేసిన మొదటి సమస్య ఇసుక అక్రమ రవాణాపైనే కావడం విశేషం.

బీసీలకు అధికంగా సంక్షేమ పథకాలు, నవరత్నాలు అందించామని జగన్ సర్కారు చెబుతున్నా వాస్తవానికి అది కేవలం ప్రచారం మాత్రమే. 2.14కోట్ల బీసీ జనాభాలో కేవలం ఐదు రకాల కులాలకు చెందిన 44 లక్షల మందికి తప్పా మిగతా 1.70 కోట్ల బీసీలకు నవరత్నాలు అందలేదు. కులవృత్తిదారులకు వెన్నుదన్నుగా ఉండే స్వయం ఉపాధి రుణాలను నిలిపివేశారు. మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ప్రోత్సాహకరంగా సంవత్సరానికి రూ.24 వేలు ఇస్తామని జగన్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే రాష్ట్రంలో 4 లక్షల మంది చేనేత కార్మికులుంటే వడపోత చేసి కేవలం 80 వేల మందికే లబ్ధి చేకూర్చింది. 100 శాతం రాయితీతో బీసీలకు ఇవ్వాల్సిన విత్తన పొట్టేళ్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయగా వాటిని కూడా జగన్ సర్కారు దారి మళ్లించింది.

వాడబలిజ, అగ్నికుల క్షత్రియ, జాలరి తదితర మత్స్యకార కులాలకు అన్యాయం జరిగింది. జీవో నెంబరు 217 తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15 లక్షల మంది మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది ఈ ప్రభుత్వం. చేపల వేట నిషేధ సమయంలో రూ.10వేలు, చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి రూ.10 లక్షల బీమా ఇస్తామని చెప్పిన హామీని మరిచారు. సముద్రతీరంలో ప్రతి 30 కిమీలకు ఒక జెట్టీని ఏర్పాటు చేయాలని, వారి పిల్లల సంక్షేమం కోసం ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ పట్టించుకోలేదు.

వైసీపీ ఈ ఐదేళ్ల దౌర్జన్య పాలనలో బీసీలపై 26 వేలకుపైగా అక్రమ కేసులు బనాయించారు. అన్యాయంగా 300 మంది బీసీల ప్రాణాలు తీశారు. తన సోదరిని అల్లరిపెడుతుంటే అడ్డుకున్న ఒక బీసీ విద్యార్థిపై పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటన రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దిగజారాయో తెటతెల్లం చేస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ తరహా బీసీలకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం కావాలనే డిమాండ్ పెరిగింది. జగన్ హయాంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న జనసేనాని పవన్ కల్యాణ్ ప్రజావ్యతిరేక వైసీపీ ప్రభుత్వ ఓటమే లక్ష్యంగా టీడీపీ, బీజేపీలతో పొత్తు పెట్టుకొని 'హలో బీసీ.. చోడో వైసీపీ' నినాదాన్ని ఇచ్చారు.

గత ఐదేళ్లలో వెనుకబాటుకు గురైన బీసీలకు స్వాంతన చేకూర్చేందుకు కూటమి బీసీ కోసం అనేక హామీలతో మానిఫెస్టో ప్రకటించింది. బీసీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4వేల పెన్షన్, బీసీ రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం, సబ్‌ప్లాన్‌కు ఐదేళ్లలో లక్షన్నర కోట్ల రూపాయల నిధులు వినియోగించడం, స్థానిక సంస్థలలో 24 శాతానికి కుదించిన రిజర్వేషన్లను 34 శాతానికి పెంచడం, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపే చర్యలు, జనాభా ప్రాతిపదికన బీసీ కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటు, ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు అందజేయడం, దామాషా ప్రకారం రిజర్వేన్లకు నిధులు, శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు, స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్ల ఖర్చు, రూ.5000 కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ, చట్టబద్ధంగా కుల గణన, రూ.10 లక్షల బీమా పునరుద్ధరణ వంటి హామీలను కూటమి ప్రకటించింది.

బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల అప్‌గ్రేడ్, బీసీలకు ప్రత్యేక భవనాలు, బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను ఏడాదిలోపు పూర్తి చేయడం, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, యాదవ, కురుబలకు గొర్రెల పెంపకం యూనిట్లు, నాయిబ్రాహ్మణులకు రూ.25 వేల గౌరవేతనం, సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం దుకాణాలు, వడ్డెరలకు క్వారీల్లో 15 శాతం రిజర్వేషన్, రజకులకు దోభీ ఘాట్లు, రాయితీపై విద్యుత్. మత్స్యకారులకు సముద్రంలో వేట విరామ సమయంలో రూ.20 వేల ఆర్థికసాయం. స్వర్ణకారుల కోసం కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు వంటి అనేక కీలకమైన హామీలను బీసీల అభివృద్ధి కోసం కూటమి మానిఫెస్టోలో ప్రకటించారు.

బీసీలు సాధికారత సాధించాలంటే వారు ఐకమత్యంగా నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. విజ్ఞులైన బీసీ సామాజిక వర్గం వారు తమ సంక్షేమానికి అండగా నిలబడేదెవరో నిర్ణయించుకోవాలి. పవన్ కల్యాణ్ ఇచ్చిన 'హలో బీసీ... బైబై వైసీపీ' పిలుపునకు అనుగుణంగా ఈ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రాష్ట్రంలో వివక్షకు గురవుతున్న బీసీలు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బ్రహ్మాస్త్రమైన ఓటు హక్కుతో తమకు అన్యాయం చేసిన వారికి సరైన రీతిలో బుద్ధిచెప్పాలి.

◆ కొణతాల రామకృష్ణ
అనకాపల్లి మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సంఘం చెప్పిన మాట

జగన్ వడ్డెరల నడ్డి విరిచారు

‣ 'ఆంధ్రజ్యోతి'తో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు


ఆంజనేయులు

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): జగన్ 2019లో అధికారంలోకి రాగానే తొలి దెబ్బ వడ్డెర సామాజిక వర్గీయులపైనే వేశాడని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు ఆరోపించారు. తమ సామాజిక వర్గం ఎక్కువగా బేల్దారు, మట్టి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారని.. వైసీపీ ప్రభుత్వం ఏర్పడగానే ఇసుక సరఫరా ఆరు నెలల పాటు నిలిపేయడంతో అప్పటివరకు పుష్కలంగా ఉన్న పనులు ఆగిపోయాయని చెప్పారు. వేరే పనులు చేయలేక ఆ సమయంలో ఒక పూట తిని ఒక పూట తినక పస్తులుండాల్సి వచ్చిందని గుర్తుచేసుకున్నారు. ఆంజనేయులు శుక్రవారం గుంటూరులో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "ఇసుక ధర భారీగా పెంచడంతో అత్యవసరమైన వారే నిర్మాణ పనులు చేసుకుంటున్నారు, సామాన్య ప్రజలు నిర్మాణాలకు దూరమయ్యారు. ప్రభుత్వ తీరుతో నేటికీ నిర్మాణరంగం పుంజుకోలేదు. ఫలితంగా ఆర్థికంగా చితికిపోయాం. పగలంతా పనిచేసే కార్మికులు రాత్రి కొద్దిగా మద్యం సేవిస్తుంటారు. ఈ ప్రభుత్వం ధర విపరీతంగా పెంచడంతో పాటు, నాణ్యమైన మద్యం విక్రయించకపోవడం వల్ల చాలామంది కార్మికులు తీవ్ర అనారోగ్యం పాలై మంచాన పడ్డారు. కొంతమంది మృతి చెందారు. వైసీపీ ప్రభుత్వం క్వారీల్లో లీజులు వడ్డెరలకు దక్కకుండా చేసింది. జగన్ అధికారంలోకి వచ్చాక వడ్డెరల గురించి ఏ రోజూ అసెంబ్లీలో మాట్లాడలేదు. అపాయింట్‌మెంట్ కోరితే ఐదేళ్లు అయినా ఇవ్వలేదు" అని ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు శకుని మామగా మారిన జగన్‌రెడ్డి

‣ నవరత్నాలు దళితుల పాలిట సమాధిరాళ్లు: మల్లెల వెంకట్రావు


వెంకట్రావు

పొన్నూరుటౌన్, మే 10: 75 ఏళ్ల రాజ్యాంగ సంక్షేమ పథకాలను రద్దుచేసి దళిత బిడ్డల పాలిట శకుని మామగా జగన్ రెడ్డి మారాడని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ నవరత్నాలు ఎస్సీ, ఎస్టీలకు సమాధి రాళ్లుగా మారాయన్నారు. వైసీపీ మేనిఫెస్టోను టిష్యూ పేపర్‌గా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 82 మంది మాలలను చంపిన వైసీపీ మూకలకు దళిత ఉద్యమ మేధావులు ఏవిధంగా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. దళిత మేధావులు పేరుతో దళిత ద్రోహులకు భజన చేస్తున్న అద్దె మైకులపై ఎస్సీ, ఎస్టీలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. జగన్ రద్దు చేసిన పథకాలు తిరిగి ప్రారంభం కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని మల్లెల కోరారు.

ఐదేళ్లలో మాదిగ కార్పొరేషన్‌కు ఐదు పైసలు ఖర్చు పెట్టలేదు

‣ కూటమి అధికారంలోకి వస్తేనే వర్గీకరణ: మంద కృష్ణ మాదిగ


గన్నవరంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

గన్నవరం, మే 10: వైసీపీ పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకోవటం లేదు. ఈ ఐదేళ్లలో విధ్వంసం, అరాచకాలు చేశారు. చంద్రబాబు చేసిన అభివృద్ధి ఎక్కడైతే ఆగిందో ఇప్పటికీ అలానే ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి జైలులో ఉన్నప్పుడు పార్టీని నడిపిన తల్లి, చెల్లి కూడా ఇప్పుడు దూషించే పరిస్థితి వచ్చిందని, వారికి కూడా ఆయన పాలన నచ్చలేదన్నారు. జగన్ పాలన రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. గన్నవరంలో మాదిగ, మాదిగ ఉప కులాల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. జగన్ మాదిగ కార్పొరేషన్‌కు ఐదేళ్లలో ఐదు పైసలు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ప్రత్యేకంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కూడా ఇవ్వలేదన్నారు. మాదిగలకు సీట్లు కూడా తక్కువ ఇచ్చారన్నారు. జగన్‌ను ఓడించాల్సిన బాధ్యత మాదిగలపై ఉందన్నారు.

ముస్లిం లీగ్ వైసీపీకి మద్దతు ప్రకటించలేదు

‣ సజ్జల ప్రకటనను ఖండిస్తున్నాం: బషీర్ అహ్మద్

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ముస్లిం లీగ్ పార్టీ వైసీపీకి మద్దతు ప్రకటించిందని సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటనను ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది బషీర్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. తమ పార్టీ ఎవరికీ మద్దతు ప్రకటించలేదని, అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేస్తున్నామని స్పష్టంచేశారు. ఓటమి భయం పట్టుకున్న వైసీపీ ముస్లిం ఓట్ల కోసం లెటర్ హెడ్‌పై ఇండియన్ ముస్లిం లీగ్ అనే నకిలీ సంస్థను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. దీనిపై గుంటూరులోని పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. స్వయం ప్రకటిత ఇండియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించుకున్న హుస్సేన్ బాషా, అతని సహచరులు, తోటి కుట్రదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఓటు'తో రాక్షస పాలన అంతం చేద్దాం: బ్రాహ్మణ సంఘాలు



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీధర్, రామలింగేశ్వర శాస్త్రి తదితరులు

గుంటూరు, మే 10: "రాష్ట్రంలో రాక్షస పాలనను 'ఓటు'తో అంతం చేద్దాం.. జగనాసుర సంహారానికి ముహూర్తం ఖరారు చేసిన త్రిమూర్తులు.. అన్ని వర్గాలు కలసికట్టుగా కూటమి అభ్యర్థుల్ని గెలిపించుకుందాం" అని బ్రాహ్మణ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవా సంఘం సంయుక్తంగా గుంటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ, అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్.జగన్మోహన్ రెడ్డి అనే రాక్షస మనస్తత్వం కలిగిన వ్యక్తి మాయ మాటలు చెప్పి ఒక్క చాన్స్ అని ప్రజల్ని మోసం చేసి గత ఐదేళ్లుగా రాక్షస పరిపాలన కొనసాగించాడన్నారు. అతని పాలనలో కులాలు, మతాల ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు అనేక హింసలు, దాడులకు గురయ్యారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు అనే ఆయుధంతో ఈ జగనాసురుడ్ని కుల మతాలకు అతీతంగా సంహరించాలని వారు పిలుపునిచ్చారు.

అల్లూరి స్మారకాల నిర్వహణపై ప్రభుత్వ నిర్లక్ష్యం

‣ అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల


కృష్ణాదేవిపేటలోని అల్లూరి పార్కులో అల్లూరి, గంటందొర సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న పడాల వీరభద్రరావు తదితరులు

కృష్ణాదేవిపేట (అనకాపల్లి జిల్లా), మే 10: అల్లూరి సీతారామరాజు చరిత్ర పట్ల, స్మారక మందిరాల నిర్వహణలో గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఆరోపించారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి పార్కులో అల్లూరి, గంటందొర సమాధులపై శుక్రవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం స్మారక ప్రదేశాల నిర్వహణకు ఈ ఐదేళ్లలో రూ.1.16 కోట్లు ప్రకటించినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం దారుణమన్నారు. ఇటువంటి పాలకులను ఎన్నికల్లో ఓటర్లు ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు తమ సంఘం మద్దతు తెలుపుతున్నట్టు ఆయన ప్రకటించారు. కూటమి నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ విజయం సాధించి, చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే అల్లూరి స్మారక ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని వీరభద్రరావు ఆశాభావం వ్యక్తంచేశారు.

జగన్ నమ్మించి మోసం చేశారు

‣ వైసీపీని చిత్తుగా ఓడిస్తాం: నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ షేక్ సిద్ధిక్

అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన జగన్‌ను ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ అన్నారు. నిరుద్యోగులకు జగన్ చేసిన అన్యాయంపై ఏప్రిల్ 24న అనంతపురంలో ప్రారంభించిన నిరుద్యోగ చైతన్య యాత్రను శుక్రవారం విశాఖపట్నంలో ముగించారు. 2.3 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ వేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ మాట తప్పి నిరుద్యోగులను దగా చేశారని సిద్ధిక్ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో 40 లక్షల మంది నిరుద్యోగుల కుటుంబాలు ఏకమై వైసీపీకి డిపాజిట్లు కూడా రాకుండా చేస్తాయని పేర్కొన్నారు.

చంద్రబాబు..



ప్రజల్లో దేవుడిని చూస్తారు

'నిజం గెలవాలి' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల కిలోమీటర్లు పర్యటన చేశారు నారా భువనేశ్వరి. 204 బాధిత కుటుంబాలను పరామర్శించారు. దాదాపు వందల మంది విద్యార్థుల భవిష్యత్తు తన భుజాల మీద వేసుకున్నారు. టీడీపీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తూ నిజం గెలవాలంటూ యాత్ర చేసిన నారా భువనేశ్వరి ప్రస్తుత ఎన్నికల వేళ 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలు వెల్లడించారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

- నిజం గెలవాలి యాత్ర అరుదైన ఘట్టం
- బాబు అరెస్టుతో చాలా బాధపడ్డాను
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ధ్వంసమైంది
- కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి మేలు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో నారా భువనేశ్వరి

? చంద్రబాబు అరెస్టు సమయంలో పవన్ కల్యాణ్ స్పందించిన తీరు ఎలా అనిపించింది?

చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు ఆయన మా కుటుంబాన్ని, నన్ను కూడా కలవడానికి వచ్చారు. వచ్చినప్పుడు ఒక్కటే అన్నారు. మీకు ఇలా జరగాల్సింది కాదని ఓదార్పునిచ్చారు. మహిళల రక్షణం కోసం మనందరం కలిసి పోరాటం చేద్దామన్నారు. నాకు, నా కుటుంబానికి ఆ మాట చాలా బలానిచ్చింది. ఒక నాయకుడున్నాడు.. మనల్ని రక్షిస్తాడు అన్న ధైర్యం ప్రతి మహిళలో వచ్చింది.

కూటమికి ఎన్ని సీట్లు వస్తాయని భావిస్తున్నారు?

ఇప్పుడు టీడీపీ ఒక్కటే కాదు కూటమితో ముందుకు వెళ్తున్నారు. కాబట్టి 175కు 175 సీట్లు రావాలని ఆశిస్తున్నాను. చంద్రబాబు 160 సీట్లు పైన రావాలని ఆకాంక్షిస్తున్నారు.

? ఒక సీఎం కుమార్తెగా, ఒక సీఎం సతీమణిగా చూసిన మిమ్మల్ని, భవిష్యత్తులో సీఎం తల్లిగా చూస్తామా?

అది ప్రజలు నిర్ణయించాలి. అలా చూడాలన్న కోరిక నాకు కూడా ఉంది. నా కొడుకు ఆ స్థానంలో ఉండాలని నేను కోరుకుంటాను. అతను తన నాన్నలాగానే ప్రజల కోసం చాలా కష్టపడుతున్నాడు.

? వైసీపీ ఐదేళ్ల పాలనపై మీ అభిప్రాయం

ఇక్కడ పాలన ఉంటే కదా?. అభిప్రాయం చెప్పడానికి. పెట్టుబడిదారులు రారు, పరిశ్రమలు రావు. ఒక పారిశ్రామికవేత్తగా చాలా రాష్ట్రాల్లో మా యూనిట్స్ ఉన్నాయి. మేము అక్కడికి వెళ్లినప్పుడు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మమ్మల్ని ఆహ్వానిస్తాయి. మర్యాద చేస్తాయి. మీరు పరిశ్రమ పెట్టండి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇస్తాయి. కానీ, ఈ రాష్ట్రానికి రావడానికి ఎవరూ మొగ్గు చూపడం లేదు. ఉన్న వాళ్లనే భయపెట్టి పారిపోయేలా చేస్తున్నారు.

రాష్ట్రానికి ఎన్టీఆర్ ఆరేళ్లు, చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా చేశారు. కానీ, ఏ రోజూ మీరు జోక్యం చేసుకోలేదు. ఇప్పుడెందుకు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం వచ్చింది?

చంద్రబాబు 53 రోజులు జైల్లో ఉన్నారు. జైల్లో ఉన్నా కూడా కార్యకర్తలు, ప్రజలు గురించే ఆయన ఆలోచించారు. అరెస్టు తర్వాత 204 మంది టీడీపీ కార్యకర్తలు చనిపోయారు. ఈ నేపథ్యంలో నన్ను పిలిచి.. కార్యకర్తల కుటుంబాలను కలిసి భరోసా ఇవ్వమన్నారు. పార్టీ సహా మన కుటుంబం.. వాళ్లకు అండగా ఉంటుందని భరోసా ఇవ్వమని చెప్పారు. రాజకీయాల్లో ఇది చేయాలి.. అది చేయాలని ఎప్పుడూ నన్ను ఆయన అడగలేదు. ఇదొక్కటే అడిగారు. ప్రజలు, కార్యకర్తలు, మహిళలు బయటకు రావడం కూడా నన్ను బాగా కదిలించింది. అందుకే 'నిజం గెలవాలి' యాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లాను. రాజకీయం నా మైండ్‌లో ఎప్పుడూ లేదు. నా దృష్టి అంతా కార్యకర్తల కుటుంబాలను కలవడంపైనే. 9 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. బాధిత కార్యకర్తల కుటుంబాలను కలిశాను. అదే నాకు సంతోషం. కానీ, కుటుంబాలు దుఃఖంలో ఉన్న సమయంలో కలవాల్సి వచ్చిందన్న బాధ కూడా కలిగింది.

వైసీపీ ఐదేళ్ల పాలనలో మహిళల్ని ఇబ్బందులు పెట్టడంపై మీరేమంటారు?

మనం చిన్నప్పుడు పుస్తకాల్లో రాక్షసుల పాలన ఎలా ఉంటుందో.. రాక్షసులు చేసే పనులు ఎలా ఉంటాయో చదువుకున్నాం. ఈ ప్రభుత్వం అదే చేసింది. ఆడబిడ్డల్ని, మహిళల్ని, ఉద్యోగస్తుల్ని, విద్యార్థులను కూడా చాలా ఇబ్బందులు పెట్టారు. రాష్ట్రంలో అభివృద్ధే కనిపించడం లేదు. అవినీతి మాత్రమే కనిపిస్తోంది. ఇది సమాజానికి చాలా పెద్ద ప్రమాదం.

చంద్రబాబు తరపున మీరు కుప్పంలో, లోకేశ్ తరపున మంగళగిరిలో బ్రాహ్మణి ప్రచారం చేస్తున్నారు. ఎవరికి ఎక్కువ మెజారిటీ తీసుకువస్తారు.

మా మధ్య అలాంటి పోటీ లేదు. కానీ, కుప్పంలోనే ఎక్కువ మెజార్టీ వస్తుంది. కుప్పం ప్రజలు 35 ఏళ్లుగా చంద్రబాబును ఎమ్మెల్యేగా గెలిపిస్తున్నారు. ఆయన అక్కడికి వెళ్లినా వెళ్లకపోయినా చంద్రబాబు మీద నమ్మకంతో ఓటేశారు. కుప్పం ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటాం. కుప్పంలో లక్షపైన మేజార్టీ వస్తుంది. మా ఫోకస్ మొత్తం కుప్పం మీదే ఉంది.

బాబు అరెస్టు అయినప్పుడు రాష్ట్రం మొత్తం బాధపడింది. ఆ సమయంలో లోకేశ్ మీకేం చెప్పారు?

సెప్టెంబరు 10.. మా పెళ్లి రోజు. తెల్లవారుజామున మూడున్నర గంటల సమయం లో ఆందోళనగా లోకేశ్ నాకు ఫోన్ చేశారు. నాన్నగారిని అరెస్టు చేశారని చెప్పారు. మొదట నేను నమ్మలేదు. చంద్రబాబు నాయకుడిగా ఎప్పుడూ ప్రజల క్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసమే పనిచేశారు. అరెస్టులు, అవినీతి ఆలోచనలు, కుటుంబానికి ఏదో వస్తుందన్న ఆలోచన ఆయన ఎప్పుడూ చేయలేదు. అలాంటి వ్యక్తిని అరెస్టు చేయడం చాలా బాధకలిగించింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా మాకు ఇది అవసరం. అది అవసరం. మీ పదవితో మాకు ఇది చేయండి.. అది చేయండి అని అసలు ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు.

చంద్రబాబును ఏడిపించారు కదా.. ఆ సమయంలో మీరెక్కడున్నారు?



ఆ రోజు నేను బయట ఉన్నాను. ఒక స్నేహితురాలు ఫోన్ చేసి.. వెంటనే ఇంటికి వెళ్లమన్నారు. నాకు భయం వేసింది. అప్పటికే చంద్రబాబు, లోకేశ్ హిట్‌లిస్ట్‌లో ఉన్నారు. వారికి ఏమైనా అయిందా అనిపించింది. ఆ తర్వాత నీ గురించి అసెంబ్లీలో ఏదో మాట్లాడారని చెప్పింది. నాకు వెంటనే అర్థం కాలేదు. కానీ, నా కళ్లలో కన్నీళ్లు వచ్చాయి. అసెంబ్లీ లాంటి దేవాలయంలో ఇలాంటివి మాట్లాడకూడదు. ప్రజల సమస్యలు, వారికి ఏం చేయాలన్న దాని గురించి చర్చ జరగాలి. కానీ మహిళల చీరలు, అమ్మాయిలు, ఆడ బిడ్డల గురించి మాట్లాడడం సంస్కారమే కాదు. అందులోనూ శాసన సభలో మాట్లాడడం మరీ దారుణం. ఒకరి జీవితాల గురించి మాట్లాడే హక్కు వీళ్లకు ఎవ్వరిచ్చారు. ఐదేళ్లలో రాజకీయాలు చెడిపోయాయి. అభివృద్ధిని పక్కన పెట్టి చిల్ల మాటలకు ప్రాధాన్యత ఇచ్చారు. వాళ్ల ఇంట్లో ఆడపడుచులైనా చెప్పాలి. సృష్టికి మూలం మహిళ. ఇది అందరూ మరిచిపోతున్నారు.

204 కుటుంబాలను కలిశారు. మీ మనసును తాకిన సంఘటన ఏదైనా ఉందా?

నేను కలిసిన 204 కుటుంబాల్లో 200 కుటుంబాలు అత్యంత సాధారణమైన స్థితిలో ఉన్నాయి. వాళ్లంతా కూలి పనులు చేసుకునే బతికేవారు. కొంతమందికి సరైన ఇళ్లు కూడా లేవు. రెండు, మూడు చోట్ల అయితే.. వర్షానికి కారిపోయే ఇళ్లు, పగిలిన గోడలు చూశాను. ఇలాంటి వాళ్లు కూడా ఉంటారా? అని అనిపించింది. వాళ్లు, వాళ్ల పిల్లలు నన్ను ఒక్కటే అడిగారు. చదువుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. దీంతో మీ పిల్లల భవిష్యత్తు మాది అని భరోసా ఇచ్చాను. ఈ ధైర్యం కూడా చంద్రబాబు వల్లే వచ్చింది. ఆయన ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కార్యకర్తలకు భరోసా కల్పించే బాధ్యత నాపై పెట్టారు. ఉన్నత విద్యా చదువుతున్న పిల్లల ఫీజులు కూడా మేము కడతామని వారికి హామీ ఇచ్చాం.

చంద్రబాబు అరెస్టు తర్వాత మహిళలు సపోర్ట్ చేశారు దీనిని ఎలా చూస్తారు?

అలాంటి స్పందన వస్తుందని అనుకోలేదు. ఆశ్చర్యం వేసింది. ఆయన నాయకత్వంపై ప్రజల్లో ఇంత నమ్మకం ఉందా అనిపించింది. ఆయన ఉంటేనే ప్రజలకి, వాళ్ల బిడ్డలకి మేలు జరుగుతుందన్న నమ్మకం వచ్చింది. ప్రజలు హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి చూశారు. రాష్ట్రాభివృద్ధి ఈయనొక్కరే చేయగలరని నమ్మకం ప్రజల్లో వచ్చింది. అరెస్టు సమయంలో ప్రజల అండగా ఉండడంతోనే మా కుటుంబం ధైర్యంగా నిలబడింది.

'యువగళం' తర్వాత లోకేశ్‌లో ఎలాంటి మార్పు గమనించారు?

దిగితేనే లోతు తెలుస్తుందన్నట్లు.. ఇంట్లో ఉంటే అంతా బాగానే ఉంది అనిపిస్తుంది. కానీ.. బయటకొచ్చి ప్రజల్లో తిరిగి, సమాజం గురించి తెలుసుకుంటే సమస్యలు, ప్రజల జీవన విధానాల గురించి తెలుస్తాయి. లోకేశ్ ప్రజల్లోకి వచ్చి వారితో మమేకమయ్యాక క్షేత్రస్థాయి పరిస్థితులు అర్థమయ్యాయి. ప్రజలు లోకేశ్‌ను అక్కున చేర్చుకున్నారన్న నమ్మకం కలిగింది. 'యువగళం' లోకేశ్ భవితకు పునాదులు వేసింది.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఉందంటారా?

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంతమందికి భయం లేకుండా పోయింది. ఎవరు ఏం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రౌడీషీటర్లు, హత్యాచారాలు చేసిన వారికీ భయం అనేది పోయింది. రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారు. వారి ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు. ఎంత ధైర్యం ఉంటే ఒక వైసీపీ నేత నందికొట్కూరులో ముస్లిం మహిళ బురఖా తీస్తారు? అంటే వారు భయం లేకుండా ప్రవరిస్తున్నారు. నా లీడర్ నన్నేం చేయరు. నా ఇష్టం. నా ఇష్టారాజ్యమని వీళ్లు ప్రవరిస్తున్నారు. అందుకే మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ఈ ప్రభుత్వం గురించి ముందే ఊహించాం. మహిళలకు రక్షణ ఉండదని అనుకున్నాం. ఐదేళ్లలో ప్రజలు ఎంతో దారుణమైన పరిస్థితులను ఎదర్కొన్నారు.

? ఎన్డీయే కూటమికి ఎందుకు ఓటు వేయాలి?

టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే ఆలోచనతో ఉన్నాయి. ప్రజల ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నాయి. ప్రజల కోసం పని చేయాలని మూడు పార్టీలూ భావిస్తున్నాయి. కాబట్టి నేను ఎక్కడికి వెళ్లినా ప్రజల్ని కోరింది ఒక్కటే కూటమికి ఓటు వేయాలనే. జెండాలు వేరైనా మూడు పార్టీల అజెండా మాత్రం ఒక్కటే.

మహిళలకు ఏం చెబుతారు?

మహిళలకి ఒకటే చెబుతాను. 53 రోజులు చంద్రబాబును జైలులో పెట్టడం చూశారు. నేను కూడా బయటకు వచ్చేలా ఈ ప్రభుత్వం చేసింది. నేను ఏదైనా చేయగలను అనే శక్తి మహిళలకు మాత్రమే సొంతం. దీనికి నేనే ఉదాహరణ. అమరావతి పోరాటంలో మహిళలు రోడ్ల మీదకు వచ్చారు. ఇప్పుడు మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు మహిళలు నడుం బిగించాలని కోరుతున్నాను.

సునీత అండ్ కో వ్యాజ్యాలు కొట్టివేత

‣ విచారణ జరగాల్సిన అవసరం ఉందన్న హైకోర్టు

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ దివంగత వివేకా కూతురు సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సీఆర్పీసీ సెక్షన్ 156(3) కింద విచారణకు ఆదేశిస్తూ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వుల్లో కారణాలు పేర్కొననప్పటికీ, దర్యాప్తు పూర్తిచేసి పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేసినందున పిటిషనర్లపై ప్రతికూల ప్రభావం చూపదని పేర్కొంది. మేజిస్ట్రేట్ కారణాలు పేర్కొనకపోవడం పెద్ద తప్పేమీకాదని తెలిపింది. పిటిషనర్లపై మోపిన అభియోగాలు తీవ్రమైనవని, వాస్తవాలు తేలాలంటే విచారణ జరగాల్సిన అవసరం ఉందంది. ఈ నేపథ్యంలో మేజిస్ట్రేట్ ఉత్తర్వులలో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు లేవంటూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి శుక్రవారం తీర్పు ఇచ్చారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అధికారి ఎస్పీ రామ్‌సింగ్ కోరినట్లు సాక్ష్యం చెప్పాలని, లేకుంటే హత్య కేసులో ఇరికిస్తామని వివేకా కూతురు, అల్లుడు తనపై ఒత్తిడికి చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని ఆరోపిస్తూ వివేకా పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో పోలీసులు కేసులు నమోదు చేశారు.

హైవే కిల్లర్లకు యావజ్జీవం

‣ ఉరిశిక్షను యావజ్జీవంగా మార్చిన హైకోర్టు

‣ హైవేలపై వాహనదారుల రక్షణలో ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్య

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వరుస హత్యలు చేసిన హైవే కిల్లర్లుగా పేరు మోసిన మున్నా, అతడి అనుచరులకు ఉరిశిక్ష విధిస్తూ ఒంగోలు ఎనిమిదో జిల్లా అదనపు సెషన్స్ కోర్టు విధించిన ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మారుస్తూ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. దోషులందరూ 45 ఏళ్లపాటు జైలుశిక్ష అనుభవించాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈ శిక్ష పూర్తికాకుండా క్షమాభిక్ష పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. పట్టపగలు జాతీయ రహదారిపై వరుస హత్యలు జరుగుతున్నా, అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొంది. రహదారిపై కనీసం పెట్రోలింగ్ కూడా ఏర్పాటు చేయలేదంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరోవైపు మృతుల కుటుంబాలకు విక్టిమ్ పరిహార పథకం కింద పరిహారం ఖరారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు ఇచ్చింది. ప్రకాశం జిల్లా, ఒంగోలు కేంద్రంగా ప్రధాన నిందితుడు అబ్దుల్ సమద్ అలియాస్ మున్నా, మరికొందరు.. అధికారుల ముసుగులో రహదారిపై వెళ్తున్న లారీలను ఆపి డ్రైవర్, క్లీనర్‌ను తమ వద్దకు రప్పించుకొని తాడుతో హతమార్చేవారు.


చందనోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలు, చందనం సమర్పిస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు

కమనీయం అప్పన్న చందనోత్సవం

‣ నిజరూప దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

సింహాచలం, మే 10: సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు కళ్లకు గంతలు కట్టుకుని వెండి బొరిగెలతో స్వామి వారిపై పూతగా ఉండే చందనాన్ని తొలగించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం దేవాలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులకు తొలి దర్శనం తెల్లవారుజామున రెండు గంటలకు కల్పించారు. ఆ తర్వాత వేకువజామున 2.30 గంటల నుంచి సామాన్య భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం తెల్లవారుజామున మూడు మణుగుల (125 కిలోల) చందనపు ముద్దను అప్పన్న స్వామిపై తొలివిడత పూతగా అర్చకులు సమర్పించడంతో చందనోత్సవం పరిసమాప్తమైంది. అప్పన్న నిజరూపాన్ని సుమారు 90 వేల మంది దర్శించుకున్నట్టు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే విభజన హామీల అమలు: శశిథరూర్

విశాఖపట్నం, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన హామీల అమలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్ ఇవ్వడంతోపాటు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా ఆపుతామని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపైనర్ శశిథరూర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార నిమిత్తం విశాఖ వచ్చిన ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పేదలకు, అన్నివర్గాల ప్రజలకూ న్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. మోదీ పాలనపై ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తేనే దేశంలో ప్రజాస్వామ్యం మనగలుగుతుందని చెప్పారు.

కూటమి విజయంతోనే ప్రజాస్వామ్యానికి రక్ష

‣ నందమూరి సుహాసిని పిలుపు


చినవడ్లపూడిలో ప్రచారం చేస్తున్న నందమూరి సుహాసిని తదితరులు

మంగళగిరి, మే 10: రాష్ట్రంలో ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే కూటమి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించుకోవడం ప్రతి పౌరుని కర్తవ్యమని నందమూరి హరికృష్ణ తనయ సుహాసిని అన్నారు. కూటమి బలపర్చిన టీడీపీ అభ్యర్థిగా మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న నారా లోకేశ్‌కు మద్దతుగా సుహాసిని తమ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం చినవడ్లపూడిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవ్ డెమోక్రసీ-సేవ్ అమరావతి నినాదంతో ఓటర్లు ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం కట్టాలని కోరారు. లోకేశ్‌ను అత్యంత భారీ మెజారిటీతో గెలిపించి మంగళగిరిని స్వర్ణగిరిగా అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నికల అక్రమాలపై పౌర సంస్థలు స్పందించాలి

‣ విశ్రాంత ఐఏఎస్ జీవీ కృష్ణారావు


జీవీ కృష్ణారావు

గుంటూరు(కార్పొరేషన్), మే 10: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నేపథ్యంలో జరిగే అక్రమాలపై పౌర సంస్థలు, పౌరులు స్పందించాలని, వాటి నివారణకు కృషి చేయాలని ఎన్నికల నిఘా వేదిక పరిశీలకుడు విశ్రాంత ఐఏఎస్ జీవీ కృష్ణారావు తెలిపారు. ఎన్నికల సందర్భంగా జరిగే అక్రమాలను సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ రూపొందించిన డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎలక్షన్‌వాచ్.సీవోఎం వెబ్ సైట్‌కు పంపించాలన్నారు. వాటిని సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరుగుదలకు కృషి చేయాలన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 2019లో ఆంధ్రప్రదేశ్‌లో 80% ఓటింగ్ జరిగిందని, దీనిని 85 శాతానికి పెంచేందుకు కృషి జరగాలన్నారు. పట్టణ ఓటింగ్ 60 శాతం లోపుగా ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణకు పట్టణ ప్రజలు ఓటుహక్కును సంపూర్ణంగా వినియోగించుకోవాలని కోరారు.

అశ్రునయనాలతో బాలాజీకి అంతిమ వీడ్కోలు

చీరాల, మే 10: 'ఆంధ్రజ్యోతి' బిజినెస్ ఎడిటర్ గార్లపాటి బాలాజీ అకాల మరణం జర్నలిస్టు లోకాన్ని కలిచివేసిందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. బాలాజీ గురువారం అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో అశ్రునయనాల మధ్య ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, జర్నలిస్టులు అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్టు శేషసాయి, బాపట్ల జిల్లా 'ఆంధ్రజ్యోతి' బ్యూరో ఇన్‌చార్జి ఎస్.నవీన్ బాబు తదితరులు బాలాజీ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అబ్ కీ బార్?

ఖర్గేపై ఈసీ మండిపాటు

న్యూఢిల్లీ, మే 10: ఎన్నికల సంఘం విడుదల చేసిన పోలింగ్ వివరాలు అసంబద్ధంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలకు రాసిన లేఖల్లో ఆరోపించడంపై ఈసీ తీవ్రంగా స్పందించింది. స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించే ఎన్నికలపై ఓటర్లలోనూ, రాజకీయ పార్టీల్లోనూ సందేహాలు లేవనెత్తి.. తప్పుదారి పట్టించేందుకు, గందరగోళం, అడ్డంకులు సృష్టించేందుకు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడింది. మొదటి దశలో పోలింగ్ శాతాన్ని 5.5 శాతం, రెండో దశలో 5.74 శాతం పెంచేశారని, ఆ వివరాల విడుదలలోనూ జాప్యం చేశారని ఖర్గే చేసిన ఆరోపణలనూ ఈసీ ఖండించింది.



విజయవాడ సభలో ఇండియా కూటమి నేతల అభివాదం

మోదీ పెద్ద అబద్ధాలకోరు

- ఇద్దరు వ్యక్తుల చేతుల్లోనే దేశ సంపద: ఖర్గే
- మోదీవి దుశ్శాసన రాజకీయాలు: ఏచూరి

విజయవాడ(ఆంధ్రజ్యోతి), గుంటూరు(తూర్పు), మే 10: దేశానికి, ప్రజలకు తనదే గ్యారంటీ అని చెబుతున్న ప్రధాని మోదీ అతిపెద్ద అబద్ధాలకోరని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. పదేళ్లకాలంలో ఆయన ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మోదీ, అమిత్‌షా దేశ సంపదను అమ్మేస్తున్నారన్నారు. అంబానీ, అదానీ దేశాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. దేశంలో వారికే ఎందుకు పన్ను మినహాయింపులు ఇస్తున్నారని ప్రశ్నించారు. అంబానీ, అదానీలపై ఈడీ, సీబీఐ దాడులు ఎందుకు జరగడం లేదని నిలదీశారు. మహాభారతంలో దుశ్శాసనుడి రాజకీయాలను మోదీ చేస్తున్నారని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. రాష్ట్రంలో మోదీ చెప్పిన బుర్రకథకు టీడీపీ, జనసేన తందానా అంటున్నాయని విమర్శించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ మోదీ మాటలకు, చేతలకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. ఇక, గుంటూరులో నిర్వహించి ఇండియా కూటమి బహిరంగసభలో డి.రాజా, సీతారాం ఏచూరి మాట్లాడుతూ మోదీ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజంలపై దాడి జరుగుతోందని మండిపడ్డారు.

మోదీ మళ్లీ ప్రధాని కాలేరు: రాహుల్ గాంధీ

కన్నౌజ్, కాన్పూర్, మే 10: నరేంద్రమోదీ మరోసారి దేశ ప్రధాని కాలేరని, బీజేపీకి ఈ ఎన్నికల్లో 180కి మించి సీట్లు రావని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి తుఫాన్ రానుందని, దేశంలో బీజేపీ అతిపెద్ద ఓటమిని ఇక్కడే ఎదుర్కోనుందని తెలిపారు. తమ కూటమికి రాష్ట్రంలోని 80 సీట్లలో 50 స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం యూపీలో జరిపిన సభల్లో రాహుల్ ప్రసంగించారు. 'నేను చెబుతున్న మాటను రాసిపెట్టుకోండి. జూన్ 4న ప్రధానిగా మోదీ ఉండరు. ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు' అని తెలిపారు.

మాకెందుకు డబ్బులివ్వవు?

- కుప్పం మండలంలో వైసీపీని నిలదీసిన మహిళ.. ఆమెపై దాడి

కుప్పం, మే 10: చిత్తూరు జిల్లా కుప్పం మండలం జరుగు పంచాయతీ యనమనాశనపల్లెలో శుక్రవారం రాత్రి వైసీపీకి చెందిన సర్పంచ్ సురేశ్ ఓటర్లకు నగదు పంపిణీ చేశారు. కొన్ని ఇళ్లలో ఇస్తూ, మరికొందరికి ఇవ్వలేదు. దీంతో.. 'మాకెందుకు డబ్బులివ్వవు' అంటూ ఒక మహిళ నిలదీశారు. అయితే 'అడగడానికి నువ్వెవరు?' అంటూ సర్పంచి ఆమెపై దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామస్థులంతా ఒక్కటై అతడిమీద తిరగబడ్డారు. భయపడ్డ సర్పంచ్ మాజీ వలంటీరు ఇంట్లోకి వెళ్లి దాక్కున్నారు. పోలీసులు వచ్చి సర్పంచ్‌ను బయటకు పిలిపించి తమతో తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. గ్రామస్థులు అడ్డుకుంటున్నా పోలీసులు సర్పంచ్‌ని తమతో తీసుకెళ్లారు.

కేజ్రీవాల్‌కు బెయిల్

జూన్ 1 వరకూ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

- సీఎంవోకు, సెక్రటేరియట్‌కు వెళ్లొద్దని, జూన్ 2న లొంగిపోవాలని షరతులు
- ఆప్ శ్రేణుల సంబరాల నడుమ తిహాడ్ జైలు నుంచి బయటకొచ్చిన ఢిల్లీ సీఎం
- హనుమంతుడి ఆశీస్సులతోనే తాను జైలు నుంచి బయటకొచ్చినట్టు వెల్లడి

బెయిల్ షరతులు

- 50వేల పూచీకత్తు, అంతే మొత్తానికి ఒకరి ష్యూరిటీ సమర్పించాలి
- సీఎం కార్యాలయానికి, ఢిల్లీ సచివాలయానికి వెళ్లకూడదు.
- ఆమోదం తప్పనిసరి అయిన సందర్భాల్లో తప్ప అధికారిక ఫైళ్లపై సంతకం చేయరాదు.
- మద్యం విధానం కేసులో తన పాత్ర గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదు.
- ఈ కేసుకు సంబంధించిన సాక్షులను కలుసుకోకూడదు. కేసు ఫైళ్లను పరిశీలించకూడదు.



న్యూఢిల్లీ, మే 10 (ఆంధ్రజ్యోతి): మద్యం విధానం కేసులో యాభై రోజులుగా తిహాడ్ జైల్లో మగ్గుతున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు ఐదు షరతులతో కూడిన 21 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికల తుది దశ జూన్ 1న ముగియనున్న నేపథ్యంలో.. జూన్ 2వ తేదీన లొంగిపోవాలని స్పష్టం చేసింది. ఈ కేసులో కేజ్రీవాల్‌పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ.. ఆయన నేరం ఇంకా రుజువు కాలేదని, ఆయనకు ఎలాంటి నేర నేపథ్యం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కేజ్రీవాల్ వల్ల సమాజానికి ఎలాంటి ప్రమాదమూ వాటిల్లదని.. ఆయన ఢిల్లీ సీఎం, ఒక జాతీయ పార్టీ అధినేత అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం తమ తీర్పులో పేర్కొంది. ప్రజాస్వామ్యంలో సార్వత్రిక ఎన్నికలు అత్యంత ముఖ్యమైన ఘట్టమని.. ఈ ఎన్నికలకున్న ప్రాధాన్యం దృష్ట్యా ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఆయనకున్న బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని మధ్యంతర బెయిల్ ఇవ్వాలని నిర్ణయించామని స్పష్టం చేసింది. కేజ్రీకి బెయిల్ ఇవ్వొద్దని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. "ఈడీ ఈ కేసులో ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్)ను నమోదు చేసింది 2022 ఆగస్టులో. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది ఈ ఏడాది మార్చి 21న. ఆయన ఈ ఏడాదిన్నర కాలం బయటే ఉన్నారు. ఆయన్ను అంతకుముందూ(మార్చి 21కి ముందు).. ఆ తర్వాతా అరెస్ట్ చేసి ఉండొచ్చు. ఇప్పుడీ 21 రోజుల బెయిల్‌తో ఏమంత తేడా రాదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "సామాన్యుడికైనా, సీఎంకైనా ఒకే న్యాయం వర్తించాలి. ఒక రైతు, కిరాణా వ్యాపారి అరెస్టయితే వ్యవసాయం చేసేందుకు, దుకాణం నడిపేందుకు బెయిల్ ఇస్తారా?" అని ఈడీ న్యాయవాదులు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. అసలు కేజ్రీవాల్ ఉన్న పరిస్థితులకు ఈ పోలికలు వర్తింపజేయలేమని స్పష్టీకరించింది. కేజ్రీవాల్‌కున్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఆయనకు సామాన్య పౌరుడితో పోలిస్తే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించామని, ఈ పరిస్థితులను విస్మరించడం సరైంది కాదని న్యాయస్థానం పేర్కొంది. చంద్రబాబు కేసులో కూడా ఆయనను రాజకీయ కార్యక్రమాల్లోనూ, ఎన్నికల సభలు, సమావేశాలలో పాల్గొనేందుకు అనుమతించిన విషయాన్ని గుర్తుచేసింది. అలాగని తాము ఈ కేసులో ఇస్తున్న తీర్పు.. రాజకీయ నాయకులకు ఎలాంటి ప్రత్యేకాధికారాలనూ ఇవ్వదని స్పష్టం చేసింది.

సంబరాలతో స్వాగతం..

సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని గంటల తర్వాత.. కేజ్రీవాల్ తిహాడ్ జైలు నుంచి బయటకొచ్చారు. ఆ సమయానికే కేజ్రీ భార్య సునీత, కుమార్తె హర్షిత, ఆప్ నేత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఢిల్లీ మంత్రులు ఆతిషీ, సౌరబ్ భరద్వాజ్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. ఆప్ నేతలు, కార్యకర్తలు సైతం జైలు బయట పెద్దసంఖ్యలో గుమిగూడారు. నీలి, పసుపు రంగు జెండాలు పట్టుకుని.. 'జైల్ కే తాలే టూట్‌గయే.. కేజ్రీవాల్ జీ ఛూట్ గయే (జైలు తాళాలు బద్దలయ్యాయి-కేజ్రీవాల్ బయటికొచ్చారు) అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ.. డోళ్లు వాయిస్తూ.. పూల వర్షం కురిపిస్తూ.. సంబరాలతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన కేజ్రీవాల్.. "మీకు ముందే చెప్పాను.. నేను త్వరలోనే బయటకు వస్తానని. నియంతృత్వానికి వ్యతిరేకంగా నేను శాయశక్తులా పోరాడుతున్నాను. కానీ, 140 కోట్ల మంది ప్రజలూ ఈ పోరాటంలో నాతో కలిసి రావాలి" అన్నారు. హనుమంతుడి ఆశీస్సులతోనే తాను బయటకు వచ్చానన్న కేజ్రీవాల్.. ఆ స్వామికి ప్రార్థనలు చేసేందుకు శనివారం ఉదయం కన్నాట్‌ప్లేస్(ఢిల్లీ)లోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లనున్నట్టు చెప్పారు.

ప్రజాస్వామ్య విజయం- సునీతా కేజ్రీవాల్

కేజ్రీవాల్ బెయిల్ పై విడుదల కావడం ప్రజాస్వామ్య విజయమని ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ అన్నారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన తదితర పార్టీలు సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశాయి. ప్రధాని మోదీ ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఝార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్‌కు కూడా ఇదే విధంగా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొంది. కేజ్రీవాల్‌కు బెయిల్ లభించడం ఈ ఎన్నికల్లో ఎంతో దోహదం చేస్తుందని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం నిలదొక్కుకుందని ఎన్సీపీ నేత శరద్ పవార్ అన్నారు.

కవిత పిటిషన్ 24కు వాయిదా

న్యూఢిల్లీ, మే 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్ విచారణను ఢిల్లీ హైకోర్టు ఈ నెల 24కు వాయిదా వేసింది. కవిత బెయిల్ పిటిషన్‌పై స్పందించాలని ఈడీకి నోటీసులు జారీ చేసింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి, నితేష్ రాణా వాదనలు వినిపించారు. ఈడీ తరఫున ప్రత్యేక న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు.

నన్ను సజీవసమాధి చేయాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయి

- దేశ ప్రజలే నాకు రక్షణ కవచం : ప్రధాని మోదీ



నందుర్బార్, మే 10: ప్రతిపక్షాలకు చెందిన కొందరు తనని సజీవసమాధి చేయాలని అనుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. కానీ, దేశ ప్రజలు తనకు రక్షణ కవచంలా ఉన్నంత వరకు తనని ఎవరు ఏం చేయలేరని తెలిపారు. మహారాష్ట్రలోని నందుర్బార్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి హీనా గవిత్‌కు మద్దతుగా ప్రధాని మోదీ గురువారం ప్రచారం నిర్వహించారు. మహారాష్ట్రలో మోదీని సజీవ సమాధి చేస్తామంటూ శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటరిచ్చిన మోదీ విపక్షాలపై ధ్వజమెత్తారు. తమ ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు శివసేన నేతలు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు.

వడగాడ్పులు ముగిసినట్టే!

విశాఖపట్నం, అమరావతి, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ ఏడాది వడగాడ్పులు దాదాపు ముగిసినట్టేనని భారత వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ రాజస్థాన్, కేరళ మినహా దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో శుక్రవారం నుంచి వేడిగాలులు వీచే అవకాశం లేదని పేర్కొంది. బంగాళాఖాతం నుంచి అత్యధిక తేమతో కూడిన గాలులు వీస్తుండటంతో దేశంలో ఉరుములు, మెరుపులు, పిడుగులు పెరిగే అవకాశం ఉందని వివరించింది. పశ్చిమ రాజస్థాన్, కేరళకు మాత్రమే వడగాడ్పుల హెచ్చరిక జారీ చేసినట్టు శాస్త్రవేత్త సోమా సేన్ తెలిపారు.

లోకం తీరు



హనుమాన్ వల్లే బయటకు వచ్చాను: కేజ్రీవాల్

'బటన్' కుట్రలు బద్దలు!

(మొదటి పేజీ తరువాయి)

కుయుక్తులను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కడిగిపారేసింది. 'జవాబు చెప్పండి' అంటూ శుక్రవారం ఈసీ సంధించిన ప్రశ్నలతో ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఆర్థిక శాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. "ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, అదీ పోలింగ్‌కు 2 రోజుల ముందు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులేయడమంటే అధికార బలంతో ఓటర్లను ప్రభావితం చేయడమే! ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే. పోలింగ్ ముగిసిన తర్వాత(మే 13) ఎప్పుడైనా ఖాతాల్లో డబ్బులు వేసుకోవచ్చు" అని సీఎస్ జవహర్ రెడ్డిని ఈసీ ఆదేశించింది.

అర్ధరాత్రి హంగామా...

హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుతో లభించిన వెసులుబాటుతో... అప్పటికప్పుడు డబ్బులు వేసేలా గురువారం అర్ధరాత్రి ఉరుకులు పరుగులు తీశారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ.. ఎన్నికల ముందు జనం ఖాతాల్లో డబ్బులు వేయాలంటే ఈసీ అనుమతి కావాల్సిందే. దీంతో.. కోర్టు తీర్పును ఉటంకిస్తూ, తమకు అనుమతి ఇవ్వాలని గురువారం అర్ధరాత్రి 1 గంటకు ఈసీకి సీఎస్ జవహర్ రెడ్డి లేఖ రాశారు. శుక్రవారం ఉదయం దీనిపై ఈసీ స్పందించింది. సీఎస్‌కు వరుస ప్రశ్నలు సంధించింది. అవి...

- జనవరి, ఫిబ్రవరి, మార్చిలోనే బటన్లు నొక్కినప్పటికీ అప్పుడు డబ్బుల్లేక డీబీటీ చేయలేదని చెప్పారు కదా! అప్పుడు లేని డబ్బులు సరిగ్గా పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఎలా వచ్చాయి?
- జనవరి-మార్చి వరకు రాష్ట్ర ఆదాయం, ఖర్చుల వివరాలు పంపండి. అలాగే, 6 పథకాలకు ఒకేసారి డీబీటీ చేయడానికి ఇన్ని డబ్బులెలా వచ్చాయో చెప్పండి!
- గడచిన ఐదేళ్లలో ఈ 6 పథకాలకు ఎప్పుడెప్పుడు బటన్లు నొక్కారు? నొక్కిన ఎన్ని రోజులకు ఖాతాల్లో డబ్బులు పడ్డాయి? ఇన్ని పథకాలకు కలిపి గంపగుత్తగా ఒకేసారి డబ్బు ఖాతాల్లోకి గతంలో ఎప్పుడైనా విడుదల చేశారా?
- పోలింగ్ తర్వాతే డీబీటీ చేయాలన్న ఈసీఐ ఆదేశాలకు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్ వేసిన వారు ఈ పథకాల లబ్ధిదారుల జాబితాలో ఉన్నారా?
- 5 నెలల నుంచి దశలవారీగా నొక్కుతున్న బటన్ల డబ్బులను ఈ రోజే(పదో తేదీనే) ఖాతాల్లో వేయాల్సిన అత్యవసరం ఏంటి? వేయకపోతే ఈ ఒక్కరోజులో ఏమైపోతుందో చెప్పండి. మార్చిలో కోడ్ వస్తుందని, మే నెలలో పోలింగ్ ఉంటుందని ముందే తెలిసినా డబ్బులు ఖాతాల్లో ఎందుకు వేయలేదు?
- బటన్లు నొక్కిన పథకాలకు ఫలానా తేదీల్లో ఖాతాలో డబ్బు జమ చేయాలని ముందుగానే నిర్ణయించారా? దానికి సంబంధించిన జీవోలు, ఆదేశాల కాపీలు, ఇతర పత్రాలు ఏమైనా ఉన్నాయా?

కుట్ర బట్టబయలు...

ఈసీ సంధించిన ప్రశ్నలకు సీఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం సమాధానాలతో లేఖ రాశారు. దీనిని పరిశీలించిన అనంతరం... సాయంత్రానికే ఈసీ తన ఆదేశాలు వెలువరించింది. "మీరు ఇచ్చిన వివరాల ప్రకారం.. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆర్థిక పరిస్థితి బాగానే ఉంది. ఇప్పుడు ఖాతాల్లో వేస్తామంటున్న డబ్బులను అప్పుడే వేసేందుకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయి. అలాకాకుండా.. జాప్యం జరగడానికి సీఎస్ చెప్పిన సమాధానం సంతృప్తికరంగా లేదు. పైగా... మే నెలలో ఎప్పుడూ డీబీటీ పథకాలకు నిధులు జమ చేయలేదు.పోలింగ్ తర్వాత ఎప్పుడైనా డబ్బులు జమ చేసుకోండి" అని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

మరో రూ.4,000 కోట్ల అప్పు

కొత్తగా మరో రూ.4,000 కోట్ల అప్పులు తెచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమవుతోంది. మంగళవారం(14వ తేదీ) రిజర్వ్ బ్యాంకులో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు వేలం వేసి రూ.4,000 కోట్లు అప్పు తెస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో ఇప్పటి వరకు కలిపి ప్రభుత్వం రూ.17,000 కోట్ల అప్పులు తెచ్చింది.

అక్రమాలు చేయలేం!

- తేల్చిచెప్పిన అధికారులు

జగన్ వీరవిధేయులైన సీఎస్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు డబ్బులు విడుదల చేయడానికి అన్నీ సిద్ధం చేసుకున్నప్పటికీ... కిందిస్థాయి అధికారులు గీత దాటేందుకు ససేమిరా అన్నారు. బడ్జెట్, బీఆర్వోలు లేకపోవడంతోపాటు ... సాంకేతికంగానూ కుదరలేదు. ఈసీ ఆదేశాలకు వ్యతిరేకంగా, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పనిచేయడానికి ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు ముందుకురాలేదు. గురువారం రాత్రి హైకోర్టు ఉత్తర్వులు రాగానే... తెల్లారేసరికే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయాలంటూ అన్ని శాఖలపై ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తీవ్ర ఒత్తిడి చేశారు. ఆ 6 పథకాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రాథమికంగా క్లియర్ చేసినప్పటికీ, ఆర్బీఐకి సంబంధించి ఈ-కుబేర్ ప్లాట్‌ఫామ్‌పై వాటిని చివరి నిమిషంలో ఆపాల్సి వచ్చింది.

నిధుల పంపిణీకి ఈసీ ఎన్‌వోసీ ఇవ్వలేదు

రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యలు

అమరావతి, మే10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు నిధుల పంపిణీ విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను హైకోర్టు వేసవిసెలవుల తరువాతకి వాయిదా వేసింది. నిధుల పంపిణీకి నిరభ్యంతర పత్రం కోరుతూ ప్రభుత్వం సమర్పించిన వినతిపై ఎన్నికల సంఘం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదని గుర్తు చేసింది. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు పథకాల నిధులను జమ చేయవద్దని సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారని తెలిపింది. మే 11 సాయంత్రం 5 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుందని గుర్తు చేసింది. ఇప్పటికే కోర్టు సమయం ముగిసిందని, అప్పీళ్లపై విచారణ జరిపి, తాము ప్రభుత్వానికి అనుకూలమైన నిర్ణయం వెల్లడించినప్పటికీ, దాని అమలుకు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అవరోధంగా మారుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో విచారణ జరిపి ప్రయోజనం లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో వ్యాజ్యాలపై విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం వైఖరిని ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టింది. సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో నిధుల పంపిణీకి ఎన్‌వోసీ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన వినతిపై తిరిగి వివరణ ఎలా కోరతారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. పోలింగ్ తేదీ ముగిసిన తరువాతే పథకాల నిధులను పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఈ నెల 9న ఇచ్చిన ఉత్తర్వుల అమలును ఈ నెల 10వరకు(శుక్రవారం) తాత్కాలికంగా పక్కపెట్టారని గుర్తు చేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులు అమలు చేసేందుకు వీలుగా ఎన్‌వోసీ ఎందుకు ఇవ్వలేదని నిలదీసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పీల్ దాఖలు చేసి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పీల్ వేయకుండా, ఉత్తర్వులు అమలు పర్చకపోవడాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉన్నప్పుడు ప్రభుత్వ పథకాల అమలు విషయంలో ఎన్నికల సంఘం భిన్నవైఖరి ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. ఎలాంటి వివరణలు కోరకుండా ఈ నెల 13 తరువాత అయినా పథకాల నిధుల పంపిణీకి అనుమతిస్తారా లేదా అని ప్రశ్నించింది. రాష్ట్రంలో పోలింగ్ ముగిసిన(మే13) తరువాత రోజు నుంచి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు చేయూత, విద్యాదీవెన, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల అమలును ఈ నెల 10వరకు తాత్కాలికంగా పక్కనపెడుతున్నామని పేర్కొంది. అయితే ఈ ఉత్తర్వులు ఎన్నికల్లో పోటీ చేసే ప్రతిపక్ష రాజకీయపార్టీల సమాన అవకాశాలు దెబ్బతీసి అధికార వైసీపీకి మేలు చేసేవిలా ఉన్నాయని పేర్కొంటూ నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం అప్పీలు దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది.

ఆ ఉత్తర్వులు అసాధారణం

అప్పీల్‌దారుల తరఫున సీనియర్ న్యాయవాదులు నాదకర్ణి, మీనాక్షి అరోరా వాదనలు వినిపించారు. "సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు అసాధారణంగా ఉన్నాయి. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు పథకాల నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయవద్దని ఆదేశిస్తూనే, ఎన్నికల సంఘం ఉత్తర్వుల అమలును ఈనెల 10వరకు తాత్కాలికంగా నిలుపుదల చేయడం సరికాదు. కొత్త పథకాలకే కాకుండా, అమల్లో ఉన్న పథకాలకు కూడా ఎన్నికల నియమావళి వర్తిస్తుంది. కోడ్ నిబంధనల ప్రకారం నిధుల పంపిణీకి ఈసీ నుంచి ప్రభుత్వాలు అనుమతి తీసుకోవాల్సిందే. తాజా ఎన్నికల్లో ఈసీఐ తన మార్గదర్శకాలను మరింత కఠినతరం చేసింది. పోలింగ్ తేదీకి రెండు రోజుల ముందు రూ.14వేల కోట్ల భారీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తే అధికారపార్టీకి లబ్ధి చేకూరుతుంది. అమల్లో ఉన్న పథకాలే అయినప్పటికీ, పోలింగ్ తేదీ సమీపిస్తున్న వేళ లబ్ధిదారులకు నిధులు పంపిణీ చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పు ఉంది" అని తెలిపారు. ఆ వివరాలను కోర్టు ముందు ఉంచారు.

అప్పీళ్లను మూసివేయవద్దు : ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. "నిధులు విడుదలకు ఈసీ నుంచి ఎన్‌వోసీ కోరాం. ఇది ఇవ్వకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఎన్నికల సంఘం వివరణ కోరింది. అన్ని వివరాలతో సీఎస్ వివరణ సమర్పించారు.ఎన్‌వోసీ ఇవ్వకపోవడంతో లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేయలేదు. సింగిల్ జడ్జి ఉత్తర్వులు అమలు చేయకుండా ఈసీ ఉల్లంఘించింది. 2019 ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పటికీ పసుపు-కుంకుమ పథకం కింద పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చేందుకు హైకోర్టు అనుమతించింది. అప్పటికే అమల్లో ఉన్న పథకం అని చెబుతూ...ఎన్నికల సంఘం సైతం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉంది. అప్పీళ్లపై విచారణను మూసివేయవద్దు" అని కోరారు. కాగా, ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. "ఈ నెల 9న ఇచ్చిన ఉత్తర్వుల అమలును ఈ నెల 10వరకు పక్కనపెడుతున్నట్లు సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిధులు పంపిణీ చేయవచ్చని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొనలేదు. ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయడానికి సింగిల్ జడ్జి ఎలాంటి కారణాలు పేర్కొనలేదు" అన్నారు.





ఒంగోలులో ఓ బియ్యం దుకాణం ఎదుట బారులు తీరిన జనం, (ఇన్‌సెట్‌లో) కొత్త మార్కెట్‌లోని ఓ రైస్ దుకాణం నుంచి బియ్యం బస్తాలు తీసుకెళ్తున్న జనం

రూ. 10కే రెండు క్వార్టర్లు
రూ. 50కే బస్తా బియ్యం

- హవాలా తరహాలో నోటుపై సీరియల్ కోడ్
- 2 రైస్ షాప్‌ల సీజ్, వైసీపీ ఒత్తిడితో రిలీజ్
- ఒంగోలులో ఓటమి భయంతో వైసీపీ ప్రలోభాలు!

ఒంగోలు(కార్పొరేషన్), మే 10: పది రూపాయలకే రెండు క్వార్టర్ బాటిళ్లు.. యాభై రూపాయలకే బియ్యం బస్తా!.. ఓటమి భయంతో ఒంగోలు వైసీపీ అభ్యర్థులు ఓటర్లకు పంచుతున్న తాయిలాల పరంపర ఇది! ఒంగోలు లోక్‌సభ, అసెంబ్లీ వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న నేతలు ఓటమి భయంతో ఇప్పటికే అనేక రకాలుగా ఓటర్లను మభ్యపెట్టారు. ఇక పోలింగ్ దగ్గర పడడంతో ఓటుకు నోటుతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఒక్కో ఓటుకు రూ.3వేలు పంపిణీ చేశారు. అయినా మార్పు లేకపోవడంతో కొత్త ఎత్తుగడలకు తెర తీశారు. నగరంలోని డివిజన్లలో మగవారికి భారీగా మద్యం, రెండు ఓట్లకు ఒక బియ్యం బస్తా పంచారు. బియ్యంతోపాటు శివారు కాలనీల్లో నూనె ప్యాకెట్లు కూడా ఇస్తున్నారు. ఇంత చేసినా వారిలో విజయంపై భరోసా మాత్రం కనిపించడం లేదు. 'అవసరమైతే అదనంగా మరో వెయ్యి ఇవ్వండి. లేదంటే అల్లర్లకు తెగబడండి, ఓటు మాత్రం వైసీపీకి పడాల్సిందే' అని ఆ పార్టీ పెద్దలు డివిజన్ నాయకులకు, కార్యకర్తలకు ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.

హవాలా తరహాలో నోట్ల టోకెన్లు

ఒంగోలులో వైసీపీ లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు ఓట్లు రాబట్టుకునేందుకు హవాలా విధానం తెరపైకి తెచ్చారు. తమ వద్ద ఉన్న రూ.పది, ఇరవై, 50నోట్ల సీరియల్ నంబర్లు రాసి, ఆ నంబర్ల లిస్టును బార్ల యజమానులకు ఇస్తారు. తర్వాత నోట్లను ఓటర్లకు పంచుతారు. పది నోటు తీసుకుని బార్ షాప్‌కు వెళ్తే సీరియల్ నంబర్‌ను తన వద్ద ఉన్న లిస్ట్‌తో సరిపోల్చి.. రెండు క్వార్టర్ బాటిళ్ల మద్యం అందజేస్తారు. ఇలా రూ.20కి మూడు, రూ.50కి ఆరు బాటిళ్లు పంపిణీ చేస్తున్నారు. అలాగే, బియ్యం పంపిణీకి రెండు ఓట్లకు ఒక రూ.50 నోటు ఇవ్వడంతోపాటు, నగరంలోని కొన్ని బియ్యం హోల్‌సేల్ వ్యాపారులతో ఒప్పందం చేసుకుని వారికి నోట్ల జాబితా అందజేశారు. దీంతో ఓటర్లు రూ.50 ఇవ్వగానే వ్యాపారులు ఒక బస్తా బియ్యం అందజేశారు. విషయం తెలిసి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడులు చేసి రెండు దుకాణాలను సీజ్ చేశారు. పంపిణీ చేస్తుండగా ఫులి వెంకట రెడ్డి కాలనీలో 554 బస్తాల బియ్యం, లారీని పట్టుకున్నారు. అయితే కోడ్‌ను ఉల్లంఘించి దుకాణాల ఎదుట వైసీపీ నాయకులు ఆందోళనకు దిగారు. చివరికి తనిఖీలకు వెళ్లిన అధికారులు అధికారపార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి మధ్యాహ్నం తర్వాత అలాంటిదేమీ లేదంటూ మాటమార్చి రెండు దుకాణాలను తిరిగి తెరిపించేశారు. ఈ వ్యవహారంలో వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మంత్రి కుమారుడి వద్ద నగదు సీజ్

ఒంగోలు(క్రైం), మే 10: మంత్రి మేరుగు నాగార్జున కుమారుడి కారులో సరైన ధ్రువపత్రాలు లేని నగదును పోలీసులు సీజ్ చేశారు. గురువారం రాత్రి 12 గంటలకు ఒంగోలులోని సమతానగర్ చెక్‌పోస్టులో పోలీసులు తనిఖీలు నిర్వ హిస్తున్నారు. మంత్రి కుమారుడు కారును పోలీసులు అక్కడ ఆపారు. ఆ కారును తనిఖీ చేయగా రూ.2 లక్షల నగదు దొరికింది. దీంతో కారును కూడా స్వాధీనం చేసుకున్నారు.

అర్ధరాత్రి 'కోట్ల' సంచుల కలకలం!

- పోలీసులు వస్తున్నారని ఇళ్ల మధ్యలో గిరాటు
- నాలుగు సంచులను పంచుకున్న మహిళలు

హిందూపురం, మే 10: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో గురువారం అర్ధరాత్రి నోట్ల సంచులు కలకలం రేపాయి. లేపాక్షి మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న పిల్లిగుండ్ల కాలనీ సమీపంలో అర్ధరాత్రి వైసీపీ నేతలు కొందరు వాహనంలో డబ్బు సంచులతో ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో పోలీసులు సైరన్ వేసుకుని రావడంతో భయపడి, కాలనీలోకి వెళ్లి ఇళ్ల మధ్య డబ్బు సంచులను గిరాటు వేసి వెళ్లిపోయారు. ఇది చూసిన కాలనీకి చెందిన రామాంజినమ్మ, సాధిక అనే మహిళలు చెరో రెండు సంచులు ఎత్తుకెళ్లి ఇళ్లలో దాచుకున్నారు. కొంతసేపటి తరువాత పడేసివెళ్లినవారు తిరిగి వచ్చి అక్కడ వెతికారు. అదే సమయంలో డబ్బు సంచులు తీసుకున్న మహిళలు బయటకు వచ్చారు. 'ఇక్కడ డబ్బు సంచులు వేసి వెళ్లాం. తీసుకుంది మీరే కదా..? ఇవ్వండి' అని వారు దబాయించి వారి వద్ద నుంచి డబ్బు వసూలు చేసుకున్నారు.

పులివెందులలో ఓటుకు రూ.2వేలు

కడప, మే 10 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఇలాకా పులివెందులలో ఓటర్లకు డబ్బులు యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నారు. వైసీపీ వారు ఓటుకు రూ.2000 ఇస్తే, టీడీపీ 1000 ముట్టజెబుతోంది. ఎవరి స్థాయిలో వారు ఇంటింటికీ వెళ్లి డబ్బులు పంచుతున్నారు. సంక్షేమం, అభివృద్ధి చేశామని చెప్పుకొంటున్న జగన్ తన నియోజకవర్గంలోనే ఓటుకు రూ.2000 ఇస్తుండడం చర్చనీయాంశమైంది.





జనవాన



జోరువానలో గన్నవరంలో చంద్రబాబు బహిరంగ సభ



- చంద్రబాబు ప్రసంగం వినేందుకు వర్షంలోనే పడిగాపులు
- అభిమానుల ఉత్సాహంలో తడిసి ముద్దయిన బాబు
- 25 నిమిషాల పాటు జోరువానలోనూ ప్రసంగం
- ఉద్వేగపూరిత మాటలతో మరింత ఉత్సాహం
- పిల్ల సైకోను ఓడించాలంటూ వల్లభనేని వంశీపై ఫైర్

జోరువానలో తడుస్తూ నిలబడిన జనం (ఇన్‌సెట్‌లో) వైసీపీ పాస్ పుస్తకాన్ని చింపేస్తున్న చంద్రబాబు

ఓవైపు జోరున వాన.. మరోవైపు ఉరుములు, మెరుపులు.. గంటపాటు నిరాటంకంగా వర్షం కురిసినా జనం ఏమాత్రం చెక్కుచెదరలేదు. అభిమాన జల్లుల్లో తడిసి ముద్దయిన టీడీపీ అధినేత చంద్రబాబు అంతే ఉత్సాహంతో ప్రసంగించారు. ఉద్వేగపూరిత మాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. గన్నవరంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో దాదాపు 25 నిమిషాల పాటు చంద్రబాబు తడుస్తూనే ప్రసంగించగా, చెక్కుచెదరని అభిమానంతో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు చప్పట్ల వర్షం కురిపించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం ఏలూరులో జరిగిన సభలో ప్రసంగిస్తుండగానే, వర్షం కురిసింది. దీంతో ఆయన హెలీప్యాడ్ దగ్గర కొంతసేపు ఆగారు. షెడ్యూల్ ప్రకారం గన్నవరంలో సభ జరగాల్సి ఉండగా, వర్షం వల్ల జరుగుతుందా, లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. కానీ, వర్షం కురుస్తున్నా ప్రజలు భారీగా సభాస్థలికి చేరుకోవడంతో సభ రద్దుచేసే ఆలోచనను విరమించుకున్నారు. వర్షం పడుతుండటం వల్ల అందరూ వెళ్లిపోతారనుకున్నారు. కానీ, ఎవరూ కదల్లేదు. అపార్ట్‌మెంట్ సెల్లార్లలో, షాపుల వెంట భారీగా నిలబడ్డారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చంద్రబాబు విజయవాడ విమానాశ్రయానికి చేరుకునేసరికి వర్షం ఇంకాస్త ఎక్కువైంది. అంత వర్షంలో కూడా చంద్రబాబు సభ నిర్వహించారు. గన్నవరం చైతన్య కాలేజీ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ సభలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు సభా వేదిక వద్దకు వస్తున్నారని మైకులో చెప్పగానే, అప్పటికే సెల్లార్లలో, షాపుల వద్ద తలదాచుకున్న వారంతా రోడ్డుపైకి చేరారు. చంద్రబాబు వచ్చేలోపు మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ప్రసంగించారు. ఉరుములు, మెరుపులను కూడా లెక్కచేయకుండా వేదిక వద్దకు చేరుకున్న చంద్రబాబు ప్రసంగం ఆద్యంతం ప్రజల చప్పట్ల మధ్య జరిగింది. తన కోసం వానలో కూడా తడుస్తూ ఎదురుచూసినందుకు అందరికీ చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు దాదాపు 20 నిమిషాల పాటు వర్షంలోనే ప్రసంగించారు.

పిల్లసైకోను సాగనంపుదాం : వంశీపై చంద్రబాబు ఫైర్

గన్నవరం నియోజకవర్గంలో పిల్ల సైకోను సాగనంపుదామంటూ వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌పై చంద్రబాబు ఫైర్ అయ్యారు. జగన్ దోపిడీ రాజ్యంలో గన్నవరం పిల్ల సైకో కూడా భాగమని, పోలవరం కాల్వ మట్టిని, కొండలను తవ్వేసి దోచుకున్నాడన్నారు. టీడీపీ దేవాలయమైన స్థానిక కార్యాలయంపై దాడి చేయటమే కాకుండా వాహనాలను తగలబెట్టడం వంటి వికృత చర్యలకు పాల్పడిన వంశీకి తగ్గిన బుద్ధి చెప్పడానికి ఇదే సరైన తరుణమన్నారు. తిన్నింటి వాసాలను లెక్కపెట్టిన పిల్ల సైకోను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. యార్లగడ్డ వెంకట్రావు అమెరికాలో వ్యాపారాలు చేసి, డబ్బు సంపాదించి, ఇక్కడ సేవ చేయటానికి వచ్చారని చెప్పారు. ఆయన్ను గెలిపించుకుంటే మంచి జరుగుతుందని, రౌడీయిజం పోతుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములకు భద్రత లేకుండా చేస్తున్నారని వైసీపీపై చంద్రబాబు మండిపడ్డారు. రైతులకు ఇచ్చే పాస్ పుస్తకాలపై జగన్ ఫొటోలు ఎందుకని ప్రశ్నించారు. ఆ పుస్తకాన్ని చించేయండి అంటూ జగన్ ఫొటోతో ఉన్న పాసుబుక్‌ను చించేశారు. మళ్లీ వైసీపీ అధికారం చేపడితే మీ భూమి మీది కాదని, జగన్‌ది అయిపోతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రెండు నెలల్లో ఆ విధానాన్ని రద్దు చేసి, రాజముద్ర వేసి ఇస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని వదిలేసిందని, సంక్షేమాన్ని భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. వైసీపీ మేనిఫెస్టోలో ఏమీ లేదని, టీడీపీ మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ ఉన్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ తిరిగితే మెడకు ఉరి పడుతుందని, అది పడకుండా ఉండాలంటే ఫ్యాన్‌కు ఉరేస్తేనే మనశ్శాంతి కలుగుతుందంటూ చంద్రబాబు ఉద్వేగపూరితంగా ప్రసంగించారు.



షెడ్ల కింద నిలబడి చంద్రబాబు ప్రసంగం వింటున్న ప్రజలు



నేటితో ప్రచారానికి

తెర

సాయంత్రం 6 గంటల తర్వాత లేనట్టే..

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

నేటి సాయంత్రం నుంచి 144 సెక్షన్

ఇక రంగంలోకి అధికార యంత్రాంగం


ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నెల రోజులుగా నిరాటంకంగా చేపట్టిన ప్రచారపర్వానికి శనివారంతో తెరపడనుంది. శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత ఎలాంటి ప్రచారానికి అనుమతి లేదు. బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించటానికి వీల్లేదు. 6 గంటల సమయం కాగానే, మైకులు, సౌండ్ బాక్సులు ఆపేయాల్సి ఉంటుంది. దీనికి విరుద్ధంగా జరిగితే క్షేత్రస్థాయిలో తిరుగుతున్న మైక్రో అబ్జర్వర్లు రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. ఎన్నికల సంఘం బాధ్యులపై చర్యలు తీసుకుంటుంది. శనివారం సాయంత్రం 6 గంటలకు రాజకీయ పార్టీల నుంచి కానీ, రాజకీయ అభ్యర్థుల నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు ఉండకూడదు. బల్క్ మెసేజ్‌లు, ఐవీఆర్ఎస్ కాల్స్, ఐవీఆర్ఎస్ సర్వేలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రకటనలు ఆగిపోవాల్సి ఉంటుంది. ప్రింట్ మీడియాలో ప్రకటనలకు మాత్రం అనుమతి ఉంటుంది.

144 సెక్షన్ అమల్లోకి.. : కలెక్టర్

శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కలెక్టర్ దిల్లీరావు రాజకీయ పార్టీల నేతలకు సూచించారు. అలాగే, డ్రై డే అమలవుతుందన్నారు. మద్యం విక్రయాలను బంద్ చేయనున్నారు. శుక్రవారం సాయంత్రం రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. సైలెన్స్ పీరియడ్‌కు సంబంధించిన నిబంధనలను వివరించారు. ఎన్నికలకు చివరి 72 గంటల నిబంధనలను, జిల్లా ఎన్నికల యంత్రాంగం అనుసరించబోయే విధానాలను వివరించారు.

మెరక పేరిట మేత..!



మల్లాయపాలెం జగనన్న కాలనీలో నిలిచిన నీరు

మల్లాయపాలెం జగనన్న కాలనీలో రూ.కోట్లు మాయం

పేదలకు సెంటు స్థలమన్నారు.. ఇల్లు అందంగా కట్టించి ఇస్తామన్నారు.. సీఎం హోదాలో జగన్ చెప్పిన మాటలు పేదలు కూడా నమ్మేశారు.. ఐదేళ్లు గడుస్తున్నా పేదలకు ఇళ్లయితే అందలేదు కానీ, వైసీపీ నేతల జేబులు మాత్రం నిండుకున్నాయి. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, ఆయన అనుచరులైతే రూ.కోట్లకు పడగలెత్తారు. జగనన్న కాలనీలకు మెరక పేరిట భారీగా దోచుకుని అధికార పార్టీ నాయకులు అందలమెక్కితే, ఐదేళ్లుగా ఇస్తామన్న ఇళ్లు చేతికందక పేదలు మాత్రం అథఃపాతాళంలోనే ఉండిపోయారు.

- ఎమ్మెల్యే కొడాలి నాని అండ్ కో మాయాజాలం
- 178.3 ఎకరాల లోతట్టు ప్రాంతం.. మెరక పేరిట భారీగా దోపిడీ
- రూ.28 కోట్లకు వర్క్ ఆర్డర్లు.. స్వాహా చేసింది రూ.20 కోట్ల పైచిలుకు
- కొడాలి అనుచరులకే కాంట్రాక్ట్ పనులు
- డబ్బు ముట్టగానే బినామీ ఖాతాల్లోకి మళ్లింపు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : జగనన్న కాలనీల నిమిత్తం గుడివాడ నియోజకవర్గంలోని మల్లాయపాలెంలో 178.3 ఎకరాలు సేకరించారు. ఎకరా రూ.52 లక్షలు పెట్టి కొన్నారు. ఇంత ఖర్చు పెట్టినా అదంతా లోతట్టు ప్రాంతంగానే ఉంది. దీన్ని మెరక చేయాలన్న నెపంతో ఎమ్మెల్యే కొడాలి నాని తన అవినీతి విశ్వరూపాన్ని చూపించారు. వాస్తవానికి ఈ ప్రాంతాన్ని మెరక చేయడానికి గ్రావెల్ ఉపయోగించాలి. అలాచేస్తే ఖర్చు ఎక్కువ అవుతుంది. దీంతో స్థానికంగా ఉన్న చెరువుల్లో మట్టితో పాటు సాగునీటి కాల్వలు, డ్రెయిన్లలోని మట్టిని తవ్వి తరలించేశారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుంచి కూడా తరలించారు. కానీ, బిల్లులు మాత్రం ఎక్కడో దూరం నుంచి గ్రావెల్ తరలించినట్లు చూపి రూ.కోట్లు కొల్లగొట్టారు. ఇంతా చేసినా మల్లాయపాలెంలో సుమారు 7వేల మందికి సెంటు పట్టాలు ఇస్తే.. వందమంది కూడా నివాసం ఉండలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతం జలమయమైపోతోంది.

రూ.కోట్లు కొట్టేశారు..!

ఎమ్మెల్యే కొడాలి నాని మాత్రం మల్లాయపాలెం జగనన్న కాలనీ పేరుతో అలవోకగా రూ.20 కోట్ల పైచిలుకు తన జేబులో వేసుకున్నారు. ఈ కాలనీ మెరక చేసేందుకు పంచాయతీలో సంబంధిత అధికారులతో 2020, ఏప్రిల్ 25న అత్యవసర సమావేశం ఏర్పాటు చేయించారు. అప్పుడున్న ఎంపీడీవో కుమారి వెంకటరమణ సాయంతో వర్క్ ఆర్డర్స్ చేత్తో రాయించి తన అనుచరులు 16 మందికి మెరక పనులు కట్టబెట్టారు. ఇలాంటి వర్క్ ఆర్డర్లు చాలానే ఇచ్చారు. మొత్తం మీద మల్లాయపాలెం జగనన్న కాలనీ మెరక చేసేందుకు రూ.28 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. వీటిలో పదో వంతు కూడా పనులు చేయలేదన్నది సత్యం. దానికి నిదర్శనమే వర్క్ ఆర్డర్లు పొందిన వారంతా కొడాలి నాని అనుచరగణంలో సాదాసీదా వ్యక్తులు కావడం. వారి ఖాతాల్లోకి జమ అయిన సొమ్ము తిరిగి కొడాలి నాని బినామీ ఖాతాల్లోకి వెళ్లడం. ఈ మొత్తం వ్యవహారాన్ని నాని అనుచరులు... దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్, కసుకుర్తి బాబ్జీ (గేదెల బాబ్జీ), కొల్లి విజయ్ తదితరులు నడిపించారు.

దోపిడీ 1 : 2020, ఏప్రిల్ 25న మల్లాయపాలెం పంచాయతీ నిర్వహించిన అత్యవసర సమావేశంలో మెరక తోలకానికి 16 మందికి వర్క్ ఆర్డర్లు ఇచ్చింది. వారిలో మందా ఛటర్జీ ఒకరు. ఈయనకు 0608542090107031 నెంబరుతో వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఆయన పని పూర్తి చేసినట్లు నిర్ధారించిన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ 2022, జూలై 21న ఆయన ఖాతాలోకి రూ.కోటీ12లక్షల25వేల642 నిధులు జమ చేశారు. ఈ నిధులు నాలుగు రోజులు తిరగకముందే కొడాలి నాని బినామీ ఖాతాల్లోకి వెళ్లిపోయాయి.
- 2022, జూలై 28న నాని బినామీ కంపెనీ శ్రీనివాస గార్మెంట్స్‌కు రూ.50 లక్షల చొప్పున రెండు విడతల్లో రూ.కోటి చెక్ ద్వారా బదిలీ అయ్యాయి.
- 2022, ఆగస్టు 2న రూ.4 లక్షలు శ్రీసాయిరామ్ ఎంటర్‌ప్రైజెస్‌కు బదిలీ అయ్యాయి.
- మరుసటి రోజు మరో వ్యక్తి ఖాతాలోకి రూ.7 లక్షలు బదిలీ అయ్యాయి.

దోపిడీ 2 : మందా ఛటర్జీ ఖాతాలోకి రెండోసారి 2022, ఆగస్టు 5న ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా నుంచి రూ.48లక్షల51వేల788 జమ అయ్యాయి. మరుసటి రోజే ఆ నిధుల్లోని రూ.14లక్షల70వేల047 ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడు, మట్టి మాయాజాలానికి సూత్రధారుడైన సజ్జ శ్రీధర్ ఖాతాలోకి జమ అయ్యాయి. అదేరోజు కొల్లి విజయ్ ఖాతాలోకి రూ.18లక్షల30వేల047, రూ.13లక్షల50వేల047 జమ అయ్యాయి. అదేరోజు మదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.2లక్షల14 జమ అయ్యాయి

దోపిడీ 3 : బలుసుపాటి రాంప్రసాద్ పేరిట 060854209010170306 నెంబరుతో వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఈయన పనులు పూర్తి చేసినట్లు నిర్ధారించి 2021, జనవరి 25న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రెండు విడతలుగా రూ.37లక్షల25వేల340 చొప్పున జమ చేశారు. ఆ నిధులు అదేరోజు ఆయన రూ.40 లక్షలు, రూ.34 లక్షల చొప్పున నగదు రూపంలో డ్రా చేశారు.

దోపిడీ 4 : మల్లిపెద్ది అభిషేక్ పేరుతో 060854209010170307/70309 నెంబర్లతో రెండు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. ఈయన పని పూర్తిచేసినట్లు నిర్ధారించిన డ్వామా పీడీ 2022, జూలై 21న రూ.కోటీ12లక్షల25వేల642 ఆయన ఖాతాలో జమ చేశారు. ఈ నిధులు మరుసటి రోజే శివ గోల్డ్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.42 లక్షలు, శ్రీలలిత ఫిష్ ప్యాకింగ్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.22 లక్షలు, ఎస్ఎస్ఆర్ ఆక్వాఫీడ్స్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.48 లక్షలు జమ అయ్యాయి.

దోపిడీ 5 : మందా దీప్తి పేరుతో వర్క్ ఆర్డర్ తీసుకోగా, ఆమె ఖాతాలోకి డ్వామా పీడీ రూ.2.24 కోట్లను 2022, జూలై 15న జమ చేశారు. సరిగ్గా వారం తిరగకముందే అంటే జూలై 21న మందా దీప్తి ఖాతా నుంచి రామకృష్ణా టౌన్‌షిప్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.2.15 కోట్లు జమ కావడం గమనార్హం. ఇవన్నీ కొడాలి నాని, ఆయన అనుచరుల బినామీ ఖాతాలు కావడం గమనార్హం. రామకృష్ణా టౌన్‌షిప్ పేరుతో హైదరాబాద్‌లో కొడాలి నాని ఆయన అనుచరులు ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి దోపిడీలు కోకొల్లలుగా జరిగాయి. ఇలా బినామీ పేర్లతో సుమారు రూ.20 కోట్ల పైచిలుకు ప్రజాధనాన్ని కొడాలి నాని, ఆయన అనుచరులు కాజేయడం గమనార్హం.

నగరం.. జలమయం..



ఏలూరురోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రెండు రోజులుగా నగరంలో ఓ మోస్తరు వర్షాలు పడగా, శుక్రవారం మధ్యాహ్నం మాత్రం భారీ వర్షం కురిసింది. ఉదయమంతా ఎండతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతాల్లో వర్షమై దంచి కొట్టింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

మృతదేహాన్ని పీక్కుతిన్న మూషికాలు

- మైలవరం సీహెచ్‌సీలో అమానవీయ ఘటన
- మృతదేహాన్ని భద్రపరచడంలో సిబ్బంది నిర్లక్ష్యం

మైలవరం, మే 10 : మైలవరం ప్రభుత్వాసుపత్రిలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం తరలించిన మృతదేహాన్ని ఎలుకలు పీక్కుతినడం కలకలం రేపింది. మృతదేహాన్ని భద్రపరచడంలో సీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. మైలవరం మండలం కొత్త మంగాపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి అచ్చిరెడ్డి.. జి.కొండూరు మండలం చెర్వుమాధవరం రైల్వే స్టేషన్ వద్ద ట్రాక్ సమీపంలో గురువారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అచ్చిరెడ్డి మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఈ క్రమంలో మార్చురీలో ఎలుకలు అచ్చిరెడ్డి ముఖం, చాతీపై చర్మాన్ని పీక్కుతిన్నాయి. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు వైద్య సిబ్బందిని ప్రశ్నించగా, సమాధానం దాటవేశారు. మృతదేహాన్ని భద్రపరచడంలో సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి విజయం ఖాయం

- రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల ప్రభంజనం
- 130 సీట్లతో చంద్రబాబు సీఎం అవుతారు
- ముస్లిం, మైనార్టీలు అపోహలు వీడి అండగా ఉండాలి
- మైలవరం ప్రచారంలో శాసనమండలి మాజీ స్పీకర్ ఎంఏ షరీఫ్



మైలవరంలో అశేషంగా హాజరైన జనం.. మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

మైలవరం, మే 10 : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించడం ఖాయమని శాసనమండలి మాజీ స్పీకర్ ఎంఏ షరీఫ్ అన్నారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆయన శుక్రవారం రాత్రి మైలవరం పట్టణంలో ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కూటమికి రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రభంజనం వీస్తున్నదన్నారు. 130-140 సీట్లు వస్తాయని అన్ని సర్వేలు చెబుతున్నాయని సానుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. 2019లో పాలిచ్చే ఆవుకు కాదనుకొని తన్నే దున్నపోతును ఎన్నుకోవడంతో ఐదేళ్లలో రాష్ట్రం అన్ని విధాల వెనుకబడిందన్నారు. పరిశ్రమలు, పెట్టుబడి, అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోవడమే కాక అప్పులు మాత్రం రూ.లక్షల కోట్లు ప్రజల నెత్తిన పడ్డాయన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. మైనార్టీ ఓట్లను దండుకునేందుకు విష ప్రచారాలతో ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. నాలుగు శాతం మైనార్టీ రిజర్వేషన్‌ను ఎత్తివేస్తారని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. మైనార్టీ సోదరులు ఎవ్వరూ అపోహపడాల్సిన అవసరం లేదన్నారు. వెనుకబడిన కులాలు, దళితులు వైసీపీ వల్ల పూర్తిగా మోస పోయారన్నారు. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామన్నారు. ప్రజా రాజధాని అమరావతి ఇక్కడే ఉంటుందన్నారు. ఇసుక ఉచితంగా అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. పింఛన్ రూ.4 వేలు ఇస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు అందించగల సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడన్నారు. బీజేపీ నాయకుడు నూతులపాటి బాలకోటయ్య, జనసేన నాయకుడు అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న వెంకట్, సత్య ఏజెన్సీస్ యాజమాన్యం

సత్య షోరూమ్ నూతన బ్రాంచి ప్రారంభం

పటమట, మే 10 : విజయవాడ ఏలూరు రోడ్డులోని రామమందిరం సమీపంలో సత్య ఏజెన్సీస్ షోరూమ్ 19వ బ్రాంచిని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. భవన యజమాని వెంకట్ రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాపార సంస్థ ఎండీ జాన్సన్ అసారియా, జీఎం (రాష్ట్ర ప్రతినిధి) సెంథిల్‌కుమార్‌తో పాటు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. తమ వద్ద ఎల్ఈడీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్‌లు, ఏసీలు, మొబైల్స్, లాప్‌టాప్స్, అన్ని రకాలు గృహోపకరణాలు ఆకర్షణీయమైన ధరలకు లభ్యమైవుతాయని నిర్వాహకులు తెలిపారు.

వైసీపీ కబ్జాలోని చెరువును తిరిగి సాధించుకున్నాం

- నాగవరప్పాడు వాసుల హర్షం

గుడివాడ, మే 10 : వైసీపీ నాయకుల కబ్జాకు గురైన చెరువును తిరిగి సాధించుకున్నామని, శాంతి నిమిత్తం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని నాగవరప్పాడు వాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నాగవరప్పాడులోని చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసీపీ నాయకులు పూడ్చారని, చెరువు పూడికతీస్తారని పలుమార్లు అడిగినా పట్టించుకోలేదన్నారు. చెరువు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి గ్రామంలో జరిగే అనర్థాలను వివరించామన్నారు. చెరువును తిరిగి సాధించుకోవడం గ్రామస్థుల విజయమన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు, నెరుసు చింతయ్య, నాయకులు లోయ శివాజీ, దారం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కుదరవల్లిలో అధికార పార్టీ తరఫున ప్రచారం చేస్తున్న వలంటీర్లు

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు!

నందివాడ, మే 10 : వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని నిబంధనలు ఉండటంతో అధికార పార్టీ నేతలు గ్రామాల్లో వలంటీర్లను బలవంతంగా రాజీనామాలు చేయించారు. వారి చేత ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తమిరిశ, కుదరవల్లి, ఇలపర్రు, పోలుకొండతోపాటు పలు గ్రామాల్లో వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల రాజీనామాలు చేయకుండా ప్రచారంలోకి వస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రచారంలో పాల్గొన్న ఇద్దరిపై వేటు



జగ్గయ్యపేట రూరల్, మే 10: అధికార పార్టీ ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులపై వేటు పడింది. ఉద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాలలో పాల్గొనరాదని అధికారులు చెబుతున్నా లెక్కచేయకుండా తిరుమలగిరి ఆలయంలో రోజు వారీ కూలీలుగా పని చేస్తున్న గుడిగంట్ల పుల్లయ్య, ఆకుల శ్రీను అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీవో రమేష్‌బాబు ఆలయ ఏసీ సాంబశివరావును కలిసి వివరాలు సేకరించారు. ప్రచారంలో పాల్గొన్న ఇద్దరిని విధుల నుంచి తొలగిస్తున్నట్టు పేర్కొన్నారు.

విదేశాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనాలు

వన్‌టౌన్, మే 10: విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ చేస్తున్న గిరిజన విద్యార్థులు ఉపకారవేతనాలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ 2024-2025 సంవత్సరానికి విదేశాల్లో మాస్టర్స్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్, పరిశోధన చేస్తున్న గిరిజన విద్యార్థులకు జాతీయ ఓవర్సీస్ పథకం కింద ఉపకారవేతనాలు అందిస్తుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, స్లాట్ల సంఖ్య 20 ఉందని, గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నందిగామలో భారీ ర్యాలీ..



ప్రచారంలో తంగిరాల సౌమ్య, సినీ నటుడు శివాజీ

కదం తొక్కిన పసుపు సైన్యం, కలిసి వచ్చిన కాషాయ దళం, కాపు కాసిన జనసైన్యంతో కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య తన బలాన్ని ప్రదర్శించారు. ప్రచార ఘట్టం తుది దశకు చేరుతున్న తరుణంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల ర్యాలీతో శుక్రవారం నందిగామ పట్టణం హోరెత్తిపోయింది. పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన ప్రజలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజలు సౌమ్యకు అభివాదం చేశారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ర్యాలీలో సినీ నటుడు, రాజధాని అమరావతి మద్దతుదారుడు శివాజీ, రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సౌమ్య ఇంటి నుంచి బయలు దేరిన ర్యాలీ పట్టణంలో వీధుల గుండా సాగింది.



ఎన్నికల ర్యాలీకి హాజరైన అశేష జనవాహిని

- ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం : తంగిరాల సౌమ్య

నందిగామ, మే 10 : జగన్ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు, మోదీ, పవన్ కళ్యాణ్‌లు సిద్ధమయ్యారని, ప్రజలు ఆశీర్వదించాలని తంగిరాల సౌమ్య కోరారు. ఓటు వేసే ముందు భావితరాల భవిష్యత్‌ను ఆలోచించుకోవాలన్నారు. నందిగామ అభివృద్ధికి యనలేని కృషి చేశానని, ఈసారి అంతకు మించి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. నందిగామను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానన్నారు.

- అమరావతి రాజధానిగా ఉండాలంటే కూటమి ప్రభుత్వం రావాలి
సినీ నటుడు శివాజీ

రాష్ట్ర భవిష్యత్ కోసం అమరావతి రైతులు తమ భూములు త్యాగం చేస్తే తన స్వార్థం కోసం జగన్ మూడు రాజధానుల కుట్రకు తెరలేపాడని సినీనటుడు శివాజీ అన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రజా రాజధాని నిర్మాణం జరిగితే నందిగామ ప్రాంతం గణనీయమైన అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక్క అవకాశం మాయలో చేసిన పొరపాటు వల్ల ఇబ్బందులకు గురయ్యామని, తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కూటమికి అండగా నిలవాలన్నారు. నందిగామ నుంచి తంగిరాల సౌమ్య, విజయవాడ పార్లమెంట్ నుంచి కేశినేని చిన్నిని గెలిపించాలని కోరారు. జగన్ మళ్లీ గెలిస్తే నేడు అమరాతి రైతుల పరిస్థితే రాష్ట్రంలో ఉంటుందన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ జగన్ మరోమారు మోసం చేసేందుకు సిద్ధమయ్యాడని, అప్రమత్తంగా ఉండాలని శివాజీ ప్రజలను కోరారు.

విధి నిర్వహణలో నైతికత, నిష్పక్షపాతం అవసరం



2023 బ్యాచ్ ఐపీఎస్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, మే 10: నైతికత, నిష్పక్షపాతం, నిజాయితీతో అధికారులు విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఎన్నికల నేపథ్యంలో వివిధ అంశాలపై అవగాహన పొందేందుకు ఎన్టీఆర్ జిల్లాకు వచ్చిన 2023 ఐపీఎస్ బ్యాచ్ శిక్షణ అధికారులు శుక్రవారం కలెక్టరేట్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఢిల్లీరావును కలిశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోఖ్వాల్‌తో కలిసి వారందరికి ఎన్నికల నిర్వహణ విధివిధానాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ కలెక్టర్ ఇచ్చారు.

ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు 16 వేల లీటర్ల మద్యం సీజ్

ఎన్నికల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టుల వద్ద పూర్తి నిఘా పెట్టామని, ఇప్పటివరకు జిల్లాలో 16వేల లీటర్లకు పైగా మద్యాన్ని సీజ్ చేశామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. అనుమానిత వాహనాలు, వ్యక్తులను, నిల్వ ఉంచి ప్రదేశాలను నిరంతరం తనిఖీచేయడం ద్వారా ఈ వారంలోనే తొమ్మిదివేల లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని ఆయన తెలిపారు. వత్సవాయి మండలంలో 11,900 సీసాలు(214 లీటర్లు), తక్కెళ్లపాడు వద్ద 4,800 సీసాలు(864 లీటర్లు), చంద్రగూడెం సమీపంలో 19,200 సీసాలు(3,456 లీటర్లు), జగ్గయ్యపేటలో 1680 సీసాలు(302 లీటర్లు), పొలంపల్లి వద్ద 1190 సీసాలు(214 లీటర్లు), నందిగామలో 9,600 సీసాలు(1728 లీటర్లు), తిరువూరులో 4,200 సీసాలు(756 లీటర్లు), మోతీరావు పేట వద్ద 3960 సీసాలు (791 లీటర్లు)సీజ్ చేసినట్లు వివరించారు.

దమ్ము, ధైర్యం ఉంటే నాతో బహిరంగ చర్చకు రా..

కేశినేని నానీకి కేశినేని చిన్ని సవాల్



మాట్లాడుతున్న చిన్ని

విద్యాధరపురం, మే 10: "నాపై వైసీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) అనేక ఆరోపణలు చేస్తున్నారు. నాపై క్రిమినల్ కేసులు లేవు. నాకు బినామీ ఆస్తులు లేవు. నా ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేస్తా. నాకు బినామీ ఆస్తులు ఉన్నట్లు దమ్ముంటే నానీ నిరూపించాలి. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకోను. నా నామినేషన్ అఫిడవిట్‌లో తప్పిదాలుంటే నామినేషన్‌ను రద్దు చేయించుకోవచ్చు. నానీకి దమ్ము, ధైర్యం ఉంటే మీడియా ముందుకు వస్తే బహిరంగంగా చర్చకు సిద్ధం." అని కేశినేని నానీకి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సవాల్ విసిరారు. శుక్రవారం గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా జీవితంలో నాని వంటి వ్యక్తులు సమాజానికి మంచిది కాదన్నారు. నానీ నోటిని అదుపులో పెట్టుకోకపోతే అతని అవినీతి, మోసాల చరిత్రను బయటపెడతానని చిన్ని హెచ్చరించారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించామని ఇంటర్నేషనల్ టెర్మినల్ ప్రారంభానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. 2019 నుంచి 2023 వరకు గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో పనులు జరగలేదన్నారు. ఎయిర్‌పోర్ట్ కమిటీకి వైస్ చైర్మన్‌గా ఉన్న కేశినేని నానీ ఐదేళ్లలో పనులెందుకు చేయలేదో చెప్పాలన్నారు. అంతర్జాతీయ విమానాలు ఎందుకు రద్దయ్యాయని నిలదీశారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధిపై ఏనాడైనా మాట్లాడావా అని నిలదీశారు. కొత్త ఆస్పత్రిని ఒక్కదాన్ని కూడా తీసుకురాలేదన్నారు. పీవీపీపై నోరు జారినందుకు నోటీసు అందుకుని వెళ్లి కాళ్లపై పడ్డాడని తెలిపారు. నాని అరాచకాలు, భూ కబ్జాలపై సాక్ష్యాలు, మీడియా కథనాలు ఉన్నాయన్నారు.

ఉద్యోగులకు జీతాలివ్వని చరిత్ర నానీది..

జగన్‌తో జతకట్టాక కేశినేని నానీలో పైశాచికత్వం బయటకొచ్చిందని చిన్ని విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వని చరిత్ర కేశినేని నానీదన్నారు. లేబర్‌కోర్టులో అతనిపై కేసులున్నాయన్నారు. ప్రధాని మోదీ విజయవాడలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో రోడ్డు షో చేయడం అభివృద్ధికి నాంది అన్నారు. ట్రావెల్స్ మూయడానికి లోకేశ్‌కు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ట్రావెల్స్ మూసివేతకు నానీ అసమర్థత కారణమన్నారు. చెల్లెలు ఏదోమాట అందని ఆమెపై నానీ రెండు కేసులు పెట్టించాడన్నారు. ఇటీవల రూ.34 కోట్లు అప్పు తీసుకుని ఓ హోటల్‌ను నానీ ప్రారంభించాడని తెలిపారు. రాము, హేమంత్ పేరుతో హోటల్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారన్నారు. దీనికి ఆర్వోసీ ఇంటిమేషన్ లేదన్నారు. అప్పులు ఎగ్గొటేందుకు మళ్లీ లీజుకు ఇచ్చాడన్నారు.

మిట్టగూడెంలో మహిళ అనుమానాస్పద మృతి

- తలకు గాయం, మెడలో బంగారం మాయం
- బంగారం కోసం హత్య చేశారని అనుమానం
- భర్త ఫిర్యాదు.. కేసు నమోదు



జగ్గయ్యపేట, మే 10 : మిట్టగూడెంలో ఇంట్లో ఉన్న మహిళ గురువారం రాత్రి అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. తలపై గాయం, మెడలో ఉన్న నాంతాడు, చెవి దిద్దులు కనిపించకపోవటంతో బంగారం కోసం అగంతకుల దాడిలో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. స్థానిక ఎస్సై సూర్యభగవాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో కిరాణా షాపులో గుమాస్తాగా పని చేస్తు మిట్టగూడెంలో బాలికల హైస్కూల్ వద్ద నివాసం ఉంటున్న కోడూరు నాగేశ్వరరావు (57) గురువారం రాత్రి షాపు నుంచి ఇంటికి వెళ్లాక భార్య కస్తూరి (52) అపస్మారకస్థితిలో తలకు గాయమై తీవ్ర రక్తస్రావంతో పడి ఉండటాన్ని గుర్తించారు. మెడలో నాంతాడు, చెవికి దిద్దులు సుమారు 40 గ్రాముల బంగారం కనిపించలేదు. వారికి సంతానం లేదు. బంగారం కోసం దాడిచేసినట్టు చెబుతుండగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నందిగామ ఏసీపీ రవికిరణ్ ఘటనస్థలిని సందర్శించారు. సీఐ జానకీరాం, ఎస్సైలు ఆయనతో ఉన్నారు.



నగదు వివరాలు తెలుపుతున్న ఏసీపీ మురళీమోహన్

వైసీపీ నేత ఇంట్లో రూ.31 లక్షలు స్వాధీనం

తిరువూరు, మే 10 : పట్టణంలో వైసీపీ నాయకుడి ఇంట్లో అక్రమంగా ఉంచిన రూ.31 లక్షలు పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఏసీపీ మురళిమోహన్ వివరాలు వెల్లడించారు. పట్టణంలో 18వ వార్డుకు చెందిన వైసీపీ నేత దారా శ్రీనివాసరావు ఇంట్లో నగదు ఉన్నట్టు అందిన సమాచారం మేరకు, ఎఫ్ఎస్ఎస్ బృందం, స్థానిక పోలీసులు ఉదయం సోదాలు చేశారు. సరైన ఆధారాలు లేకుండా అనధికారికంగా ఉన్న రూ.31 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. శ్రీనివాసరావు భార్య మునిసిపల్ కౌన్సిలర్ అని, ఈ నగదు ఎన్నికల్లో పంపిణీ నిమిత్తం ఉంచినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ అబ్దుల్ నబి, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.



పట్టుబడ్డ మద్యం బాక్సులు, వ్యాను డ్రైవర్

129 బాక్సుల మద్యం పట్టివేత

ఉయ్యూరు, మే 10 : పమిడిముక్కల మండలం వేల్పూరులో శుక్రవారం 129 మద్యం బాక్సులు(5,934 సీసాలు) స్వాధీనం చేసుకున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉయ్యూరు ఇన్స్‌పెక్టర్ జీవీ లక్ష్మి తెలిపారు. వాటి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని చెప్పారు. వాహనాల తనిఖీల్లో భాగంగా టాటా ఏస్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 129 బాక్సుల మద్యం, డ్రైవర్ కాసాని శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. మద్యం, వ్యాన్‌ను సీజ్‌చేసినట్టు తెలిపారు. ఎవరైనా మద్యం అక్రమ రవాణా చేస్తున్న, పెద్ద మొత్తంలో నిల్వ చేసినా వెంటనే సమాచారాన్ని 9440902451 నంబరుకు తెలియపరచాలన్నారు.

వైసీపీ మూక దాడిలో టీడీపీ కార్యకర్తలకు గాయాలు





బాధితులు

కంచికచర్ల రూరల్, మే 10 : పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ వైసీపీ మూకల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో కీలకంగా ఉంటూ.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. శుక్రవారం ఈ ఘటనలు గనిఆత్కూరు గ్రామంలో చోటు చేసుకున్నాయి. గనిఆత్కూరు గ్రామానికి చెందిన తలపాటి వంశీ వాట్సాప్‌లో మద్యం విషయమై పోస్టు పెట్టాడనే అక్కసుతో దాడి చేయడంతో అతడికి గూడ జారింది. చలపాటి అన్వేష్ టీడీపీ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నాడనే అక్కసుతో వైసీపీకి చెందిన దామినేని శివరాం ప్రసాద్ రాడ్డుతో అన్వేష్‌పై దాడి చేశాడు. దీంతో తలకు గాయమైంది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితులు పేర్కొన్నారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40	

ఎన్డీఏ విజయం కోసం శివస్వామి గిరి ప్రదక్షిణ



భవానీపురం, మే 10 : దేశంలో ఎన్డీఏ కూటమి 400 సీట్లుపైనే విజయం సాధించాలని, విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగా సుజనా చౌదరిలు విజయం సాధించాలని కోరుతూ శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి శుక్రవారం చేపట్టిన గిరి ప్రదక్షిణకు కబేళా సెంటర్‌లో పలువురు స్వాగతం పలికారు. శివస్వామి నగరంలో ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి తనయుడు కార్తీక్ శివస్వామి వెంట సాగారు. వివిధ డివిజన్ల టీడీపీ అధ్యక్షులు పేరం సత్యనారాయణ, కె. శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

గద్దె విజయాన్ని కాంక్షిస్తూ బెజవాడ నజీర్ ప్రచారం


11వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బెజవాడ నజీర్

పటమట, మే 10 : జనసేన, బీజేపీ బలపర్చిన తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ శుక్రవారం 11వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలికపరమైన అవకాశాలు, సరైన ఉద్యోగాల్లేక యువత, పనుల్లేక కూలీలు పక్క రాష్ట్రాలకు వలసపోతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలపై ల్యాండ్ టైటిలింగ్ నల్లచట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలందరూ వివేకంతో ఆలోచించి ఓటు అనే ఆయుధంతో అభివృద్ధికి పట్టంగట్టి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని బెజవాడ నజీర్ యువతకు పిలుపునిచ్చారు.

తిరుమల నిత్యాన్నదాన పథకానికి కూరగాయల వితరణ


లారీకి పూజలు నిర్వహిస్తున్న బొండా ఉమా, దాతలు

లబ్బీపేట, మే10: సమాజం లో ప్రతి ఒక్కరూ ధార్మిక భావ జాలం అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద గల విజయ కార్ ఏపీ వర్క్స్ నుంచి వర్రె వెంకట అప్పారావు, యాసర్ల శ్రీనివాసరావు ఇతర భక్తుల సహకారంతో తిరుమల నిత్యాన్నదాన పథకానికి కూరగాయలు పంపారు. కూరగాయల లారీని బొండా ఉమామహేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభించారు. వ్యాపారవేత్త చెన్నుపాటి శ్రీనివాసరావు, దాతలు మేదరమెట్ల శ్రీనివాసరావు, శ్రీకాంత్, హిమాన్షు, నందగోపాల్, వినయతేజ, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాజు, నాగయ్య పాల్గొన్నారు.



లయోల ఎంబీఏ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భారతీనగర్, మే 10: ఆంధ్రా లయోల ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ పూర్వ విద్యార్థుల 5వ ఆత్మీయ సమ్మేళనం విభాగాధిపతి వి. నాగలక్ష్మి పర్యవేక్షణంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పూర్వ విద్యార్థులను వారి అనుభవాలను ప్రస్తుత విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మహేష్, అధ్యాపకులు డాక్టర్ ఎం .విజయ కుమార్, లావణ్య, లలిత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తుల కబ్జాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

యాక్ట్ ప్రతులు దహనం చేసిన గద్దె


ల్యాండ్ టైటిలింగ్ ప్రతులను దహనం చేస్తున్న గద్దె రామ్మోహన్

పటమట, మే 10 : విశాఖపట్నంలో వైసీపీ నాయకులు ప్రభుత్వ, ప్రజల ఆస్తులను చిన్న, చిన్న అగ్రిమెంట్‌లు తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేశారని, వాటికి కోర్టు హక్కు పొందాలనే దూరదృష్టితోనే జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆరోపించారు. భూ హక్కు చట్టం ప్రతి ఒక్కరి మధ్య విభేదాలు సృష్టించి చివరకు వారి ఆస్తులు కబ్జా చేసేందుకు తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపైనే కూటమి ప్రభుత్వం రెండో సంతకం చేస్తుందని భరోసా ఇచ్చారు. 11వ డివిజన్‌లోని ఎన్టీఆర్ సర్కిల్ భోగయ్య బజార్ వద్ద నుంచి కూటమి బలపర్చిన టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్ తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా కేశినేని శివనాథ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా యాక్టు జీవో ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కూటమి అగ్రనేతల వరుస రోడ్ షోలతో ఎన్నికల వాతావరణం పూర్తిగా మారి పోయిందని, వార్ వన్‌సైడ్ అయ్యిందన్నారు. వైసీపీ నాయకులు ముఖాలు జావగారి పోయాయన్నారు. కూటమి చక్కటి ఫలితాన్ని సాధిస్తుందని గద్దె ధీమా వ్యక్తం చేశారు. జగన్ పాలనలో నష్టపోయిన రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే ధ్యేయంగా కూటమి పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ నేతలు నాగేశ్వరరావు, రాజేష్, సుజాత, ఎస్.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి కేవీ.రామకృష్ణయ్య


న్యాయ సదస్సులో పాల్గొన్న జడ్జి కేవీ.రామకృష్ణయ్య, వాసవ్య ప్రతినిధులు

పటమట, మే 10 : చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ.రామకృష్ణయ్య తెలిపారు. వాసవ్య మహిళా మండలిలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సివిల్ జడ్జి రామకృష్ణయ్య మాట్లాడుతూ వాసవ్య మహిళా మండలిలోని శక్తి సదన్ గృహాన్ని సందర్శించారు. అక్కడి వారితో ఆయన కాసేపు ముచ్చటించారు. వారికి ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. ఎవరికైనా న్యాయ సలహాలు అవసరమైతే మీరు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటిని సంప్రదించవచ్చునని సూచించారు. వాసవ్యలో ఇస్తున్న వృత్తివిద్యా శిక్షణ తరగతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పి.దీక్ష, ఉపాధ్యక్షులు కె. విజయ, శక్తి సదన్ సూపరింటెండెంట్ కె. రాణి పాల్గొన్నారు.

అకాల వర్షంతో రోడ్లు జలమయం


జలమయమైన నోవాటెల్ సర్వీస్ రోడ్డు


ఎన్టీఆర్ కాలనీ సర్వీస్ రోడ్డు కోటిరెడ్డి రోడ్డులో

భారతీనగర్, మే 10: నగరంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి నాల్గవ డివిజన్‌లోని ప్రధాన, అంతర్గత, సర్వీస్ రోడ్లు జలమయమయ్యాయి. భారతీనగర్ నోవాటెల్ సర్వీస్‌రోడ్డు, గురునానక్ రోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ సర్వీస్ రోడ్డు, ఆటోనగర్ సమీపంలోని గమేళా బజార్‌రోడ్డులలో ఉన్న సైడ్ డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. దీంతో పలు కాలనీ ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. ఆ సమయంలో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సైడు డ్రెయినేజీల్లోని పూడిక తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం



"నేను రాజకీయాల్లోకి వచ్చింది రూ.కోట్లు సంపాదిద్దామని కాదు. సంపాదనే ముఖ్యమైతే అమెరికాలో నా కంపెనీలు చూసుకుంటే చాలు. కేవలం ప్రజల్లో ఉండాలని, ప్రజాసేవ చేయాలని మాత్రమే రాజకీయాల్లోకి వచ్చా. కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ఏడాది పనిచేశా. ఆ స్వల్ప వ్యవధిలోనే బ్యాంకును అన్ని విభాగాల్లో దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టా. ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇస్తున్నా" అని గన్నవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఓవైపు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.. ఆ వివరాలు మీకోసం..

- విజయవాడ
- ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- గన్నవరానికి బహుళజాతి ఐటీ కంపెనీలు తెస్తా
- మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి
- బ్రహ్మలింగయ్య చెరువును రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతా
- ఏలూరు కాల్వపై వంతెనల నిర్మాణం చేపడతా
- వైసీపీ ఐదేళ్లు చేసింది పాలన కాదు విధ్వంసం
- గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

ప్రచారంలో ప్రజాస్పందన ఎలా ఉంది..?

ఐదేళ్ల వైసీపీ పాలనలో విసిగి వేసారిన ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది..? ఏ గ్రామానికి వెళ్లినా అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. ప్రజల నుంచే కాదు వైసీపీ నేతల నుంచి కూడా మంచి స్పందన కనిపిస్తోంది. దానికి నిదర్శనమే ఎక్కడా లేని విధంగా పార్టీలోకి ఈ వలసలు. వైసీపీలో ఉండలేక వందలాది మంది ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు టీడీపీలోకి వస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ, ప్రతి గడపలోనూ ప్రచారం చేసిన ఘనత మా పార్టీ నేతలు, కార్యకర్తలది.

ఐదేళ్ల వైసీపీ పాలనపై జనాభిప్రాయం?

వైసీపీ పాలన అనడం కన్నా వైసీపీ విధ్వంసం అనడం సముచితం. ఈ ఐదేళ్లలో వైసీపీ చేసింది అదే. ప్రజలకు వారి సొమ్మునే పప్పులు, బెల్లాల మాదిరి పంచారు. అదీ ఓ చేత్తో ఇచ్చి మరో చేత్తో లాగేసుకున్నారు. ఓవైపు ప్రజాధనాన్ని, మరోవైపు రాష్ట్ర సంపదను వైసీపీ పాలకులు విచ్చలవిడిగా దోచుకున్నారు. ప్రజలంత అమాయకులు కాదు. ఈ ఐదేళ్లలో ఏం జరిగిందో సాధారణ వ్యక్తులు కూడా విడమర్చి చెబుతున్నారు.

కూటమి నేతల మధ్య సమన్వయం?

నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల మధ్య ఎలాంటి సమస్యలు లేవు. అందరం కలిసికట్టుగా సమన్వయంగా పనిచేస్తున్నాం. నాతోపాటు వచ్చిన క్యాడర్ కన్నా ముందు నుంచి టీడీపీని నమ్ముకున్న క్యాడర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. దీంతో క్యాడర్ కూడా ఎలాంటి అరమరికలు లేకుండా పనిచేస్తున్నారు.

ప్రత్యర్థి బలాలు, బలహీనతలు?

ప్రజలను చాలా తక్కువగా అంచనా వేయడం నా ప్రత్యర్థి నైజం. నియోజకవర్గంలో ప్రకృతి సంపదను కొల్లగొట్టి కోట్లాది రూపాయలు దోచుకుని అందులో నుంచి ప్రజలకు చిల్లర విదిల్చి తాను దానకర్ణుడిగా ప్రచారం చేసుకుంటూ ప్రజలు కూడా తన ప్రచారాన్ని నమ్ముతారని భావిస్తుంటారు. కానీ నేతలకన్నా ప్రజలే తెలివైన వారని గన్నవరం నియోజకవర్గ ప్రజలు నిరూపించే రోజు దగ్గరలోనే ఉంది.

ప్రజలకు మీరిచ్చే ప్రధాన హామీలు?

మా పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. నేను నా గన్నవరం నియోజకవర్గ ప్రజలకు చంద్రబాబు సూపర్ సిక్స్‌తోపాటు వెంకట్రావు సూపర్ సిక్స్‌ని ప్రకటిస్తున్నాను. ఆ సూపర్ సిక్స్ ఏంటంటే. నెంబర్ 1. బ్రహ్మలింగయ్య చెరువుని రిజర్వాయర్‌గా మార్చి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి తాగు, సాగునీటి సమస్యలు తొలగిస్తా, నెంబర్ 2. ఏలూరు కాల్వపై రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కులనెక్కలం, కేసరపల్లి వద్ద వంతెనలు నిర్మించి ప్రజలకు రహదారి ఇబ్బందులు తొలగిస్తా. నెంబర్ 3. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 15వేల మంది అర్హులు ఇంకా ఇళ్ల స్థలాలు లేకుండా ఉన్నారు. వారందరికీ ఇళ్లస్థలాలిచ్చే బాధ్యత తీసుకుంటా. నెంబర్ 4. మల్లవల్లి పారిశ్రామికవాడలో పూర్తిస్థాయి పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తా. తద్వారా ఇక్కడ 15వేల మందికి ప్రత్యక్షంగా మరో 5వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. నెంబర్ 5. గన్నవరంలో బహుళజాతి ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తా. నెంబర్ 6. బండారుగూడెం వద్ద పోలవరం కుడికాల్వ 137 కిలోమీటరు నుంచి ఏలూరు కాల్వ 33వ కిలోమీటరు వద్ద అనుసంధానం చేసి డెల్టా రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు రూ.15.3 కోట్ల ఖర్చుతో చేపట్టిన పథకాన్ని సత్వరమే పూర్తి చేస్తా.

బ్రదర్స్‌కు మొండిచెయ్యేనా?





- ఫ్యాను ఆగిపోయి ఉక్కపోతతో అల్లాడుతున్న వైసీపీ
- టీడీపీలోకి పెరుగుతున్న వలసలు.. కూటమి కార్యకర్తల్లో జోష్
- వైసీపీ నుంచి వెళ్లిపోయిన వారిని తిరిగి రావాలంటూ బతిమాలుతున్న బ్రదర్స్

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో మొత్తం 9 మంది ఎన్నికల కదనరంగంలో ఉండగా, ప్రధానంగా తెలుగుదేశం, వైసీపీ మధ్యనే పోటీ నెలకొంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి అనుకూల పవనాలు బలంగా వీస్తుండగా, వైసీపీ 'ఫ్యాను' ఆగిపోయి ఉక్కపోతతో విలవిలలాడుతోంది. టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు తలపడుతున్నారు. టీడీపీకి బలమైన నియోజకవర్గాల్లో నందిగామ ఒకటి. గత ఎన్నికల్లో అనూహ్యంగా వైసీపీ గెలుపొందటంతో ఖంగుతిన్న టీడీపీ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో సమన్వయంతో, రెట్టింపు ఉత్తేజంతో పనిచేస్తున్నారు. గత ఎన్నికల్లో సౌమ్య ఓడిపోవటంతో ప్రస్తుతం ఆమెపై ఓటర్లలో సానుభూతి నెలకొంది. వైసీపీకి చెందిన పలు గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, ఇటీవల మృతిచెందిన మునిపల్ చైర్మన్ భర్త మండవ పిచ్చయ్యతో పాటుగా పలువురు కౌన్సిలర్లు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరటంతో బలం పెరిగింది. క్యాడర్‌లో బాగా పట్టున్న కంచికచర్ల వైసీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, గొట్టుముక్కల మాజీ సర్పంచ్ మాజీ గుదే రంగారావుతో పాటుగా వ్యక్తిగత బలం కలిగిన ఇంకొందరు నేతలు టీడీపీలో చేరటంతో ఆయా గ్రామాల్లో వైసీపీ ఓట్లకు భారీగా గండిపడనుంది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్టు-2022పై రైతులు మండిపడుతున్నారు. ఈ చట్టం గురించి పల్లెల్లోనూ బాగా తెలియటంతో రైతుల్లో ఒక రకమైన అభద్రతాభావం నెలకొంది. వైసీపీకి ఓటు వేస్తే తమ భూములకు భద్రత లేకుండా పోతుందన్న భయం రైతుల్లో ఏర్పడటం, అధికారంలోకి రాగానే ఈ దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేస్తానని చంద్రబాబు వాగ్దానం చేయటం టీడీపీకి ప్లస్ పాయింట్‌గా మారింది. ఇక వైసీపీ విషయానికొస్తే పెద్దగా పాజిటివ్ అంశాలేవీ కనపడటం లేదు. ముఖ్యంగా ఐదేళ్లలో చెప్పుకొదగిన అభివృద్ధిగా జరగకపోవటం అధికారపార్టీకి మైనస్‌గా మారింది. దీనికితోడు ఎమ్మెల్యే జగన్మోహనరావు, ఆయన సోదరుడు ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌పై ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడీలపై వచ్చిన ఆరోపణలు ఇరకాటంగా మారాయి. గ్రామాల్లో వైసీపీ నేతలు చేసిన చిన్నా చితక పనులకు కూడా బిల్లులు రాలేదు. చేసిన అప్పులకు కనీసం వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పలువురు నేతలు లోలోపల తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పలుకుబడిన ద్వితీయ శ్రేణి నేతలు వైసీపీని వీడుతుండటం సోదరులిద్దరూ తీవ్రంగా కలవరపడుతున్నారు. రెండు రోజుల క్రితం టీడీపీలో చేరిన వైసీపీ మండల కన్వీనర్ నన్నపనేనిని బుజ్జగించేందుకు అన్నదమ్ములిద్దరూ స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి ఆరేడు గంటలు ప్రయత్నించటం చూస్తుంటే ఎన్నికల్లో వైసీపీకి ఎదురీత తప్పదంటున్నారు. ఇక ఫైనల్‌గా నగదు పంపిణీపైనే అధికార పార్టీ నేతలు ఆశలు పెట్టుకున్నట్టుగా తెలుస్తోంది, ఏది ఏమైనా కూటమి అభ్యర్థి సౌమ్య పరిస్థితి మెరుగ్గా ఉందన్న అభిప్రాయం నెలకొంది.

ఎంతకు తెగించారు..!

- ఫేక్ ఆడియోతో అడ్డంగా దొరికిన వైసీపీ ముఠా
- కులాల మధ్య చిచ్చుతో ఓట్లు దండుకునే యత్నం
- ఇద్దరు టీడీపీ వాళ్లు మాట్లాడుకున్నట్లు సోషల్ మీడియాలో వైరల్
- నిజం బయటపడటంతో నెత్తీనోరు బాదుకుంటున్న ఫేక్ ముఠా

మైలవరం, మే 10: వైసీపీ ఫేక్ ముఠా ఓట్లు దండుకునేందుకు అనేక కుయుక్తులు పన్నుతోంది. కులాల మధ్య చిచ్చుపెట్టి తన అభ్యర్థిని గెలిపించుకునే యత్నంలో అడ్డంగా దొరికిపోయింది. గురువారం ఇద్దరు అగ్రవర్ణాలకు చెందిన టీడీపీ నేతల ఫోన్ సభాషణ అంటూ వైసీపీ ఫేక్ ముఠా సోషల్ మీడియాలో టీడీపీ ఆడియో లీక్డ్ అని విపరీతంగా ట్రోల్ చేశారు. అందులో ఎస్సీలను, బడుగులను తిడుతూ టీడీపీకి అనుకూలంగా మాట్లాడినట్టు పెట్టారు. అసలు ఆ ఆడియోలో ఉన్న వ్యక్తులు ఎవరు, ఎక్కడ జరిగిందీ సంభాషణని టీడీపీ వాళ్లు ఎంక్వైరీ చేయగా అది కాస్త వైసీపీ ఫేక్ బ్యాచ్ పని అని తేలిపోయింది. వసంత ఏ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తే ఆ గ్రామంలో పెద్ద ఎత్తున ఎస్సీ, బీసీ, ముస్లిం, మైనార్టీ వర్గాలు, చివరకు రెడ్డి సామాజిక వర్గం వారు చేరుతుండటంతో వైసీపీ ఫేక్ బ్యాచ్‌కి దిమ్మతిరిగిపోయి ఏం చేయాలో తెలియక చివరకు కులాల మధ్య చిచ్చు పెట్టే కార్యక్రమానికి తెర లేపారు. నిన్న మొన్నటి వరకు మైలవరం వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు గురించి ఊదరగొట్టిన సామాన్యుడు, మీ కులపోడు, మీలో ఒకడు, స్థానికుడు అనే నినాదాల వల్ల ఏమాత్రం ఫలితం లేకపోవడంతో ఎస్సీ, బీసీలను తిట్టినట్టు సృష్టిస్తే ఫలితం ఏమైనా ఉంటుందని వైసీపీ ఫేక్ టీమ్ వేసిన ఎత్తుగడ కాస్త అట్టర్‌ప్లాప్ అయ్యింది. చివరకు ఆ ఆడియో ఫేక్ అని తేలిపోయింది. సోషల్ మీడియాలో ఎదుటి పార్టీపై వైసీపీ వాళ్లు చేసే విష ప్రచారం అంతా ఇంత కాదు. ఇప్పటి వరకు వైసీపీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని బజారుకీడ్చిన వారు ఇప్పుడు ఫేక్ ఆడియోలకు తెరలేపారు. ఎన్నికలయ్యే లోపు వైసీపీ వాళ్లు మైలవరంలో ఇంకా ఎన్ని కుయుక్తులు, అగాయిత్యాలకు పాల్పడతారో వేసి చూడాలి.

బిల్లులు చెల్లించండి..!
వైసీపీ ప్రచార వాహనంలో ట్రాన్స్‌కో ప్రకటన!

జగ్గయ్యపేట: మండలకేంద్రం పెనుగంచిప్రోలులో వైసీపీ ద్విచక్రవాహనంతో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో కరెంటు బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు ప్రకటన చేయటం విస్మయం కలిగించింది. పెనుగంచిప్రోలు పాత సినిమాహాలు సెంటర్‌లో కరెంటు బిల్లులు కట్టించుకొనబడనని, అక్కడ చెల్లించాలని విన్నవించారు. అంతేనా బిల్లులు వచ్చిన 14రోజుల్లో చెల్లించ కపోతే సర్‌చార్జి పడుతుందని హెచ్చరించటం విశేషం. ప్రభుత్వం తరపున వైసీపీ ప్రచారమా లేక వైసీపీ నేతలే ప్రభుత్వం తరపున ప్రచారం చేస్తున్నారా అని చర్చించుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఇది వైరల్‌గా మారింది.



కరెంటు బిల్లులు చెల్లించాలని ప్రచారం చేసిన పెనుగంచిప్రోలు వైసీపీ ద్విచక్ర ప్రచార వాహనం

అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్..!

- గెలుపోటములపై సమాలోచనలతో పెరుగుతున్న బీపీ
- గ్రామాల్లో జోరుగా ప్రారంభమైన నగదు పంపిణీ.. రూ.1500 నుంచి రూ.2వేల వరకు

పామర్రు: పోలింగ్ సమీపిస్తున్న వేళ బరిలో ఉన్న అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. బరిలో ఉన్న నేతల రాజకీయ భవితవ్యంపై ఓటర్లు తమ నిర్ణయాన్ని ఓటురూపంలో ఈవీఎంలో నిక్షిప్తం చేయనున్నారు. ప్రచారాలు బహిరంగ సభల ద్వారా జనాల్లోకి వెళ్లినప్పటికీ తమకు ఓట్లు పడతాయో లేదోనని అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఉన్న ఏకైక ఎస్సీ నియోజకవర్గమైన పామర్రులో ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రధానంగా పోటీలో నిలబడ్డారు. పోలింగ్‌కు 4 రోజుల ముందునుంచే గ్రామాల్లో ప్రధాన పార్టీలు నగదు పంపిణీ చేపట్టాయి. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.2వేల వరకు పంచారు. పెద్దమొత్తంలో నగదు పంపిణీ చేసినప్పటికీ అభ్యర్థుల్లో ఏదో తెలియని భయం వెంటాడుతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటరు నాడిని పసి గట్టడం పార్టీలకు ఎంతో కష్టంగా మారిందని ఆయా నేతల నుంచే వినిపిస్తోంది. ఓటర్లు పార్టీలిచ్చే డబ్బులు తీసుకుంటూనే ఓటుపై సష్టమైన హామీని మాత్రం ఇవ్వడం లేదని తెలుస్తోంది. దీంతో డబ్బు తీసుకున్నవారంతా ఓటు వేస్తారో లేదోనన్న టెన్షన్ అభ్యర్థులను పట్టుకుని పీడిస్తోంది. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మరోసారి పోటీలో ఉండగా, ఎన్డీయే కూటమి బలపరచిన టీడీపీ నుంచి వర్ల కుమార్ రాజా గట్టిపోటీ ఇస్తున్నారు. దీంతో నువ్వానేనా అన్నట్టుంది అక్కడి వాతావరణం. పైగా మెజార్టీ ఓటర్లు కుమార్‌రాజా వైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. పైగా సర్వేలు కూడా అనుకూలంగా రావడంతో ఎవరు గెలుస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పైగా కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే డీవైదాస్ బరిలో ఉండటంతో ఈయన ఎవరి ఓట్లు చీలుస్తారనేది అంతు చిక్కకుండా ఉంది. పైగా ఆయన తానే గెలుస్తానని మంచి ఉత్సాహంతో ఉన్నారు. ఈక్రమంలో ప్రధాన పార్టీల మధ్య పోరు మరింత ఉత్కంఠభరితంగా మారింది.



తలరాతలు మార్చే శక్తి ఓటుకే ఉంది..!

మన తలరాతలు మార్చే ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తన ఓటు కొనగలిగే ధనవంతుడు ఈ రాష్ట్రంలోనే లేడని తెలుపుతూ బర్రె లెనిన్ సీపీఎం నేత చేస్తున్న విజ్ఞప్తి స్థానికులను ఆలోచింపజేస్తోంది. బాపులపాడు మండలంలోని బండారుగూడెంకు చెందిన సీపీఎం నేత బర్రె లెనిన్ ఓటును అమ్ముకోవద్దంటూ అంబేద్కర్ చెప్పిన మాటలను ఒక ప్లకార్డుపై రాసి దాన్ని ప్రదర్శిస్తూ శుక్రవారం గ్రామంలో వినూత్నంగా ప్రచారం చేశారు. నిజాయితీపరులను, అభివృద్ధి చేయగలిగే వారిని మాత్రమే అసెంబ్లీకి పంపిస్తే వారు ప్రజాసమస్యలపై పోరాడగలరని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- హనుమాన్‌జంక్షన్ రూరల్



అత్యంత ప్రమాదకరంగా రోడ్డు

మాజీ మంత్రివర్యా...

ఇంకెన్నాళ్లీ తిప్పలు?

గుడివాడ-కంకిపాడు రోడ్డుకు మోక్షమెప్పుడు..?

గుడివాడ: గుడివాడ-విజయవాడ వయా కంకిపాడు రహదారి నిత్యం వాహనాల రద్దీతో ఉంటుంది. చెరోవైపు కాలువలు ఉండటంతో రోడ్డు కోసుకుపోయి అధ్వాన్నంగా మారింది. నిత్యం ప్రమాదాలతో రక్తమోడుతోంది. 20 ఏళ్లుగా నానీ అదిగో ఇదిగో నాకు అధికారం లేదంటూ సాకులు చెబుతూ గెలుస్తూ వచ్చాడు. ఈ దఫా మంత్రి కూడా అయ్యారు. ఈ ఐదేళ్లుగా ఇదిగో చేపడతాం.. అదిగో చేపడతాం అంటూ వైసీపీ ఎమ్మెల్యేలు చెప్పిన మాటలు ఇక వినేది లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెన్నాళ్ల ఈ తిప్పలని వాపోతున్నారు. గుడివాడ-కంకిపాడు వరకు ఉన్న రహదారి గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల గుండా 23 కిలోమీటర్లు దాటాల్సి ఉంది. ఈ నాలుగు నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలే ప్రాతినిత్యం వహిస్తున్నారు. ఒక్కరంటే ఒక్కరు కూడా చొరవ తీసుకునే ప్రయత్నం చేయలేదు. ఈ రహదారిలో ప్రయాణమంటే ద్విచక్రవాహనదారులతో పాటు ఆటో, బస్సు డ్రైవర్లు కూడా బెంబేలెత్తిపోతున్నారు. రహదారి ఛిద్రమై ప్రయాణం నరకప్రాయంగా మారిం ది. ప్రయాణికులు ప్రత్యక్ష నరకమంటే ఏంటో రుచి చూస్తున్నారు. ఈ గుంతల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అంగవైకల్యానికి గురైన వారు మరెందరో..! ఇటీవల పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ శివారులోని పౌల్ట్రీ ఫాం వద్ద గుంతల్లో పడి ఆటో తిరగబడి డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ రహదారిపై ఇటువంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉంటాయి.



శ్రీశ్రీశ్రీ నానీ బాబా..!

గతంలో ఎవరిని పడితే వారిని బూతులతో విమర్శించి.. నేడు అత్యంత సౌమ్యుడిలా భక్తులకు వరాలిచ్చే బాబాలా మారిపోయారు. ఆయన అడుగేస్తే పాలాభిషేకాలు, పాదాభివందనాలు, పూల రహదారులే..



పూలబాటపై నడుస్తున్న నాని



నానికి పాదాభివందనం చేస్తున్న వైసీపీ కార్యకర్త



నాని పాదాలకు పాలాభిషేకం చేస్తున్న పార్టీ మహిళ కార్యకర్త



- గతుకుల దారుల్లో ప్రజలు.. పూలబాటలో నాని
- మొన్న పాలాభిషేకాలు.. నిన్న పాదాభివందనాలు.. నేడు పూలతో రహదారి
- గుడివాడలో పుట్టుకొచ్చిన మరో బాబా
- ఏందయ్యా నానీ.. ఏంటీ ఈ వింత లీలలు

గుడివాడ: కొడాలి నాని.. ఈ పేరు వింటే బూతులే గుర్తొస్తాయి. దాదాపు 20 ఏళ్ల నుంచి శాసనసభ్యుడిగా, మంత్రిగా ఉన్న నానీ తన నియోజకవర్గంలోని గ్రామాల్లో ఒక్క రోడ్డు వేసింది లేదు. గతుకుల, గుంతల రోడ్లతో నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదు. ఎన్నికల ప్రచారంలో మాత్రం తనదైన పీట్లతో ప్రజలను ఆశ్చర్యచికితులను చేస్తున్నారు. మొన్న మహిళా కార్యకర్తతో పాదాలకు పాలాభిషేకం చేయించకున్న నానీ ఇటీవల నామినేషన్‌కు వెళ్లి వస్తూ యువకుడితో పాదాభివందనం చేయించుకున్నాడు. నేడు ఏకంగా మండలంలోని బొమ్ములూరు గ్రామంలో తన కార్యకర్తలతో పూల రహదారి ఏర్పాటు చేయించుకుని నడిచి బాబా అవతారమెత్తారు. ఒక్కో సమయంలో ఒక్కో అవతారం ఎత్తుతూ బాబాలనే మించిన అవతార్ బాబాగా పేరు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి విచిత్రాలు కేవలం నానికే మాత్రమే సాధ్యమయ్యాయి.

షర్మిల దూకుడు!

వివేకా హత్య కేసులో అన్న, తమ్ముడితో చెడుగుడు

కడపలో శరవేగంగా మారుతున్న రాజకీయం

జగన్ శిబిరం ఉక్కిరిబిక్కిరి.. అయోమయంలో అవినాశ్‌రెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి)

కడపలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు అందరిలోనూ ఆసక్తిని పెంచాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు అటు ఢిల్లీ గడ్డ సైతం అటు వైపే చూస్తోంది. ప్రాంతీయ మీడియాతో పాటు జాతీయ మీడియా సైతం కడప బాట పడుతుండడం అక్కడి పరిస్థితిని తెలియజేస్తోంది. సీఎం జగన్ సోదరి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కడప ఎంపీ స్థానానికి బరిలో దిగారు. ఇదే స్థానానికి వైసీపీ నుంచి వరుసకు జగన్/షర్మిలకు సోదరుడు, సిటింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పోటీ చేస్తుండగా, టీడీపీ నుంచి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి బరిలో ఉన్నారు. అయితే ఇక్కడ షర్మిల దూకుడు మామూలుగా లేదు. చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య కేసులో అన్నను, తమ్ముడిని చీల్చి చెండాడుతున్నారు. నిందితుడైన అవినాశ్ అండ్ కోను జగన్ వెనకేసుకురావడం వెనుక మర్మమేంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి ఆమె వెంట తిరుగుతూ తండ్రి హత్యకు న్యాయం చేయాలని ప్రజలను అడుగుతున్నారు. షర్మిల కొంగుపట్టి న్యాయం అర్థించడం జనంలో ఆలోచన రేపుతోంది. ఆమె వాగ్ధాటి, చొచ్చుకు పోతున్న తీరు జగన్‌ను కలవరపరుస్తున్నాయి. మరోపక్క అవినాశ్‌రెడ్డి దిక్కుతోచక అయోమయంలో పడిపోయారు.



పీసీసీ చీఫ్‌గా వచ్చీ రాగానే..

అవినాశ్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ షర్మిల ప్రచారం వైసీపీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రజలపైన, వారి ఓటింగ్‌పైన ఆమె చూపించే ప్రభావం కడప లోక్‌సభ స్థానానికే పరిమితం కాబోదని.. అసెంబ్లీ సీట్లపైనా పడితే వైసీపీ అభ్యర్థులకు కష్టాలు తప్పవన్న భయం వారిలో కనబడుతోంది. షర్మిల పీసీసీ చీఫ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఇడుపులపాయ వచ్చినప్పుడు, అభ్యర్థుల జాబితా ప్రకటించినప్పుడు, వివేకా వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమానికి వచ్చినప్పుడూ.. వివేకా హత్య కేసులో నిందితులను జగన్ కాపాడుతుండడం, అవినాశ్‌రెడ్డి గురించి చెప్పుకొచ్చారు. కడప ఎంపీగా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించాక జిల్లా అంతటా ఆమె బస్సు యాత్ర చేపట్టారు. ఈ నెల 1 నుంచి జిల్లాలో రెండో విడత ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. 'చిన్నాన్నను చంపించింది అవినాశ్‌రెడ్డే. అతడు అరెస్టు కాకుండా కాపాడుతున్నది సీఎం జగన్‌రెడ్డే. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడు, సొంత బాబాయి అయిన వివేకాను హత్య చేస్తే జగన్‌కు బాధ లేకుండా హంతకుల పక్క ఉంటున్నాడు' అని ఆమె ఊరూవాడా విరుచుకుపడుతున్నారు. ఇదే సమయంలో జిల్లా అభివృద్ధిపైనా నిలదీస్తున్నారు.

వన్ మేన్ ఆర్మీ..

షర్మిల సభలకు జనం కూడా బాగా తరలివస్తున్నారు. జిల్లాలో బలమైన నాయకులు, కేడర్ లేకున్నా ఆమె వన్‌మేన్ ఆర్మీగా తిరుగుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపుతున్నారు. అగ్నికి ఆజ్యం తోడైనట్టు సునీత, ఆమె తల్లి సౌభాగ్యమ్మ కూడా షర్మిల వెంట నడుస్తున్నారు. సునీత పులివెందుల మొత్తం ఓ మారు చుట్టేశారు. షర్మిలను ఎంపీగా చూడాలన్నది నాన్న చివరి కోరిక అనే విషయాన్ని జనంలోకి బాగా తీసుకెళ్లారు. ఇక షర్మిల పదునైన విమర్శలతో జగన్, అవినాశ్‌రెడ్డిలపై విరుచుకుపడుతున్నారు. 'సొంత చిన్నాన్న గురించి జగన్ ఒక్కరోజైనా మంచి మాట మాట్లాడారా..? వివేకా వ్యక్తిగత జీవితాన్ని హననం చేసేలా సొంత పత్రికలో కథనాలు, సోషల్ మీడియాలో రాక్షసమూక ట్రోల్ చేస్తోంటే ఏం చేస్తున్నారు' అంటూ ఆమె వేస్తున్న ప్రశ్నలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.

జగన్ శిబిరంలో వణుకు..

షర్మిల సభలకు జనం స్వచ్ఛందంగా తరలిరావడం జగన్ శిబిరానికి వణుకు పుట్టిస్తోంది. మొన్నటిదాకా గెలుపు ఏకపక్షమని సంబరపడ్డారు. ఇప్పుడు ఆమె దూకుడు చూసి వారికి మైండ్ బ్లాక్ అవుతోంది. రాజశేఖర్‌రెడ్డి బాడీ లాంగ్వేజ్, హావభావాలు షర్మిలలో కనిపిస్తాయి. జనాన్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం, మాట్లాడడం అచ్చం ఆయన్ను తలపిస్తోంది. అందుకే తక్కువ వ్యవధిలోనే జిల్లావాసులకు ఆమె బాగా చేరువయ్యారు. పార్టీలకతీతంగా అభిమానిస్తున్నారని వైసీపీ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. అటు వైఎస్ అభిమానులు, ఇటు వివేకా అభిమానులు, జగన్ శిబిరాన్ని వ్యతిరేకించే వైసీపీ నేతలంతా ఆమెకే మద్దతివ్వడం జగన్ శిబిరాన్ని టెన్షన్ పెడుతోంది.

పులివెందులలో చెరొక ఓటు!!

జగన్‌పైన, వైసీపీపైన షర్మిల ఎఫెక్ట్ మామూలుగా ఉండేటట్లు లేదు. కడప, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, జమ్మలమడుగులో ఆ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. పులివెందులలో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కొంత మంది మహిళలను ప్రశ్నిస్తే ఒక ఓటు రాజశేఖర్‌రెడ్డి కొడుకు, మరో ఓటు ఆయన కూతురికని చెబుతుండడం జగన్ శిబిరానికి మింగుడుపడడం లేదు. జిల్లాలో ముస్లిం ఓట్లు కూడా గణనీయంగా ఉన్నాయి. వీరు షర్మిల వైపు మొగ్గుచూపుతారని ప్రచారం సాగుతోంది. ఏతావాతా తమ ఓట్లకే భారీగా గండి పడే పరిస్థితి నెలకొనడం వైసీపీని కలరవపాటుకు గురిచేస్తోంది.

నోటా నుంచి గెలిచేస్తారనే దాకా..

కడప పార్లమెంటు నుంచి షర్మిల పోటీ చేస్తున్నట్లు ప్రకటించగానే.. మొదట్లో ఆమె మూడో స్థానానికి పరిమితమవుతారని.. వైసీపీ ఓట్లు చీల్చేస్తారని.. టీడీపీ లాభపడుతుందని అందరూ భావించారు. స్వయంగా జగనే మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన చోట నిలబడ్డారని ఆమెను ఎద్దేవా కూడా చేశారు. అయితే జిల్లాలో షర్మిల రెండో విడత ప్రచారం తర్వాత అంచనాలు తలకిందులయ్యాయి. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు షర్మిలకే ఓట్లు వేశారని అంటున్నారు. మహిళలు, క్రిస్టియన్, ఎస్సీ ఎస్టీ వర్గాల్లో ఆమెపై సానుకూలత కనబడుతోంది. ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే షర్మిలే గెలిచే సూచనలు ఉన్నాయనే టాక్ జనాల్లోకి బలంగా వెళ్లింది.

సెంటిమెంటు పండుతుందా..?

షర్మిల రాకముందు పోటీ టీడీపీ, వైసీపీ మధ్యే ఉంది. జమ్మలమడుగుకు చెందిన భూపేశ్‌రెడ్డి మొదటిసారి టీడీపీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈసారి ఆ పార్టీ పుంజుకుంది కూడా. అయితే అభ్యర్థి ఎంపిక బాగా ఆలస్యమైంది. దీంతో పాటు వివేకా హత్య ప్రధాన అస్త్రంగా మారింది. 'అమ్మా.. ఆడబిడ్డలు పుట్టింటికి వస్తే చీరసారె ఇచ్చి పంపిస్తాం. మీ ఆడబిడ్డలు పుట్టింటికి వచ్చి న్యాయం అడుగుతున్నారు. న్యాయం చేసేందుకు మీ అందరికీ సమయం వచ్చింది. అందరం కలిసి షర్మిలకు ఓట్లు వేద్దాం. మీ అందరి ఓట్లతో షర్మిల కొంగు నింపండి' అంటూ సౌభాగ్యమ్మ అర్థించడం.. పార్టీలకతీతంగా అందరినీ ఆలోచింపజేస్తోంది. ఈ సెంటిమెంటు బాగానే పనిచేస్తోందని.. పోటీ అవినాశ్, షర్మిల మధ్యే ఉన్నట్లు ప్రస్ఫుటంగా కనిపిస్తోందని అంటున్నారు. షర్మిల దూకుడు ప్రభావాన్ని తగ్గించేందుకు జగన్ కూడా జిల్లాలో నాలుగు బహిరంగ సభలు పెట్టారు.

నీకోసం త్యాగం చేశానని

బైబిల్‌పై ప్రమాణం చేస్తా

- నేను డబ్బు, పోస్టు అడిగానని ప్రమాణం చేయగలరా?
- పెయిడ్ ఆర్టిస్టులకు కుక్క బిస్కెట్లు వేసి మరీ నాపై నిందలు వేశారు
- మీడియా సమావేశంలో భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టిన షర్మిల

కడప, మే 10(ఆంధ్రజ్యోతి): 'నీకోసం నేను త్యాగం చేశానని బైబిల్ మీద ప్రమాణం చేస్తా.. నేను డబ్బు, పోస్టు అడిగానని మీరు ప్రమాణం చేయగలరా..? నేను అడిగినట్లు రుజువు చేయగలరా?' అని పీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలరెడ్డి తన సోదరుడు వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం కడప డీసీసీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇటీవల జగన్ ఒక టీవీ చానెల్‌లో ఇంటర్వ్యూ ఇస్తూ చాలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. నాకు రాజకీయ కాంక్ష ఉన్నదుకే వైఎస్ కుటుంబంలో విభేదాలు వచ్చినట్లు వ్యాఖ్యానించారు. నాకు రాజకీయ కాంక్ష ఉంది కాబట్టి దానిని ఎంకరేజ్ చేస్తే అది నెపోటిజంకు, కరప్షన్‌కు దారితీస్తుంది కాబట్టి ఇవే కుటుంబంలో భేదాలు రావడానికి కారణమన్నట్లు చెప్పారు. అసలు నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది ఎవరు? మీకు ఎప్పుడు అవసరమైతే ఆ అవసరానికి.. సమైక్యాంధ్ర కోసం అయితేనేమి, తెలంగాణలో ఓదార్పు యాత్ర అయితేనేమి, బైబై బాబు క్యాంపెయిన్ అయితేనేమి.. ఇలా ఎప్పుడు అవసరమైతే అప్పుడు పనికొచ్చింది నేను కాదా? నిన్ను ముఖ్యమంత్రిని చేసే వరకు నేను చేసింది త్యాగం. వైఎస్సార్ సంక్షేమ పాలన తీసుకొస్తారని నేను త్యాగం చేసిన మాట వాస్తవం కాదా?..' అని జగన్‌ను షర్మిల నిలదీశారు.

నన్ను నెపోటిజం అంటారా...

'మనిషిని మనిషిగా గుర్తించడం వైఎస్సార్ నుంచి మీకు ఎందుకు రాలేదు. వైఎస్సార్ హృదయంలో హృదయంగా పెరిగా. వైఎస్సార్ ఆశయాలు కొనసాగాలని కోరుకున్నా. మీకోసం నా జీవితాన్ని త్యాగం చేశా. నీకోసం నేను నిలబడ్డా, రాజకీయాల కోసం నన్ను నెపోటిజం అంటారా..' అని గద్గద స్వరంతో ఆమె ప్రశ్నించారు. పెయిడ్ ఆర్టిస్టులకు కుక్క బిస్కెట్లు వేసి మరీ నిందలు వేశారంటూ భావోద్వేగానికిలోనై కన్నీరు పెట్టారు. 'రాజారెడ్డి, జయమ్మ, సౌభాగ్యమ్మ, వివేకా అందరూ రాజకీయాల్లో ఉన్నారు. వీరంతా ఒకే జనరేషన్‌కి చెందినవాళ్లు.. అప్పుడు లేదా నెపోటిజం. ఇప్పుడు మీరు ఒకే జనరేషన్ వాళ్లు రాజకీయాల్లో ఉండొద్దు అంటారు.. ఇప్పుడు రవీంద్రనాథ్‌రెడ్డి, తమ్ముడు అని నెత్తిన పెట్టుకొని తిరిగే అవినాశ్‌రెడ్డి, భారతి అందరూ ఉన్నారు కదా.. వీళ్లను నెపోటిజం అనరా? మీరు వైఎస్సార్ కొడుకు అని ఎందుకు మరచిపోతున్నారు.. మీ మానసిక స్థితి బాగాలేదు.' అని షర్మిల వ్యాఖ్యానించారు.

దొంగ మాటలు పిచ్చోళ్లు నమ్ముతారు

మీకు విలువఉంటే అవినాశ్‌రెడ్డి మీద అనుమానం ఎందుకు రాలేదు? హార్ట్ అటాక్ అని ఎందుకు వార్త నడిపారు? అవినాశ్‌రెడ్డి పిల్లోడంట, నాలుగు ఇంటర్వ్యూలు ఇచ్చాడట, అవి చూసి అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని కన్విన్స్ అయ్యాడట.. కన్విన్స్ అవడానికి నువ్వు ఎవరు? నువ్వు ఏమైనా రాజ్యాంగమా? చట్టమా? కన్విన్స్ అవ్వాల్సింది న్యాయవ్యవస్థ. సీబీఐ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అన్నీతెలిసి కూడా కన్విన్స్ అయ్యాడని బుకాయిస్తున్నాడు. మీకు విశ్వసనీయత ఉంటే హోదా ఎందుకురాలేదు? పోలవరం కట్టలేదేం? కడపలో స్టీల్ ప్లాంట్ ఎందుకు కట్టలేదు? వైఎస్సార్ తర్వాత ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదు. నిర్దోషులు అయితే సీబీఐకి ఎందుకు తప్పించుకుని తిరుగుతున్నారు? దొంగ ఎప్పుడైనా దొంగ అని చెబుతాడా? దొంగ మాటలు పిచ్చోళ్లు నమ్ముతారు.. అంటే ఇక్కడ జగన్ పిచ్చోడు కాదా?.



ఇవేనా మీకున్న విలువలు

'మీకు ఏ విలువలు ఉన్నాయో సమాధానం చెప్పాలి. వైఎస్సార్ మరణంలో రిలయన్స్ హస్తం ఉందని చెప్పింది ఈ జగన్ కాదా? వాళ్ల ఆస్తులు ధ్వంసం చేయించలేదా? అధికారంలోకి వచ్చాక వాళ్లకు ఎంపీ పదవులు ఇచ్చారు. ఇదేనా నీకున్న విలువ? మీకు ఎలా వీలయితే అలా మాట్లాడతారా.. వివేకా హత్య విషయంలో సీబీఐ విచారణ అడిగారు, ముఖ్యమంత్రి అయ్యాక విచారణ వద్దు అన్నారు. ఇదేనా మీకున్న విలువ? అవసరానికి మాట మారుస్తారా? వైఎస్సార్ పేరును కాంగ్రెస్ చార్జిషీట్‌లో చేర్పించలేదు. మీరే ఒక మనిషిని పెట్టి కోర్టుల్లో కేసులు వేయించారు.. పొన్నవోలు సుధాకర్‌రెడ్డితో పిటిషన్ వేయించింది మీరు కాదా? ఆయనకు మీరు పదవి ఇవ్వలేదా? మీకు విలువ ఉంటే వైఎస్సార్ పేరును చార్జిషీట్‌లో పెట్టించిన వాళ్లకు ఎలా పదవులు ఇస్తారు? మీ పేపర్‌లో పైన వైఎస్సార్ ఫొటో, కింద వివేకా మీద తప్పుడు ప్రచారం.. ఇదేనా మీ విలువ?

అవినీతి చక్రవర్తి జగన్: షర్మిల

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతా పెరుగుతున్న అవినీతి కేన్సర్‌లా విస్తరిస్తూ ప్రజలను మింగేస్తోందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. తమరు(జగన్)అవినీతి చక్రవర్తి అయితే ఇక మీ అనుచరగణం, అధికార యంత్రాంగం నీతిగా ఉంటారా అని ప్రశ్నించారు. న్యాయ నవ సందేహాల పేరుతో సీఎం జగన్‌కు ఆమె వరుసగా బహిరంగ లేఖలు సంధిస్తున్నారు. 1) ఇదివరకెన్నడూ లేని రీతిలో ఏపీలో సహజ వనరులు దోపిడీకి గురవుతున్నా తమరెందుకు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు?2) పర్యావరణ అనుమతులు లేకుండా నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువుల్లో అక్రమంగా ఇసుక తరలింపు జీవ వైవిధ్యానికి ప్రమాదమని దేశ సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించినా ఎందుకు ఆపడం లేదు? 3) ఇసుక దందాల్లో లేని ఒక్క ఎమ్మెల్యేను వైసీపీలో చూపగలరా? 4) హరిత ట్రైబ్యునల్ మార్గదర్శకాలను పట్టించుకోకుండా జరుగుతున్న ఇసుక దోపిడీకి సీఎంగా మీరు బాధ్యులు కారా? 5) జేపీ పవర్ వెంచర్స్ ఆధ్వర్యంలోని 18 రీచ్‌లను పరిశీలించి, వీటన్నింటా అక్రమాలు జరుగుతున్నాయని ఎన్జీటీ రూ.18కోట్ల జరిమానా విధించడం నిజం కాదా? 6) పౌరుల సర్వ భూ హక్కులను ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా అధికారికంగా గుప్పిట్లో పెట్టుకోవాలనుకుంటున్న మిమ్మల్ని మళ్లీ ఎందుకు గద్దెనెక్కించాలి? 7) మద్యం తయారీ, సరఫరా, పంపిణీ, అమ్మకాన్ని మీ గుప్పిట్లో పెట్టుకుని రూ.30వేలకోట్లు అనధికారికంగా దోచుకున్న వాస్తవాన్ని కాదనగలరా?8)గత ప్రభుత్వ విద్యుత్తు ఒప్పందాలు రద్దుచేసి, అదే లైన్లో మీ అస్మదీయులతో ఒప్పందాలు కుదుర్చుకోవడమే కాకుండా వారికి అప్పనంగా సర్కారు భూములు అప్పగించడం వెనుక మతలబు ఏమిటి? 9) అదానీకి మేలు చేసేవిధంగా 7వేల మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి ఒప్పందాల్లో తమరికి ముట్టిన ముడుపులెంత?...

భారతి.. నన్ను నరికేస్తారో..

షర్మిలను నరికేస్తారో?



- మాకు ప్రాణహాని ఉంది.. అన్నిటికీ తెగించి పోరాడుతున్నాం
- నా పిల్లలకు వీలునామా రాసి వచ్చా
- సింగిల్ ప్లేయర్‌గా ఉండాలనే వివేకా హత్య
- వివేకా కుమార్తె సునీత సంచలన వ్యాఖ్యలు

ప్రొద్దుటూరు, మే 10: 'భారతి నన్ను నరికేస్తారో.. షర్మిలను నరికేస్తారో తెలియదు. సింగిల్ ప్లేయర్‌గా ఉండాలంటే అదొక్కటే వాళ్లకు అవకాశం. నేనైతే నా పిల్లలకు వీలునామా రాసి వచ్చాను. అన్నీ తెగించే మీ ముందుకొచ్చాను. పులివెందులలో సింగిల్ ప్లేయర్‌గా అవినాశ్ ఉండాలని వివేకాను దారుణంగా చంపేశారు' అని ఆయన కుమార్తె డాక్టర్ సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. భారతి మళ్లీ అదే మాటలు అంటోందంటే మళ్లీ హత్యలు చేయడానికి వాళ్లకు ప్లానుందా అని ప్రశ్నించారు. అవినాశ్‌కు ఎప్పటికైనా సమస్య సృష్టిస్తారేమోనని, జగన్‌ను ఎదిరించగల సత్తా ఉందనే భయంతోనే వివేకాను హత్య చేశారని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ అదే మాట్లాడుతున్నారంటే.. వారికి ఇంకో ప్లాన్ ఉన్నట్లుందని ఆరోపించారు. తనకు, తన భర్తకు ఎప్పుడైనా ఏమైనా కావచ్చని సునీత ఆందోళన వ్యక్తం చేశారు. 'మేము ప్రొటెక్షన్ తీసుకోవాల్సిందే. సీబీఐకి తెలుసు... స్థానిక పోలీసులకు తెలుసు, నాకైతే పోలీసుల నుంచి సీరియస్ ఆదేశాలొచ్చాయి. నా ప్రతి కదలికలు తెలపాలని, నాకు ప్రమాదం ఉందని చెప్పారు. ప్రస్తుతం నాకు ఒన్ ప్లస్ ఒన్ భద్రత కల్పించారు' అని సునీత తెలిపారు. అవినాశ్‌రెడ్డి ఇంటర్వ్యూలో చెప్పింది విని, ఆయన్ను నమ్ముతున్నానని జగన్ చెప్పారని, మరి చెల్లెలు చెప్పింది ఎందుకు నమ్మరని ప్రశ్నించారు. కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా చేశారని, బాధితురాలిగా ముఖ్యమంత్రి అయిన మీకు లెటర్ పెట్టినా సమాధానం లేదని ఆరోపించారు. చిన్నాన్న హత్య కేసులో నీకు కొడుకుగా బాధ్యత లేదా అని సునీత ప్రశ్నించారు. 2021లో అసెంబ్లీలో అవినాశ్‌రెడ్డికి క్లీన్‌చిట్ ఇచ్చారని, మీకు కావాల్సినప్పుడు ఎలాగైనా మాట్లాడతారా అన్నారు. సీబీఐ కోర్టుకు చెప్పిందే తాను కూడా చెబుతున్నానని, అయితే జగన్ మాత్రం నిందితులు చెప్పింది నమ్మి వాళ్లను సమర్థిస్తున్నారని వాపోయారు. చెల్లెలికో న్యాయం, తమ్ముడికో న్యాయం అంటున్నారని, ఇదేమన్నా సీఎం పర్సనల్ ఎజెండానా అని సునీత ప్రశ్నించారు. ఇది లా అండ్ ఆర్డర్ సమస్యని, మీరు న్యాయంవైపు ధర్మంవైపు ఉండాలని సూచించారు. 'నేను చేసేది న్యాయ పోరాటం. సీబీఐ వారు సాక్ష్యాలు ఇచ్చారు కదా. ఏపీ హైకోర్టు విచారణను సుప్రీంకోర్టు తెలంగాణకు ఎందుకు బదిలీ చేసింది? ఇవన్నీ మీకు కనిపించవు. నిందితుడు మాత్రం నిర్దోషిగా కనపడతారు' అని సునీత మండిపడ్డారు. 'కడప ఎంపీ ఎన్నికలు పార్టీలకు సంబంధించినవి కావు.. న్యాయానికి, నిందితుడికి మధ్య జరుగుతున్నవి. ఒకపక్క నిందితుడు ఉన్నాడు మరోవైపు షర్మిల ఉన్నారు. షర్మిలను ఎంపీని చేయాలని వివేకా అనుకున్నారు. అది నేరవేర్చాలనే ముందుకు వెళుతున్నా. సౌభాగ్యమ్మ పసుపు కుంకుమలు తుడిచేసిన వారికి పులివెందుల, కడప ప్రజలు మద్దతు ఇవ్వరనే నమ్మకం ఉంది. అందుకే షర్మిలకు హస్తం గుర్తుకు ఓటేయమని కోరుతున్నా' అని ప్రజలకు సునీత విజ్ఞప్తి చేశారు.

శివశంకర్‌రెడ్డిని పులివెందులకు

అనుమతించొద్దు

- సాక్షులను ప్రభావితం చేస్తారు
- సీబీఐ కోర్టులో దర్యాప్తు సంస్థ వాదనలు
- ఏకీభవించిన కోర్టు.. పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో 5వ నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డికి హైదరాబాద్‌లోని సీబీఐ స్పెషల్ కోర్టులో చుక్కెదురైంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పులివెందులకు వెళ్లాలని, మూడు రోజులపాటు అనుమతి ఇవ్వాలని అభ్యర్థిస్తూ శివశంకర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టేసింది. విచారణ సందర్భంగా సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు మార్చి 11న బెయిల్ వచ్చిందని.. నిజంగా ఓటు వేసే ఉద్దేశం ఉంటే పోస్టల్ బ్యాలెట్ సహా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయత్నించాల్సి ఉందని, కానీ.. అలాంటివేమీ చేయలేదని పేర్కొన్నారు. శివశంకర్‌రెడ్డి అత్యంత ప్రభావం చూపగల వ్యక్తి అని.. ఆయన పులివెందులకు వెళ్తే సాక్షులు ప్రభావితమవుతారని తెలిపారు. ఈ వాదనతో ఏకీభవించిన కోర్టు పిటిషన్‌ను కొట్టేసింది. కాగా, ఇదే కేసులో ఏ-7గా ఉన్న వైఎస్ భాస్కరరెడ్డికి కేవలం 13వ తేదీ ఒక్కరోజు ఓటు వేసి.. అదేరోజు తిరిగి హైదరాబాద్ వచ్చేందుకు షరతులతో కూడిన అనుమతించింది. కేసుతో సంబంధం ఉన్న ఏ సాక్షినీ కలవరాదని స్పష్టం చేసింది.

నేడు కడపకు రాహుల్ గాంధీ

కడప(కలెక్టరేట్), మే 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కడపకు రానున్నారని కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అయన మాట్లాడుతూ.. 'శనివారం 11-30 గంటలకు రాహుల్ గాంధీ కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో కలసి హెలికాప్టర్‌లో ఇడుపులపాయ వెళ్తారు. అక్కడ వైఎస్సార్ ఘాట్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తారు. తిరిగి కడప చేరుకుని బహిరంగ సభలో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు పాల్గొంటారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. షర్మిలను 3 లక్షల మెజార్టీతో గెలిపించడమే మా లక్ష్యం' అని అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, ఏపీ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మెయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సాయంత్రం వరకే మద్యం

» దుకాణాల వద్ద చాంతాడంత క్యూలు

ఉదయగిరి రూరల్, మే 10: పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం దుకాణాలను మూసివేయాల్సి ఉండటంతో శనివారం సాయంత్రం తర్వాత మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. మళ్లీ రెండ్రోజుల తర్వాతే తెరుచుకుంటాయి. దీంతో మద్యం దుకాణాల ముందు మందుబాబులు క్యూకట్టారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో శుక్రవారం మద్యం దుకాణాలు మందుబాబులతో కిక్కిరిసిపోయాయి. ఉదయగిరిలోని మూడు షాపుల వద్ద మందు బాబులు బారులు తీరారు. అయినా మధ్యాహ్నానికే దుకాణాలు మూసివేయడం, గంటల కొద్దీ క్యూలో నిల్చున్నా మద్యం దొరక్కపోవడంతో మందుబాబులు నిరాశతో వెనుతిరిగారు.

మా గ్రామంలోకి రావొద్దు!

- వైసీపీ ఎమ్మెల్యే కాటసానికి పరాభవం
- ప్రచారానికి రాకుండా అడ్డుకున్న ప్రజలు
- పాణ్యం నియోజకవర్గం బైరాంపురంలో ముళ్లకంపలు వేసి స్థానికుల నిరసన



బైరాపురం గ్రామంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి పర్యటనను అడ్డుకున్న స్థానికులు

ఓర్వకల్లు, మే 10: కర్నూలు జిల్లాలో వైసీపీ అభ్యర్థులకు ప్రజల నుంచి నిరసనల సెగ తగులుతోంది. ఐదేళ్ల పాటు తమను నిర్లక్ష్యం చేసి, ఎన్నికల సమయంలో ఓట్లకోసం వస్తున్నారంటూ వైసీపీ నేతలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పాణ్యం ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం ఓర్వకల్లు మండలంలోని బైరాంపురం గ్రామంలో పర్యటించారు. అయితే, పర్యటనకు ముందు గ్రామంలో హైడ్రామా చోటు చేసుకుంది. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వాటిని పరిష్కరించలేని మీరు గ్రామంలోకి ఎందుకు వస్తున్నారని గ్రామ సర్పంచ్‌ను ప్రజలు నిలదీశారు. అంతేకాదు, ఎమ్మెల్యే కాటసాని గ్రామంలోకి రాకూడదని పట్టుబట్టారు. అంతటితో ఆగకుండా ఆయన గ్రామంలోకి రాకుండా కంప చెట్లు, దుంగలను రోడ్డుపై అడ్డంగా వేశారు. సమస్యలు పరిష్కరించలేని కాటసాని గ్రామంలోకి రావాల్సిన అవసరమే లేదని మహిళలు సైతం నినదించారు. వైసీపీ వాళ్ల తమకు అవసరమే లేదని స్పష్టంచేశారు. దీంతో ఎమ్మెల్యే కాటసాని అనుచరుడు గంగాధర్ రెడ్డికి, ప్రజలకు మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఏదేమైనా గ్రామంలోకి కాటసాని కాన్వాయ్ రాకూడదంటూ గ్రామస్థులు పట్టుబట్టారు. తమ నీటి సమస్య తీర్చలేని కాటసానికి తాము ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని ప్రజలకు నచ్చజెప్పారు. అనంతరం కాటసాని కాన్వాయ్ గ్రామంలోకి వెళ్లింది. 40ఏళ్ల రాజకీయ చరిత్రలో కాటసాని, ఆయన అనుచరులను ఎదురించాలంటే పాణ్యం, బనగానపల్లెలో ప్రజలు భయపడేవారు. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో కాటసానికి ఇటీవలి కాలంలో ఇలాంటి చేదు అనుభవాలు వరుసగా ఎదురవుతుండటం ఆయన అనుచర వర్గాల్లో కలవరం రేపుతోంది. కాగా, పోటీ చేసిన 8 ఎన్నికల్లో కాటసాని రెండుసార్లు ఓడిపోయి, ఆరుసార్లు గెలిచారు.

రేయ్ సాంబా.. కారు దిగరా..!

- ఏ ముఖం పెట్టుకుని మా వద్దకు వచ్చావ్?
- ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి అవమానం
- ఇంట్లోకి లాక్కెళ్లి నిర్బంధించిన అసమ్మతి నాయకులు




సాంబ కారుని అడ్డగించిన సత్యనారాయణరెడ్డి అనుచరులు

నార్పల, మే 10: అనంతపురం జిల్లా నార్పలలో వైసీపీ అసమ్మతి నాయకుడు సత్యనారాయణరెడ్డి ఇంటికివెళ్లిన సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ఘోర అవమానం జరిగింది. సాంబను సత్యనారాయణ రెడ్డి అనుచరులు అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి యత్నించారు. ఇంట్లోకి తీసుకెళ్లి నిర్బంధించారు. శింగనమల వైసీపీ అభ్యర్థిగా తనవద్ద టిప్పర్ డ్రైవర్‌గా ఉన్న వీరాంజనేయులుకు సాంబ టికెట్ ఇప్పించుకున్నారు. దీన్ని వైసీపీ అసమ్మతివర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శమంతకమణి, యామినీబాల తదితరులు టీడీపీలో చేరారు. మరికొందరు వైసీపీలోనే కొనసాగుతున్నారు. వీరిలో నార్పల సత్యనారాయణరెడ్డి ఒకరు. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుతో కలిసి శుక్రవారం నార్పలలో రోడ్‌షో, బహిరంగ సభ నిర్వహించేందుకు సాంబ వెళ్లారు. రోడ్‌షోకు సత్యనారాయణరెడ్డి రాకపోవడంతో.. ఆహ్వానించేందుకు సాంబ అయన ఇంటికి వెళ్లారు. సాంబను చూడగానే సత్యనారాయణరెడ్డి వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. 'రేయ్ సాంబా.. కారు దిగురా..! ఏ ముఖం పెట్టుకుని మా అన్న ఇంటికి వస్తున్నావ్..? నీ అంతు చూస్తాం..' అంటూ.. అసభ్య పదజాలంతో దూషిస్తూ.. దాడికి యత్నించారు. సాంబ కారు అద్దాలు ధ్వంసం చేశారు. సాంబశివారెడ్డిని సత్యనారాయణరెడ్డి ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు మూసేశారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. అక్కడే ఉన్న పోలీసులు సత్యనారాయణరెడ్డి అనుచరులను శాంతింపజేశారు. చివరకు సత్యనారాయణరెడ్డిని బుజ్జగించి, బహిరంగ సభకు తీసుకెళ్లారు.

జన కేతనం


ప్రజా అజెండా



అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

కౌంట్ డౌన్ 2 రోజులు

ఆంధ్రజ్యోతి
శనివారం ◇ 11-5-2024



చావులను రాజకీయానికి వాడుకోవడం! చివరికి.. దేవుడినీ రాజకీయానికి వాడుకోవడం!

ఈ విద్య వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తెలిసినంతగా మరెవరికీ తెలియదని ఖాయంగా చెప్పవచ్చు. తిరుమల వేంకటేశ్వరస్వామి అంటే మనకు భక్తి, ప్రపత్తి! జగన్‌కు మాత్రం 'తిరుమల' అనేది లాబీయింగ్‌కు ఒక అవకాశం! అధికారంలో ఉన్న ఐదేళ్లూ... ఆయనది ఇదే వైఖరి! అధికారంలోకి రావడానికి 'వెంకన్న పింక్ డైమండ్'ను వాడుకున్నారు. పదవిలోకి వచ్చాక వెంకన్ననే వాడుకున్నారు! దేవ దేవుడు క్షమించాలి!



టీటీడీ బోర్డు సభ్యుల నియామకాల్లో స్వార్థం

లాబీయింగ్, కేసులు, రాజకీయ అవసరాలే ముఖ్యం

ఐదుగురి నియామకాలే దీనికి నిదర్శనం

సీబీఐని మేనేజ్ చేసేవారొకరు..
అప్పులు ఇప్పించే వారొకరు

షా సన్నిహితులొకరు.. నిర్మలకు దగ్గరివారొకరు

రాష్ట్రానికి కాదు.. తనకు పనికొచ్చే వాళ్లకే పీఠం

కొండపై ధర్మారెడ్డికి కొలువు.. ఆయనదే రాజ్యం

వెంకన్ననూ వాడుకున్నాడు

స్వప్రయోజనాల కోసం తిరుమలనూ వాడటమే!

మీ వాడకం ఇట్లా ఉంటుందని ఊహించలేదు నాయకా! కుటుంబ సభ్యులను, పార్టీ నేతలను, ఐఏఎస్‌లను, ఐపీఎస్‌లను, సోకాల్డ్ తటస్థ మేధావులను... చివరికి తిరుమల వెంకన్న స్వామినీ వదలకుండా వాడుకోవడం మీ ఒక్కరికే సాధ్యం!.... ఇది వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి దక్కిన ఘనత! సొంత కేసుల నుంచి రక్షణ, ఢిల్లీలో అవసరాలు, రాజకీయాలు! ఇదే ఆయన లక్ష్యం. మరీ ముఖ్యంగా టీటీడీ బోర్డు సభ్యుల నియామకంలో అర్హతలు, సేవాభావం కంటే... తన సొంత అవసరాలు, లాబీయింగ్‌కు ఉపయోగపడే వారికే జగన్ పెద్ద పీట వేశారనే ఆరోపణ ఉంది. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని క్షణకాలం దర్శించుకోవడమే ఒక మహాభాగ్యంగా అంతా భావిస్తారు. బోర్డు సభ్యుల హోదాలో కావాలనుకున్నప్పుడల్లా దర్శించుకుని, తమ వాళ్లకూ దర్శనం చేయించే అవకాశం లభిస్తే! ఈ అవకాశం, అదృష్టం కోసం జాతీయ స్థాయిలో అనేక మంది ప్రముఖులు ఎదురు చూస్తుంటారు. సరిగ్గా ఈ 'క్రేజ్'నే జగన్ ఉపయోగించుకున్నారు. వాళ్లు వచ్చి అడగడం కాదు...'మీ వాళ్లలో ఎవరైనా ఉంటే చెప్పండి! టీటీడీ బోర్డులో వేద్దాం' అని వీళ్లే ఆఫర్లు ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరిని కలిసి... ఇలాంటి ఆఫరే ఇచ్చారు. ఆయన దీనిని సున్నితంగా తిరస్కరించారు.

● ఆ ఐదుగురు...

జగన్ హయాంలో టీటీడీ బోర్డులో నియమితులైన వారిలో ఐదుగురి గురించి కచ్చితంగా చెప్పుకోవాల్సిందే! వాళ్ల వల్ల రాష్ట్రానికి నష్టమే తప్ప నయాపైసా ఉపయోగం లేదు. కేవలం తన స్వప్రయోజనాల కోసమే జగన్ వీరికి టీటీడీ బోర్డు పదవులు ఇచ్చారు.

● కేంద్ర ఏజెన్సీల కోసం కేతన్?




మహారాష్ట్రకు చెందిన కేతన్ దేశాయ్ ఎంసీఐ(మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) అధ్యక్షుడిగా పని చేశారు. ఆ సమయంలో దేశాయ్ దారుణమైన అక్రమాలకు పాల్పడ్డాడంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. కానీ, కొంతకాలం గడిచాక, ఆశ్చర్యకరంగా సీబీఐ స్వయంగా దేశాయ్‌కి క్లీన్‌చిట్ ఇచ్చింది. తనపై కేసు పెట్టిన దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థతోనే క్లీన్‌చిట్ ఇప్పించుకున్న మహాఘనుడు. ఆయన లాబీయింగ్ పవర్ అలాంటిది. మరి... జగన్ ఇలాంటి వ్యక్తిని వదులుకుంటారా? సీబీఐ కేసుల్లో నిండా మునిగున్న జగన్, సీబీఐపై పట్టున్న దేశాయ్‌కి టీటీడీ పాలక సభ్యుడి పోస్టు ఇచ్చి తన లైన్లో ఉంచుకున్నారు. కేంద్ర ఏజెన్సీలను మేనేజ్ చేసి జగన్‌కు అనుకూలంగా వ్యవహరించడమే ఈయన పని. అందులో భాగంగానే తన సోదరుడు అవినాశ్ కోసం ఈయన 'సేవల'ను జగన్ వాడుకున్నారు. అలాగే... ఢిల్లీలోనే సెటిల్ అయిన నాగసత్యను దాదాపుగా ఈ అవసరాలకోసమే టీటీడీ బోర్డులో నియమించారు. కొందరిని కేతన్, కొందరిని నాగసత్య మేనేజ్ చేస్తుంటారన్న మాట!

● షా' సన్నిహితుడికి...



తమిళనాడుకు చెందిన కృష్ణమూర్తి వైద్యనాథన్ అనే వ్యక్తి ఒక హైకోర్టు లాయర్. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఆయన అత్యంత సన్నిహితుడు. 11 సీబీఐ కేసు లున్న జగన్‌కు అమిత్‌షాతో ఎంత అవసరం ఉంటుందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అందుకే అమిత్‌షాతో నేరుగా సంప్రదింపులు జరపగల కృష్ణమూర్తి వైద్యనాథన్‌కు టీటీడీ మెంబర్ పదవిచ్చి గుప్పిట్లో ఉంచుకున్నారు.

● 'సెటిల్‌మెంట్' రాజేశ్...




ముంబైకి చెందిన రాజేశ్ శర్మ... క్యాపి లోన్స్ అనే సంస్థ అధినేత. పేరుకు బంగారంపై రుణాలిచ్చే వ్యాపారమైనప్పటికీ.. ఆర్థిక వివాదాల పంచాయితీలు సెటిల్ చేయడంలో దేశంలో రాజేశ్ శర్మను మించిన వారు లేరు. అది ప్రభుత్వాలకు, ప్రైవేటు సంస్థలకు మధ్య వివాదమైనా... వ్యక్తులకు - వ్యక్తులకు నడుమ వివాదమైనా... ఆర్థిక సంస్థలకు- ఇతర కంపెనీలకు వివాదమైనా... వాటిని సెటిల్ చేయడంలో ఈ రాజేశ్ శర్మను మించిన వారులేరని కార్పొరేట్ రంగంలో పేరుంది. నిలువెల్లా ఆర్థిక నేరాల్లో మునిగిపోయిన జగన్‌కు.... రాజేశ్ శర్మలాంటి వ్యక్తితో అవసరాలు లేకుండా ఎలా ఉంటాయి! అందుకే.. ఆయనకు తిరుమలలో పిలిచి పెద్దపీట వేశారు. బోర్డులో సభ్యత్వం ఇచ్చారు. రాజేశ్ శర్మ తిరుమలలో ఒక అతిథి గృహాన్ని కూడా నిర్మించారు. దానిపైన 'క్యాపి లోన్స్' అని రాసుకున్నారు. సాధారణంగా తాడేపల్లి ప్యాలెస్ దాటని జగన్ నేరుగా వచ్చి గత ఏడాది ఈ అతిథిగృహాన్ని ప్రారంభించారు. ఇదీ రాజేశ్ శర్మకు జగన్ ఇచ్చిన ప్రాధాన్యం!

● అప్పుల కోసం 'శంకర్'




తమిళనాడులో బీజేపీకి చెందిన డాక్టర్ శంకర్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సన్నిహితుడు. ఆయనకు ఒక్కసారి కాదు... రెండుసార్లు టీటీడీ బోర్డులో సభ్యత్వం ఇచ్చారు. జగన్ సర్కారు అడిగిందే తడవుగా అప్పులు మంజూరు చేయడం, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నా చూసీ చూడనట్లు వదిలేయడం అందరికీ తెలిసిందే. ఏపీకి ఇచ్చినన్ని సార్లు బీజేపీ పాలిత రాష్ట్రాలకు కూడా కేంద్రం అప్పులకు అనుమతివ్వలేదు.

● బాండ్ల కోసం బోరా!



ముంబైకి చెందిన సౌరబ్ బోరా స్టాక్‌మార్కెట్ కార్యకలాపాలకు సంబంధించి, ఆ రంగాన్ని ప్రభావితం చేయగల ఒక సలహాదారు. ఆయనకూ జగన్ టీటీడీ బోర్డు సభ్యత్వం ఇచ్చారు. బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా బాండ్లు జారీచేసి మార్కెట్ నుంచి రూ.22,500 కోట్ల అప్పు తేవడం, ఇటీవల ఏపీఎండీసీ ద్వారా బాండ్లు జారీ చేసి రూ.7,000 కోట్ల అప్పు తేవడంలో తెరవెనుక సౌరభ్ బోరానే తతంగం నడిపినట్లు సమాచారం.

ధర్మారెడ్డి రాజ్యం!



రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్‌లు ఎంతోమంది ఉండగా, ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్ సర్వీస్‌కు చెందిన ధర్మారెడ్డిని డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి తిరుమలలో సర్వాధికారాలు అప్పగించారు. ధర్మారెడ్డికి శ్రీవారిపైకంటే, జగన్ పైనే భక్తి ఎక్కువ అంటే అతిశయోక్తి కాదు! జగన్ చెబుతారు, ధర్మారెడ్డి పాటిస్తారు అనే కంటే... జగన్‌కు ఏమేం కావాలో తెలుసుకుని ధర్మారెడ్డే చేసేస్తారు అనడం కరెక్టు! ఈ ఐదేళ్లూ ఆయన పని ఇదే! మే 14తో ధర్మారెడ్డి డిప్యుటేషన్ ముగియనుంది. కానీ, ఆయనకు జూన్ 30 వరకు డిప్యుటేషన్ పొడిగిస్తూ రక్షణ శాఖ ఆదేశాలిచ్చింది. ధర్మారెడ్డి లేకపోతే తిరుమల అస్తవ్యస్తమైపోతుందని, జనాలకు శ్రీవారి దర్శనం కష్టమవుతుందంటూ జగన్ లేఖ రాయడమే దీనికి కారణం. అటు తిరుమలలో, ఇటు ఢిల్లీలో జగన్‌కు అవసరమైన వ్యవహారాలన్నీ ఆయనే చక్కబెడుతుంటారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ఏపీని కాపాడుకోవడానికి ఇదే చివరి అవకాశం

జగన్ అన్ని రంగాలనూ వెనక్కినెట్టేశారు

సర్వే రాళ్లపై, పాస్‌బుక్‌లపై ఆయన బొమ్మలెందుకు?

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

మేల్కొనకపోతే తరాలు నాశనమైపోతాయి

బిడ్డల భవిష్యత్ కోసం కూటమికే ఓటేయండి

'ఆంధ్రజ్యోతి'తో సినీ హీరో శివాజీ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవడానికి ఇదే ఆఖరి అవకాశమని సినీ హీరో శివాజీ వ్యాఖ్యానించారు. కూటమికి ఎందుకు ఓటు వేయాలన్న అంశంపై.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు రాష్ట్రాభివృద్ధికి పనిచేశారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లోనూ వెనుకబడేటట్లు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్కరే' అన్నారు. 'ఎవరైనా ఉచితంగా ఇస్తున్నారంటే దానికి పర్యవసానంగా నిత్యావసరాల ధరలు పెరిగిపోతాయని అర్థం. ఉపాధి కల్పించడం మానేసి ఏడాదికి పది వేలు ఇస్తే కుటుంబ పోషణ ఎలా? డబ్బు కాదు కావల్సింది. బిడ్డల భవిష్యత్ కోసం ఆలోచన చేయండి. పేదవారిని పైకి తీసుకురావడానికి ప్రయత్నం చేయండి. ఎవరి డబ్బు ఎవరికి ఇస్తున్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో అభివృద్ధి బాగుందని చెప్పడం, కంపెనీలు ఎంతమందికి ఉద్యోగాలు ఇస్తాయి అనడం హాస్యాస్పదం. ఒక కంపెనీపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షా 60 వేలమంది ఉపాధి పొందుతున్నారు. కొంతమంది రాష్ట్రంపై విషం చిమ్ముతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఈ రోజు చాలా దారుణమైన పరిస్థితిలో ఉంది. మీ బిడ్డల భవిష్యత్ బాగుపడాలంటే కూటమి అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలి. రాష్ట్ర ఎకానమీ పడిపోయింది. వ్యవసాయం లేదు. విద్య, వైద్యం, ఉద్యోగాలు లేవు. ఏ రంగం చూసుకున్నా గుండుసున్నా. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో చాలా ప్రమాదం. మా పంట భూములు సర్వేచేసి రాళ్లు పాతి వాటిపై నీ బొమ్మలు ఎందుకు?. పాస్ పుస్తకాలపై ముఖ్యమంత్రి ఫొటోలు వేయడం దుర్మార్గం. జగన్మోహన్‌రెడ్డి ఫొటో ఉన్న పాస్ బుక్ బ్యాంకు తనఖాకు పనికి రాదంట. భూముల వివరాలు తెలుసుకోవడానికి మాత్రమే అని పుస్తకంలో రాశారు' అని శివాజీ అన్నారు.

● దయచేసి ఓటేయడానికి రండి!

శివాజీ ఇంకా ఏమన్నారంటే.. 'ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రం గంజాయి వనంగా మారిపోయింది. మేల్కోకపోతే రాబోయే తరాలు నాశనమయిపోతాయి. ప్రజలారా దయచేసి ఆలోచించండి. ఆంధ్రప్రదేశ్ దయనీయ స్థితిలో ఉంది. ఓటరుగా నమోదయిన ప్రతిఒక్కరూ ఓటువేయడానికి రండి. మీరు ఎవరికి ఓటు వేస్తారో తరువాత విషయం. ముందు మే 13న ఎక్కడ ఉన్నా ఓటు వేయడానికి రండి. మన పూర్వీకులు పుట్టిన గడ్డ నాశనమైపోతోంది. కులం, మతం గురించి కాదు, మనం పుట్టిన గడ్డ కోసం ఓటు వేయడానికి రావాలి. మరీ ముఖ్యంగా సిగ్గు విడిచి కులం పేరుతో చెబుతున్నా కాపు సోదరులకు సువర్ణావకాశం వచ్చింది వదలొద్దు. ఈ మాట పరమార్థం మీకు తరువాత చెబుతాను. జనసైనికులు, టీడీపీ కార్యకర్తలు ఒకరికొకరు సమన్వయం చేసుకుని పనిచేయాలి. బూత్ కన్వీనర్లు జాగ్రత్తగా ఉండాలి. వైసీపీ ప్రలోభాలకు గురిచేస్తోంది. ఎటువంటి సర్వేలూ నమ్మవద్దు. గ్రౌండ్ చాలా క్లియర్‌గా ఉంది. ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఎంత రాత్రయినా నిలబడి ఓటువేసి రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది. ముందు ఓటు వేయడానికి రండి. ఎవరికి వేసినా ఓటు ఆలోచింపజేస్తుంది' అని శివాజీ అన్నారు.

-కొవ్వూరు

ఆలయాలపై వైసీపీ పడగ

అంతర్వేది, కొండబిట్రగుంటలో రథాలు దగ్ధం

రామతీర్థంలో కోదండరాముడి తల నరికివేత

పిఠాపురంలో దేవతల విగ్రహాలు ధ్వంసం

దుర్గమ్మ గుడిలో వెండి సింహాలు మాయం

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగనన్ని దారుణాలు

కేసులు దర్యాప్తు చేయరు.. నిందితుల్ని పట్టుకోరు

జగన్ పాలనలో హిందువులపై ముప్పేట దాడి

దేవుడికి రక్షణేదీ!

రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం తల నరికేశారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యరథాన్ని తగులబెట్టారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ వెండి రథంలోని వెండి సింహాల ప్రతిమలు అపహరించారు. పిఠాపురంలో వినాయకుడు, షిర్డీ సాయిబాబా విగ్రహాలతో పాటు మరెన్నో దేవతా విగ్రహాలను ధ్వంసం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పదుల సంఖ్యలో ఆలయాలను తవ్వేశారు. హుండీలు కొల్లగొట్టారు. ఇలా ఒకటీ, రెండూ కాదు... జగన్ ఏలుబడిలో రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా హిందువులపై ముప్పేట దాడి జరిగింది. భక్తులు పరమ పవిత్రంగా భావించే 36 దేవాలయాలపై కనీవినీ ఎరుగని స్థాయిలో దాడులు చేశారు. హిందూ దేవుళ్ల విగ్రహాలే టార్గెట్‌గా భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆలయాల్లో అరాచకాలు సృష్టించారు. ప్రధాన పూజారులను అవమానించారు. అర్చకులను హింసించారు. అయినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదు. ఒక్క ఘటనపైనా సీఎం జగన్ స్పందించిన దాఖలాలు లేవు. చాలా ఘటనల్లో మతిస్థిమితం లేని వ్యక్తులు, మద్యం మత్తులో ఉన్నవారే కారకులని తేల్చేసి మమ అనిపించారు. మరికొన్ని ఘటనల్లో అసలు కేసులే నమోదు చేయలేదు. కాకినాడ జిల్లా పిఠాపురంలో 2020 జనవరిలో కొంతమంది దుండగులు ఎనిమిది ఆలయాల్లో ఉన్న 14 దేవతా విగ్రహాలను రాత్రి వేళ ధ్వంసం చేశారు. నాటినుంచే రాష్ట్రంలో దేవతా విగ్రహాలపై దాడులు తీవ్రమయ్యాయి. ఆ రోజే వైసీపీ ప్రభుత్వం కారకులపై కఠిన చర్యలు తీసుకుంటే ఇన్ని ఆలయాలపై దాడి ఘటనలు జరిగి ఉండేవి కావు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి



రామతీర్థంలో దారుణం



రామతీర్థం ఆలయంలో తల నరికిన శ్రీరాముడి విగ్రహం, కోనేటిలో లభ్యమైన రాముడి తలను తీసుకొస్తున్న దృశ్యం

పిఠాపురం ఘటన తర్వాత విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయంలో శ్రీరాముడి విగ్రహం తల తెగ్గోసి, సమీపంలో ఉన్న కోనేట్లో పడేశారు. ఈ దారుణం రాష్ట్ర వ్యాప్తంగా భక్తుల మనసులను కలచి వేసింది. ఈ ఘోరంపై జగన్ ప్రభుత్వం స్పందించిన తీరు మరింత దారుణంగా ఉంది. విగ్రహాలపై దాడులు సహజమే అన్నట్లు, కొత్త విగ్రహం తెచ్చి పెట్టేస్తామంటూ మంత్రులు తేలికచేసి మాట్లాడారు. ఈ కేసు విచారణను సీఐడీకి అప్పగించినా ఇప్పటికీ దర్యాప్తు ముందుకు కదల్లేదు. ధర్మానికి ప్రతీకైన శ్రీరాముడి తల తీసేస్తేనే పట్టించుకోని జగన్... తాను ధర్మయుద్ధం చేస్తున్నానంటే నమ్మడం ఎలా?



అంతర్వేది రథానికి నిప్పు

దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన దివ్యరథాన్ని 2020 సెప్టెంబరు 6వ తేదీ తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. 40 అడుగుల ఎత్తయిన రథం కాలి బూడిదైంది. ఈ దారుణానికి కారకులెవరో ప్రభుత్వం ఇప్పటి వరకూ తేల్చలేకపోయింది. అలాగే 2020 ఫిబ్రవరిలో ఉమ్మడి నెల్లూరు జిల్లా కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ రథం తగులబడింది. దేవదాయ శాఖ అధికారులు కేసు పెట్టడంతో సరిపుచ్చారు. చివరకు మతిస్థిమితం లేని వ్యక్తి పనిగా తేల్చేసి, విచారణను అక్కడితో ముగించారు. తర్వాత సీజేఎఫ్ నిధుల నుంచి రూ.87లక్షలు కేటాయించి కొత్త రథాన్ని తయారుచేయించారు.

మహాభారతంలో అర్జునుడితో పోల్చుకుంటారు. తాను చేసేది ధర్మయుద్ధమని చెప్పుకుంటారు. నుదుట నామాలు పెట్టుకుంటారు. పుష్కర స్నానాలు చేస్తారు. సీఎం హోదాలో సంప్రదాయ వస్త్రధారణలో దేవుడికి పట్టవస్త్రాలూ సమర్పిస్తారు. ఉగాది, సంక్రాంతి వంటి పండుగలకు తాడేపల్లి ప్యాలెస్‌లోనే ఆలయాల సెట్టింగ్ వేయించి ఫొటోలకు పోజులిస్తారు. కానీ రాష్ట్రంలో ఆలయాలపై దాడులు జరిగినా, హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేసినా కిక్కురుమనరు. ఇక ఈ ఘటనలపై కేసులు నమోదు చేయడం, దర్యాప్తు చేసి దోషులపై చర్యలు తీసుకోవడం అనే మాటలకు తావే లేదు. హిందువులకు, హిందూ దేవుళ్లకు సీఎం జగన్ ఇచ్చే గౌరవం ఇదీ!

వెండి సింహాలు చోరీ

బెజవాడ కనకదుర్గమ్మ గుడిలోని వెండి రథంపై ఉన్న నాలుగు వెండి సింహాల్లో మూడు సింహాలను దొంగలు ఎత్తుకుపోయారు. దీనిపై అప్పట్లో పెద్ద దుమారం రేగింది. కొన్నిరోజుల తర్వాత పోలీసులు దొంగలను పట్టుకుని, వారి నుంచి వెండి మొత్తాన్ని రికవరీ చేశారు. అనంతపురం జిల్లా మడకశిరలో రత్నగిరి అమ్మవారి ఆలయంలో నంది విగ్రహాన్ని ఎత్తుకుపోయారు. రాయదుర్గం సమీపంలో ఉన్న పశుపతినాథ స్వామి ఆలయంలో నంది విగ్రహాన్ని, ఆకివీడులో సరస్వతీ దేవి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు.

అబ్బ ఛా!



సీఎం జగన్

అవినాశ్ ఎలాంటి వాడో అందరికీ తెలుసు..

అవినాశ్ నాకన్నా 13 ఏళ్లు చిన్నపిల్లోడు. మా అందరికన్నా చిన్నపిల్లోడు.. ఈ పిల్లాడి జీవితం నాశనం చేయడం కోసం చంద్రబాబు దగ్గర నుంచి అందరూ కుట్రలు పన్నుతున్నారు. అవినాశ్ ఎలాంటి వాడో మీ అందరికీ తెలుసు.



బొత్స బలాబలాలు

- మంత్రిగా చీపురుపల్లి సహా విజయనగరంపై గట్టి పట్టు.
- కుటుంబ సభ్యుల సహకారంతో పాటు వ్యాపార వర్గాల అనుకూలత
- గ్రామాల్లోనూ బొత్సకు అనుచరులు ఎక్కువగా ఉండడం
- సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండడం

బలహీనతలు

- వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు.
- ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత.
- తోటపల్లి ప్రాజెక్టు పనుల పెండింగ్.
- షాడో నేత అధికారం చలాయింపు.
- రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనుల మందగమనం.





వెంకట్రావు బలాబలాలు

- సమీప మండలం కావటం.
- మాజీ మంత్రిగా, టీడీపీ సీనియర్ నేతగా సుపరిచితం.
- కూటమి ప్రకటించిన సూపర్-6 పథకాలు.
- మెరకముడిదాం మండలంలోని కోట్ల కుటుంబం దన్ను
- కిమిడి నాగార్జున సహకారం.

బలహీనతలు

- పొరుగు నియోజకవర్గం నుంచి రావడం.
- బలమైన గళం వినిపించలేకపోవడం.
- కార్యకర్తలను సమన్వయం చేయలేకపోవడం.

బిగ్ ఫైట్

చీపురుపల్లిలో బొత్సకు సెగ!

విజయనగరం జిల్లాలోని కీలకమైన నియోజకవర్గం చీపురుపల్లి. ఈ నియోజకవర్గం మంత్రి బొత్స సత్యనారాయణకు పెట్టని కోట. ఈ నియోజకవర్గ పరిధిలో మూడు దశాబ్దాలుగా బొత్స రాజకీయం చేస్తున్నారు. ఆయనకు సొంత సామాజికవర్గం, బంధుత్వాలు కలిసి వస్తున్నాయి. అయితే ఎన్నికల ముందు నియోజకవర్గంలో సమీకరణలు మారాయి. కూటమి అభ్యర్థిగా కళా వెంకట్రావు రావడంతో బొత్స అసంతృప్తి వర్గం బయటకు వచ్చేసింది.

ఏమున్నది గర్వకారణం?

మూడు దశాబ్దాలుగా చీపురుపల్లిలో బొత్స సత్యనారాయణ రాజకీయం చేస్తున్నా అభివృద్ధి లేకపోగా అనుచరుల దందాలు పెరిగిపోయాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బొత్స అనుచరులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేస్తున్న భూ దందాలు, రియల్ ఎస్టేట్ బినామీ వ్యాపారాలు, అనుచరుల కంపెనీల్లో తయారయ్యే పైపుల ఉత్పత్తులను ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రుద్దటం.. మంత్రిగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం.. బొత్స కోటకు బీటలువారేలా చేస్తున్నాయి. మంత్రి హోదాలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయలేకపోవడంపై రైతాంగం మండిపడుతోంది.

బొత్సకు తగ్గిన బలం!

మెరకముడిదాం మండలంలో బొత్సకు బలం తగ్గింది. 1962లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన కోట్ల సన్యాసప్పలనాయుడు కుమారుల్లో ఇద్దరు టీడీపీలో చేరారు. కోట్ల మోతీలాల్ నాయుడు మండల స్థాయిలో ప్రజాప్రతినిధిగా వెలుగొందిన నేత. కోట్ల సుగుణాకరరావు కూడా టీడీపీలో చేరారు. బొత్సకు వెన్నుదన్నుగా ఉన్న ఈ కుటుంబంలో చీలిక ఏర్పడింది. ఇది బొత్సకు మైనస్‌గా మారింది. విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబ పాలనను సాగిస్తున్నారన్న వాదన ఎప్పటి నుంచో ఉంది. చీపురుపల్లి, నెల్లిమర్ల, గజపతినగరం ఎమ్మెల్యేలు ఈయన కుటుంబానికి చెందిన వారే. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కూడా ఈయన కుటుంబానికి చెందినవారే. తాజాగా విశాఖ ఎంపీగా బొత్స సతీమణి ఝాన్సీ పోటీ చేస్తున్నారు.

మండలాలు : చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల
ఓటర్లు : పురుషులు: 1,02,627, మహిళలు: 1,02,847, ట్రాన్స్‌జెండర్లు: 10, మొత్తం: 2,05,471
సామాజిక వర్గాల వారీగా..: బీసీలు: 1,60,500: ఓసీలు: 11,500, ఎస్సీ:15,200, ఇతరులు: 13,471

కలసి వస్తున్న కళా రాజకీయం

టీడీపీ అభ్యర్థి కళా వెంకట్రావుకు కిమిడి కుటుంబం సంపూర్ణ సహకారాలు అందిస్తోంది. ఇదే సమయంలో బొత్స అసంతృప్త నాయకులు, వైసీపీ వ్యతిరేక వర్గం కళాకు జైకొట్టింది. కూటమి పార్టీల నేతల ఐక్యతతో కళా విజయంపై ధీమా వ్యక్తమవుతోంది. పార్టీకి బలమైన కేడర్ ఉండడం కూడా కలిసి వస్తోంది.

- విజయనగరం,ఆంధ్రజ్యోతి

మాచర్లలో



నువ్వా.. నేనా?

అలనాటి పల్నాటి పోరు కేంద్రమైన మాచర్లలో ఈసారి హోరాహోరీ పోరు నెలకొంది. సమవుజ్జీలైన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నేత జూలకంటి బ్రహ్మానందరెడ్డి నడుమ పోరు ప్రతిష్ఠాత్మకంగా సాగుతోంది. తలవాకిటనే కృష్ణమ్మ.. అయినా తాగునీరు లేదు. గిరిజన తండాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడానికి సరైన రోడ్లు లేవు. అయినా అడగడానికి వీల్లేదు. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు అడిగితే వారి పైకి ట్రాక్టర్లు వెళ్తాయి. గొడ్డళ్లు వీపుల మీద తారంగమాడతాయి. ఇంతటి అరాచకం రాజ్యమేలుతున్న మాచర్లపై విజయానికి రెండు ప్రధాన పార్టీలు గట్టి ప్రయత్నాలే చేస్తున్నాయి. ఇప్పటికి నాలుగు సార్లు ఇక్కడి నుంచి గెలిచిన పిన్నెల్లి ఐదోసారి కూడా పైచేయి సాధించడానికి కృషి చేస్తున్నారు. 2004, 09ల్లో ఆయనపై పోటీచేసి ఓడిన జూలకంటికి.. టీడీపీలోని వర్గాలన్నీ ఏకతాటిపైకి వచ్చి మద్దతిస్తున్నాయి. ఈసారి ఎలాగైనా పిన్నెల్లిని ఓడించాలన్న కసితో ఆ పార్టీ శ్రేణులు పని చేస్తున్నాయి. మాచర్లలో 2004 నుంచి ఇప్పటి వరకు పసుపుజెండా ఎగురలేదు. పార్టీ ఆవిర్భావం తర్వాత నాలుగు సార్లు 1983, 89, 94, 99 ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ గెలిచింది. 2004లో పిన్నెల్లి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 2009లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గెలిచారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆయన జగన్మోహన్‌రెడ్డి పక్షాన నిలిచారు. 2012 ఉప ఎన్నికల్లో, 2014, 19ల్లో వైసీపీ నుంచే విజయం సాధించారు. బ్రహ్మారెడ్డిది కూడా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమే. ఆయన తండ్రి నాగిరెడ్డి 1972లో ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు. ఆయన తల్లి దుర్గాంబ 1999లో టీడీపీ తరపున ఎన్నికయ్యారు.

పిన్నెల్లికి వ్యతిరేక పవనాలు..

వరుసగా నాలుగు సార్లు గెలిచిన పిన్నెల్లిపై నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సాగించిన అక్రమాలు, హింసాకాండ చూసి జనం నివ్వెరపోయారు. ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి లిక్కర్ డాన్‌గా వ్యవహరిస్తూ అరాచకాలకు చిరునామాగా నిలిచారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పిన్నెల్లి అనుచరులు చెలరేగిపోతున్నారు. టీడీపీకి ఓటు వేసిన వారిని లక్ష్యంగా చేసుకొని దాడులు, వేధింపులు, గ్రామ బహిష్కరణలు, రాజకీయ ప్రత్యర్థులను పట్టపగలే గొంతుకోసి చంపేయడం వంటి అసాధారణ హింస చోటు చేసుకుంది. స్థానిక ఎన్నికల్లో మాచర్ల మున్సిపాలిటీతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులన్నీ బలవంతంగా ఏకగ్రీవం చేసుకుంది. మద్యం బెల్టు షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈసారి వైసీపీకి చెక్ పెట్టాలని జూలకంటి బ్రహ్మానందరెడ్డిని టీడీపీ రంగంలోకి దించింది. మాజీ ఎమ్మెల్యే కుర్రి పున్నారెడ్డి, మరో సీనియర్ నేత చిరుమామిళ్ల మధుబాబు కూడా ఆయనకే మద్దతిస్తున్నారు.

- మాచర్ల టౌన్.



పిన్నెల్లి బలాలు..

వైసీపీ కేడర్ బలంగా ఉండడం.. ఆర్థికంగా సంపన్నుడు.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనుభవం.

బలహీనతలు..

దౌర్జన్యాలు, దాడులు, ఆస్తుల విధ్వంసం.. మామూళ్ల వసూలు.. ప్రభుత్వ భూములన్నీ బినామీల పేరిట బదిలీ.. బెదిరింపులతో కాంట్రాక్టర్లు పరార్.. పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డి అరాచకాలు.



జూలకంటి బలాలు..

రాజకీయ కుటుంబ నేపథ్యం.. టీడీపీ కేడర్ అంతా ఈసారి విజయం కోసం కసిగా పనిచేస్తుండడం.. పిన్నెల్లిని ఎదుర్కోవడానికి వర్గాలన్నీ ఏకం కావడం.. జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత.. 2004, 09ల్లో రెండు సార్లు ఓడిపోయిన సానుభూతి.

బలహీనతలు..

ఆర్థికంగా అంత బలంగా లేకపోవడం...

నియోజకవర్గ స్వరూపం.. కీలకం

కారంపూడి, దుర్గి, రెంటచింతల, మాచర్ల, వెల్దుర్తి మండలాలు

మొత్తం ఓటర్లు: 2,62,518, పురుషులు: 1,28,639, మహిళలు: 1,33,743, ట్రాన్స్‌జెండర్లు: 22

కీలక సామాజిక వర్గాల ఓటర్లు..

మాదిగ-31 వేలు, మాల-9 వేలు, రెడ్లు-28 వేలు, కమ్మ-22 వేలు, యాదవ-22 వేలు, కాపులు-17 వేలు, వడ్డెర-17 వేలు, ముస్లిం-17 వేలు, సుగాలి-17 వేలు, వైశ్యులు-12 వేలు, రజక-9 వేలు.

సంఘం చెప్పిన మాట




డాక్టర్ జోసఫ్ మోసిగంటి
చైర్మన్, జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్

చంద్రబాబుపైనే క్రైస్తవ సమాజం విశ్వాసం

జగన్ ప్రభుత్వం క్రైస్తవులను ఘోరంగా మోసగించింది. జగన్ ప్రభుత్వంలో క్రైస్తవ సమాజానికి అన్ని రకాలుగా అన్యాయం జరిగింది. క్రైస్తవ ముద్ర పడుతుందనే ఉద్దేశంతో జగన్ క్రైస్తవులను దూరం పెట్టారు. 98 శాతం క్రైస్తవ సమాజం ఆయనకు ఓట్లు వేసి గెలిపిస్తే.. ఒక ఎమ్మెల్సీ, ఒక్క రాజ్యసభ ఎంపీ పదవి కూడా ఇవ్వలేదు. కరోనా సమయంలో రూ.5వేలు ఇచ్చి దళిత క్రైస్తవులకు ఉన్న రిజర్వేషన్ పోయేటట్లు చేశారు. కుల గణనలో క్రైస్తవులను హిందువులుగా నమోదు చేసి.. క్రైస్తవులే లేకుండా చేశారు. చంద్రబాబు ప్రభుత్వం క్రైస్తవుల కోసం 475 కోట్లు ఖర్చు పెడితే.. జగన్ ప్రభుత్వం 107 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. పాస్టర్లకు గౌరవ వేతనం, ఇతర సంక్షేమ పథకాల గురించి వైసీపీ మేనిఫెస్టోలో పెట్టలేదు. క్రైస్తవ సమాజానికి అవసరమైన మేలు చేస్తామని టీడీపీ పేర్కొంది. చర్చిల నిర్మాణానికి నిధులు, పాస్టర్లకు గౌరవ వేతనాలు, శ్మశాన వాటికలకు స్థలాలు ఇస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. సెక్యులర్ విధానాలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నాం.

- పొన్నూరు టౌన్

గుసగుసలు



ఓటుకు నోటులోనూ.. కమీషన్లు నొక్కుడే!

ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్యం, నిబంధనల సంగతి ఎలా ఉన్నా... ఓట్లు వచ్చాయంటే నోట్లు పంచాల్సిందే! ఇదో విషాదకరమైన వాస్తవం! ఓటు విలువ వందల్లోంచి వేలల్లోకి పెరిగింది! డబ్బు పంపిణీకి ఎవరి వ్యూహాలు వారివి! పోలీసులకు దొరకొద్దు. ప్రత్యర్థి పార్టీ నేతలకు తెలియవద్దు! అన్నింటికంటే ముఖ్యంగా... చేరాల్సిన వాళ్లందరికీ డబ్బులు చేరాలి! స్థానికంగా చోటా నేతలకు డబ్బు పంపిణీ బాధ్యత అప్పగిస్తే... పంచుతారో, వారే తింటారో! ఇదో పెద్ద భయం! అందుకే ఈసారి పలువురు అభ్యర్థులు 'ఏజెంట్ల'ను పెట్టుకుంటున్నారు. అయితే, ఈ ఏజెంట్లు అభ్యర్థులకే చుక్కలు చూపిస్తున్నారు. ఉదాహరణకు... ఓటుకు రూ.1500చొప్పున చెల్లించాలని డబ్బులిస్తే, ఓటరుకు రూ.1200లే ఇస్తున్నారు. "మీకు 1500 ఇమ్మన్నారు. 300 కమీషన్‌పోగా ఇదిగో 1200' అని ఓటర్లకే చెబుతున్నారు. పది ఓట్లకు రూ.15వేలు ఇవ్వాలంటే, అందులో రూ.3వేలు కట్! ఈ కోతలు చూసి ఓటర్లు కస్సుమంటున్నారు. అభ్యర్థిపై మండిపడుతున్నారు. 'డబ్బులిచ్చి తిట్టించుకోవడమంటే ఇదే' అని అభ్యర్థులు వాపోతున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ద్విముఖమా.. త్రిముఖమా?

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానంలో రసవత్తర పోటీ

- కొత్త అభ్యర్థి గూడూరికి వైసీపీ అవకాశం
- కూటమి అభ్యర్థిగా బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి.. కాంగ్రెస్ నుంచి గిడుగు

చారిత్రక రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గంలో ఈ దఫా రసవత్తర పోటీ నెలకొంది. 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ.. ప్రధాన పోటీ టీడీపీ-జనసేన మద్దతిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, వైసీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు మధ్యే నెలకొంది. తొలుత ఇక్కడ ద్విముఖ పోటీయే ఉంటుందని భావించినా.. రుద్రరాజుకు ఈ ప్రాంతంలో ఎక్కువ పరిచయాలు ఉండడంతో రుద్రరాజు సైతం గట్టిగానే పోటీలో నిలబడ్డారు. దీంతో రాజకీయ వర్గాలు త్రిముఖ పోటీ ఉంటుందని అంటున్నాయి. వైసీపీకి వెళ్లిన కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లను ఆయన కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని.. ఇదే జరిగితే వైసీపీ అభ్యర్థికి నష్టం జరుగుతుందని చెబుతున్నాయి.


గోదావరికి అటూ ఇటూ..

గోదావరికి రెండువైపులా అంటే ఒకవైపు రాజమహేంద్రవరం డివిజన్, రెండో వైపు కొవ్వూరు డివిజన్లతో కలిపి ఈ పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు (1984, 91, 2014), బీజేపీ రెండు సార్లు (1998, 99), కాంగ్రెస్ నాలుగు సార్లు (89, 96, 2004, 09), వైసీపీ (2019) ఒకసారి గెలిచాయి. 1999లో టీడీపీ మద్దతుతో బీజేపీ గెలిచింది. మళ్లీ ఇప్పుడు టీడీపీ-జనసేన మద్దతుతో బీజేపీ పోటీచేస్తోంది. గత ఎన్నికల్లో ఇక్కడ ముక్కోణ పోటీ జరిగి వైసీపీ లాభపడింది. ఇప్పుడు బీజేపీ, టీడీపీ-జనసేనతో కలవడంతో పురందేశ్వరి గెలవడం ఖాయమని కూటమి వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో వైసీపీయే పోటీచేస్తుండగా.. టీడీపీ రాజమండ్రి రూరల్, సిటీ, కొవ్వూరు, గోపాలపురంలో, బీజేపీ అనపర్తిలో, రాజానగరం, నిడదవోలులో జనసేన బరిలో ఉన్నాయి.

- రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి



ఎంపీ బరి



నియోజకవర్గ స్వరూపం..

రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి, నిడదవోలు, కొవ్వూరు (ఎస్సీ), గోపాలపురం (ఎస్సీ) అసెంబ్లీలు

మొత్తం ఓటర్లు	16,23,149
పురుషులు	7,92,317
మహిళలు	8,30,735
ట్రాన్స్‌జెండర్లు	97



గూడూరి బలాలు

వైసీపీకి గట్టి ఓటు బ్యాంకు ఉండడం..వివాదరహితుడు.. సౌమ్యుడు.

బలహీనతలు..

రాజకీయాలకు కొత్త.. ఎన్నికల నిర్వహణ అనుభవం లేకపోవడం.. పూర్తిగా వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులపైనే ఆధారపడడం.. కొన్ని నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ భయం.. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత.



పురందేశ్వరి బలాలు

మూడు పార్టీల శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తుండడం.. పురందేశ్వరి ఎన్టీఆర్ కుమార్తె కావడం.. టీడీపీకి పటిష్ఠ ఓటు బ్యాంకు.. జనసేనకూ చెప్పుకోదగిన ఓట్లు ఉండడం..

బలహీనతలు..

పూర్తిగా టీడీపీ శ్రేణుల పైనే ఆధారపడడం.. బీజేపీకి పెద్దగా కేడర్ లేకపోవడం.. స్థానికేతరురాలంటూ వైసీపీ ప్రచారం.



గిడుగు బలాలు

రాజకీయానుభవం.. అందరినీ ఆకట్టుకునే వ్యక్తిత్వం. సంప్రదాయంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉన్న ఎస్సీలు, ముస్లింలను తన వైపు తిప్పుకొనేందుకు కసరత్తు.. ఆయనకు మద్దతుగా షర్మిల, మరో సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి ప్రచారం.

బలహీనతలు..

అసెంబ్లీ అభ్యర్థులు బలహీనంగా ఉండడం.. పెద్దగా ఖర్చుచేయలేకపోవడం.

ఈబీసీలపై ఇంత ఈర్ష్యా?

అగ్రవర్ణ పేదలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం అమలుచేసిన 'ఈడబ్ల్యూఎస్' రిజర్వేషన్లను ఆనాడు చంద్రబాబు ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంది. కాపులు,ఇతర అగ్రకులాలకు చెందిన కుటుంబాలకు ఉద్యోగ అవకాశాల్లో ఈ కోటాను తు.చ. తప్పక పాటించింది. జగన్ అధికారంలోకి రాగానే కాపులకు 'ఈడబ్ల్యూఎస్' కోటాను రద్దుచేశారు. మరోవైపు తాను ఆర్భాటంగా చెప్పుకొనే గ్రామ/ వార్డు సచివాలయాల ఉద్యోగ నియామకాల్లో 'ఈడబ్ల్యూఎస్' విధానం అమలుచేయలేదు. దీనివల్ల అగ్రవర్ణ పేద వర్గాలు 38 వేల పోస్టులు కోల్పోయాయి. ఆ తర్వాత 'ఈడబ్ల్యూఎస్'ను అమలు చేస్తున్నట్లు ప్రకటించారుగానీ, మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండరు పై ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ ఎగ్గొట్టేయడంతో.. గత ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా ఈడబ్ల్యూఎస్ విధానంలో అగ్రవర్ణ పేదలకు దక్కలేదు.

- ఉద్యోగావకాశాల్లో అమలుకాని 'ఈడబ్ల్యూఎస్'
- ఐదేళ్లలో ఇచ్చింది సచివాలయ, వలంటీర్ పోస్టులే
- 'ఈడబ్ల్యూఎస్' ఎగవేసి అగ్రవర్ణ పేదలకు వంచన

'బయట పల్లకీల మోత... ఇంట్లో ఈగల మోత'.. రాష్ట్రంలోని అగ్రవర్ణాల్లో (ఈబీసీలు) చాలా కుటుంబాల పరిస్థితి దాదాపుగా ఇంతే! మధ్యతరగతి పేరిట దారిద్ర్యం అనుభవిస్తున్న వర్గాలివి. ఆర్థికంగా చితికిపోయిన అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వాలు అండగా ఉండాలి. అది చేతగాకపోతే ఈ వర్గాలను వాటి మానాన వాటిని వదిలేయాలి. కానీ, జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఎందుకనో ఈబీసీలంటే ఈర్ష్య పడుతోంది. అగ్రవర్ణాల్లోని పేదల కోసం 'ఈడబ్ల్యూఎస్' రిజర్వేషన్ 10 శాతం అమలుచేయాలని కేంద్రప్రభుత్వం చట్టం చేసింది. ఈ రిజర్వేషన్లను ఆయా ఓసీ కేటగిరీలకు రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన పంపిణీ చేసుకోవచ్చని సూచించింది. ఈ ప్రకటన చేసినప్పుడు రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. కాపులకు 5 శాతం, మిగిలిన అగ్రవర్ణాలకు 5 శాతం ఇస్తూ.. చంద్రబాబు ప్రభుత్వం చట్టం చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటుచేసింది. సుమారు 1.34 లక్షల గ్రామ, వార్డు సచివాలయ పోస్టులు, మరో రెండున్నర లక్షల వలంటీర్ల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ పోస్టుల భర్తీలో ఈడబ్ల్యూఎస్ కోటాను కావాలనే విస్మరించిందని ఈబీసీలు ఆగ్రహిస్తున్నారు. జగన్ వంచన వల్ల 38 వేల పోస్టులు కోల్పోయామని ఆవేదన చెందుతున్నారు.

ఆనాడు ఎన్నెన్ని పథకాలో....

బ్రాహ్మణ వర్గంలో చాలామంది కడు దారిద్ర్యం అనుభవిస్తున్నారని గుర్తించిన చంద్రబాబు ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్ ద్వారా 1,54,182 మంది వివిధ పథకాలను పొందారు. విద్యా రంగంలో గాయత్రి, భారతి, వేదవ్యాస, వశిష్ఠ, ద్రోణాచార్య, చాణక్య పథకాలు, ఆ వర్గంలోని దివ్యాంగులు, వితంతువులు, అనాథల కోసం కశ్యప అండ్ అహల్య పథకం, మట్టి ఖర్చుల కోసం గరుడ పథకం అమలయ్యాయి. కల్యాణమస్తును వీరికీ వర్తింపజేశారు. రూ.50 కోట్లతో క్రెడిట్ సొసైటీని ఏర్పాటుచేసి రాష్ట్రవ్యాప్తంగా 45,097 మందికి కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చారు. అప్పట్లో కార్పొరేషన్ బడ్జెట్ కూడా రూ.285 కోట్లు ఉండేది. జగన్ వచ్చాక తొలి ఏడాది రూ.100 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత నుంచి పైసా విదిలించలేదు.

ఆర్యవైశ్యుల సంక్షేమమేది?...

వ్యాపారమే వృత్తిగా ఉన్న ఆర్యవైశ్య కుటుంబాల్లో ఉన్నత చదువులకు వెళ్లేవారి సంఖ్య చాలా తక్కువ. దీనిని గుర్తించిన చంద్రబాబు ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేసి, ఏటా రూ.60 కోట్లు బడ్జెట్ పెట్టి.. వారి ఆర్థిక ఉన్నతికి బాటలు వేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌ను రద్దుచేసింది. ఈబీసీలపై చంద్రబాబు ప్రభుత్వం ఆనాడు ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈబీసీలు వ్యవసాయ వృత్తిలో ఉన్నప్పటికీ వారికి సొంత భూమి లేదు. గ్రామాల్లో పేదరికంలో మగ్గుతుంటే, పట్టణాల్లో అసంఘటిత రంగంలో అస్థిర జీవితాలు గడుపుతున్నారు. ఈ విషయం గుర్తించిన చంద్రబాబు.. ఫైనాన్స్ కార్పొరేషను ఏర్పాటు చేసి ఆర్థికంగా ఊతం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బడ్జెట్ ఇవ్వకుండా ఈ కార్పొరేషన్‌ను ఎండబెట్టింది.

- అమరావతి,ఆంధ్రజ్యోతి



కౌలు రైతుల పచ్చని సందేశం!

ఈ చిత్రంలో కనిపిస్తున్న అక్షరాలు, పార్టీ గుర్తులు రంగులతో రాసినవి కావు. గోంగూర విత్తనాలను ఆవిధంగా అమర్చి, మొలకెత్తించారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోటకు చెందిన కౌలు రైతులంతా ఆదర్శ రైతు ఎర్రు బాపారావు ఆధ్వర్యంలో పక్షం రోజుల కిందట చేసిన ఈ ప్రయత్నం.. ఇప్పుడు మొలకెత్తి.. సార్వత్రిక ఎన్నికల వేళ పచ్చని సందేశాన్ని ఇచ్చింది. రైతుల సంక్షేమం, కౌలు రైతుల మేలు కోరి ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించాలంటూ కౌలు రైతులు గోంగూర విత్తనాలతో ఈ లోగోను ఆవిష్కరించారు.

- తెనాలి, ఆంధ్రజ్యోతి



టీడీపీ అధినేత చంద్రబాబును శాలువాతో సత్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

హిందూ, ముస్లింలు రెండు కళ్లు ముస్లింల రక్షణకు కట్టుబడి ఉన్నాం

- ముస్లిం మత పెద్దలతో ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు
- కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని, ప్రజలు స్వేచ్ఛ కోల్పోయి భయం గుప్పిట్లో బతుకుతున్నారని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. ముస్లింలపై మునుపెన్నడూ లేనన్ని అఘాయిత్యాలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువులు, ముస్లింలు తనకు రెండు కళ్లుగా భావించానని, ముస్లింల రక్షణకు టీడీపీ కట్టుబడి ఉందని అన్నారు. ముస్లింలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని, వారి రిజర్వేషన్లను కాపాడతామని హామీ ఇచ్చారు. విశాఖ నగరంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి ముస్లిం మతపెద్దలు, ఇతర ప్రతినిధులతో శుక్రవారం ఉదయం జరిగిన ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ముస్లింలను గాలికొదిలేశారని ఆరోపించారు. టీడీపీ తొలి నుంచీ ముస్లింలకు రక్షణ కల్పించిందని గుర్తుచేశారు. ఈనెల 13న జరగనున్న పోలింగ్‌లో రాష్ట్రంలోని ముస్లింలంతా ఏకపక్షంగా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని చంద్రబాబు కోరారు. టీడీపీ అధికారంలోకొచ్చాక పాత పథకాలను పునరుద్ధరించడంతోపాటు ముస్లింలకు మరికొన్ని అమలు చేస్తామని, మేనిఫెస్టోలో పలు పథకాలను పొందుపరచామని చెప్పారు. ముస్లింలకు 50 ఏళ్లకే పింఛన్, హజ్ యాత్రకు రూ.లక్ష, రూ.100 కోట్లతో నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటుచేసి ముస్లింలు ఆర్థిక పరిపుష్టి కోసం చర్యలు తీసుకుంటామన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేని రుణాలు, ఇమామ్‌ల గౌరవ వేతనం రూ.10 వేలకు పెంపు, మసీదుల నిర్వహణకు నిధులు కేటాయిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచామన్నారు. కడపలో ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం నెలకొల్పుతామని హామీ ఇచ్చారు.

జగన్‌కు ఓటేస్తే భవిష్యత్ ఉండదు

ప్రశ్నించే వారిపై దాడులు, ఖనిజ సంపదను దోచుకోవడం, మద్యం ఆదాయాన్ని పెంచుకోవడం... ఇవే వైసీపీ ప్రభుత్వ ఘనతలని చంద్రబాబు ధ్వజమెత్తారు. అవి సరిపోవన్నట్టుగా భూహక్కు పరిరక్షణ చట్టం పేరుతో ప్రమాదకరమైన జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టును తీసుకొచ్చారని ఆరోపించారు. జగన్‌ను సొంత కుటుంబ సభ్యులే నమ్మే స్థితిలో లేరని, పొరపాటున ఆయనకు ఓటేస్తే పుట్టబోయే బిడ్డలకు భవిష్యత్తు కూడా ఉండదని హెచ్చరించారు. తాజా ఎన్నికల్లో తాము బీజేపీతో కలవడం వెనుక రాష్ట్ర ప్రయోజనాలున్నాయని వివరించారు. ఉలేమా కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ఫరూఖీ అల్ ఖాసిమ్ మాట్లాడుతూ... గత ఐదేళ్లలో ముస్లింలకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. పార్లమెంటులో ఎన్‌డీఏ ప్రవేశపెట్టిన రెండు బిల్లులకు అనుకూలంగా ఓటు వేసిందని ఆరోపించారు. టీడీపీ మేనిఫెస్టోలో ముస్లింలకు అనేక పథకాలు పొందుపరిచారని, చంద్రబాబు రుణం తీర్చుకునే సమయం వచ్చినందున ప్రతి ముస్లిం ఆయనకు మద్దతు పలకాలని కోరారు. సమావేశంలో గుంటూరుకు చెందిన మౌలానా మోహబూబ్ రషీద్‌తో పాటు ఖారీ అబ్దుల్ రహీమ్‌సాహెబ్ (కడప), మరికొందరు పెద్దలు పాల్గొన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని కోరుతూ ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చంద్రబాబును శాలువాతో సత్కరించారు. కార్యక్రమానికి ఫారూఖ్ సాబుల్ అధ్యక్షత వహించగా టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి టీడీ జనార్దన్, విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్, అసెంబ్లీ అభ్యర్థులు వెలగపూడి రామకృష్ణబాబు (విశాఖ తూర్పు), సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ (విశాఖ దక్షిణ), పి.విష్ణుకుమార్‌రాజు (విశాఖ ఉత్తరం), పల్లా శ్రీనివాసరావు (గాజువాక), పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గన్నవరంలో



గన్నవరం ప్రజాగళం సభకు హాజరైన జనం, వర్షంలో మాట్లాడుతున్న చంద్రబాబు



ఒంగోలులో



ఒంగోలులో జరిగిన రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని

జగన్‌కు ఓటేస్తే ఉరితాడే!

- ఎండగా ఉందని ఇంట్లో పడుకుంటే.. ఎన్నికలయ్యాక ప్రతి ఇంటికీ గొడ్డలి వస్తుంది. అందుకే ఉదయం ఏడు గంటలకే అంతా ఓటు వేయాలి. పోలింగ్ కేంద్రాలు దద్దరిల్లిపోవాలి.
- పవన్ కల్యాణ్ నిజ జీవితంలోనూ హీరోయే. నన్ను జైలుకు పంపినప్పుడు స్వచ్ఛందంగా వచ్చి మద్దతిచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూడదని.. కూటమి ఏర్పడాలని ఆ రోజే ఆయన చెప్పారు.
- మన భూమి మన బిడ్డలకు దక్కాలంటే ఈ దొంగ బిడ్డను ఇంటికి తరలించాలి. జీవితాంతం కష్టబడి సంపాదించిన ఆస్తిని మెడపై కత్తి పెట్టి రాయించుకుంటున్నారు. - చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించారు. మండుటెండలో ఉండిలో, భారీవర్షంలోనూ గన్నవరంలో, ఒంగోలు నుంచి మాచర్ల ప్రజలతో వర్చువల్‌గా, ఒంగోలులో రోడ్‌షో నిర్వహించి భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. గత ఎన్నికల ముందు జగన్ ముద్దులుపెట్టి ఇప్పుడు గుద్దులు గుద్దుతున్నారని.. ప్రజల భూములు, ఆస్తుల కబ్జాకు ఏకంగా ల్యాండ్ టైటిలింగ్ చట్టమే తెచ్చారని విరుచుకుపడ్డారు. 'భూమి మీదా, జగన్‌దా? మీ భూమిపై ఆయన ఫొటో ఏంటి..? మీ భూమిని మీకు ఎవరిచ్చారు? ఈ జగన్ ఇచ్చాడా.. వాళ్ల తాత ఇచ్చాడా.. నాన్న ఇచ్చాడా? జగన్ ఇచ్చే భూమి పత్రాలకు సంబంధించిన జిరాక్స్ కాపీలను చించి చెత్తబుట్టలో వేయాలి. ఆయన మళ్లీ వస్తే మీ ఆస్తులు కొట్టేస్తాడు. ల్యాండ్ టైటిలింగ్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌ను ఆయనే నామినేట్ చేస్తాడట.. రిజిస్ట్రేషన్ చేయాలంటే ఆయన చెప్పిందే ఫైనల్ అట.. కోర్టుకు కూడా వెళ్లకూడదట.. జగన్ ప్రైవేటుగా పెట్టుకున్న వ్యక్తికి ప్రజల ఆస్తులపై పెత్తనమేంటి? వీటికి జగన్ సమాధానం చెప్పాలి. ప్రస్తుతం భూమికి సంబంధించి 10వన్, అడంగళ్ రికార్డులు ఉన్నా కొన్ని చోట్ల వైసీపీ నాయకులు భూమిని కాజేశారు. కొత్తచట్టంలో ఎంఆర్‌వో ఉండడు, ఆర్డీవో ఉండడట!! అందుకే హామీ ఇస్తున్నా. నేను అధికారంలోకి వచ్చిన వెంటనే రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపైనే. పట్టాదార్ పాస్‌పుస్తకంపై రాజముద్ర వేసి భూమిపై మీకు సర్వహక్కులు కల్పిస్తా. మంచి భవిష్యత్ కోసం ల్యాండ్ టైటిలింగ్ చట్టం కాపీలను చించి చెత్తబుట్టలో పారేద్దాం. సమయం లేదు మిత్రమా.. ఈ చట్టాన్ని మేం ఆమోదించబోమంటూ శనివారం సాయంత్రం 4 గంటలకు దాని ప్రతులను చించి చెత్తబుట్టలో పారేయండి' అని పిలుపిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో దొంగలు పడి భూములను కబ్జా చేశారు.. రికార్డులు మార్చేశారని తెలిపారు. వైసీపీని గెలిపించేందుకు కృషి చేస్తే మీ ఆస్తులూ ఉండవని వైసీపీ నాయకులను హెచ్చరించారు. ల్యాండ్ టైటిలింగ్‌పై మాట్లాడడానికి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఎవరని ప్రశ్నించారు. ఇంకా ఏమన్నారంటే..

జగన్ నవమోసాలు..

జగన్ నవరత్నాల పేరుతో నవమోసాలు చేశారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బాధ్యత నేను, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీసుకుని ఎలాంటి భేషజాలు లేకుండా పని చేస్తాం. మేమొచ్చాక గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తాం. దేశంలో నాలుగు కోట్ల ఇళ్లు నిర్మిస్తామని మోదీ హామీ ఇచ్చారు. అందులో భాగంగా రాష్ట్రంలో అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం. వృద్ధులకు ఏప్రిల్ నుంచే రూ.4 వేలు పింఛన్ ఇంటికే ఇస్తాం. జూలైలో మొత్తం ఏడు వేలు ఇస్తాం. బీసీ డిక్లరేషన్‌లో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తాం. ఓటుకు వైసీపీ 5 వేలు నుంచి 10 వేలు ఇస్తుంది. కానీ ఆ పార్టీకి ఓటు వేయొద్దు. రూ.13 లక్షల కోట్ల అప్పులు చేశారు. రాష్ట్రాన్ని పురోభివృద్ధి బాటలో నడపాలనే లక్ష్యంతోనే 3 పార్టీలం కలిసి వచ్చాం.

పిల్ల సైకోను ఓడించండి

గన్నవరంలో పిల్ల సైకో (ఎమ్మెల్యే వల్లభనేని వంశీ) ఉన్నాడు. మాతో పెట్టుకుంటే తోక కత్తిరిస్తా. ఆయన్ను ఈసారి చిత్తు చిత్తుగా ఓడించాలి. శాశ్వతంగా భూస్థాపితం చేయాలి. గన్నవరం టీడీపీ కార్యాలయాలన్నీ తగులబెట్టిన ఈ పిల్ల సైకోపై టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు వీరోచిత పోరాటం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయనకు సముచిత స్థానం కల్పిస్తా. అత్యధిక మెజారిటీతో ఆయన్ను, మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని గెలిపించాలి. శ్రమజీవి తాగే మద్యం రూ.60 నుంచి రూ.200కు పెంచేశాడు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఉరివేయాలి.. ఫ్యాన్ తిరగకూడదు. లేకపోతే మీ మెడకు ఉరితాడు వేస్తారు. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. రాష్ట్రానికి పరిశ్రమలు రప్పిస్తాం.

పవన్ త్యాగం మరువలేం..

రాష్ట్రం కోసం పోరాడుతున్న నాయకుడు పవన్ కల్యాణ్ త్యాగం మరిచిపోలేనిది. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ధ్యేయంతో.. పొత్తుతో గెలవాలని ప్రతిపాదించి అందరినీ ఒప్పించారు. రాష్ట్రాన్ని కాపాడాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకొచ్చింది. సైకిల్ గుర్తుపై ఓటేసి.. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి. మేం జట్టు కట్టింది ప్రజల కోసం. మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించిందే తెలుగుదేశం. దేశంలోని మత పెద్దలంతా టీడీపీ మద్దతివ్వడం సంతోషకరం. ఈ ఎన్నికల్లో జగన్ సాగిస్తున్న అరాచక పాలనకు ప్రజానీకం ముగింపు పలకాలి.

గన్నవరం నుంచి ఒంగోలుకు

చంద్రబాబు గన్నవరం సభలో పాల్గొన్న అనంతరం మాచర్ల సభకు హాజరై అక్కడి నుంచి ఒంగోలు చేరి రోడ్‌షో, బహిరంగ సభల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే గన్నవరం సభ అనంతరం మాచర్ల వెళ్లేందుకు వాతావరణం అనుకూలంగా లేక నేరుగా ఒంగోలు వచ్చారు.

90% పోస్టల్ బ్యాలెట్లు మాకే!

పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులతో పాటు పోలీసులు.. నూటికి 90 మంది కూటమికే ఓట్లు వేశారు. ఓట్లు వన్‌సైడ్ పడ్డాయి. పరిస్థితి ఏమిటో వైసీపీకి ఈపాటికే అర్థమైంది. ఉద్యోగులకు ఓటుకు ఐదు వేలు ఇవ్వబోతే మాకు నీతి ఉందని చెప్పి.. మీరిచ్చే అవినీతి డబ్బులు వద్దని తిరస్కరించారు. ఉద్యోగులు చరిత్రను తిరగరాస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో సత్తా చూపారు. పోలీసులు సైతం బహిరంగంగానే మద్దతు ఇచ్చారు. అలాంటి ఉద్యోగుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చి పనిచేస్తా. మళ్లీ జగన్ వస్తే ఉద్యోగుల జీతాలు తగ్గించేందుకు రివర్స్ పీఆర్సీ వేస్తాడన్న విషయం గుర్తుంచుకోవాలి.

చిత్తూరులో చివరి సభ.. చంద్రబాబు సెంటిమెంట్

చిత్తూరు, తిరుమల, మే 10(ఆంధ్రజ్యోతి): చంద్రబాబుకు చిత్తూరు సెంటిమెంట్ ఉంది. శనివారం ప్రచారానికి ఆఖరి రోజు కావడంతో ఆయన వరుసగా మూడు సభల్లో... నంద్యాల, హిందూపురం, చిత్తూరులో పాల్గొంటారు. 2014 ఎన్నికల్లో ఆయన చిత్తూరులోనే చివరి ప్రచార సభను నిర్వహించారు. అప్పుడు ఎన్నికల్లో గెలిచి సీఎం అయ్యారు. అదే సెంటిమెంటును ఇప్పుడూ కొనసాగిస్తూ చిత్తూరు సభతో తన ప్రచారానికి ముగింపు పలకనున్నారు. కాగా, చంద్రబాబు శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. చిత్తూరులో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభతో ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికి సాయంత్రం 6.30 గంటలకు తిరుమలలోని గాయత్రి అతిథి గృహానికి చేరుకుంటారు. అర్ధగంట తర్వాత కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు.

ఇసుక అక్రమ తవ్వకాలు తక్షణం ఆగాలి

- జగన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, మే 10(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని జగన్ సర్కారును సుప్రీంకోర్టు ఆదేశించింది. మైనింగ్ జరిగే ప్రాంతాలకు వెంటనే వెళ్లి ఈ తవ్వకాలను ఆపేయించాలని ఆదేశాలు జారీచేసింది. కేంద్ర పర్యావరణశాఖ అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకోవాలని, అక్రమ మైనింగ్‌ను నిలిపివేశారా లేదా తనిఖీలు చేయాలని ఆదేశించింది. అక్రమ మైనింగ్‌పై తాము తగిన చర్యలు తీసుకున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను కోర్టు తిరస్కరించింది. 'మీ చర్యలు అన్నీ కాగితాలపై కనిపిస్తున్నాయి. కానీ ఆచరణలో కనిపించడం లేదని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీం గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మాత్రం ఖాతరు చేయలేదని పిటిషన్‌దారు దండా నాగేంద్ర కుమార్ అనే పిటిషనర్ ఆధారాలతో సహా వివరించారు. దీంతో సర్కారుపై బెంచ్ ఆగ్రహం ప్రకటించింది. అక్రమ మైనింగ్‌ను ఆపాలని, అనుమతి ఉన్నచోట యంత్రాలను ఉపయోగించవద్దని సుప్రీంకోర్టు గతనెల 29న ఆదేశాలు జారీచేసిన తర్వాత కూడా అక్రమ మైనింగ్ జరుగుతోందని నాగేంద్ర కుమార్ చెప్పడంతో.. కోర్టు తీవ్రంగా పరిగణించింది. అక్రమ మైనింగ్ జరుగుతున్న తీరును తేదీ, సమయం, వాహనాల ఫొటోలను కోర్టు ముందుంచారు. ఈ అంశాలపై వచ్చే గురువారంలోగా అఫిడవిట్ సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలు వివరించాలని కోరింది. తవ్వకాలు నిలిపేశాకే నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను కోర్టు మే 15కు వాయిదా వేసింది. నాగేంద్ర కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. అక్రమ మైనింగ్‌పై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని, జగన్‌ను, బాధ్యులైన అధికారులను జైలుకు పంపాలని కోరారు.

బాబు కోసం కాంగ్రెస్ కుట్రలు

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆయన మనిషి
- అవినాశ్ చిన్నపిల్లాడు.....: మరోసారి జగన్ సమర్థన
- మంగళగిరి, పుత్తూరు, కడపలో ప్రచారసభలు



కడప నగరంలో జగన్ రోడ్‌షో

పుత్తూరు, మే10(ఆంధ్రజ్యోతి)/కడప(ఎర్రముక్కపల్లె), మంగళగిరి: తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని గెలిపించడం కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని సీఎం జగన్ అన్నారు. చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు, ఎంపీ అవినాశ్‌రెడ్డిని చిన్నపిల్లాడు అంటూ మరోసారి వెనుకేసుకువచ్చారు. సంబోధించారు. శుక్రవారం కడప, గుంటూరు జిల్లా మంగళగిరి, తిరుపతి జిల్లా పుత్తూరుల్లో జరిగిన ప్రచార సభల్లో జగన్ మాట్లాడారు. కడప సభలో కాంగ్రెస్ పార్టీపై జగన్ విరుచుకుపడ్డారు. "రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్ బరితెగించింది. వైసీపీ ఓట్లు చీల్చడం ద్వారా చంద్రబాబుకు, ఎన్డీయే కూటమికి లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ఆ పార్టీ రాష్ట్రంలో రంగ ప్రవేశం చేసింది. ఎన్నికల వేళ కాంగ్రెస్ నేతలు రాష్ట్రానికి ఎందుకు వచ్చారో ఆలోచించాలి. చంద్రబాబు రాజకీయాల్లో ఇది భాగం. ఆయన మనిషి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. రాజశేఖరరెడ్డి బతికి ఉన్నప్పుడు ఎవరితో అయితే యుద్ధం చేశారో, వారితోనే ప్రస్తుతం వైఎస్ వారసులమని చెప్పుకొంటున్నవారు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నా"రంటూ షర్మిలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఓట్లు చీల్చి చంద్రబాబును గెలిపించడం కోసం కోసమే ఇదంతా చేస్తున్నారని జగన్ ఆరోపించారు. వైఎస్ మరణం తరువాత ఆయన పేరును చార్జిషీట్‌లో పెట్టిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. ఇప్పుడేమో చార్జిషీట్‌లో మనమంతట మనమే వైఎస్ పేరు చేర్చామని కొత్త కథలు చెబుతున్నారంటూ షర్మిలను ఉద్దేశించి మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మన కళ్లు మనమే పొడుచుకున్నట్టేనన్నారు. అవినాశ్‌పై తనకు నమ్మకం ఉన్నదని జగన్ చెప్పారు. "అవినాశ్ నాకన్నా 13 ఏళ్లు చిన్నపిల్లోడు. మా అందరికన్నా చిన్నపిల్లోడు.. ఈ పిల్లాడి జీవితం నాశనం చేయడం కోసం చంద్రబాబు దగ్గర నుంచి కుట్రలు పన్నుతున్నారు. కడప జిల్లాలో రాజకీయ శూన్యతను సృష్టించి, అందులోకి వారు రావాలని కుట్రలు చేస్తున్నారని, దానికోసం అవినాశ్ జీవితం నాశనం చేయడానికి చూస్తున్నారు" అంటూ ఎంపీని వెనకేసుకువచ్చారు.. కాగా, జగన్ పర్యటన సందర్భంగా క్రిష్ణ సర్కిల్ నుంచి పాత మున్సిపాలిటీ కార్యాలయం అలాగే దేవునికడప ఆర్చి వరకు బారికేడ్లు నిర్మించడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. కాగా, ఐదేళ్లలో వివిధ పథకాల కోసం 130 సార్లు బటన్ నొక్కానని జగన్ చెప్పుకొన్నారు. కాగా, అమరావతిలో నిర్వహించిన ఏకైక ప్రచారసభలో జగన్ రాజధాని ఊసే ఎత్తకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. కనీసం భూములిచ్చిన రైతులకు కౌలు డబ్బుల చెల్లింపు గురించికానీ, రాజధాని రైతుల సంక్షేమ పథకాలను గురించి కానీ ప్రస్తావించలేదు. వాస్తవానికి అమరావతి విధ్వంసంపై ఈ ప్రాంత ప్రజల్లో చాలా బాధ ఉంది. అయిదేళ్ల తరువాతనైనా జగన్ మనసు మారి అమరావతి రైతులకు ఊరట కలిగేలా ఏదైనా ప్రత్యేక ప్రకటనలు చేస్తారేమోనని వైసీపీ అభిమానులు కొందరు ఆశగా ఎదురుచూసినప్పటికీ జగన్ తన 45 నిమిషాల ప్రసంగంలో ఆ ప్రస్తావనే తీసుకురాలేదు.

జగన్.. ముందు ఇల్లు సరిదిద్దుకో: రేవంత్

హైదరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): జగన్ విమర్శలపై సీఎం రేవంత్ స్పందించారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీట్ ద ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. జగన్ మాటలను సొంత చెల్లి, కన్నతల్లే విశ్వసించడం లేదని, కాబట్టి ఆయన మాటలకు విలువ లేదని కొట్టిపారేశారు. ముందుగా చెల్లి, కన్నతల్లి మాటలకు బదులివ్వాలని సూచించారు. కుటుంబ సమస్యలు పరిష్కరించుకోవాలని జగన్‌ను కోరుతున్నానన్నారు. చంద్రబాబుపై గౌరవం ఉందని, కానీ, రాజకీయ సంబంధాలు లేవని చెప్పారు. ఏపీలో షర్మిల సీఎం అవుతారని, అక్కడ పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తామన్నారు.



పిఠాపురం సభకు హాజరైన జనం

ఆస్తుల రక్షణకు కూటమికే ఓటేయండి

లేదంటే జగన్ వచ్చి ప్రజల ఆస్తులు అమ్మేస్తాడు

- వైసీపీ నేతలకు తెలుగుజాతి తలవంచదు.. వారిని మట్టిలో పాతేస్తాం: పవన్
- పిఠాపురం రోడ్ షోకు బ్రహ్మరథం

కాకినాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పీఠం కూటమిదేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ ఆస్తులు రక్షించుకోవాలంటే ప్రజలంతా కూటమికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. లేదంటే జగన్ మళ్లీ వచ్చి మీ ఆస్తులు లాగేసుకుంటారని హెచ్చరించారు. ఎన్నికలకు ముందే జగన్ ఓటమితో భయపడిపోతున్నారని, అందుకే వైసీపీ ఓటుకు రూ.5వేల వరకూ పంచుతోందని అన్నారు. ఆ డబ్బులు తీసుకుని.. ఓటు మాత్రం కూటమి అభ్యర్థులకే వేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పవన్ కల్యాణ్ శుక్రవారం పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా రోడ్ షో నిర్వహించారు. అనంతరం పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..

జాగ్రత్తగా ఆలోచించి ఓటేయండి

ఎన్నికలకు ఇంకా రెండు రోజులే ఉంది. ఓటేసే ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఆలోచించండి. జగన్ ప్రభుత్వం తెచ్చిన భూహక్కు చట్టం భూ కబ్జా చట్టంగా మారింది. జగన్ మళ్లీ వస్తే ప్రజల ఆస్తులు గాల్లో దీపాలే. విశాఖలో ప్రభుత్వ భూములు తాకట్టుపెట్టి రూ.25వేల కోట్లు అప్పు తెచ్చిన జగన్ భవిష్యత్తులో ప్రజల ఆస్తులు లాగేసుకుంటాడు. పాస్‌బుక్‌పైనా, సర్వే రాళ్లపైనా అతడి బొమ్మ వేయించుకున్న జగన్ మీ ఆస్తులు కాపాడతాడనే నమ్మకం ఏంటి? జగన్‌లా నేను అబద్ధాలు చెప్పను. మేనిఫెస్టోలో ఏం చెప్పామో.. అది అమలయ్యేలా చూసే బాధ్యత నాది. 20 లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తారని జగన్ అడుగుతున్నారు. దొంగ మద్యంతో ఆయన వేలకోట్లు దోపిడీ చేసి డబ్బులు సంపాదించినప్పుడు ప్రజల కోసం మేం కొత్త ఆలోచనలతో ఖజానా నింపలేమా..? యువతకు ఉద్యోగాలు ఇచ్చి చూపిస్తాం. రాష్ట్రం దశ, దిశను మార్చే ఎన్నిక పిఠాపురం నుంచే జరగబోతోంది. ఇది మామూలు ఎన్నిక కాదు. దేశంలో ఏపీ బలమైన రాష్ట్రంగా తయారవడానికి పిఠాపురం నుంచే బీజం పడబోతోంది. ఈ ఎన్నికల్లో వైసీపీ భారీగా డబ్బులు పంచుతోంది. ఇదంతా ప్రజల సొమ్మే. ఓటుకు లక్ష ఇచ్చినా తీసుకోండి. కానీ ఓటు మాత్రం కూటమికే వేయండి.



పిఠాపురం రోడ్ షోలో పవన్ కల్యాణ్, వర్మ

నా భార్య భయపడింది..

మా నాన్న నాకు ఆస్తిపాస్తులివ్వలేదు. ధర్మంగా బతకాలని మాత్రమే చెప్పారు. కష్టం చేయకపోతే బాదేస్తానన్నారు. అందుకే నేను ధర్మం కోసం పనిచేస్తున్నా. ఈ క్రమంలో వైసీపీ వాళ్లు నా భార్యను తిట్టారు. ఆమె ఈ దేశానికి చెందినది కాదు. ఈ రాజకీయాలు తెలియవు. తనను ఎందుకు తిడుతున్నారని నన్ను అడిగింది. భయపడింది. అప్పుడు నా భార్యను క్షమించమని అడిగాను. ఎన్నికల రోజు పిఠాపురం వస్తే రాజకీయాల్లో ఎందుకు నిలబడ్డానో నీకే తెలుస్తుందని చెప్పాను. నా కోసం ప్రచారం కోసం వచ్చిన సాయిధరమ్ తేజ్‌పై గాజుసీసాతో దాడి చేశారు. పవన్ ప్రతిఒక్కరినీ గుండెల్లో పెట్టుకుంటాడు. నన్ను తిట్టినా భరిస్తా.. నా ప్రాణాన్ని బలిదానంగానైనా ఇస్తా. వైసీపీ గూండాలకు ఒకటే హెచ్చరిస్తున్నా. పవన్ సంగతి మీకు తెలియదు.

పవన్ రోడ్ షోకు పోటెత్తిన జనం

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పవన్ కల్యాణ్ శుక్రవారం ఇక్కడ రోడ్ షో నిర్వహించారు. 216వ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. దారిపొడవునా మహిళలు పూలవర్షం కురిపించారు. హారతులిచ్చారు. పవన్ బైపాస్ రోడ్ మీదుగా గొల్లప్రోలు చేరుకున్నారు. అక్కడినుంచి 216వ జాతీయ రహదారి, చేబ్రోలు శివాలయం, మల్లవరం సెంటర్ మీదుగా ఏకేమల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో రోడ్‌షో కొనసాగించారు. తర్వాత కొత్తపల్లి మండలంలో రోడ్‌షో సాగింది.

నేటితో ప్రచారానికి తెర

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా రాష్ట్రంలో హోరాహోరీగా సాగుతున్న ఎన్నికల ప్రచారానికి నేటితో తెర పడనుంది. 11వ తేదీ సాయంత్రం 6గంటలకు 169 నియోజకవర్గాల్లో ప్రచార పర్వం ముగుస్తుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో సాయంత్రం 5గంటలకు, అరకు వ్యాలీ, పాడేరు, రంపచోడవరం, నియోజకవర్గాల్లో సాయంత్రం 4గంటలకే ప్రచారం ఆపేయాలని ఆదేశించారు. ప్రచారంతో పాటు మద్యం విక్రయాలు కూడా అదే సమయానికి నిలిపేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అన్ని జిల్లా ఎన్నికల యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం చివరి 72 గంటల్లో, పోలింగ్ రోజున చేయాల్సిన ఏర్పాట్లను ఆయన వివరించారు. హింసకు, రీపోలింగ్‌కు తావులేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యూహాత్మక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 11న సాయంత్రం 6గంటల నుంచి పోలింగ్ ముగిసే సమయానికి 48గంటల ముందు నుంచి నిశ్శబ్ద కాలం (సైలెన్స్ పీరియడ్) అమల్లోకి వస్తుందని తెలిపారు. ఆ సమయంలో ప్రచారానికి తెరపడుతుందని, కోడ్‌ను ఎవరూ ఉల్లంఘించ కూడదని పేర్కొన్నారు. లౌడ్‌స్పీకర్లను అనుమతించకూడదని, బహిరంగ సభలు, చట్టవిరుద్ధమైన సమావేశాలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేస్తామని వివరించారు. పోల్ ముగింపు సమయం ఆధారంగా 48 గంటల డ్రై డే సమయాన్ని సవరిస్తామని తెలిపారు. నియోజకవర్గం వెలుపల నుంచి ప్రచారం నిమిత్తం వచ్చినవారంతా ప్రచార సమయం ముగిసిన వెంటనే అక్కడినుంచి వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న ఆఫీస్ బేరర్లు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంగా ప్రకటించిన ప్రదేశంలో మాత్రమే ఉండాలని, తమ పార్టీ కార్యాలయాన్ని దాటి బయటకు వెళ్లకూడదన్నారు. అయితే ఆలయ పట్టణాల్లోని యాత్రికులకు, పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన సమయం ముగిసే 48గంటల వ్యవధిలో రాజకీయ స్వభావం గల బల్క్ ఎస్ఎంఎస్‌లను పంపడం నిషేధించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీ, ఎన్నికల కార్యకర్తల ద్వారా అలాంటి సందేశం ఏ ఓటరుకైనా అందితే, విచారణ కోసం సదరు మొబైల్ నంబర్‌ను, ఆ సందేశాన్ని పోలీసులకు పంపాలని మీనా కోరారు. 48గంటల వ్యవధిలో పోలింగ్ ప్రాంతంలో సినిమా, టెలివిజన్ లేదా ఇతర ఉపకరణాల ద్వారా ఎలాంటి ఎన్నికల అంశాలను ప్రదర్శించకూడదని ఆదేశించారు. పోలింగ్ రోజు, ఎన్నికల ముందు ప్రింట్ మీడియాలో రాజకీయ ప్రకటనలను రాష్ట్ర, జిల్లా ఎంసీసీ నుంచి ముందస్తు ధ్రువీకరణతో ప్రచురించుకోవచ్చని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4,44,216

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో 4,44,216 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయని రాష్ట్ర సీఈవో మీనా ప్రకటించారు. మొత్తం 25 పార్లమెంటరీ నియోజకవర్గాలకు గాను 4,44,216 ఓట్లు, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 4,44218 పోస్టల్ బ్యాలెట్లు పోలైనట్లు వివరించారు. ఈ నెల 4 నుంచి 9 వరకూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగిందని, ఇందులో పెద్దఎత్తున ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గంలో అత్యధికంగా 22,650 ఓట్లు, అమలాపురం స్థానంలో అత్యల్పంగా 14,526 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. పోలైన పోస్టల్ బ్యాలెట్లను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఎంఎస్ బేగ్ నివాసంలో తనిఖీలు



ఎంఎస్ బేగ్ నివాసంలో తనిఖీలు నిర్వహించిన ఎన్నికల అధికారులు, పోలీసులు

వన్‌టౌన్, మే 10 : పశ్చిమ నియోజకవర్గంలోని టీడీపీ మైనార్టీ నాయకుడు ఎంఎస్ బేగ్ నివాసంలో శుక్రవారం మోడల్ కోడ్ అమలు నిఘా విభాగం అధికారులు, పోలీసులు సంయుక్తంగా రెండు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ తన ఇమేజ్‌ను దెబ్బకొట్టాలని ఎన్నికల అధికారులకు వైసీపీ నాయకులు తప్పుడు ఫిర్యాదు చేసుంటారని విమర్శించారు. తన కార్యాలయంలో, నివాసంలో తనిఖీ చేయడంపై ఆయన ఆగ్రహించారు. ఇది మైనార్టీలపై దాడి అని అభివర్ణించారు. జగన్మోహనరెడ్డిలాగా తాను సూట్‌కేస్ పంపిణీ పెట్టి ఎవ్వరినీ మోసం చేయలేదన్నారు. తన కుటుంబం నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిందన్న సంగతి పశ్చిమ నియోజకవర్గంలో అందరికీ తెలిసిందేనన్నారు.

దుర్గగుడిలో లక్ష్మీయాగం



అక్షయ తృతీయ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన లక్ష్మీయాగం

వన్‌టౌన్, మే 10 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అక్షయతృతీయ సందర్భంగా శుక్రవారం మహాలక్ష్మీ యాగాన్ని ఆర్జిత సేవగా నిర్వహించారు. పూజలో, పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో రామరావు దంపతులు పాల్గొన్నారు. దుర్గగుడి ప్రధాన ఆలయగోపురంలో మిగిలిన సగభాగానికి స్వర్ణతాపడం నిమిత్తం దేవస్థానం విరాళాలు సేకరిస్తోంది. ఈ క్రమంలో విజయవాడ శివారు అంబాపురానికి చెందిన సంబంగి లావణ్య, కుటుంబసభ్యులు శుక్రవారం ఆలయ అధికారులను కలిసి చెక్కురూపంలో లక్ష రూపాయలు విరాళం అందించారు. అన్నవితరణ కార్యక్రమానికి కడప జిల్లా ప్రొద్దుటూరు సుందరాచార్యులు వీధికి చెందిన నగరూరు రామాంజనేయులు, సుచరిత దేవస్థానం అధికారులను కలిసి రూ.1,11,116 విరాళం అందజేశారు.

కూటమికే కళాకారుల మద్దతు

కళాకారుల సంఘం ప్రతినిధులు

విజయవాడ కల్చరల్, మే 10 : గత ఐదేళ్ల పాలనలో కళాకారులను వైసీపీ ప్రభుత్వం బిచ్చగాళ్లలాగా మార్చిందని, ఇటువంటి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చేందుకు కళాకారులు ఏ రూపంలోనూ సహకరించబోరని, త్వరలో జరుగనున్న ఎన్నికల్లో మూడు పార్టీల కూటమికే రాష్ట్రస్థాయి రంగస్థల, వాయిద్య గాయని, గాయకులు అనుబంధ రంగాల కళాకారులందరూ మద్దతు తెలుపుతున్నారని కళాకారులు నిర్వాహకులు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకులు సూర్యదేవర జగన్నాథరావు, నటరాజ సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు మద్దాలి ప్రకాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నగరంలో, రాష్ట్రంలో కళారంగం ఎంతో వైభవంగా కళాకాంతులతో ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కళాకారుల సంక్షేమాన్ని, వారి జీవన ప్రమాణాలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లిందన్నారు. త్వరలో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వంలో తమ ఆకాంక్షలు నెరవేరుతాయని భావిస్తున్నామన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ కళారంగం ద్వారా ఎంతోమందికి మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్న కళాకారుల జీవితాల్లో చీకటి నింపిన ప్రభుత్వం గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. సమావేశంలో వివిధ కళాసంస్థలకు చెందిన ప్రతినిధులు నందివాడ నాని, బాయన శ్రీనివాసరావు, వరదరాజు, బొర్రా నరేన్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో గంజాయి రాష్ట్రంగా ఏపీ

● కోపూరి శ్రీలక్ష్మి

ధర్నాచౌక్, మే 10 : గత ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మారిందని, గంజాయి అమ్మకాన్ని ఒక కుటీర పరిశ్రమగా మార్చారని ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి శ్రీలక్ష్మి ధ్వజమెత్తారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా గుంటూరు రూరల్ మండలం స్వర్ణ భారతీనగర్ మారిందని వైసీపీ నేతలే అక్కడ అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మైనర్ బాలులు, యువకులు గంజాయికి బానిసై ఆ మత్తులో బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీఎం జగన్‌తో పాటు పోలీస్ ఉన్నతాధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. ఈ ఎన్నికల్లో వైసీపీని ఓడించడం ద్వారా గంజాయిను అరికట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఎన్డీఏ కూటమిని గెలిపించండి : భానుసింగ్

ధర్నాచౌక్, మే 10 : బొందిలి కులాన్ని ఓబీసీలో చేర్చాలంటే కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రావాలని రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర టీడీపీ బొందిలి సాధికారత సమితి కన్వీనర్ ఎస్.సీ.భానుసింగ్ పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన బలపరిచిన బీజేపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరిని గెలిపించాలని కోరుతూ బొందిలి కుటుంబాలను కలిశారు. బీజేపీ నేత ప్రసాద్, సమితి నాయకులు ఎన్.వేణుగోపాల్‌సింగ్, ఎన్.లక్ష్మణ్‌సింగ్ పాల్గొన్నారు.



విజయవాడ పశ్చిమంలో టీడీపీదే హవా : కేశినేని చిన్ని

విద్యాధరపురం, మే 10 : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ హవా నడుస్తుందని.. ఓటమి భయంతో వైసీపీ చేసే అసత్య ప్రచారాలను నమ్మవద్దని మైనార్టీ సోదరీసోదరమణులకు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. శుక్రవారం ఎన్‌టీఆర్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వైసీపీ పార్లమెంట్ ప్రచార కార్యదర్శి షేక్ ఆశా ఆమెకు మద్దతుగా 56వ డివిజన్ ఆర్‌ఆర్ పేటకు చెందిన 350 మంది మైనార్టీ మహిళలు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. టీడీపీ నాయకులు మహమ్మద్ ఫతావుల్లా, షేక్ ఆశాల ఆధ్వర్యంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి షేక్ ఆశా, శివనాథ్‌లు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ ఓటమి భయంతో వైసీపీ చేసే ప్రచారాలను మైనార్టీ సోదరీసోదరమణులు నమ్మవద్దని చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే జగన్ నిలిపివేసిన దుల్హాన్ పథకాన్ని తిరిగి అమలు చేయడంతో పాటు రేపటి భవిష్యత్తు కోసం ఎదురుచూసే వారందరికి మంచి చేస్తామన్నారు. మైనార్టీలకు ఏదైన సమస్య ఉంటే మహమ్మద్ ఫతావుల్లా కార్యాలయంలో చెప్పినట్లు అయితే తానే స్వయంగా అక్కడకు వచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని వారంతా గురునానక్‌కాలనీ దాకా రావాల్సిన పని లేదని స్పష్టం చేశారు. సల్మా, లక్ష్మీ, షాహేదా, షేక్ నసీమా, నుర్జాహన్, లాల్‌బీ వంటి మహిళ ముఖ్య కార్యకర్తలు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు.

జగన్‌ను గద్దె దించడమే అన్ని వర్గాల ప్రజల అభిమతం

విద్యాధరపురం : అమరావతి రాజధాని కోసం పోలవరం నిర్మాణం, యువత భవిష్యత్తులను కాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరూ జగన్‌ను గద్దె దించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని అన్ని వర్గాల ప్రజలు అతనిని అధికార పీఠం నుంచి దించేందుకు సిద్ధంగా ఉన్నారని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలో ఎన్‌టీఆర్ భవన్‌లో శుక్రవారం అమరావతి రన్నర్స్ బృందం ఆయనను కలిసింది. ఈ సందర్భంగా శివనాథ్ వారితో అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రాగానే రెండు సంవత్సరాల కాలంలోనే అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేశారన్న ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా అమరావతి రన్నర్స్ ప్రెసిడెంట్ రావి రమేష్‌బాబు మాట్లాడుతూ తాము ఇప్పటివరకు ఏ పార్టీ జెండా పట్టుకోలేదని సొసైటీ ఫిట్‌నెస్, యువత భవిష్యత్తు కోసం టీడీపీకి ప్రచారం చేస్తున్నామని చెప్పారు. అంతకముందు టీడీపీకి ఎన్నికలలో విజయం సాధించాలని కాంక్షిస్తూ రన్నర్స్ బృందం ర్యాలీ నిర్వహించింది. ఎంజీ రోడ్డులో ప్రారంభించి వీపీ సిద్ధార్థ స్కూల్, మొగల్రాజపురం, గుణదల, క్రీస్తురాజపురం, ఎన్‌టీఆర్ కాలనీ, వెటర్నరీ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీల మీదుగా గురునానక్ కాలనీలోని ఎన్‌టీఆర్ భవన్‌కు చేరుకుంది. టీం సభ్యులు సత్యనారాయణ, రమణారావు, సాధినేని సతీష్, లలిత, సుభాని, తనూజ, సుమ, రిషికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చేతిలో ఈడీ, సీబీఐ

- దేశ సందంతా అదానీ, అంబాలనీలకు..
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- నగరంలో ఉత్సాహంగా ఇండియా కూటమి బహిరంగ సభ






వేదికపై మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే, పక్కన సీతారాం ఏచూరి, డి.రాజా తదితరులు.. సభకు హాజరైన జనం

విజయవాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఈడీ, సీబీఐలను ప్రధాని మోదీ తన గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలపై ఇష్టానుసారం దాడులు చేయిస్తున్నారని, అంబానీ, అదానీలపై ఎందుకు దాడులు చేయించడంలేదని ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పదేళ్లలో ఆయన ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం విజయవాడ గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించారు. మోదీ ఇచ్చిన గ్యారంటీలు ప్రజల కోసమా లేక తనకు, అమిత్‌షా కోసమా అని ప్రశ్నించారు. పదేళ్ల బీజేపీ హయాంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క ప్రజల ఆదాయం తగ్గిపోతుందన్నారు. బీజేపీ పదేళ్ల కాలంలో మోదీ, అమిత్‌షా వారి మిత్రుల ఆదాయం మాత్రం పెరుగుతోందని అన్నారు. అంబానీ, ఆదానీలు దేశాన్ని లూటీ చేస్తున్నారన్నారు. దేశంలో వారికే ఎందుకు పన్ను మినహాయింపులు ఇస్తున్నారని ప్రశ్నించారు. రాజ్యాంగ వ్యవస్థలను తన చేతుల్లో పెట్టుకుని మోదీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. మోదీ, అమిత్‌షాలు దేశ సంపదను అమ్మేస్తున్నారన్నారు. దేశంలో 30లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని ఇప్పటి వరకు భర్తీ చేయలేదన్నారు. ఈ ఉద్యోగాల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. మోదీ దేశాన్ని విభజించి, వేర్వేరు భాషల మధ్య వివాదాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో లౌకిక వాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని సమాధి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రిజర్వేషన్ ప్రాథమిక హక్కని, వాటిని రద్దు చేయడానికి బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.ఎ.గఫూర్, కూటమి సెంట్రల్ అభ్యర్థి సి.హెచ్.బాబూరావు పాల్గొన్నారు.

మోదీ బుర్రకథకు టీడీపీ, జనసేన తందానా..


- ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి



రాష్ట్రంలో మోదీ చెప్పిన బుర్రకథకు టీడీపీ, జనసేన తందానా అంటున్నాయని సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. వైసీపీ రాష్ట్రంలో సింహాసన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. తాను సింహాసనం దిగను, ఏదైనా తనకే కావాలన్న విధంగా జగన్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పదేపదే రాముడి గురించి మాట్లాడుతున్న మోదీ మహాభారతం మరచిపోయారని ఎద్దేవా చేశారు. మహాభారతంలో దుశ్శాసనుడు రాజకీయాలను మోదీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ రాజకీయాలతో దేశాన్ని, లౌకికవాదాన్ని నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దుశ్శాసన, సింహాసన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య రాజకీయాలు చేస్తేనే ఇండియాను, ప్రజలను కాపాడుకోగలమని చెప్పారు. దేశాన్ని రక్షించుకుంటూ రాబోయే రోజుల్లో ఉత్తమ భారతదేశాన్ని నిర్మిద్దామన్నారు. దేశ ప్రజలందరి ముందు దేశాన్ని కాపాడుకోవడమన్న లక్ష్యం ఉందన్నారు. దేశంలో బీజేపీ మత విద్వేషాల పాలన సాగిస్తోందన్నారు. ఎవరికి ఇష్టం వచ్చిన మతాన్ని వారు విశ్వసించే హక్కు ప్రజాస్వామ్యంలో ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు రూ.16లక్షల కోట్ల రుణాలను కేంద్ర మాఫీ చేసిందన్నారు. రైతులు తీసుకున్న స్వల్ప రుణాలను మాత్రం బలవంతంగా వసూలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రకటించిన బీజేపీ దాని గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ పదేళ్ల కాలంలో పోలవరం ప్రాజెక్టును బీజేపీ పూర్తి చేయలేదన్నారు.

మోదీని దించేద్దాం..

- సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా



రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో ఉన్న విధ్వంసకర బీజేపీ ప్రభుత్వాన్ని, మోదీని ఇంటికి పంపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు దేశానికి, ప్రజల భవిష్యత్తుకు చాలా కీలకమన్నారు. ఎన్డీఏకు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని నిలదీశారు. డీజిల్, పెట్రోలు, గ్యాస్ ధరలు తగ్గిస్తానని చెప్పిన మోదీ ఆ పని చేయలేదన్నారు. దేశ ప్రజలకు మోదీ అబద్ధపు హామీలు ఇచ్చారని మండిపడ్డారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోదీ చెప్తే వారు ఇప్పుడు కనీస మద్దతు ధర కోసం ఢిల్లీ వీధుల్లో ఎందుకు పోరాటం చేశారని ప్రశ్నించారు. వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనంలో ఒక్క రూపాయి వెనక్కి తీసుకురాలేదన్నారు. డాలర్‌తో రూపాయి విలువ తగ్గుతుందంటే అది దేశానికి అగౌరవమన్నారు. రాజ్యాంగాన్ని మోదీ పదేళ్లకాలంలో విధ్వంసం చేశారని మండిపడ్డారు. దేశాన్ని మతపరమైన ఇండియాగా బీజేపీ మార్చడం ఒక పెద్ద ఉపద్రవమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశమంతా ప్రజలందరిదని రాజ్యాంగం చెబుతుంటే ఆర్‌ఎస్‌ఎస్ మత పరంగా విభజిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రాలకు ఉన్న అధికారాలను కేంద్రం తన చేతుల్లో పెట్టుకుందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఏ క్షణాన అయిన ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందని ఆందోళన చేశారు.

మద్యంతోనే దారుణాలు

- సర్కారుకు తెలిసే ఏవోబీలో గంజాయి సాగు
- మద్యంపై రూ.1.05 లక్షల కోట్ల వ్యాపారం
- శాంతిభద్రతలపై సదస్సులో జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న వి.లక్ష్మణరెడ్డి, వేదికపై రంగనాయకమ్మ, హైకోర్టు న్యాయవాది పి.రవితేజ తదితరులు

విజయవాడ/మొగల్రాజపురం, మే 10 : ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు క్షీణించడంతో పాటు ప్రమాదాలు, నేరాలు, హత్యలు, దాడులకు వైసీపీ ప్రభుత్వం మద్యం పాలసీకి అవినాభావ సంబంధం ఉందని జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అన్నారు. టీమ్ స్వేచ్ఛ ఆధ్వర్యంలో విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో రాష్ట్రంలో 2014-2024 వరకు శాంతి భద్రతలు - విశ్లేషణపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో జగన్ నవరత్నాల్లో ఒక రత్నంగా మద్యనిషేధం గురించి చెప్పారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఓటు అడగటానికి మద్యనిషేధం చేసి వస్తానని నమ్మించాడన్నారు. దాన్ని విశ్వసించే తాను మద్య విమోచన కమిటీకి చైర్మన్ పదవిని తీసుకున్నానని చెప్పారు. తాను పదవిలో ఉన్న మూడేళ్ల కాలంలో సీఎం, మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడా మద్యనిషేధంపై ఎలాంటి సమీక్షలు చేయలేదని విమర్శించారు. మద్యం వినియోగం ఎలా తగ్గించాలన్న దానిపై ప్రణాళికలు సిద్ధం చేయలేదన్నారు. మద్యం ధర పెంచడంతో ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులు, పేద, మధ్యతరగతి వారు గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రా, ఒడిసా మధ్య వేలాది ఎకరాల్లో గంజాయి పండిస్తున్నారన్న విషయం ప్రభుత్వానికి తెలుసునన్నారు. మిలటరీ, రెండు రాష్ట్రాల పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేస్తే 30 రోజుల్లో గంజాయి లేకుండా చేయవచ్చన్నారు. వైసీపీ ప్రభుత్వం మద్యం ధరలు పెంచి అమ్మడం వల్ల ఈ ఐదు సంవత్సరాల్లో లక్షా ఐదు వేల కోట్ల రూపాయల వ్యాపారం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన దానికంటే ఇది 100 శాతం అధికం అన్నారు. మద్యం కొనలేనివారు సారాయి, గంజాయి, డ్రగ్స్ వాడుతుండటం వల్ల ఈ ప్రభావం రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలపై పడుతోందన్నారు.

పోస్టులు పెడితే నిర్బంధమా?

గుంటూరుకు చెందిన రంగనాయకమ్మ మాట్లాడుతూ సోషల్ మీడియా అనేది భావ ప్రకటనకు మంచి మాధ్యమమని అన్నారు. సీఎంగా ఉన్న వ్యక్తి మంచి పాలన చేయాలని కక్షపూరితంగా వ్యవహరిస్తే కింద యంత్రాంగం అదే విధంగా ఉంటుందని చెప్పారు. మాజీ సీఎంపై చెప్పు విసిరిన ఘటనలో అప్పటి డీజీపీ అది భావ ప్రకటనా స్వేచ్ఛ అని అన్నారని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడుతుందని ఒక అంశంపై సామాజిక మాధ్యమంలో పోస్టు చేసి ప్రశ్నిస్తే తనను నిర్బంధించి కేసులు పెట్టి జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టు పెట్టినందుకు క్షమాపణలు చెప్పాలని పోలీసులు ఒత్తిడి చేశారన్నారు.

అమరావతి రైతులపై పోలీసుల దాడి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాజీ సంచాలకురాలు కె.సుహాసిని దేవి మాట్లాడుతూ వేలాది ఎకరాల భూమి ఇచ్చిన రాజధాని రైతులపై ముఖ్యంగా మహిళా రైతులు చేసిన ఉద్యమం మీదకు పోలీసులను ఉసికొల్పడం దారుణం అన్నారు. భూములు ఇచ్చిన తమకు అన్యాయం జరిగిందని వారు రోడ్డెక్కితే మహిళలను ఇష్టరాజ్యంగా కొట్టడం ప్రతి ఒక్కరూ చూశారని అన్నారు. పోలీసుల తీరు ఈ ప్రభుత్వంలో దారుణంగా ఉందన్నారు. పాత్రికేయులు ఆలపాటి సురేష్, మాల మహానాడు అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, ఏపీ టుమారో అధ్యక్షుడు నల్లమోతు చక్రవర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది పదిరి రవితేజ సభాధ్యక్షత వహించారు. ఓటు ప్రాధాన్యతపై రూపొందించిన వీడియో పాటను గాయకుడు రాజేష్‌తో కలిసి గోళ్ల నారాయణరావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక మాధ్యమాల కార్యకర్త యశస్విని పెద్ది, న్యాయవాది పిల్లా యశస్విని, వ్యాపారవేత్త మొవ్వ సత్యవరప్రసాద్, టీం స్వేచ్ఛ బుధరాలు పూజిత, ఏనుగు అశ్విని కుమార్, కొత్తపల్లి ఐశ్వర్య చౌదరి పాల్గొన్నారు.

14న కేడీసీఏ పురుష క్రికెట్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, మే 10 : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 14న ఉదయం 7 గంటలకు అండర్-19 పురుషుల వన్డే, మల్టీ డేస్ మ్యాచ్‌ల్లో పాల్గొనే జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు కేడీసీఏ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 2005 సెప్టెంబరు 1వ తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, ఆసక్తి కలిగిన వారు పుట్టినతేదీ, ఆధార్ జిరాక్సులతో, వారి వ్యక్తిగత క్రికెట్ కిట్‌లతో రావాలని ఆయన తెలిపారు.

మాదిగలకు అండగా ఉంటా : సుజనా

● మందకృష్ణ సోదర సమానుడు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సుజనా చౌదరి, పక్కనే మందకృష్ణమాదిగ

చిట్టినగర్, మే 10 : మాదిగలకు అండగా నిలబడి వారిని అత్యున్నత స్థానానికి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తానని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. సుజనాకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ శుక్రవారం ప్రైజర్‌పేట నుంచి చిట్టినగర్ పాలఫ్యాక్టరీ వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం పాలఫ్యాక్టరీ వీ కన్వెన్షన్‌లో మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుజనా మాట్లాడుతూ మందకృష్ణ తనకు సోదరుడితో సమానమని, తామిద్దరి మధ్య 25 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మాదిగల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అన్ని రంగాల్లో ఉన్నత స్థానానికి తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటానని సుజనా హామీ ఇచ్చారు.

సుజనాకు మాదిగలు అండగా నిలబడాలి : మందకృష్ణ మాదిగ

మాదిగల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఎన్నో సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఎదుగుదలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సుజనా చౌదరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మందకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకి జగన్‌ను ఇంటికి పంపించాలన్నారు.



భారతీయ సంస్కృతికి కూచిపూడి నాట్య కళ ప్రతీక

సత్యనారాయణపురం, మే 10 : కళలు మనోవికాసానికి సాధనం అని, ప్రత్యేకించి నాట్యకళ మనిషి సర్వోన్నత వికాసానికి బాటలు వేస్తుందని భారతీయ సంస్కృతికి కూచిపూడి నాట్యకళ ప్రతీకగా నిలుస్తుందని ప్రకాశం జిల్లా అద్దంకి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి జె.శ్రీ సీత అన్నారు. జయశ్రీ కూచిపూడి కళానృత్యనిలయం రజతోత్సవ వేడుకలు ఆంధ్ర లయోలా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.మొవ్వ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన అయోధ్యనగర్ శ్రీదర్మపరిషత్ కళాప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. కూచిపూడి నృత్యప్రదర్శన, నెమలికంటి స్వర్ణలత సన్మానోత్సవం నిర్వహించారు.

అడ్డగోలుగా జగన్, ఆసిఫ్ స్టిక్కర్లు అంటివేత

● 41, 44, 39వ డివిజన్లలో ఇళ్లకు స్టిక్కర్లు

భవానీపురం, మే 10 : ఎన్నికల సంఘం నిబంధనలకు తూట్లు పొడుస్తూ పశ్చిమ నియోజక వర్గం కార్పొరేటర్లు కనుసన్నల్లో నాయకులు, కార్యకర్తలు గురువారం రాత్రి నుంచి గుట్టుచప్పుడు కాకుండా జగన్ బొమ్మతో సిద్ధం, వైసీపీ ఎంపీ అభ్యర్థి నాని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్ బొమ్మలతో కూడా స్టిక్కర్లు గోడలపై అంటిచేశారు. 41వ డివిజన్‌లో దళితవాడ, బేతిపూడి అరుణకుమారి వీధి, ప్రెసిడెంట్ వీధి, 44వ డివిజన్‌లో నాలుగు స్తంభాల సెంటర్, కొండ ప్రాంతాల్లో పైన ఇళ్లకు, 39వ డివిజన్ క్వారీ సెంటర్లలోను అడ్డగోలుగా సిద్ధం, ఆసిఫ్ స్టికర్లు అంటించేశారు. సచివాలయాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు వీటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వైసీపీలో అవమానాలు పడ్డా.. : యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మే 10 : 'వైసీపీలో ఉన్నప్పుడు ఎన్నో అవమానాలు పడ్డ. నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపా. నా కష్టార్జితం రూ.90కోట్లు ఖర్చు చేశా'అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. చంద్రబాబు నాయుడుతో మాట్లాడిన తరువాత మళ్లీ రాజకీయాల్లో కొనసాగాలని నిర్ణయించుకున్నానన్నారు. గన్నవరంలో శుక్రవారం జరిగిన ప్రజాగళం సభలో యార్లగడ్డ మాట్లాడుతూ ఓడిపోతే అమెరికా వెళ్లిపోతానని దుష్ప్రచారం చేశారని కానీ ఎక్కడికీ వెళ్లనన్నారు. కొండలు, గుట్టలు తవ్వడానికి రాలేదని తెలిపారు. ఎవరితో అయితే చంద్రబాబు అవమానించబడ్డారో వారికి నా విజయంతోనే సమధానం చెబుదామన్నారు. ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ జోరు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా వచ్చిన మీ అందరిని చూస్తుంటే కూటమి అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ఇదే ఉత్సాహంతో సైకిల్, గాజు గ్లాసు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని, చంద్రబాబును సీఎంను చేయాలని కోరారు.

లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలకు జాతీయ స్థాయిలో స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు

మొగల్రాజపురం, మే 10 : జాతీయస్థాయిలో తమ పాఠశాల స్కూల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనట్లు సిద్ధార్థ నగర్ లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ కాంక్లెవ్ -2024 సవిౖట్‌లో ఏఈసీటీఈ న్యూఢిల్లీ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో పి.రాజు, పానల్ స్పీకర్‌గా పాల్గొన్నారు. గుజరాత్, మహారాష్ట్ర, చండీఘర్, పంజాబ్, ఒడిసా, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారని తెలిపారు. పాఠశాలలో ఉపయోగించే సూక్ష్మ విద్యా బోధనా పద్ధతులు, పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమాలు ఈ అవార్డుకు ప్రధాన కారణాలు అని తెలిపారు.




చంద్రబాబును కలిసిన యామిజాల తదితరులు

బ్రాహ్మణుల సంక్షేమానికి ఎన్డీఏను గెలిపించండి

● యామిజాల నరసింహమూర్తి

ధర్నాచౌక్, మే 10 : వైసీపీ ప్రభుత్వం బ్రాహ్మణులకు మొండిచెయ్యి చూపించగా టీడీపీ, జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో బ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలు చేర్చడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమాఖ్య చైర్మన్ యామిజాల నరసింహమూర్తి తెలిపారు. బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్డీఏ కూటమికి ఓట్లు వేసి గెలిపించాలని రాష్ట్రంలోని బ్రాహ్మణులకు ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కుల వృత్తిగా గుర్తిస్తామని, హిందూ బోర్డు, ప్రతి దేవాలయంలో పురోహితుడికి ట్రస్ట్ మెంబర్‌గా అవకాశం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు.



ఇంజన్‌కు నిర్వహిస్తున్న హాట్ టెస్ట్

లిక్విడ్ రాకెట్ ఇంజన్ తుది పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట, మే 10: పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాల కోసం కొత్త టెక్నాలజీతో అభివృద్ధి చేసిన లిక్విడ్ రాకెట్ ఇంజన్‌కు తుది పరీక్షను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ సెంటర్‌లో ఈ లిక్విడ్ రాకెట్ ఇంజన్‌కు ఈ నెల 9న హాట్ టెస్ట్ నిర్వహించినట్లు ఇస్రో శుక్రవారం వెల్లడించింది. పీఎస్ఎల్వీ రాకెట్ నాలుగో దశలో ఈ లిక్విడ్ ఇంజన్‌ను ఉపయోగిస్తారు. దీన్ని అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఏఎం) టెక్నాలజీ సాయంతో రూపొందించారు. హాట్ టెస్ట్ సందర్భంగా ఈ ఇంజన్‌లోని లిక్విడ్‌ను 665 సెకన్లపాటు మండించారు. ఆ క్రమంలో ఇంజన్ పనితీరు అద్భుతంగా ఉందని గుర్తించారు. కొత్త ఇంజన్‌ను శ్రీహరికోటలోని షార్ నుంచి ప్రయోగించే పీఎస్ఎల్వీ రాకెట్‌లో వినియోగించేందుకు శాస్త్రవేత్తలు సన్నద్ధమవుతున్నారు.

ఎన్డీఏ విజయం ఖాయం: లంకా దినకర్

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): మోదీ గ్యారెంటీ, బాబు ష్యూరిటీ, పవన్ కమిట్మెంట్‌తో రాష్ట్రంలో ఎన్డీఏ అభ్యర్థుల విజయం ఖాయమని బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ ధీమా వ్యక్తం చేశారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రాన్ని దోచేసిన వైసీపీని ఓడించేందుకు ఈ నెల 13న ఓటర్లు సిద్ధమయ్యారు. రాష్ట్ర సంపద మొత్తం దోచేసిన జగన్... ఓటుకు రూ.లక్ష ఇచ్చినా గెలిచే పరిస్థితి లేదు' అని దినకర్ అన్నారు.

జగన్ ప్రైవేట్ టూర్‌కు ప్రభుత్వ అధికారులా?

- విదేశీ పర్యటనకు ఐపీఎస్‌ను తీసుకెళుతున్న వైనం
- అనుమతిచ్చిన ప్రభుత్వం... టూర్‌పై 14న కోర్టు నిర్ణయం

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): అధికారమంటే ప్రజా సేవ కాదు, రాజభోగాలు అనుభవించడం అని నిరూపించిన జగన్ వ్యక్తిగత పర్యటనలోనూ అదే హవా చూపిస్తున్నారు. ప్రధాని తరహా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్న ఆయన తన రక్షణ కోసం విదేశాలకు ఏకంగా ఐపీఎస్ అధికారినే తీసుకెళుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ 13న ముగియగానే సతీమణి భారతితో కలిసి ఆయన విదేశాలకు వెళుతున్నారు. పలు సీబీఐ కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయన విదేశీ పర్యటన అనుమతి కోసం కోర్టును ఆశ్రయించారు. దీనిపై 14న కోర్టు నిర్ణయం వెలువరించనుంది. ఈ నెల 15నుంచి 31వరకూ విదేశాల్లో కుటుంబ సభ్యులతో ఆయన గడిపేది పూర్తిగా వ్యక్తిగత పర్యటన. అయినప్పటికీ ప్రభుత్వ అధికారులను తనతో పాటు తీసుకెళ్లాలని భావించడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో ఆయనకు రక్షణ కల్పించే ఎస్ఎస్‌జీ విభాగాధిపతి, సీనియర్ ఐపీఎస్ అధికారి అట్టాడ బాబూజీని ఏకంగా తనతో పాటు విదేశాలకు తీసుకెళుతున్నారు. ముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణ మోహన్, సీఎస్‌వో చిదానందరెడ్డి, సెక్యూరిటీ అధికారులు మహబూబ్ బాషా, బొడ్డేపల్లి మురళి, అడిషనల్ పీఎస్ కె.నాగేశ్వర్‌రెడ్డి వెంట వెళుతున్నారు. సీఎం పర్యటనకు వెళ్లేందుకు వీరికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు మందీ మార్బలంతో వెళ్లేందుకు అవకాశం ఉండదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

జగన్ పాలనలో ఏపీ దివాలా: కనకమేడల

న్యూఢిల్లీ, మే 10(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పాలనలో ఏపీ దివాలాతీసిందని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. రాష్ట్రం పైన రూ.13 లక్షల కోట్లకు పైన అప్పులున్నాయన్నారు. రాష్ట్రంలో ఇక తాకట్టు పెట్టడానికి ఏమీ లేదని, తాకట్టు పెట్టకుండా ఉన్నది ప్రజల ఆస్తులు మాత్రమేనని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక కత్తిలాంటిదని, దానితో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని కనకమేడల తెలిపారు.

12 వరకు పోస్టల్ బ్యాలెట్: టీడీపీ వినతి

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఈనెల 12 వరకు కొనసాగించాలని టీడీపీ నేతల బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాను టీడీపీ నేతలు కలిసి, ఎన్నికల విధుల్లోకి తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే అమరావతి విట్ కాలేజీ విద్యార్థులకు 13న ఓటు వేసే అవకాశం కల్పించాలని, తమిళనాడు విట్‌లో చదువుతున్న తెలుగు విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను రీషెడ్యూల్ చేయాలని టీడీపీ నేతలు కోరారు. దీనిపై ఈసీ సానుకూలంగా స్పందించింది.

మా ఫిర్యాదులు పట్టవా?: ఈసీకి 'ఇండియా' ప్రశ్న

న్యూఢిల్లీ, మే10: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నారంటూ బీజేపీ నాయకుల మీద తాము చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని విపక్ష ఇండియా కూటమి నాయకులు ఎలక్షన్ కమిషన్‌ను కోరారు. మొదటి రెండు దశల పోలింగ్ వివరాల వెల్లడిలో జాప్యం జరగడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ మను సింఘ్వి, సల్మాన్ ఖుర్షీద్, డెరెక్ ఓబ్రెయిన్(తృణమూల్), టీ.ఆర్.బాలు (డీఎంకే), మహువా మాఝి (జేఎంఎం), బినయ్ విశ్వం (సీపీఐ), జావేద్ అలీ (సమాజ్‌వాదీ)లు ఎన్నికల సంఘాన్ని కలిసి 7పేజీల వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం సింఘ్వి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు 11 ఫిర్యాదులు ఇచ్చినా ఒక్కదానిపైనా చర్యలు తీసుకోలేదని తెలిపారు. వీటిపై సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన ఉందన్నారు.

పాక్‌ను గౌరవించకుంటే మనకే ముప్పు

- వారి దగ్గర అణుబాంబులున్నాయ్: మణిశంకర్ అయ్యర్

న్యూఢిల్లీ, మే 10: లోక్‌సభ ఎన్నికల వేళ సొంత పార్టీ సీనియర్ నేతల వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేస్తున్నాయి. మొన్న భారతీయుల రూపురేఖలపై శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. నిన్న పిట్రోడా మాటలపై స్పందిస్తూ.. కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురి మరింత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ గత ఏడాది చేసిన వ్యాఖ్యలనూ ప్రత్యర్థులు తాజాగా వైరల్ చేశారు. 'పాకిస్థాన్‌తో మనం చర్చలు జరపాలి. అంతేగానీ సైన్యంతో రెచ్చగొట్టొద్దు. అలా జరిగితే ఉద్రిక్తతలు పెరిగి మనమే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఆ దేశం వద్ద అణుబాంబులున్నాయి. అందువల్ల పాక్‌ను మనం గౌరవించాలి. వారిని గౌరవించకపోతే భారత్‌పై అణు బాంబులు ఉపయోగించాలని ఆలోచన చేస్తారు. మనవద్దా ఆ అస్త్రాలున్నాయి. కానీ, లాహోర్‌పై మనం ప్రయోగిస్తే.. దాని తాలూకు రేడియేషన్ అమృత్‌సర్‌ను చేరడానికి 8 సెకన్లు కూడా పట్టదు' అని అయ్యర్ ఆ వీడియోలో అన్నారు. అయితే, తాను ఎప్పుడో మాట్లాడిన వీడియోను బీజేపీ నేతలు కావాలనే ఇప్పుడు వైరల్ చేస్తున్నారని అయ్యర్ పేర్కొన్నారు. అయ్యర్ వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని కాంగ్రెస్ ప్రకటించింది.

కేసులు ఉన్నా ఏజెంట్లుగా రావొచ్చు: ఈసీ

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం జరగనున్న ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియపై ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ బూత్‌లలో ఆయా రాజకీయ పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్ల వివరాలను అదే రోజు ప్రిసైడింగ్ అధికారికి ఇస్తే చాలని తెలిపింది. గతంలో పోలింగ్ ఏజెంట్ల వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారుల(ఆర్వో)కు ఇవ్వాల్సి వచ్చేది. దీనివల్ల అధికార దుర్వినియోగానికి పాల్పడే అవకాశంఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఈసీకి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఈసీ.. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ రోజు నేరుగా తమ వివరాలను బూత్ ప్రిసైడింగ్ అధికారికి ఇస్తే చాలని తాజాగా ఆదేశాలు జారీచేసింది. ఆయా వివరాలను ఆర్వోకి ఇవ్వాల్సిన అవసరంలేదని స్పష్టం చేసింది. పోలింగ్ జరిగే రోజు ప్రిసైడింగ్ అధికారికి వివరాలు సమర్పించి నేరుగా విధులకు హాజరు కావచ్చని ఆదేశాల్లో పేర్కొంది. గతంలో చేసినట్లు ఏజెంట్లకు పోలీసు, రిటర్నింగ్ అధికారి వెరిఫికేషన్, ఆమోదం అవసరంలేదని తెలిపింది. పోలీసు కేసులు ఉన్నా ఏజెంట్లుగా పని చేయవచ్చునని పేర్కొంది.

తప్పుల రీ సర్వేతో

ల్యాండ్ టైటిలా?

- 100 ఏళ్లకు సరిపడా చిక్కులు
- అంతా.. రగడ రగడే
- నోటీసులు లేవు.. కొలతలు లేవు
- ఈ రికార్డు ఆధారంగానే టైటిల్
- ఇది అమలైతే రైతుకు కష్టకాలమే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అన్న సామెత... ముఖ్యమంత్రి జగన్ ఎంతో గొప్పగా చెబుతున్న భూముల రీ సర్వే, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు అతికినట్టు సరిపోతుంది. జగన్ సర్కారు చేపట్టిన భూముల రీ సర్వేనే ఓ తప్పుల తడక. ఉన్న సమస్యలను పరిష్కరించకపోగా, కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అలాంటిది... రీ సర్వే ఆధారంగా భూములకు 'టైటిల్' ఇస్తామని చెబుతున్నారు. ఇదే కనుక జరిగితే రైతులకు కొత్త కష్టాలు తప్పవు.

'రాష్ట్రంలో 100ఏళ్ల తర్వాత భూముల సర్వే చేస్తున్నాం. భూ వివాదాలన్నింటిని పరిష్కరిస్తాం. రీ సర్వే ఆధారంగా టైటిల్ ఇస్తాం. భూ వివాదాల పేరిట కోర్టుల చుట్టూ తిరిగే పనిలేకుండా చేస్తాం' అని సీఎం జగన్ చెబుతున్నారు. నిజంగానే ఆయన మాటలు నమ్మొచ్చా? రీ సర్వే అంత గొప్పగా ఉందా? అంటే.. అంతా ఒట్టిమాటే. రీ సర్వే చేయాలన్న ఆలోచన మంచిదేమో కానీ, చేపట్టిన తీరే అశాస్త్రీయంగా ఉంది. అమలు చేస్తున్న తీరు మేడిపండు చందంలా ఉంది. వివాదాల పరిష్కారం కోసం చేపట్టిన సర్వేతో కొత్త సమస్యలు వస్తున్నాయి. సర్వే చేసిన గ్రామాల్లో వివాదాలు, భూముల విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి. సెంటు భూమి లేనివారికి ఎకరాల కొద్దీ ఉన్నట్లు, ఎక్కువ విస్తీర్ణంలో భూములున్న వారికి తక్కువగా ఉన్నట్టు రికార్డులో నమోదు చేశారు. ఒరిజినల్ ఆర్ఎస్ఆర్‌కు, రీసర్వే రికార్డుకు పొంతనే ఉండటం లేదు. ఇదేమని బాధిత రైతులు గగ్గోలు పెడితే అప్పీల్ చేసుకోమని అధికారులు చెబుతున్నారు. అప్పీల్ చేసుకుంటే మీ సమస్య పరిష్కారమైపోతుందంటూ తప్పించుకుంటున్నారు. రికార్డు మాత్రం సరిచేయడం లేదు. ఇదే విషయాన్ని జగనన్నకు చెబుదాం, స్పందన, టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా ప్రభుత్వానికి ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. అన్నీ పరిష్కరించామని, రైతులకు ఏ ఇబ్బందీ లేదని చెబుతున్నారు. అదే నిజమైతే రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త రికార్డు ఎందుకు బయటపెట్టడం లేదు? గ్రామ సచివాలయాల్లో ఆ రికార్డును ఎందుకు అందుబాటులో ఉంచడం లేదు? భూ వివాదాలు పరిష్కరిస్తామని గొప్పలకు పోయిన సర్కారు సరిదిద్దుకోలేని స్థాయిలో తప్పులు చేసింది. వెయ్యి కోట్ల వ్యయంతో అరచేతిలో వైకుంఠం చూపాలని జగన్ ప్రయత్నిస్తున్నారు. 6వేల గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మరోదఫా అధికారం ఇస్తే రీసర్వే పూర్తి చేసి, దాని ఆధారంగా టైటిల్ ఇస్తామని చెబుతున్నారు.

లెక్కల్లో తేడా

రాష్ట్రంలో భూముల సర్వే చేపట్టడానికి ముందు ప్రభుత్వం ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ (పీఓఎల్ఆర్) చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భౌతికమైన ఒరిజినల్ ఆర్ఎస్ఆర్ రికార్డుకు, వెబ్‌ల్యాండ్ రికార్డును సరిపోల్చినప్పుడు భారీ తేడాలు వెలుగుచూశాయి.ఒరిజినల్ ఆర్ఎస్ఆర్‌లో 1,30,30,298 సర్వే నంబర్లకు గాను 2,90,92,995.41 ఎకరాలు ఉన్నాయి. అదే వెబ్‌ల్యాండ్ ఆర్ఎస్ఆర్‌లో 1,35,05,283 సర్వే నంబర్లకు గాను 3,40,23,510.19 ఎకరాలున్నట్టు గుర్తించారు. 8,34,609 సర్వే నంబర్ల పరిధిలో 31,23,395 ఎకరాలు సరిపోలడం లేదు. అంటే.. ఒరిజినల్ రికార్డులకు, వెబ్‌ల్యాండ్ రికార్డుకు టాలీ కాలేదు. దీన్ని సెటిల్ చేశాకే రీ సర్వే ప్రారంభించాలి. కానీ అలాగే భూముల సర్వే చేశారు. తక్కెళ్లపాడు సర్వేపై విమర్శలు రావడంతో సర్కారు సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ)ను రంగంలోకి దింపిది. ఆ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. కార్స్, రోవర్స్ డ్రోన్ టెక్నాలజీ ఆధారంగా రాష్ట్రం అంతా సర్వే చేసేలా ఆ సంస్థతో మాట్లాడుకున్నారు. కేంద్ర సంస్థే సర్వే చేయనుందని తెలియడంతో రైతులు ఊరట పొందారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ ఒత్తిడితో కేంద్ర సంస్థ పక్కకు తప్పుకొంది. ఆ తర్వాత ప్రభుత్వం రీ సర్వేలో ఏమాత్రం అవగాహన లేని డ్రోన్ కంపెనీలకు టెండర్లు ఇచ్చింది. అవి ఆకాశం నుంచి భూమి ఫొటోలు (ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజెస్-ఓఆర్ఐ) తీసి సర్వే అధికారులకు ఇచ్చాయి. వాటి ఆధారంగా సర్వే అధికారులు గ్రామాల వారీగా క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలి. ప్రతీ పొలం కొలతలు వేసి, ఒక గ్రామంలో సర్వే పూర్తి చేయడానికి సగటున ఐదారు నెలల సమయం పడుతుంది. కానీ సర్కారు ఒత్తిళ్లతో సిబ్బంది ఓఆర్ఐల ఆధారంగా రైతుల భూములు కొలిచినట్లుగా రికార్డులు తయారు చేశారు. వాటినే రీ సర్వే రికార్డులని చెబుతున్నారు.

సర్వే చట్టం బుట్టదాఖలు

ఆంధ్రప్రదేశ్ సర్వే, సరిహద్దుల చట్టం-1921 ప్రకారం భూముల సర్వే చేపట్టాలి. చట్టంలోని సెక్షన్ 9(1) ప్రకారం భూమిని సర్వే చేయబోతున్నట్లుగా ముందుగా నోటీసు ఇవ్వాలి. ఆ తర్వాత సర్వే పూర్తయ్యాక సెక్షన్ 9(2)కింద నోటీసు ఇవ్వాలి. అందులో రైతు పొలం సర్వే పూర్తయినట్లుగా, ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? లేవా? అన్నది తెలియజేయాలి. ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే, సర్వే విజయవంతంగా పూర్తయినట్లే. ఇలా సర్వే పూర్తయ్యాక 13 నోటిఫికేషన్ ఇస్తారు. అదే ఫైనల్. కానీ చాలా గ్రామాల్లో రైతులకు నోటీసులు ఇవ్వలేదు. వారి అభ్యంతరాలు, విన్నపాలు స్వీకరించలేదు. ఓఆర్ఐ ఆధారంగా చేసిన రికార్డునే అసలైన భూమి రికార్డుగా చూపిస్తున్నారు.

రికార్డుల నిండా తప్పులే

నెల్లూరు జిల్లా నాయుడు పేటలో జనార్దన్‌రావు అనే రైతుకు 6.40 ఎకరాల భూమి ఉంది. రీసర్వే చేశాక ఆయనకు 5.20సెంట్లు ఉన్నట్లు రికార్డు ఇచ్చారు. ఆ రైతు పక్కనే ఉన్న శారదమ్మకు 1.40 సెంట్ల భూమే ఉంది. కానీ ఆమెకు 6.40ఎకరాలున్నట్లు రికార్డు తయారు చేశారు. ఆ ఇద్దరికి ఒకే భూమిని చూపించారు. ఇదే విషయంపై అప్పీల్ చేస్తే ఇంత వరకు సెటిల్ చేయలేదు. ఇదొక మచ్చుతునక మాత్రమే. భూ విస్తీర్ణంలో తప్పులున్నాయని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతూ సర్కారుకు గత మూడున్నర సంవత్సరాల కాలంలో 8లక్షల ఫిర్యాదులు వచ్చాయి. జగన్ సర్కారు నిర్వహించిన స్పందనలోనే ఐదున్నర లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇక జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 72వేల ఫిర్యాదులు వచ్చాయి. ప్రతీ ఫిర్యాదులో రైతు పేరు, గ్రామం, సమస్య, ఫోన్ నంబరును నమోదు చేశారు. ఇక మండల స్థాయి అప్పీల్స్ అధికారులకు 1.78 లక్షల ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విన్నపాలు, ఫిర్యాదులన్నింటిని సర్కారు బుట్టదాఖలు చేసింది. రైతుల సమస్యలన్నీ పరిష్కారం చేసినట్లుగా ఫిర్యాదులను మూసేసింది. ఇదంతా ఆరువేల గ్రామాల్లోనే. ఈ గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది కానీ ఆ గ్రామాల్లోని తాజా రెవెన్యూ రికార్డులను బయటపెట్టడం లేదు. సర్వే, సరిహద్దుల చట్టం ప్రకారం సెక్షన్ 13 నోటిఫికేషన్ ఇచ్చాక గ్రామాల వారీగా భూముల రికార్డును రైతులకు అందుబాటులో ఉంచాలి. దానివల్ల ప్రతీ రైతు తన భూమి వివరాలు తెలుసుకోగలగాలి. భూ వివాదాలన్నీ బయటకొస్తాయన్న భయంతో ఆ రికార్డును బయటకు రానివ్వడం లేదని తెలుస్తోంది. ఇదే రికార్డు ఆధారంగా టైటిల్ ఇచ్చేందుకు సర్కారు సిద్ధంగా ఉంది. అదే జరిగితే భూమి విస్తీర్ణంలో తేడాలు పొందిన రైతులకు కష్టకాలమే.

పైలెట్‌లోనే ఫెయిల్

ఉమ్మడి కృష్ణా జిల్లా జగయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామంలో పైలెట్ సర్వే చేశారు. రాష్ట్రంలో భూముల రీ సర్వేకు ముందు ఈ గ్రామంలో ప్రయోగాత్మకంగా ఏడాది పాటు సర్వే చేశారు. ఈ గ్రామంలో 1932 నాటి రీ సర్వే రికార్డు ప్రకారం 1539 ఎకరాల భూమి ఉంది. అడంగల్ ప్రకారం 1573.26 ఎకరాల భూమి ఉంది. కానీ తాజాగా రీ సర్వే తర్వాత 1533.56 ఎకరాల భూమి ఉన్నట్లు తేల్చారు. అంటే, ఉన్నదాని కంటే 5.44 ఎకరాల భూమి తగ్గినట్లు లెక్క తేల్చారు. భూమి కొలతల్లో సగటున 2.10 ఎకరాల మేర తేడాలు వచ్చాయి. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' 2020లోనే వెలుగులోకి తీసుకొచ్చింది. గజం భూమి కూడా తేడా రాకుండా కొలతలు వేస్తారని, ఏ మాత్రం తేడా వచ్చినా తనదే బాధ్యత అంటూ జగన్ తక్కెళ్లపాడు బహిరంగ సభలో చెప్పారు. కానీ పైలెట్‌గా చేపట్టిన గ్రామంలోనే భారీగా తప్పులు వచ్చాయి. భూమి విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. రీ సర్వేలో తగ్గిన 5.44 ఎకరాల భూమి ఎక్కడికి పోయిందో లెక్క తేల్చమంటే సర్కారు నీళ్లు నమిలింది. అయినా దీన్నే విజయవంతమైన ప్రాజెక్టుగా ప్రకటించారు. ఇదే తరహాలో రాష్ట్రం అంతా రీ సర్వే ప్రారంభించారు.

ప్రాజెక్టులు కట్టలేం!

- ఆ లోన్లు రద్దు చేయండి.. కేంద్రానికి జగన్ వినతి
- 3 అత్యవసర మౌలికవసతుల ప్రాజెక్టులను కాలదన్నేసిన వైనం
- తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామన్నా అభివృద్ధిని విస్మరించిన సర్కారు

అమరావతి, మే 10(ఆంధ్రజ్యోతి): సాధారణంగా అభివృద్ధి ప్రాజెక్టులు, రుణాలు మంజూరు చేయాలని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతుంటాయి. ఆర్థిక సాయం చేయాలని ఢిల్లీ చుట్టూ తిరుగుతుంటాయి. అయితే జగన్ సర్కారు ఈ విషయంలో కూడా 'రివర్స్'. ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్రం ఎంపిక చేసిన మూడు కీలక ప్రాజెక్టులను, వీటికోసం తక్కువ వడ్డీతో అంతర్జాతీయ సంస్థలు ఇచ్చే లోన్లను కాలదన్నుకుంది. ఈ ప్రాజెక్టులు కట్టలేమని, లోన్లు రద్దు చేయాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి జగన్ కోరారు. దీంతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై, ఆంధ్రప్రదేశ్ రోడ్స్, బ్రిడ్జెస్ రీకన్‌స్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ మండల్ కనెక్టివిటీ అండ్ రూరల్ కనెక్టివిటీ ప్రాజెక్టులను జగన్ నీరుగార్చారు. పట్టణ ప్రజలకు తాగునీటి కల్పనకు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేసే రోడ్లు, వంతెనల నిర్మాణానికి ఈ ప్రాజెక్టులు ఎంతో కీలకం. ప్రజలకు తప్పనిసరిగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ఈ మూడు ప్రాజెక్టులను జగన్ చాలా తేలిగ్గా తీసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు కొన్ని రాష్ట్రాలను ఎంపిక చేస్తుంది. ఆయా రాష్ట్రాల అధికారులు, ఎంపీలతో పాటు సీఎం కూడా తమ రాష్ట్రానికి అవసరమైన ప్రాజెక్టులకు ఈఏపీ లోన్ ఇప్పించాల్సిందిగా కేంద్రం వద్ద లాబీయింగ్ చేస్తుంటారు. ఈఏపీ లోన్లు అతి తక్కువ వడ్డీకే లభిస్తాయి. ఒరకంగా ఈఏపీ ప్రాజెక్టులు మంజూరు కావడమే అదృష్టం. అందుకే వీటి కోసం రాష్ట్రాల మధ్య పోటీ ఎక్కువగా ఉంటుంది. ఇంత పోటీని తట్టుకుని ఈ 3 ప్రాజెక్టులు రాష్ట్రానికి రాగా, జగన్ వాటిని కాలదన్నేశారు. ఇందులో అర్బన్ వాటర్ సప్లై ప్రాజెక్టు చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి మంజూరైంది. మిగిలిన 2 ప్రాజెక్టుల కోసం చంద్రబాబు హయాం నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించి జగన్ అధికారంలోకి వచ్చాక మంజూరయ్యాయి. వీటికి 2021 జూన్‌లో ఒప్పందాలు చేసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై ప్రాజెక్టుకు ఏఐఐబీ నిధులు సమకూర్చేది. అయితే పట్టణ ప్రజలకు తాగునీరే అవసరం లేదన్నట్టుగా జగన్ సర్కారు తిరస్కరించింది. ఇక ఆంధ్రప్రదేశ్ రోడ్స్, బ్రిడ్జెస్ రీకన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టుకు ఎన్‌డీబీ రుణం ఇచ్చేది. అయితే.. 'మా రాష్ట్ర ప్రజలకు ఐదేళ్ల నుంచి గుంతల రోడ్లు అలవాటైపోయాయి. పైగా గుంతల రోడ్ల కోసమే సెస్ కూడా వసూలు చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు మా కొద్దు' అని జగన్ సర్కారు అనుకున్నట్టుంది. ఇక మూడోది ఆంధ్రప్రదేశ్ మండల్ కనెక్టివిటీ అండ్ రూరల్ కనెక్టివిటీ ప్రాజెక్టు. దీనికి కూడా ఎన్‌డీబీనే రుణం ఇచ్చేది. మండలాలకు, గ్రామీణ ప్రాంతాలకు కనెక్టివిటీ రోడ్లు అవసరం లేన్నట్టుగా, ఏదో ఒక పథకం పేరు చెప్పి కొంత డబ్బు ఖాతాలో వేస్తే చాలని జగన్ సర్కారు దీన్ని కూడా వద్దనుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అధికార యంత్రాంగానికి లోటు లేదు. అవసరమైన నిపుణులకు కొదవ లేదు. అన్నింటికంటే అతి ముఖ్యమైనది ప్రాజెక్టుకు డబ్బు. వాటిని అతి తక్కువ వడ్డీకి ఇవ్వడానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. మరి ఈ ప్రాజెక్టులు కట్టడానికి ఇంకేంటి సమస్య? ఈ ప్రాజెక్టులు కడితే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంది. అయితే రాష్ట్రం అభివృద్ధి చెందడం జగన్‌కి ఇష్టం లేన్నట్టుగా ఉంది.

వైసీపీదైతే వదిలేయ్!

ఏంటి బాసూ ఇది!

ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా కాపు కాయాల్సిన పోలీసులే దారి తప్పుతున్నారు. అధికార పక్షానికి అన్ని విధాలా సహకరిస్తున్నారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారు. వైసీపీ నేతల అక్రమాలపై చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిక్కచ్చిగా పనిచేస్తున్న అధికారులపైనా పైనుంచి 'బాసు'లు ఒత్తిడి తెచ్చి అనుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కోడ్ నిబంధనలను సైతం తుంగలో తొక్కుతున్నారు.

- అక్రమ మద్యంపై అధికారుల తీరు
- జిల్లాల్లో పోలీసులకు బాస్‌ల నుంచి ఫోన్లు
- ఆ.. రెడ్డితో నీకేంటయ్యా? ఓ అధికారికి తలంటు
- సీమ రెడ్డి సరుకు.. పట్టుకునే ముందు చూసుకోరా?
- గోదావరి జిల్లాల్లో ఇద్దరు అధికారులకు చీవాట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



'ఆ.. రెడ్డితో నీకేంటయ్యా గొడవ' ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి నుంచి ప్రకాశం జిల్లాలోని ఒక పోలీసు అధికారికి వచ్చిన ఫోను ఎత్తగానే వినిపించిన మాట ఇది. 'అయ్యో.. ఆయనతో నాకేం ఉంటుంది సర్' అంటూ భయం భయంగా బదులిచ్చారు ఆ అధికారి. 'సమాచారం ఏదైనా వస్తే సెర్చ్(తనిఖీలు)కు వెళ్లే ముందు వెనకున్నది ఎవరో తెలుసుకో.. ఎస్ఐ నుంచి పైకి వచ్చావ్‌గా.. డిపార్ట్‌మెంట్‌లో ఇన్నేళ్లు పనిచేశాక కూడా ఏది ఎలా చేయాలో తెలుసుకోక పోతే ఎలా?' అంటూ ఆ అధికారి ఫోన్ పెట్టేశారు. ఆ షాక్ నుంచి అధికారి తేరుకునేలోపు మరో పెద్ద ఐపీఎస్ నుంచి ఫోన్ వచ్చింది. 'తలకాయలేని పనులు చేయమాకండయ్యా.. అదేదో సరుకు పట్టుకున్నావటగా..' అంటూ ఉన్నతాధికారి ప్రశ్నించగా.. 'అదెవరిదో సెర్చ్‌కు వెళ్లే ముందు మాకు తెలీదు సర్. సమాచారం రాగనే వెళ్లాం. ఎన్నికల టైమ్‌లో నిక్కచ్చిగా ఉండమని తమరు చెప్పారు కదా సర్. అందుకే ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లాం సర్' అంటూ కొంత ధైర్యం తెచ్చుకుని సమాధానం ఇచ్చాడు. 'మంచిదే కానీ నా దాకా ఫోన్లు వస్తున్నాయంటే చూసుకోండి.. జాగ్రత్త' అంటూ పెద్ద సార్ ఫోను పెట్టేశారు. ఇద్దరు ఉద్దండుల్లాంటి అధికారులు ఫోన్లు చేయడంతో భయపడిన జిల్లా అధికారి.. అధికార పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థికి ఫోను చేసి.. 'మాకు సమాచారం వచ్చినప్పుడు మీదని తెలీదు' అని చెబుతుండగానే.. 'మాకు తెలుసులే అన్నా మీరు పక్కా సమాచారంతోనే పట్టుకున్నారని.. మీరేం చేస్తున్నారో అంతా తెలుసు' అని ఫోన్ కట్ చేశారు. ఈ వ్యవహారం రెండు రోజుల్లోనే రాష్ట్రమంతా వ్యాపించడంతో క్షేత్రస్థాయి అధికారుల్లో భయం పట్టుకుంది. రాష్ట్రంలో ఎక్కడికక్కడ అధికార పార్టీకి చెందిన అక్రమ మద్యం సీజ్ చేయడం బాగా తగ్గిపోయింది. ఒకటి రెండు చోట్ల ఏదో పట్టుకున్నట్లు చూపించేందుకు కేసు పెట్టినా.. పట్టుబడ్డ లిక్కర్ ఆ తర్వాత ఏమవుతోందన్నది ప్రశ్నార్థకం. ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ అధికారులతో లెటర్ తీసుకుని ఈసీకి సమర్పిస్తున్నామని అధికారులు పైకి చెబుతున్నారు. కానీ, ఈ విషయంలోనూ విపక్షాల సరుకైతే ఒకలా.. అధికార పక్షానిదైతే మరో విధంగా పనికానిస్తున్నారు.

ఇదీ తీరు!

గన్నవరంలో ప్రతిపక్ష పార్టీకి చెందినదిగా పోలీసులు వెల్లడించిన మద్యం బాటిళ్లను కలెక్టరు, జిల్లా ఎస్పీ సమక్షంలో ధ్వంసం చేశారు. ఫొటోలు, వీడియోలు మీడియాకు విడుదల చేశారు. కానీ, ఇతర ప్రాంతాల్లో వైసీపీ నేతలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసుకున్న మద్యాన్ని మాత్రం ఇలా ధ్వంసం చేయడం లేదు. ఈ విషయంపై పోలీసులు ఎవరూ స్పందించడమే లేదు. ఇక, రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా పట్టుబడుతున్న అక్రమ మద్యం కేసుల్లో పోలీసు, సెబ్ అధికారులు వ్యవహరించిన తీరు గమనిస్తే.. ఏకపక్షం అనడం కన్నా సహకారం, ఉపకారం అనొచ్చు. ఇక, సీఎం జగన్ పాల్గొంటున్న సభలు, రోడ్ షోలకు జనం రాకపోవడంతో దిక్కుతోచని నేతలు జనాలను తరలించేందుకు రూ.500, బిర్యానీ పొట్లం ఆఫర్ చేస్తున్నారు. పురుషులైతే మద్యం బాటిల్ కూడా ఇస్తున్నారు. దీంతో వైసీపీలోని కొందరు ముఖ్య నేతలు ఈ మద్యం సరఫరా కాంట్రాక్టు తీసుకున్నారు. గోవా నుంచి తీసుకొచ్చి రాష్ట్రంలో ఎక్కడెక్కడ అవసరమో అక్కడికి చేరవేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా 'పెద్దగా' పట్టించుకోవడం లేదు. ఒకటో అరో పట్టుకున్నట్టు మీడియాకు సమాచారం ఇచ్చి ఫొటోలు దిగేసిన తర్వాత సరుకు మాయం చేస్తున్నారు.

పిఠాపురంలో గోవా మద్యం

పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను ఎలాగైనా ఓడించేందుకు సీఎం జగన్ కంకణం కట్టుకున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ మండలానికో మంత్రిని రంగంలో దింపారు. రాయల సీమలో తనకు దగ్గరగా ఉండే ఒక ఎంపీకి బాధ్యతలు అప్పగించారు. దీంతో జగన్ కళ్లలో ఆనందం కోసం.. సదరు నేత గోవా నుంచి మద్యం తెప్పించి ఒక్క పిఠాపురమే కాకుండా ఉభయగోదావరి జిల్లాల్లోని వైసీపీ అభ్యర్థులకు కూడా సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందుతూనే ఉంది. అయినా కొన్ని రోజులు పోలీసులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదు. మీడియాలో విస్తృతంగా కథనాలు రావడంతో ఎట్టకేలకు కదిలిన పోలీసులు పిఠాపురంలో దాచిన గోవా మద్యాన్ని పట్టుకున్నారు. అయితే, తర్వాత దానిని మాయం చేశారు. అలా ఎందుకు చేశారని ఆరా తీస్తే.. ఆ మద్యం పట్టుకున్న పోలీసులు, సెబ్ అధికారులకు పైనుంచి 'క్లాసు తీసుకున్నట్టు' తెలిసింది. 'అది సీమ రెడ్డి సరుకు.. పట్టుకునే ముందు చూసుకోరా? ఏదో ఫోన్ వస్తే చాలు వెళ్లి పట్టుకోవడమేనా? తప్పదని పిస్తే ముందే సమాచారం లీక్ చేసి సోదాలకు వెళ్లాలి' అంటూ చీవాట్లు పెట్టడంతో మాకేంటీ బాధ అంటూ క్షేత్రస్థాయి అధికారులు వాపోతున్నారు. చివరికి అదే రెడ్డిగారి వద్ద కెళ్లి 'మా పైఅధికారులకు చెప్పొద్దు సార్. ఏదో ఒకటి చేస్తాం' అని బతిమాలుకుని మద్యం వెనక్కి చ్చేశారు. ఈసీకి మాత్రం 'ధ్వంసం' చేసినట్లు ఎక్సైజ్ అధికారితో ఆథరైజేషన్ తీసుకుని సమర్పించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కీలకంగా వ్యవహరించిన ఓ అధికారి తన ఆప్తమిత్రుడికి ఫోనుచేసి 'ఆ లింకు పట్టుకుని ముందుకు వెళ్తే భారీడంప్ దొరికేది. లారీలకు లారీల సరుకు పట్టుబడేది. ముందుకు వెళ్లలేకపోయాం' అని ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్డదారులు ఎన్నెన్నో!

- కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆలమూరులో వైసీపీ నేతలు పంపిణీకి సిద్ధం చేసిన మద్యం పట్టుబడింది. ఆ తర్వాత ఏమైందో ఎవరికీ తెలీదు.
- అనకాపల్లి జిల్లాలో ఎలమంచిలి వైసీపీ నేత ఓటర్లకు పంచేందుకు తెప్పించిన పొరుగు మద్యం కూడా పట్టుబడింది. కానీ, తర్వాత మాయమైంది.
- వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాజోలులో 1200 కేసుల గోవా మద్యం పట్టుబడితే కనీసం ఫొటో కూడా బయటకు రాలేదు. ఎందుకంటే గుట్టుచప్పుడు కాకుండా మాయచేశారు.
- రాయలసీమలో పట్టుబడుతున్న అక్రమ మద్యంలో అరకొర చూపించడం మిగతాది మాయం చేయడం సర్వసాధారణంగా మారిందని కొందరు పోలీసులు గుసగుసలాడుతున్నారు.
- చంద్రగిరి నియోజక వర్గ పరిధిలోని ఓ గ్రామ సర్పంచ్ గోవా మద్యాన్ని భారీగా తెప్పించి పంచాయితీ భవనంలోనే డంప్ చేశారు. ప్రచారానికి వచ్చే మందుబాబులకు రోజూ పంచుతున్నారు. అయినా, పోలీసులు పట్టించుకోవడం లేదు. చివరికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేసి రచ్చ చేయడంతో నాలుగైదు బాక్సుల మద్యం సీజ్ చేసి మమ అనిపించేశారు.
- పోలింగ్ పూర్తయ్యే వరకు రోజూ మూడు ట్రక్కుల గోవా మద్యం తెప్పించేందుకు చిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు లిక్కర్ డాన్‌లతో వైసీపీ ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై పోలీసుల్లోనూ చర్చసాగుతోంది.

ప్రాతినిధ్యం కోసం వామపక్షాల పాట్లు

- ప్రచారంలో చెమటోడుస్తున్న కామ్రేడ్లు
- హోరాహోరీ పోరులో ఉనికి దక్కేనా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాజకీయంగా ఉనికిని కాపాడుకోవడంతోపాటు చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం వామపక్షాలు గట్టిగానే పోరాడుతున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో తమ బలం, బలగాన్ని ప్రదర్శించి, చట్టసభల్లోనూ వాణి వినిపించిన కమ్యూనిస్టు పార్టీలు విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రజా సమస్యలపై పోరాటాలను కొనసాగిస్తున్నాయి. అయితే రాజకీయంగా వాటి ప్రభావం కనిపించడం లేదు. గత (2019) ఎన్నికల్లో జనసేనతో పొత్తు పెట్టుకుని చెరో రెండేసి పార్లమెంటు, ఏడేసి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన సీపీఐ, సీపీఎం ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయాయి. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా తమకు లభించిన చెరొక పార్లమెంటు, ఎనిమిదేసి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న లెఫ్ట్ పార్టీలు తమ ఉనికి చాటుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఎంపిక చేసుకున్న స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో కూడా లోతైన పరిశీలనలు చేశాయి. ఎన్నికల ప్రచారంలో కూడా వామపక్ష ఐక్యతను ప్రదర్శిస్తూ ఉభయ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నేతలు తమ అభ్యర్థుల తరఫున ఉమ్మడిగా ప్రచారం నిర్వహిస్తూ గెలుపు కోసం చెమటోడుస్తున్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మూడు రోజులపాటు రాష్ట్రంలో తమ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ, ప్రధాన కార్యదర్శి డీ రాజా కూడా ఇండియా కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

సీపీఎం వ్యూహాలు ఫలిస్తాయా?

గత ఎన్నికల్లో జనసేనతో పొత్తులో భాగంగా కర్నూలు, నెల్లూరు పార్లమెంటు స్థానాలతోపాటు కురుపాం, అరకు, రంపచోడవరం, ఉండి, విజయవాడ సెంట్రల్, సంతనూతలపాడు, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఎం పోటీ చేసినప్పటికీ ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. అయినప్పటికీ ఈసారి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా దాదాపుగా మళ్లీ అవే స్థానాల కోసం పట్టుబట్టింది. కాంగ్రెస్‌తో పలు దఫాలుగా జరిగిన చర్చల్లో చివరకు అరకు పార్లమెంటు స్థానంతోపాటు రంపచోడవరం, కురుపాం, గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు టౌన్, పాణ్యం అసెంబ్లీ స్థానాలను సీపీఎం దక్కించుకుంది. అరకు పార్లమెంటు స్థానంలో పీ అప్పలనర్సను అభ్యర్థిగా రంగంలోకి దింపింది. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం అసెంబ్లీ స్థానం నుంచి లోతా రామారావు, విజయనగరం జిల్లా కురుపాం నుంచి మండంగి రమణ, విశాఖపట్నం జిల్లా గాజువాకలో ఎం.జగ్గునాయుడు, కృష్ణా జిల్లా గన్నవరంలో కే వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో చిగురుపాటి బాబూరావు, గుంటూరు జిల్లా మంగళగిరిలో జొన్నా శివశంకర్, నెల్లూరు పట్టణ నియోజకవర్గంలో మూలం రమేశ్, కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం నుంచి గౌస్ దేశాయ్‌లను అభ్యర్థులుగా రంగంలోకి దించింది. వీటిలో అరకు పార్లమెంటు స్థానం, రంపచోడవరం, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. గత ఎన్నికల్లో రంపచోడవరం నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య పోటీ చేయగా... ఆ ఎన్నికల్లో సీపీఎంకు 10,344 ఓట్లు వచ్చాయి. కురుపాంలో 8,551, అరకులో 10,313, విజయవాడ సెంట్రల్‌లో 25,620 చొప్పున సీపీఎంకు ఓట్లు పోలయ్యాయి. ఈసారి పోటీ చేస్తున్న నియోజకవర్గాలపై సీపీఎం ప్రత్యేక దృష్టి సారించి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

సీపీఐ పోటీ ఇస్తుందా?

పొత్తులో భాగంగా గుంటూరు పార్లమెంటు స్థానంతోపాటు విశాఖ పశ్చిమ, ఏలూరు, విజయవాడ పశ్చిమ, అనంతపురం అర్బన్, తిరుపతి, రాజంపేట, పత్తికొండ, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఐ పోటీ చేస్తోంది. ఈ స్థానాల ఎంపిక అంత ఆశాజనకంగా లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గుంటూరు పార్లమెంటు స్థానం నుంచి జంగాల అజయ్‌కుమార్‌ను సీపీఐ అభ్యర్థిగా నిలబెట్టింది. అసెంబ్లీ స్థానాల విషయానికొస్తే.. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అత్తిలి విమల, ఏలూరులో బండి వెంకటేశ్వరరావు, విజయవాడ పశ్చిమలో జీ కోటేశ్వరరావు, అనంతపురం అర్బన్‌లో సీ జాఫర్, తిరుపతిలో పీ మురళి, రాజంపేటలో భూక్యా విశ్వనాథనాయక్, పత్తికొండలో పీ రామచంద్రయ్య, కమలాపురంలో గాలి చంద్రలను అభ్యర్థులుగా రంగంలోకి దించింది. సీపీఐ ఎంచుకున్న దాదాపు అన్ని స్థానాల్లోనూ అధికార వైసీపీ, ఎన్డీఏ కూటమిల నుంచి బలమైన అభ్యర్థులు హోరాహోరీ పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ అభ్యర్థులు ఏ మేరకు పోటీ ఇస్తారు? అన్నది చూడాల్సిందే.



ఐఫోన్‌తో బెస్ట్ ఫొటోస్



ఈ మధ్య కాలంలో విదేశీ పర్యటనలు విజయవంతమయ్యేందుకు కూడా సెల్ ఫోన్ పనికొస్తోంది. ఐఫోన్ అదీ ఐఓఎస్ 17 ఉంటే చాలు. దాంతో కలిగే ప్రయోజనాలను ఒకసారి తరచి చూద్దాం. దీంతో మొదట పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కావాలంటే....

- వీసా దరఖాస్తుపై అతికించేందుకు లేదంటే స్టూడియోలో ప్రింట్ కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కావాలంటే ఐఓఎస్ 17 ఉన్న ఐఫోన్‌తో తీసుకోవాలి. అదీ ఇంటిదగ్గరే వైట్ బ్యాక్‌గ్రౌండ్‌తో తీసుకోవాలి. ఫొటో తీస్తున్న స్నేహితుడు లేదంటే బంధువుకు ఒక విషయం చెప్పండి. ఫోన్‌ని లైట్ మోడ్‌లో సెట్ చేయమనండి. అలాగే ఫేస్‌ని మరేది కవర్ కాకుండా చూసుకోవాలి. లైటింగ్ బాగా ఉండాలి.
- ఇమేజ్‌లోని సబ్జెక్టుని టాప్ అపై హోల్డ్ చేయాలి. అలా ఇమేజ్ నుంచి బ్యాక్‌గ్రౌండ్ తీసేవచ్చు. అప్పుడు కాపీని టాప్ చేయాలి. అలా వచ్చిన ఇమేజ్‌ని నోట్స్ యాప్‌లో పేస్ట్ చేసుకోవాలి. వైట్ బ్యాక్‌గ్రౌండ్‌తో డార్క్ మోడ్ టర్న్‌డ్ ఆఫ్ అయ్యిందీ లేనిదీ చూసుకోవాలి. డార్క్‌మోడ్ ఉపయోగిస్తే అప్పుడు బ్యాక్‌గ్రౌండ్‌లో నల్లగా కనిపిస్తుంది.
- నోట్స్‌యాప్‌లో నోట్ స్క్రీన్ షాట్ తీసుకోవాలి. ఫొటోస్‌ని ఓపెన్ చేయాలి. ఎడిట్, క్రాప్‌ని టాప్ చేయాలి.
- రెక్టాంగ్యులర్ ఐకాన్‌ని ఎంచుకుని, యాస్పెక్ట్ రేషియోని సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ చుట్టూ ఉన్నది తొలగి, ఫ్రేమ్‌లో మీరు మాత్రమే ఉండేలా చూసుకోవాలి.
- డన్‌ని టాప్ చేయాలి. అప్పటికి ఐడీ ఫొటో రెడీ అవుతుంది.

3 సెకన్ల సెల్ఫీ జీఐఎఫ్



గూగుల్ మెసేజెస్ ప్రస్తుతం సెల్ఫీ ఇమేజ్‌లను విడుదల చేస్తోంది. మెసేజ్ బేటా చానల్‌లో లాంగ్ ప్రెస్ చేస్తే గేలరీ ఐకాన్, సర్క్యులర్ ప్రివ్యూ అదీ స్క్రీన్ సెంటర్‌లో కనిపిస్తుంది. 'సెండ్ ఎ స్మూత్', 'డ్రా ఎ హీట్' సజెషన్ క్లిప్స్ కూడా ఉంటాయి. ఫ్రంట్ - రేర్ ఫేసింగ్ కెమెరా మధ్య స్విచ్ కావచ్చు. సర్క్యులర్ ఇండికేటర్‌తో రికార్డ్ బటన్‌ను టాప్ చేయాలి. ఆ ఇండికేటర్ ఎంత సమయం ఉందో చెబుతుంది. మొత్తమ్మీద ఫన్ టచ్‌తో మూడు సెకెండ్ల నిడివి గల వీడియోని రూపొందించి షేర్ చేసుకోవచ్చు. సెండ్ ఎ స్మూత్, డ్రా ఎ హార్ట్ వంటివి ఇంకా బేటాలోనే ఉన్నాయి. అందువల్లే అవి పనిచేయడం లేదు. కాన్వర్సేషన్ ప్రాంప్ట్‌తోనూ సెల్ఫీ జీఐఎఫ్‌ని రికార్డ్ చేసుకోవచ్చు. రిఫరెన్స్ కోసం దీనికి సంబంధించిన సపోర్ట్ ఆర్టికల్ ఒకటి లైవ్‌లో ఉంది.

'గూగుల్ పే' ని మించిన వాలెట్

ఇండియాలోకి గూగుల్ వాలెట్ వచ్చేసింది. భారతీయ యూజర్ల రోజువారి వ్యవహారాలను ఈ వాలెట్‌తో ఇకపై చక్కబెట్టుకోవచ్చు. గూగుల్ పేకి మించిన సౌకర్యాలు ఇందులో ఉంటాయి. పలు డిజిటల్ డాక్యుమెంట్స్ అంటే బోర్డింగ్ పాస్‌లు, లాయల్టీ కార్డులు, మూవీ టికెట్స్ సహా పలు పనులకు ఇది తోడ్పడుతుంది. దీని ప్రభావం గూగుల్ పే పై ఉండదు కూడా. ఇదో భద్రతతో కూడిన వాలెట్. ఇరవైకి పైగా బ్రాండ్స్‌తో ఈ వాలెట్‌కు భాగస్వామ్యం ఉంది. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఫ్లిప్‌కార్ట్, పైన్ ల్యాబ్స్ వాటిలో కొన్ని మాత్రమే. రాబోయే నెలల్లో మరికొన్నింటితో భాగస్వామ్యం పొందనుంది. యాపిల్ వాలెట్ మాదిరిగానే ఉంటుంది. దీన్ని నాన్ పేమెంట్ యూజర్ల కోసం ఉద్దేశించారు. చాలా దేశాలు గూగుల్ పే, గూగుల్ వాలెట్ రెంటినీ కలిపేస్తున్నాయి. ఇండియాలో మాత్రం రెంటినీ వేర్వేరు అవసరాల కోసం ఉపయోగిస్తున్నారు.

తేడాలు ఇవే

గూగుల్ పే
- గూగుల్ పే కేవలం నగదు లావాదేవీలకు పరిమితం. కేవలం డిజిటల్ పేమెంట్స్‌కు ఉపయోగపడుతుంది.
- గూగుల్ పే ఎన్ఎఫ్‌సీ టెక్నాలజీని సపోర్ట్ చేస్తుంది. తద్వారా క్రెడిట్ కార్డ్ సమాచారాన్ని దాచిపెడుతుంది.

గూగుల్ వాలెట్
- యూపీఐ పేమెంట్స్ లేదా నగదు బదిలీ గూగుల్ వాలెట్‌తో కుదరదు. బోర్డింగ్ పాస్‌లు, మూవీ టికెట్లసహా పలు డాక్యుమెంట్లను వాలెట్ భద్రపరుస్తుంది.
- గూగుల్ వాలెట్ క్రెడెన్షియల్స్, పాస్‌లు, క్యూఆర్ కోడ్స్‌తో టాగ్ అయిన పాస్‌లను భద్రంగా దాచిపెడుతుంది.

డిజైన్‌లో భారీ మార్పులు

వాట్సాప్ డిజైన్ సహా భారీగా మార్పులు చేసినట్టు మెటా ప్రకటించింది. కొత్త ఐకాన్స్, కలర్స్, టూల్స్ తదితరాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజులు రెంటిలోనూ వాట్సాప్ ఇంటర్‌ఫేస్‌లో మార్పులు కనిపిస్తాయి. యూజర్లకు మరింత మంచి అనుభవాన్ని అందించేందుకు ఫ్రెష్, సింపుల్, అప్రోచబుల్‌గా డిజైన్‌ను మారుస్తున్నట్టు వాట్సాప్ పేర్కొంది. మార్పుల విషయానికి వస్తే...

- డిజైన్ టీమ్ మొత్తం 35 రంగులను పరిశీలించింది. గ్రీన్ కలర్ ఎక్కడికీ పోదు. అలాగే యాప్‌లో చాలా భాగాల్లో గ్రీన్ కలర్ ఉంది. ఇంతకు మునుపుతో పోలిస్తే ఇది ఎక్కువే అని చెప్పవచ్చు.
- రౌండ్, ఔట్‌లైన్డ్ స్టయిల్స్‌లో కొత్త ఐకాన్లను పరిచయం చేసింది యానిమేషన్స్‌ను పెంచింది. డిఫాల్ట్‌గా ఉండే ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్‌లో కూడా మార్పులు ఉన్నాయి.
- ఆండ్రాయిడ్ డివైజుల్లో అడుగున ఆధునిక నేవిగేషన్ బార్ ఉంది. ఐఓఎస్ డివైజుల్లో కొత్త అటాచ్‌మెంట్ లేఔట్ ఉంది. ఫొటోలు, వీడియోలు పంపుకొనేందుకు ఇది వీలుకల్పిస్తుంది.
- చాట్ మేనేజ్‌మెంట్ మరో విషయం. ఆర్గనైజేషనల్ టూల్స్ అంటే ఫిల్టర్స్ వంటివి ఉన్నాయి. చదవనివి, గ్రూప్ చాట్స్ గుర్తించేందుకుగాను యూజర్లకు టాబ్ ఉంది.
- యూజర్లకు వాట్సాప్‌లో ఈ మార్పులు కనిపించకుంటే, లెటెస్ట్ వెర్షన్‌ను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.



మే 16న ఇండియాలోకి మోటోరోల ఎడ్జ్ 50 ఫ్యూజన్

మోటోరోల ఎడ్జ్ 50 ఫ్యూజన్ మే 16న ఇండియాలో విడుదల అవుతోంది. గత నెలలోనే ఇది ఎంపిక చేసిన యూరప్ మార్కెట్లలోకి వచ్చింది. తాజాగా భారతదేశంలోకి ప్రవేశిస్తోంది. 144హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు డిస్‌ప్లే, ఐపీ68 రేటు, 50 మెగా పిక్సెల్ డ్యూయల్ రేర్ కెమెరా, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ 68 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉన్నాయి.

ఆన్‌బోర్డ్ ర్యామ్ 12 జీబీ. 1600 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 5 ప్రొటెక్షన్ ఉన్నాయి. ఇన్-డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్ ఉంది. ఫారెస్ట్ బ్లూ, హాట్ పింక్, మార్షమల్లో బ్లూ రంగుల్లో ఇది లభ్యమవుతుంది. యూరప్‌లో దీని ధర మన ఇండియన్ కరెన్సీలో రూ.35,900.

పవర్ ఆఫ్ అయినా 'పిక్సెల్ 8' ఫోన్ కనిపెట్టవచ్చు



ఫైండ్ మై డివైజ్ నెట్‌వర్క్ పరిధిలో పిక్సెల్8, పిక్సెల్ 8 ప్రొ ఫోన్లను పవర్ ఆఫ్ లేదంటే బ్యాటరీ డెడ్ అయినా పట్టుకోవచ్చు. కొన్ని గంటల తరవాత కూడా పట్టుకోవడానికి వీలు ఉంటుంది. అనుకోని పరిస్థితుల్లో ఈ రెండు ఫోన్లలో దేన్నైనా ఎవరైనా దొంగిలించినా ఈ మార్గంలో పట్టుకోవచ్చు. ఎఫ్ఎండీ సెట్టింగ్స్‌లోని 'విత్ నెట్‌వర్క్ ఇన్ హై ట్రాఫిక్' 'విత్ నెట్‌వర్క్ ఇన్ ఆల్ ఏరియాస్'ని యాక్టివ్ చేసుకోవాలి. అందులో మొదటిది డిఫాల్ట్‌గా ఉంటుంది. రెండోది లోయర్ ట్రాఫిక్ ఏరియాలో పనిచేసేందుకు ఉంచారు. అయితే వెర్షన్‌ని మాత్రం కంపెనీ పేర్కొనలేదు. స్పెషలైజ్డ్ పిక్సెల్ హార్డ్‌వేర్‌తోనే ఇది సాధ్యమైందని సమాచారం.

17న భారత్‌లోకి శాంసంగ్ గెలాక్సీ



శాంసంగ్ గెలాక్సీ ఎఫ్55 5జీ ఈ నెల 17న ఇండియన్ మార్కెట్లోకి వస్తోంది. 6.7 ఇంచీల సూపర్ అమోల్డ్ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, వెయ్యి నిట్స్ మేరకు పీక్ బ్రైట్‌నెస్ ఈ గెలాక్సీ సొంతం. 256జీబీ స్టోరేజీ సదుపాయం ఉంది. ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 50ఎంపీ ఓఐఎస్ కెమెరా, 8ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 3ఎంపీ మైక్రో కెమెరా ఉన్నాయి. సెల్ఫీల కోసం 50ఎంపీ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా ఉపయోగపడుతుంది. 5000 ఎంఏహెచ్ బ్యాటరీకి తోడు 25వాట్స్ చార్జింగ్ సపోర్ట్ ఉంటుందని భావిస్తున్నారు. లీక్స్, ఊహాగానాల ఆధారంగా ఈ వివరాలన్నీ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.

ఆండ్రాయిడ్ సెక్యూరిటీ ప్యాచ్



ఆండ్రాయిడ్ 14 మే సెక్యూరిటీ ప్యాచ్ విడుదలైంది. పిక్సెల్ 5ఎ, 6, 6ప్రొ, 6ఎ, 7, 7ప్రొ, 7ఎ, ట్యాబ్లెట్, ఫోల్డ్, 8, 8 ప్రొ కోసం ఉద్దేశించిన సెక్యూరిటీ ప్యాచ్ ఇది. దీంతో మొత్తం 11 వరకు సెక్యూరిటీ సమస్యలను పరిష్కరించింది. గూగుల్ డివైజెస్‌కు చెందిన బులెటిన్‌లో మరో ఏడు సెక్యూరిటీ ప్యాచ్‌లను ఫిక్స్ చేసినట్టు పేర్కొంది. కిడ్డి(జపాన్), వెరిజాన్, టి-మొబైల్, సి స్పయిర్, యూఎస్ సెల్యులర్ అండ్ సెల్‌కామ్ బిట్స్ ఉన్నాయి. ఈ నాలుగింటి పరిధిలో ఉన్న వివిధ పిక్సెల్ డివైజ్‌లు, మిగిలిన వాటి జాబితా కూడా బులెటిన్ ద్వారా తెలుసుకోవచ్చు.

క్రోమ్ ఓఎస్ 124 అప్డేట్

క్రోమ్ ఓఎస్ 124 అప్డేట్‌తో క్రోమ్‌బుక్‌కు ఫాస్టర్ స్ప్లిట్ స్క్రీన్ సెటప్‌నకు తోడు పలు ఫీచర్లను తీసుకొచ్చింది. క్రోమ్‌బుక్ యూజర్ల కోసం గూగుల్ విడుదల చేసింది. ముందే పేర్కొన్నట్టు ఇందులో మొదటిది ఫాస్టర్ స్ప్లిట్ స్క్రీన్ సెటప్ ఫీచర్. విండో లేఔట్‌ని చాలా వేగంగా చేయవచ్చు. ఓపెన్ అయిన విండోలను ఒక సైడ్ నుంచి చూడవచ్చు. వైఫైకి ప్రాధాన్యం ఇచ్చింది. వీడియో కాన్ఫరెన్సింగ్, గేమింగ్ అప్లికేషన్స్‌కు అనువుగా మార్చింది. దాంతో వీడియో ప్లేయింగ్ చాలా సాఫీగా ఉంటుంది. మైస్ కోసం ఫాస్ట్ పెయిర్ ఫీచర్ మరొకటి. క్రోమ్ ఓఎస్ డివైజ్‌కు సానుకూలమైన మౌస్‌గా ఉంటుంది. కర్సర్ సైజ్‌ను అడ్జస్ట్ చేసుకోవచ్చు.

అమెజాన్ అలెక్సా అమేజింగ్ ఫీచర్స్



అలెక్సా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. అయితే దీంట్లో ఉన్న కొన్ని ఫీచర్లు అందరికీ అవగాహన లేకపోవచ్చు. ఇవి మరింత ప్రయోజనకరంగా ఉన్నాయి.

- యాంబియెంట్ ధ్వనులు లేదా ఇంటరాక్టివ్ గేమ్స్‌తో పెంపుడు జంతువులను ఉల్లాసంగా ఉంచుతుంది. యజమానులు ఇంట్లో లేనప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది.
- ప్రత్యేక పరిస్థితులు, ప్రశ్నలు తలెత్తినప్పుడు అలెక్సా రెస్పాన్స్ బాగా ఉంటుంది. అందుకు అనుగుణంగా స్కిల్ బ్లూప్రింట్స్‌ను ఉపయోగించుకోవాలి. వాటిని పర్సనలైజ్ చేసుకోవాలి.
- అలెక్సాకు చెందిన టాస్క్ మేనేజ్‌మెంట్ సహకారంతో ఈమెయిల్, క్యాలెండర్‌ను ఇంటిగ్రేట్ చేసుకోవచ్చు.
- గార్డ్ మోడ్‌ని యాక్టివేట్ చేసుకోవాలి. అప్పుడు అలార్మింగ్ సౌండ్స్, అలెర్టులు అవసరాలకు అనుగుణంగా అలెక్సా వింటుంది.
- పలు అలెక్సా డివైజ్‌లు ఉన్నప్పుడు వేర్వేరు రూముల్లో ఉన్నప్పటికీ మ్యూజిక్‌ను స్ట్రీమ్‌లైన్ చేసుకోవచ్చు.
- ఎంపిక చేసిన సంస్థలకు అలెక్సాతో విరాళాలను అందించవచ్చు. అందుకు స్మార్ట్ అసిస్టెంట్‌ను వాడుకోవాలి.
- ఇంట్లో వేర్వేరుగా ఉండే గొంతులను అలెక్సా గుర్తిస్తుంది. పర్సనలైజ్డ్ అనుభవాలను అందిస్తుంది.

ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లో డార్క్ మోడ్



ఆండ్రాయిడ్ ఫోన్లలో బ్రైట్ యాప్స్‌తో ఇబ్బంది పడుతున్న యూజర్లకు వెసులుబాటు ఈ డార్క్‌మోడ్. సపోర్ట్ చేయని యాప్స్‌లో డార్క్‌మోడ్‌ని అమలు చేసేందుకు రెండు విధానాలు ఉన్నాయి. చాలా వరకు యాప్స్‌లో డార్క్ మోడ్‌కి స్విచ్ అయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో ఇప్పటికీ చాలా వాటిల్లో ఈ సదుపాయం లేదు. అయిదేళ్ళ క్రితం నాటి ఆండ్రాయిడ్ ఫోన్ అయితే మాత్రం ఫోర్స్‌తోనే డార్క్‌మోడ్‌ని ఎనేబుల్ చేయాల్సి ఉంటుంది. అదీ ఆండ్రాయిడ్ 10 ఆపై వెర్షన్లతో పనిచేస్తూ ఉండాలి. డార్క్‌మోడ్ ఎనేబిలింగ్‌లో మొదటి విధానం పూర్తిగా సింపుల్. రెండో విధానంలో డెవలపర్ ఆప్షన్స్‌ని అన్‌లాక్ చేయాలి. డెవలపర్ ఆప్షన్స్‌ని పొందడం అంటే కొన్ని బ్యాంకింగ్ యాప్స్ పని చేయవని కూడా యూజర్లు అర్థం చేసుకోవాలి. సెట్టింగ్స్ - యాక్సెసబిలిటీ - విజన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ - హైకాంట్రాస్ట్ థీమ్ ఎంపిక, అప్లయ్ ఉంటుంది. అబౌట్ ఫోన్ ఆప్షన్‌పై అయిదు సార్లు టాప్ చేస్తే డెవలపర్ ఆప్షన్స్ అందుబాటులోకి వస్తాయి. ఒకసారి అవి ఎనేబుల్ అయితే చాలు, హార్డ్‌వేర్ యాక్సిలిరేటెడ్ రెండరింగ్ వద్దకు వెళ్ళవచ్చు. తద్వారా ఓవర్‌రైడ్ ఫోర్స్ డార్క్‌ను పొందవచ్చు. అది ఫోర్స్ డార్క్ ఫీచర్‌ను ఓవర్‌రైడ్ చేస్తుంది. ఆప్షన్స్ అన్నీ వచ్చిన తరవాత కొన్ని యాప్స్ కొత్తగా కనిపిస్తాయి. డార్క్‌మోడ్‌తో ఆప్టిమైజేషన్ కావడమే అందుకు కారణం.



రీయూజబుల్ ప్యాకింగ్

పర్యటనలు, సెలవులకు సంబంధించి రీయూజబుల్ ప్యాకింగ్ లిస్ట్ టెంప్లేట్స్‌ని ఐఫోన్‌లో ఉంచుకోవాలి. అప్పుడు ప్రతి పర్యటన సమయంలో దానిని ఉపయోగించుకోవచ్చు.

- రిమైండర్స్ యాప్‌లో ఎగ్జిస్టింగ్ లిస్ట్‌ను క్రియేట్ లేదంటే సెలెక్ట్ చేసుకోవాలి.
- త్రీ డాట్స్ వద్దకు వెళ్ళి 'సేవ్ యాజ్ టెంప్లేట్'ని సెలెక్ట్ చేసుకోవాలి.
- టెంప్లేట్ 'రీ నేమ్'తో 'సేవ్'ని హిట్ చేస్తే సరిపోతుంది.
- సేవ్ చేసి ఓవర్‌లాపింగ్ స్వేర్స్ ఐకాన్‌ని టాప్ చేయాలి. తద్వారా టెంప్లేట్స్‌ని యాక్సెస్ చేసుకోవాలి. అక్కడ ఉపయోగించుకోవాలని భావించిన టెంప్లేట్‌ని సెలెక్ట్ చేసుకుని, పేరు మార్చుకుని, క్రియేట్‌ని హిట్ చేయాలి. ఇప్పుడు కొత్త జాబితాను ఓపెన్ చేయాలి. కావాలనుకున్న రీతిలో మోడిఫై చేసుకోవాలి.
- రిమైండర్‌కు లొకేషన్‌ను జతచేసుకోవచ్చు. అందు కోసం లొకేషన్ బటన్‌ని టాప్ చేయాల్సి ఉంటుంది. లొకేషన్ పరిధిని సెట్ చేసుకోవచ్చు. గడువు తేదీ అలాగే ఫొటోను కూడా జోడించుకోవచ్చు.
- చివరగా పర్యటనలో ముఖ్యంగా ఆఫ్‌లైన్‌లో మ్యాప్స్‌ను ఇదే ఐఫోన్‌లో ఉపయోగించుకోవచ్చు. అందుకోసం డౌన్‌లోడ్‌ని టాప్ చేయాలి. అక్కడ మ్యాప్‌ని కోరుకున్న ఏరియాకు పరిమితం చేస్తూ అడ్జస్ట్ చేసుకోవాలి. తద్వారా స్టోరేజీని ఆప్టిమైజ్ చేసుకోవాలి. తదుపరి మళ్ళీ డౌన్‌లోడ్‌ని టాప్ చేస్తే చాలు, కావాల్సింది డౌన్‌లోడ్ అవుతుంది.


ఇండియన్ మార్కెట్లో వివో నంబర్ 1



స్మార్ట్ ఫోన్లకు సంబంధించి ఇండియన్ మార్కెట్లో 'వివో' మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది మొదటి మూడు నెలల అంటే జనవరి నుంచి మార్చి వరకు జరిగిన అమ్మకాలను తీసుకుంటే వివో వాటాలో ఎనిమిది శాతం వార్షిక పురోభివృద్ధి కనిపించింది. కరెస్పీపరంగా అది 18 శాతం నమోదైంది. దేశీ మార్కెట్లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో రోజువారి ప్రగతి కనిపిస్తోంది. మొదటి స్థానంలో చైనీస్ బ్రాండ్ వివో ఉంది. షావోమీ, శాంసంగ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయని 'కౌంటర్‌పాయింట్' నివేదికలో వెల్లడైంది. దేశీ మార్కెట్లో వివో వాటా 19.5 శాతం. 5జీ విషయంలో తిరుగులేని ఆధిపత్యం అలాగే కలర్, మెటీరియల్, ఫినిషింగ్‌పరంగా ఉన్నతస్థానం - పటిష్ఠమైన ఇమేజింగ్ కేపబిలిటీస్‌తో వివో స్మార్ట్ ఫోన్ల రంగంలో రారాజుగా వెలుగుతోందని రీసెర్చ్ అనలిస్ట్ ఒకరు ఈ సందర్భంలో పేర్కొన్నారు.

మూడో స్థానంలో ఉన్న శాంసంగ్ ప్రీమియమ్ మార్కెట్ సెగ్మెంట్‌లో తన ఆధిపత్యాన్ని కనబరుస్తోంది. అమ్మకాల మొత్తమే 425 డాలర్లు కాగా అత్యున్నత సగటు ధరను సాధించగలిగింది. ఇండియన్ మార్కెట్లో శాంసంగ్ అమ్మకాలకు సంబంధించి ఇదో మైలురాయి.

మరోవైపు ఐఫోన్ 15 సిరీస్ సైతం గణనీయంగానే ఉన్నాయి. అలా మన దేశంలో ఐఫోన్ తన అమ్మకాలను పెంచుకుంటోందని కూడా చెప్పవచ్చు. సైబర్ మార్కెట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం మొదటి క్వార్టర్‌లో ఆరుశాతం వాటాను పొందింది. మొత్తం ఎగుమతుల్లో 60 శాతం సాధించింది. మధ్యశ్రేణి, ప్రీమియం ఫోన్లు ఈ ఏడాది మొదటి క్వార్టర్లో రిలీజ్ అయ్యాయి. ఈ ఏడాది రెండో అర్థ భాగంలో స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ మరింత పుంజుకుంటుందని అనలిస్టులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఐఐపీలో ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్)2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ కోర్సును కూడా అందిస్తున్నారు. దీని వ్యవధి ఏడాది. ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. కోర్సులు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

సీట్ల వివరాలు

- **పీజీ డిప్లొమా:** ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు, అహ్మదాబాద్ క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.
- **ఎంఎస్:** హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.
- **సీపీఈ:** చెన్నై క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, అప్లయిడ్ మెకానిక్స్, మెకానికల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిజం, ప్రిన్సిపల్స్ ఆఫ్ ప్యాకేజింగ్, పేపర్ అండ్ పేపర్ బోర్డ్, గ్లాస్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్, పాలిమర్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్, ప్రింటింగ్ టెక్నాలజీ, ప్రొడక్షన్/ఫైనాన్షియల్/మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ మెషినరీ, ప్యాకేజింగ్ లాస్, టూలింగ్ అండ్ డిజైన్, ప్యాకేజింగ్ డిజైన్స్, అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, ఆటోక్యాడ్ తదితర సబ్జెక్టుల్లో తరగతులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాక్టికల్ సెషన్స్, రీసెర్చ్ యాక్టివిటీస్, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ సంబంధిత శిక్షణ ఉంటాయి.

ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది. ఇందులో ప్యాకేజింగ్ మెటీరియల్స్, ప్యాకేజ్ డెవలప్‌మెంట్, ప్యాకేజ్ ప్రింటింగ్ టెక్నాలజీ, మెటీరియల్ టెస్టింగ్, ప్యాకేజ్ ఫినిషింగ్ ఆపరేషన్స్, ప్యాకేజింగ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ అండ్ మెడికల్ డివైజ్ ప్యాకేజింగ్, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ ప్యాకేజింగ్, ప్యాకేజింగ్ లాస్ అండ్ రెగ్యులేషన్స్, ప్యాకేజింగ్ మెషినరీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్-మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ డిజైన్ తదితర అంశాలు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ సెషన్స్, ఇండివిడ్యువల్ ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ రిపోర్ట్ రైటింగ్ ట్రెయినింగ్, అయిదు నెలల ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

సీపీఈ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: ఈ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో మూడు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో ప్యాకేజింగ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ స్టడీస్ సంబంధిత సెషన్స్ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ అండ్ రిపోర్ట్, డిజర్టేషన్, ప్రజంటేషన్ తదితరాలు ఉంటాయి.

అర్హత: పీజీడీపీ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. అగ్రికల్చర్/ఫుడ్ సైన్స్/పాలిమర్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్/నాలుగేళ్ల డిగ్రీ ఇన్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ ఉత్తీర్ణులై ఉండాలి. సీపీఈ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైం డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. పీజీడీపీ, ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. సీపీఈ ప్రోగ్రామ్‌నకు వయోపరిమితి నిబంధనలు లేవు.

ఐఐపీ సెట్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, రాత పరీక్ష స్కోరుకు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 8
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** www.iip-in.com

సిరిసిల్ల ఫైన్ ఆర్ట్స్ అకాడమీలో బీఏ ఆనర్స్

సిరిసిల్లలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న టీటీడబ్ల్యూఆర్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ(మహిళ కళాశాల)- బీఏ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. రాష్ట్రానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. బోధన రుసుం చెల్లించనవసరం లేదు.



స్పెషలైజేషన్‌లు-సీట్లు: బీఏ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో మొత్తం 120 సీట్లు ఉన్నాయి. ఫ్యాషన్ డిజైన్‌కి 60 సీట్లు, ఇంటీరియర్ డిజైన్‌కి 40 సీట్లు, ఫొటోగ్రఫీ అండ్ డిజిటల్ ఇమేజింగ్‌కి 20 సీట్లు నిర్దేశించారు.

● వీటిలో 85 శాతం సీట్లను ఎస్టీ అభ్యర్థులకు కేటాయించారు. ఎస్సీ, బీసీ, ఓసీ/ఈబీసీ, స్పోర్ట్స్/ఎన్‌సీసీ, అనాథలు, దివ్యాంగులకు సంబంధించి ఒక్కో కేటగిరీకి 2.5 శాతం సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2023లో ఇంటర్ పాసైనవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థిని వయసు 2024 జూలై 1 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం పట్టణాల్లో రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభై వేలకు మించకూడదు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అర్హులే.

- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.300
- ★ **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- ★ **కౌన్సెలింగ్:** జూన్ 5 నుంచి
- ★ **చిరునామా:** ప్రిన్సిపాల్, టీటీడబ్ల్యూఆర్‌డీసీ(డబ్ల్యూ)-సిరిసిల్ల, లక్ష్మీపూర్ రోడ్, తంగెళ్లపల్లి-505405, సిరిసిల్ల.
- ★ **వెబ్‌సైట్:** ttwrdcs.ac.in

ఎన్ఎల్ఐయూలో అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్

భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్ఎల్ఐయూ)- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. గరిష్ఠంగా ఆర్నెల్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రతి ప్రోగ్రామ్‌లో మూడు మాడ్యూల్స్/పేపర్లు ఉంటాయి. మాడ్యూల్‌కు పది టీచింగ్ సెషన్స్ నిర్వహిస్తారు. అభ్యర్థులకు కనీసం 70 శాతం అటెండెన్స్ ఉండాలి. ప్రతి సబ్జెక్టుకూ ఒక అసైన్‌మెంట్ తప్పనిసరి. అసైన్‌మెంట్‌కు 30 మార్కులు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌నకు 70 మార్కులు నిర్దేశించారు.

ప్రోగ్రామ్‌లు

- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ లాస్ అండ్ సైబర్ ఫోరెన్సిక్స్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ సెక్యూరిటీస్ లా అండ్ క్యాపిటల్ మార్కెట్స్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ లేబర్ లాస్

అర్హత: ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; డిగ్రీ చదువుతున్నవారు; డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమీషియన్స్, రీసెర్చ్ మెంబర్లు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మెంబర్లు, అడ్వకేట్స్, ప్రొఫెషనల్స్ కూడా అర్హులే.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25
- **వెబ్‌సైట్:** www.nliu.ac.in



జాబ్ కార్నర్



డీఎంఆర్ఎల్‌లో ఐటీఐ అప్రెంటిస్‌లు

కాంచన్‌బాగ్(హైదరాబాద్)లోని డీఆర్‌డీవోకి చెందిన డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(డీఎంఆర్ఎల్)...కింద పేర్కొన్న ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 127
పోస్టు: ఐటీఐ అప్రెంటిస్
ట్రేడులు: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
చివరి తేదీ: మే 31
వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

కేంద్ర శాఖల్లో వివిధ ఖాళీలు

దేశ వ్యాప్తంగా కేంద్ర విభాగాలు/శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 17

పోస్టుల వివరాలు

1. అసిస్టెంట్ డైరెక్టర్: **1 పోస్టు**
2. డిప్యూటీ కమిషనర్: **2 పోస్టులు**
3. డిప్యూటీ డైరెక్టర్: **1 పోస్టు**
4. అసిస్టెంట్ కంట్రోలర్: **2 పోస్టులు**
5. ట్రెయినింగ్ ఆఫీసర్: **4 పోస్టులు**
6. అసిస్టెంట్ ప్రొఫెసర్: **5 పోస్టులు**
7. సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్: **2 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు రుసుము: రూ.25. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 16
వెబ్‌సైట్: https://upsc.gov.in/recruitment/-recruitmentadvertisement

ఏటీఏఆర్ఐలో రీసెర్చ్ ఫెలో

సంతోష్‌నగర్(హైదరాబాద్)లోని ఐకార్ - అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: సీనియర్ రీసెర్చ్ ఫెలో
అర్హత: సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
గరిష్ఠ వయోపరిమితి: పురుషులు 35 ఏళ్లు; మహిళలు 40 ఏళ్లు మించకూడదు
వేతనం: నెలకు రూ.31,000
ఇంటర్వ్యూ తేదీ: మే 16
ప్రదేశం: ఐకార్-అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://atarihyderabad.icar.gov.-in/atarihyderabad/events?lang=en

ప్రాజెక్ట్ స్టాఫ్

'రాజేంద్ర' ఇన్‌స్టిట్యూట్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్‌పట్నాలోని ఐసీఎంఆర్- రాజేంద్ర మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 21

1. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్- 1
2. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-2
4. ఫీల్డ్ అటెండెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 13
ఇంటర్వ్యూ తేదీ: మే 16
వేదిక: రాజేంద్ర మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆగం-కువాన్, పట్నా, బిహార్.
వెబ్‌సైట్: www.rmrims.org.in

ఐపీపీబీలో ఎగ్జిక్యూటివ్‌లు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 54

పోస్టుల వివరాలు

1. ఎగ్జిక్యూటివ్(అసోసియేట్ కన్సల్టెంట్): **28 పోస్టులు**
2. ఎగ్జిక్యూటివ్(సీనియర్ కన్సల్టెంట్): **5 పోస్టులు**

అర్హత: బీఈ/బీటెక్ లేదా బీసీఏ/బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
జీతం: ఏడాదికి ఎగ్జిక్యూటివ్(అసోసియేట్ కన్సల్టెంట్) పోస్టుకు రూ.10,00,000; ఎగ్జిక్యూటివ్(కన్సల్టెంట్) పోస్టుకు రూ.15,00,000; ఎగ్జిక్యూటివ్(సీనియర్ కన్సల్టెంట్) పోస్టుకు రూ.25,00,000.
దరఖాస్తు రుసుము: ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.150. మిగతా వారందరికీ రూ.750.
ఎంపిక ప్రక్రియ: అసెస్‌మెంట్, ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ తదితరాల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 24
పోస్టింగ్ స్థలం: ఢిల్లీ/ముంబయి/చెన్నై
వెబ్‌సైట్: www.ippbonline.com/

సెంట్రల్ మెడికల్ సర్వీసెస్‌లో మేనేజర్లు

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 15

1. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): **1 పోస్టు**
3. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **1 పోస్టు**
5. మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
6. మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్): **2 పోస్టులు**
7. మేనేజర్(ఫైనాన్స్): **2 పోస్టులు**
8. మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **2 పోస్టులు**
9. ఆఫీస్ అసిస్టెంట్: **1 పోస్టు**
10. వేర్ హౌస్ మేనేజర్(ఫార్మాసిస్ట్): **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఐసీడబ్ల్యూఏఐ, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: మేనేజర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,00,000; మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు రూ.50,000; ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20
వెబ్‌సైట్: https://cmss.gov.in

లిటిల్స్



గందరగోళం కుందేలు

ఒక అడవిలో ఓ కుందేలు ఉండేది. అది గందరగోళంకు గురి అవ్వటంలో ముందుండేది. చిన్న చప్పుడయినా భయపడేది. చినుకు పడినా ఉరికేది. గాలి శబ్దానికి భీతిల్లేది. ఆఖరికి దూరంగా సాధారణ పక్షి అరుపు విన్నా భయపడేది. దీంతో ఆ కుందేలును అంతా 'గందరగోళం కుందేలు' అని పిలిచేవాళ్లు.



బాగా ఎండాకాలం. మామిడిచెట్టు కింద పడుకుంది కుందేలు. ఒక మామిడిపండు చెట్టుమీద నుంచి కుందేలు తల మీద పడింది. అంతే కుందేలు పరిగెత్తింది. ఎక్కడా నిలబడలేదు. 'ఆకాశం విరిగి పడుతోంది' అంటూ పరిగెత్తింది. కొన్ని జింకలు కనపడ్డాయి. 'ఎందుకింత పరుగు?' అని అడిగాయి. 'ఆకాశం విరిగిపడుతోంది. నేనుచూశా. మీరు ఇక్కడే ఉంటే చస్తారు' అంటూ గట్టిగా అరిచింది. జింకలు వెంటనే పరిగెత్తాయి. కుందేలుతో పాటు జింకలు పరిగెత్తటం ఎలుగుబంట్లు చూశాయి. విషయం ఏంటని? అడిగాయి. 'చెడు జరుగుతంది. ఈ ఆకాశం ఊడి పడుతోంది. ఇక్కడే ఉంటే ప్రాణాలు నిలబడవు' అన్నది ఓ జింక. పాపం పరిగెత్తలేక ఆ ఎలుగుబంట్లు ముందుకు ఉరికాయి.


అడవిలో గందరగోళం, చప్పుళ్లు. గాలి వీస్తోంది గట్టిగా. కుందేలు, జింకలు, ఎలుగుబంట్లకు తోడుగా నక్కలు జతకలిశాయి. పక్షులూ ఈ గుంపు మాట నమ్మాయి. అవి కూడా తుర్రుమన్నాయి. ఎదురుగా అడవికి రాజైన సింహం వచ్చింది. 'ఎందుకిలా పరిగెత్తుతున్నారు?' అని అడిగింది. 'ఆకాశం పడుతోంది' అంటూ విషయం చెప్పాయి. ఎవరు చెప్పారు? అని అడిగింది సింహం. ఒకరి మీద ఒకరు చెప్పుకున్నారు. సింహం గట్టిగా నవ్వింది. విషయం తెలుసుకుందాం? అని అడిగింది. అంతలోనే 'అసలు ఈ విషయాన్ని ఎవరు ముందు చూశారు?' అని అడిగింది. అందరూ కుందేలు అని చెప్పింది. 'విషయం ఏంటీ?' అని కుందేలును అడిగింది సింహం. 'మామిడిచెట్టుమీద నుంచి ఆకాశం విరిగి పడింది' అని చెప్పింది. 'ఇదేదో తేడాగా ఉంది. అక్కడికి వెళ్లి చూద్దాం' అన్నది నక్క. అన్ని జంతువులూ బయలుదేరాయి ఆ ప్రాంతానికి. మామిడిచెట్టు కింద మామిడి పండు పడింది. అది చూసి ఇదేనా ఆకాశం నుంచి విరిగిపడిన ముక్క అన్నది సింహం. జంతువులన్నీ ఒకటే నవ్వులు. గందరగోళం కుందేలు మాట వినటమే తప్పు అనుకున్నాయి.

15 తేడాలు గుర్తించండి





సరైన నీడ ఏది?





రోబోలు ఎన్ని?



దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 304

	1				9			
3				8	1	4		9
7					4		5	
1		6		9		5		
		5		1		8		3
	2		4					7
5		9	1	3				4
			9				1	

సుడోకు - 303 సమాధానం

6	8	2	3	1	4	9	7	5
4	7	1	9	5	2	8	6	3
5	9	3	7	8	6	2	4	1
2	1	7	6	3	5	4	9	8
3	5	9	4	2	8	7	1	6
8	6	4	1	7	9	5	3	2
7	4	5	2	6	1	3	8	9
1	3	8	5	9	7	6	2	4
9	2	6	8	4	3	1	5	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.